RNI No. APTEL/2003/12253

# భావవీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 10(1) Monthly October 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



## గుంటూరు శేషేంద్రశర్మ



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 10(1) - October 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**

## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
(Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics
and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గుంటూరు శేషేంద్రశర్మ

తెలుగు సాహిత్యంలో విలక్షణ కవిగా ముద్రవేసుకున్న కవివరేణ్యులు గుంటూరు శేషేంద్ర శర్మ. అటు కవిత్వంలోనూ, ఇటు సాహిత్య విమర్శలోనూ విలక్షణ ఊహాశీలతను పాటించే శైలీ నిర్మాత. భారతీయ సాహిత్యం మీదే గాక ప్రపంచ సాహిత్యం మీద సాధికారిక పరిచయం ఉన్న పండితులు. విశ్వమానవ దృష్టి, పానపీన ఆహార విహారాల నుంచి నిత్య నైమిత్తిక కార్యచరణలు, ఆలోచనలు... అన్నిటా ఆయన సంప్రదాయ, ఆధునిక తత్వాల మేళవింపు.

కవిగా, విమర్శకులుగా, సాహితీవేత్తగా, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతగా, ఆధునిక సాహిత్యంపై తనదైన ముద్ర వేసిన గుంటూరు శేషేంద్రశర్మ ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు విభిన్న అంశాలను స్పృజిస్తూ క్రొత్త కోణంలో నూతన దృక్పథంతో దాదాపు 50 పైగా రచనలు చేశారు. ఆధునిక భారతం, నాదేశం - నా ప్రజలు, రక్తరేఖ, షోడశి - రామాయణ రహస్యములు, మబ్బుల్లో దర్బారు మొదలైన రచనలెన్నో చేశారు. ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్గించడం కోసం ఎన్నో సైన్స్ వ్యాసాలు రాశారు. పురపాలకశాఖలో కమీషనర్‌గా విధులు నిర్వహించే సమయంలో ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాలను సందర్శించటం చేత అక్కడ ప్రజల సాధక బాధలను తెలుసుకొని వారి సమస్యల పట్ల స్పందిస్తూ ప్రభావితులై ఎన్నో రచనలు చేశారు.

“ఆలోచన, ఆవేశం, భావుకతల మేళవింపు, ఆధునిక శేషేంద్ర కవిత్వం”. అనే నానుడి ప్రజల్లోకి చొచ్చుకు పోయిందంటే వారి కవితా రచనా శైలి ఏపాటిదో మనకు అర్థం కాక మానదు. తెలుగువాడి వేడి, భాషా సొగసు, ఆలోచనల్లో అంతర్మథనం, సమాజం పట్ల బాధ్యత, తోటి మానవుని పట్ల సానుభూతి ఇవన్నీ రంగరిస్తే శేషేంద్ర కవిత్వం. తెలుగు సాహిత్యంలో నొబెల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ చేయబడ్డ “నా దేశం - నా ప్రజలు” అనే ఆధునిక మహాభారతం కావ్యంలో శేషేంద్ర శర్మ భావుకత లోకానికి వెల్లడవుతుంది.

“పొట్లాట నేను బతకటానికి పీల్చే ఊపిరి
నా అవయవాలకు నీచంగా వంగే భంగిమలు తెలియవు
నేను సత్యాగ్రాహి! సత్యం నా గుండెల్లో బద్దలవుతున్న అగ్నిపర్వతం
నా గొంతుల్లో గర్జిస్తున్న జలపాతం”

అనటంలోనే శేషేంద్ర కవిత గాఢత, తీవ్రత అభివ్యక్తమవుతుంది.

మనిషి పాలకుల కుతంత్రాలలో చిక్కుకొని, వ్యాపార సంస్కృతిలో పోటీ పడలేక సంఘర్షణలో వున్న వ్యక్తికి దిశానిర్దేశం చూపటానికి ప్రయత్నిస్తారు శేషేంద్రశర్మ.

“దేవుడ్ని గూర్చి దీర్ఘ చర్చలు చేసేటంత మూర్ఖులుమూ కాము
ధనికులమూ కాదు మనని పనిచేసి బ్రతకవలసిన చేతులంటూ”

వాస్తవిక జీవన చిత్రణను ఆవిష్కరిస్తారు. ఆయన రచనల్లో అభివ్యక్తం చేయబడే ప్రతివాక్యం ఒక బుల్లెట్‌లా ప్రతి మనిషి గుండెల్లో చొచ్చుకుపోయి ఆలోచనలను రేకెత్తించగలదు. అటువంటి శేషేంద్ర శర్మ జీవితం, సాహిత్యం ఎందరికో ఆదర్శప్రాయం.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. దాశరథి, సి.నా.రె ల సాహిత్య (రేఖా మాత్ర) తులనాత్మక పరిశీలన | - డా॥ టి. చక్రధర స్వామి | 6 |
| 2. తెలుగు జానపదుల నమ్మకాలు | - డా॥ అజ్మీరా సిల్మా నాయక్ | 9 |
| 3. సాహిత్య ప్రస్థానంలో తెలంగాణ కథ | - డా. చవ్వా వెంకటరెడ్డి | 11 |
| 4. తెలంగాణేతర నాటకాలు - తెలంగాణ విమర్శకులు | - డా॥ గంగు కిషన్ ప్రసాద్ | 18 |
| 5. భాషా పరిణామం ఒక చారిత్రక అవసరం | - డా॥ పి.ఎ. సత్యనారాయణ | 27 |
| 6. సామాజిక జ్వాలా కెరటాలు | - డా॥ వెల్దండి శ్రీధర్ | 29 |
| 7. ఒక దశాబ్ది రాయలసీమ నవలలు - సాంస్కృతికాంశాలు (2001-2010) | - డి. హసీనా | 33 |
| 8. తెలంగాణ నవల - బహుజన అస్తిత్వ చిత్రణ | - డా.పంతంగి వెంకటేశ్వర్లు | 37 |
| 9. తెలుగు వారి జానపద సంస్కృతిలో 'కుండ' పరిశీలన | - యస్. రాకేష్ | 41 |
| 10. పల్లె జీవన విధానంకు ప్రతీక-"పెద్దింటి అశోక్‌కుమార్ కథలు" | - రంగు శ్రీకాంత్ గౌడ్ | 45 |
| 11. అలపర్తి రామకృష్ణ నవలలు - సామాజిక స్పృహ | - సి .విజయలక్ష్మి | 48 |
| 12. జానపద కళల ఆవిర్భావం - వికాసం | - జె. విజేందర్ | 52 |
| 13. పత్రికా రచన విస్తరణ మరియు సరళీకరణ | - డా॥. హెచ్. కిషన్ | 55 |
| 14. ప్రపంచీకరణ నేపథ్యంలో గ్రామదేవతలు | - డా. ఎ. రవీంద్రబాబు | 58 |
| 15. తెలుగులోవచన కవిత్వానికి జెండా ఊపిన శిష్ట్లా | - డా. గోనిపాటి ధర్మారావు | 62 |
| 16. భారతీయ కుటుంబ సంబంధాలు-యువత నాడు-నేడు | - డా॥ భరోతు సరస్వతి | 66 |
| 17. ద్రావిడ భాషల్లో తొలి కథానికలు | -డాక్టర్ సి.సంపత్ | 71 |
| 18. మట్టిలో మణిదీపాలు - తుమ్మల రామకృష్ణ కథలు | - డా॥ జి. వెంకట రమణ | 77 |
| 19. ద్రోణచార్య ద్రుపదుల బంధం - మనోవిశ్లేషణ | - డా. జె. వెంకటరమణ | 83 |
| 20. 'ద్వానా' కవితలు - వస్తువు | - డాక్టర్ కె.లక్ష్మణ | 87 |
| 21. గోపీచంద్ నవలలు - వస్తు వైవిధ్యం | - డాక్టర్ పి.ఎస్.మైథిలి | 94 |
| 22. అన్నమయ్య - త్యాగయ్య | - డా॥ ఆర్.యన్.యస్.శైలేశ్వరి | 99 |
| 23. కాళోజీ కవిత్వంపై ఇతర కవుల ప్రభావం | - డా॥ భూక్య తిరుపతి | 104 |
| 24. ఆధునిక సాహిత్యవేత్త యిక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం-ప్రకృతి వర్ణన | - గౌరారపు శ్రీనివాస్ | 107 |
| 25.బాధాశప్త నది - కొండేపూడి నిర్మల | - నల్ల యామిని | 111 |
| 26. పాల్కురికి సోమనాథుని రచనల్లో అన్య భాషాప్రభావం | - పసుపులేటి నాగమల్లిక | 115 |
| 27. 'కుటుంబరావుకు ఏదో అయింది' కథ - విశ్లేషణ | - పూండ్ల వేంకటేశ్వరరావు | 117 |
| 28. చిత్తూరు జిల్లా కథా - దళితవాద స్పృహ | - యం. రాజేష్‌బాబు | 122 |
| 29. 'శత్రువుతో ప్రయాణం'-సామాజిక దృక్పథం | - డి. తిరుమల స్వాతి | 125 |
| 30. హాస్యకథారచయితగా - డా॥ మంతెన సూర్యనారాయణరాజు | - వి. వెంకటేశన్ | 131 |
| 31. "తెలంగాణ కథ - ప్రాంతీయ అస్తిత్వం" | - బానోత్ వెంకటేశ్వర్లు | 135 |
| 32. జానపద కళారూపాలు - తోలుబొమ్మలాట మరియు గంగిరెద్దులు విశిష్టత | - డా॥. మఠపతి మాంతయ్య | 138 |

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# దాశరథి, సి.నా.రె ల సాహిత్య (రేఖా మాత్ర) తులనాత్మక పరిశీలన

– డా॥ టి. చక్రధర స్వామి, తెలుగు శాఖాధ్యక్షులు, శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్, తెలంగాణ.

ఒక చేత్తో పెన్ను, మరో చేత్తో గన్ను చేపట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న దాశరథి కృష్ణమాచార్య ఆ తరవాత "విశాలాంధ్ర" ను సమర్థిస్తూ తెలుగు సంస్కృతీ సంప్రదాయలను ప్రశంసిస్తూ " మహాంధ్రోదయం " కావ్యం రాశాడు.

**డా॥ సి.నా.రె (సింగిరెడ్డి నారాయణరెడ్డి) :**

"తెలుగు జాతి మనది - నిండుగ వెలుగు జాతి మనది" అంటూ సినిమా ద్వారా సమైక్యాంధ్రను సమర్థించారు. అదే సినారె ఒక ఇంటర్వ్యూలో "తెలంగాణ ఉద్యమం" సందర్భంగా ఈ విషయమై ప్రశ్నించగా, "తెలుగు జాతి మనది రెండుగ వెలుగు జాతి మనది" అన్నారు.

దాశరథి ఆంధ్రప్రదేశ్ మొదటి ఆస్థాన కవి. ఎన్నో అవార్డులు అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి పొందారు. సి.నా.రె విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా పని చేసారు. లెక్కలేనన్ని అవార్డులు వారిని వరించాయి. అత్యున్నత సాహితీ పురస్కారం జ్ఞానపీఠాన్ని తెలుగు సాహిత్యాన్ని సాదించి పెట్టారు. వీరిద్దరి సాహిత్యాన్ని రేఖామాత్రంగా తులనాత్మక పరిశీలన చేసే ప్రయత్నం ఈ పత్రంలో చేశాను.

దాశరథి అమ్జద్ హైద్రాబాదీ, మీర్ తకీమీర్, అసదుల్లా ఖాన్ గాలిబ్, ఇక్బల్, ఫైజ్ అహ్మద్ ఫైజ్ , అహ్మద్ ఫరాజ్ మొదలైన ఉర్దూ మహాకవుల గజళ్ళను, రుబాయీలరు ఇష్టంగా చదివి, పరవశత్వంతో వాటిని తెలుగులోకి తర్జుమా చేశాడు. తెలుగులో గజల్ ప్రక్రియకు దాశరథి ఆద్యుడు. అలాగే రుబాయీ ప్రక్రియకు కూడా 1966లో దాశరథి తొలి గజల్ రాశాడు.

అరబ్బీలోని రుబాయీకి మూలకర్త ఉమర్‌ఖయామ్ ఆ కవి ప్రభావం కొంత దాశరధిని రుబాయీలు రచించేలా చేసింది. తన యౌవనంలో అమ్జద్ హైదరాబాదీ రుబాయీలకు సమ్మోహితుడైనాడు. అమ్జద్ హైదరాబాదీతో దాశరధికి గాఢమైన పరిచయం ఉండేది. అమ్జద్ ఆయన కలం పేరు అసలు పేరు సయ్యద్ అహ్మద్ హుసేన్.

దాశరధి రుబాయీలు హాయిగా సాగిపోతాయి. గిలిగింతలు పెడతాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. హాస్యం కురుపిస్తాయి. ఆలోచింపచేస్తాయి. ఉదాహరణకు ఒక రెండు చూద్దాం.

"నింగి కితాబు చేశాను/చుక్కల హిసాబు వేశాను
ప్రేయసి కోసం వేచి వేచి/తుదకు మంచమేనేశాను"
"నిప్పులోంచి అప్పుడప్పుడు పొగ పుడుతుంది
నీళ్ళలోంచి విద్యుత్తను సెగ పుడుతుంది / ఈ దానవ
లోకంలో ఎన్నటికైనా
మానవులని పిలువదగిన తెగ పుడుతుంది"

ఉర్దూ కవి సమయాలు, కవితా సామాగ్రి దాశరధి తెలుగు భాషకు ప్రధానం చేశాడు.

సి.నా.రె కంటే దాశరధి ఆరేళ్ళు పెద్దవాడు. ఆ పెద్దరికం ఆ రోజుల్లో సి.నా.రె ని బాగా ప్రభావితం చేసింది. దాశరధి ఇరవై ఐదేళ్ళకే మహాకవి అయ్యాడు. ఆ సమయంలో సినారె "నవ్వని పువ్వు" లాంటి గేయాలు రాస్తున్నారు. ఇద్దరూ తెలంగాణ గడ్డ నోచుకొన్న నోము ఫలాలే.

సినారె గజల్ ప్రక్రియతో పాటు రుబాయీ ప్రక్రియను అవకాశం ఉన్నప్పుడల్లా సినిమా పాటల్లోనూ, తన గేయ కావ్యాల్లోనూ ప్రయోగించారు. సాధారణంగా రుబాయీకి నాలుగు పాదాలుంటాయి. సినారె పాత రుబాయీ ఛందస్సుకి కొత్త లక్షణం చేర్చాడు. కొత్తగా 5 వ పాదం చేర్చాడు. నిర్మాణ శిల్పంలో తన ప్రతిభను చూపాడు. తన రుబాయీలకు " ప్రపంచ పదులు " అని పేరు పెట్టాడు. ఇవి తెలుగు సాహిత్యంలో చాలా ప్రసిద్ధిని పొందాయి. మూల రుబాయీలోని 3 వ పాదంలో తఖ

ల్లుస్ (కవినామ ముద్ర) ఉంటుంది. అయితే సినారె అరుదుగా వాడాడు. ఉదాహరణకు ఒకటి చూద్దాం.

"విరిగి పడిన జాతికి వెను చరుపులీ ప్రపంచ పదులు
మరుగు పడిన నీతికి కనుమెరుపులీ ప్రపంచ పదులు
చేదో తీపో మథించి చెప్పాడు సుమా సినారె
కునికే అడుగులకు మేలుకొలుపులీ ప్రపంచ పదులు
మారే విలువలకు దారి మలుపులీ ప్రపంచ పదులు"

ప్రపంచ పదుల్లోని తాత్త్వికతనిందులో దర్శించవచ్చు. మనిషి పట్ల గాఢమైన ప్రేమతో ప్రవచించిన కవితాత్మక పంక్తులీ ప్రపంచ పదులు. మనిషి మనుగడా, అతని వ్యష్టి, సామాజిక జీవన ప్రయత్నాలకు క్షణక్షణం స్పందించి అందించిన కవితలివి. నిరాశా నిస్పృహల పాలు కాకుండా మనిషిని రక్షించుకోవాలనే తపనతో, కృత నిశ్చయంతో చేస్తున్న 'వెను చరుపులు'. ఆవేదన, సానుభూతి, బుజ్జగింపు, మేలుకొలుపు, పట్టుదలా అన్నింటిని మించి కార్యోన్ముఖ కంఠంతో కదనుదొక్కిస్తున్న వేడి వేడి వాడి పంక్తులు. మనిషి ప్రగతి కోసం కవి అన్వేషిస్తున్న పాజిటివ్ పరిష్కారాలుగా డా॥ఎన్. గోపి సినారె ప్రపంచ పదులను నిర్వహించారు.

దాశరథి, సి.నా.రె లిద్దరూ తెలుగు సిరిమా పాటకు ఉర్దూపదసోయగాన్నద్దారు. గజల్ గులాబీల సువాసనలను గుభాళింపచేశారు. తెలుగులో గజల్ ప్రక్రియ దాశరథితో ఆరంభమైతే సినారెతో విస్తరించింది.

## సినారె గజల్ :

"రమ్మంటే చాలు గానీ రాజ్యాలు విడిచిరానా
నీ చిన్ని నవ్వుకోసం స్వర్గాలు గడిచిరానా
యేడేడు సాగరాలు, యెన్నెన్నో పర్వతాలు
యెంతెంత దూరమైన బ్రతుకంతా నడిచిరానా
కనులందు మంచులాగ కలలన్నీ కరిగిపోగా
కావేరి వోలె పొంగి కన్నీరు తుడిచిరానా
నీవున్న మేడ గదికి నను జేరనీయరేమో!
జలతారు చీరగట్టి సిగపూలు ముడిచిరానా
పగబూని కంకు వారు, బంధించి వుంచినారు
యేనాటికైన గానీ ఈ గొడ పొడచిరానా! "

ఈ గజల్ ఎందరో సాహిత్యాభిమానుల్ని, గాయకుల్ని ఆకర్షింపచేసుకొంది. దాశరథి మొత్తం 11 గజళ్ళు రాశాడు. ఆ గజళ్ళు సాహిత్యాభిమానుల్ని గజల్ ఆరాధకుల్ని చేశాయి. దాశరథి గజల్ మజాను, నవ్యతను విస్తరింప చేస్తూ దానికి మానవీయ కోణాన్ని జోడించిన సుకవి సి.నా.రె.

గజల్ ప్రక్రియను సి.నా.రె విశ్వవ్యాప్తం చేశాడు. ఆయన గజళ్ళు వేదికలపై గానం చేసి ప్రఖ్యాతులైన వారెందరో ఉన్నారు. తాను స్వయంగా మార్ధవమైన కంఠంతో గానం చేసి సభికుల్ని మైమరపించారు.

తెలుగు గజళ్ళు సినారె గజళ్ళు, సినారె స్వయంగా పాడిన క్యాసెట్ సంగీత సాహిత్యాభిమానులకు అపురూప కానుకలు.

" అమ్మ ఒక వైపు దేవతలంతా ఒక వైపు
సరి తూచమంటే నేను ఒరిగేను అమ్మవైపు " సినారె గజళ్ళలో ఉదాత్తం , హృదయాన్ని కదిలించేది ఈ గజల్ వస్తు వైవిధ్యంతో నిండిన సినారె గజళ్ళు వంద వరకు ఉన్నవి.

మాటకు దండం పెడతా పాటకు దండం పెడతా
మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా
ఎంత రాచమొక్కైన సిమెంటులోన మొలవదురా
సృష్టికి ప్రాణం పోసే మట్టికి హారతి పడతా

.............................................................

.............................................................

అరువు తెచ్చుకున్న గొంతు అసలే సరిపడదు నాకు
కడ వూపిరి దాకా స్వీయ కంఠంతో గీపెడతా
అచ్చమైన ప్రతిభ ముందు అందరు ఒకటే 'సినారె'
కదిలితే అట్టడుగు మనిషి కాళ్ళకు గజ్జెలు కడతా

సినారె గజల్ రచనా వ్యాసంగం లో "సినారె గజళ్ళు" మలిదశ "తెలుగు గజళ్ళు" తొలిదశ. మలిదశలో ఉర్దూ గజల్ "మౌలిక ధాతువులను అనుసరిస్తూనే మత్లా వరకు అన్ని పాదాల్లోనూ మాత్రా సంఖ్యా సమత్వాన్ని పాటించాను. కాఫియా స్వరూపం లో మాత్రం కొన్ని చోట్ల కాస్త

స్వేచ్ఛ తీసుకున్నాను. నా ఇతర గేయ రచనల్లో ఉన్నట్లు గానే ఈ గజళ్ళలో కూడా చాలా వరకు యతి నియమం ఉండడం గమనించదగ్గ అంశం" అని సి.నా.రె చెప్పుకున్న అంశాలను (నా మాట - నారాయణ రెడ్డి. డా॥ సి. నారాయణ రెడ్డి సమగ్ర సాహిత్యం - ఆరో సంపుటం - పుట: 82) పై గజల్ ప్రతిబింబించింది.

"ఓహో గులాబి బాలా ! అందాల ప్రేమ మాలా !
సొగసైన కనుల దానా ! సొంపైన మనసు దానా !
నీ వారెవరో తెలుసుకో తెలుసుకో ! "

దాశరధి తెలుగు సినిమా పాటల్లో గజల్ సంస్కృతిని ప్రవేశపెట్టిన విధానాన్ని తెలియ చేసే పాట ఇది. "ఇద్దరు మిత్రులు" సినిమా లో 'ఖుషీ ఖుషీ గా నవ్వుతూ', 'నవ్వాలి నవ్వాలి నీ నవ్వులు నాకే ఇవ్వాలి', మొదలైన పాటలు దాశరధి పాండిత్య ప్రకర్షను తెలియ చేస్తాయి.

అలాగే సినారె "సప్తస్వరాలు" సినిమా లోని ఒక పాటలోని చరణాన్ని రుబాయీ రూపంగా ఈ విధంగా రాశాడు.

"పున్నమి రేయి పూచిన తోట / కన్నులు చేసే గారడి వేట
చూపులు జత చేసి ఊపిరి శ్రుతి చేసి / తనువే జల్లన కవ్వించిన ఆ మాట"

"చైనా టౌన్" సినిమాలో, మజ్రూహ్ సుల్తాన్ పురి రాసిన ప్రసిద్ధ హిందీ గీతం "బార్ బార్ దేఖో, హజార్ బార్ దేఖో !!

దేఖో నేకె ఛీజ్ హై హమారీ దిల్ రుచా ! తాలీ హో ! తాలీహో !! తాలీహో !!!

దీనికి సి.నా.రె అద్భుత అనువాదం "ఎంత వారు గానీ వేదాంతులైన గానీ వాలు చూపు సోకగానే తేలిపోదు రోయ్ / కైపులో! కైపులో!! కైపులో!!!

షేర్, దోహా, భజన్, తరానా వంటి ఉర్దు, హిందీ కవితా ప్రక్రియలు తెలుగు సినిమా పాటల్లో మిళితం చేసి తెలుగు సినిమా పాటని ఉన్నత శిఖరం పై నిల బెట్టాడు సి.నా.రె. దాశరథి, సి.నా.రె ల సాహిత్య తులనాత్మక పరిశోధన జరగాల్సిన అవసరముంది.

## ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు పై ఉర్దూ పారశీకముల ప్రభావము - డా॥ కె.గోపాలకృష్ణారావు
2. గాలిబ్ గీతాలు - దాశరధి
3. డా. సి.నారాయణ రెడ్డి సమగ్ర సాహిత్యం - 6వ సంపుటం
4. పంచ పదుల్లో ప్రపంచం - డా॥ ఎన్. గోపి. సి.నా.రె. "ప్రపంచ పదులు"కు ముందుమాట.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు జానపదుల నమ్మకాలు

– డా॥ అజ్మీరా సిల్మా నాయక్, ప్రాచార్యులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, హైదరాబాద్, తెలంగాణ.

మానవ సమాజం నుంచి జానపదులకు సంక్రమించే సాంస్కృతిక అంశాలలో 'నమ్మకాల'ను కూడా చేర్చుకోవాలి. ఆదిమ మానవుని జీవితం నుంచి ఆధునిక జీవితం వరకు నమ్మకాలు ప్రథమస్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. పల్లె ప్రజలలో ఈ నమ్మకమనేది ఎక్కువగానే కనిపిస్తున్నా నేటి ఈ ఆధునిక కాలంలోని ప్రజలు కూడా మూఢనమ్మ కాలలో తగుల్కొని బయటపడలేక ఇబ్బందులకు గురవు తున్నారు.

నమ్మకాలనేవి మన సాంఘికాచారాలలో ఒక భాగం. సంఘమనేది లేకపోతే ఈ మూఢ నమ్మకాలుండవు. ఒక్కొక్కసారి ఈ నమ్మకాలు మానవుని మనస్సును అల్ల కల్లోలం చేస్తాయి. దాని వలన మానవుడు మానసిక క్షోభకు గురవుతాడు. మూఢ విశ్వాసాన్ని చాలా గుడ్డిగా నమ్మే అమాయక పల్లెప్రజలు చాలా మంది ఉన్నారు. ఈ మూఢ విశ్వాసం మానవుని తన వైపు బలవంతాన లాక్కుంటుంది, మాయలు, మంత్రాలు మొదలైన శక్తుల పట్ల నమ్మకం కలిగేట్లుగా చేయడమే కాక మూఢ విశ్వా సాలు మనిషిని ఎప్పుడూ భయంలో ముంచెత్తు తుంటాయి. పిల్లి అడ్డం వచ్చినట్లయితే ఏమైనా కీడు సంభవించవచ్చునని భావన నమ్మకంలో ఒక భాగమైతే, వెళ్ళకుండా వెనక్కి తిరిగి రావడం మరొక మూఢ నమ్మ కముగా చెప్పవచ్చు. మనం బయటికి వెళ్ళుతున్నప్పుడు ఎవరైనా తుమ్మితే కీడుగా భావిస్తారు.

జానపదుల నమ్మకాలు అత్యంత ప్రాచీనకాలం నుంచి ఒకతరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తూ వస్తున్నాయి. అసలు ఈ నమ్మకాలనేవి మానవుని పుట్టుక తోనే వస్తున్నాయనడంలో సందేహించాల్సిన పనిలేదు. అయితే మానవుడు ఒకసంఘంగా ఏర్పడిన తర్వాతే మూఢనమ్మకాలకు బలం చేకూరింది. పూర్వం మానవుని భావ్య వ్యక్తీరణకు భాష ఏర్పడింది. ఆ భాష ఒక మనిషి నుంచి మరొక మనిషికి సంక్రమించింది. చుట్టుప్రక్కల తిరిగే పశుపక్ష్యాదుల స్వభావాల ఆధారంగా అనేక సమ్మకాలు ఏర్పడ్డాయి.

ఈనమ్మకాలు తెలుగు పుట్టుకతో ఉద్భవించి నాయనుకుంటే నమ్మకాలు కూడా ఐతరేయ బ్రాహ్మణ మంత ప్రాచీనమని చెప్పడంలో సందేహంలేదు. తెలుగులో నన్నయ కాలంనుండి ఈ సమ్మకాలు కావ్యా లలో, శాసనాలలో చోటు చేసుకున్నాయి. కోయిల మనకు మృదుమధురంగా పాడేమంచీ పక్షిగా ఉంటే పాశ్చాత్యులు మాత్రం అది మోసం చేసే పక్షులకు సంకేతంగా భావి స్తారు. గుడ్లగూబ మనకు అన్ని విధాలుగా చెడ్డపక్షి అని భావిస్తే పాశ్చాత్యులకు అదీ వివేక వంతమైన పక్షి.

ప్రకృతి శక్తులను ఆశ్చర్యంతో, భయంతో సంతోషంతో వీక్షించిన మానవుడు ఎన్నో రకాల నమ్మకాలను ఏర్పరచు కున్నాడు. యజ్ఞ యాగాదులు, జాతరలు, వ్రతాలు, నోములు, పూజలు మొదలైన మత సంబంధ కార్య కలాపాలు నమ్ముకాలుద్భవించడానికి కారణమౌతాయి. కొన్ని నమ్మకాలు సాంస్కృతిక కారణాల వలన ఉద్భ విస్తాయి, మాతృ అనేది ప్రతి ప్రాణికి సహజమైన గుణము, కాని గొడ్రాలిని హీనంగా చూసేది మాత్రం సాంస్కృతిక కారణములవలన, గొడ్రాలు ఆశీర్వాదం పొందరాదనే నమ్మకం సాంస్కృతికంగా వెలువడింది. ఈ విధమైన నమ్మకాలు ఒక వ్యక్తి నుంచి వేరొక వ్యక్తికి సమాజంలో సులభంగా అంటు వ్యాధిలాగా వ్యాపిస్తాయి.

మానవాతీత శక్తుల వలన రోగాలు సంక్రమిస్తాయని నమ్మేవాళ్ళు చాలా మంది ఉన్నారు. దెయ్యాలు, భూతాల వలన అనేక విధాల కష్టాలు సంభవిస్తాయని వాటిని తప్పించుకోవడానికి మనిషి అనేక ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టాడు. తాయత్తులను కట్టుకోవడం, మంత్ర గాళ్ళను ఆశ్రయించడం, చెప్పులు చేత ధరిస్తే దెయ్యాలు దగ్గరికి రావని, దెయ్యాలకు కాళ్ళు ఉండవని, ఉన్నా పాదాలు వెనక్కి దిరిగి ఉంటాయని నమ్మకం సమాజంలో

వ్యాప్తిలో ఉంది. యజ్ఞయాగాదులలో జాతరలో బలి ఇప్వడం వలస రోగాలను నయం చేసుకోవచ్చనే సమ్మకం వల్ల దారుణమైన పరిణామాలు సంభవించాయి. ఇవేకాక దేవత ఒంటి పైకి పచ్చి కోరికలు కోరడం ప్రారంభించి తమకి నైవేద్యంగా కోళ్ళు కావాలనో, గొర్రెలు కావాలనో, బర్రెలు కావాలనో, పూజరుల ద్వారా, భక్తుల ద్వారా అడగడం అనే ఆచారం జానపదులలో ఉంది.

గ్రహణ కాలంలో తప్పట కొట్టి సూర్యుణ్ణి రాహువు నుంచి తప్పించే ఆస్తిక మహాశయులు, దేవుడికి ముడుపులు కట్టుకునే వారు, దేవునికి తల నీలాలర్పించేవారు, సత్యనారాయణపూజలు. నాగ పూజలు చేసే వారు గంగా నదిలోని మురికి నీటిని తెచ్చి తీర్థమనేవారు, చింత చెట్టు మీద దెయ్యాన్ని చూసేవారు, ఇలాంటి మూఢ నమ్మకాలలో అంధాభిమానం కలవారు చాలా మందిని మనం చూస్తున్నాం. పండుగనాడు పిల్లల్ని కొట్టకూడదని, తిట్టకూడదని చెప్పడం, రాత్రిపూట సున్నం, మజ్జిగ మొదలైనవి ఇవ్వకూడదని చెప్పడం. ఉప్పును చేతికి ఇవ్వకూడదనడం, మంగళవారం అశుభం అని చెప్పడం, శనివారం కొత్త దుస్తులు ధరించకూడదనడం, శుక్రవారం ఆడపడుచును ఇంటి నుండే పంపరాదనడం. ఇవన్నీ మరి కొన్ని ఆచారాలు. ఆరువ్రేళ్ళుంటే అదృష్టవంతులని, మెల్ల కన్ను ఉంటే అదృష్టమని దైహికస్వరూపాన్ని బట్టి చూస్తే, కుడి కన్ను కుడిభుజం అదిరితే మంచిదని చెప్పేవి చలనాన్ని గురించిన సమ్మకాలు.

పశు పక్ష్యాదులకు సంబంధించిన సమ్మకాలు వాటి చాతుర్యాన్ని తెలిపేవి కొన్ని వాటి అరుపుల ద్వారా, అవి కన్పించడం ద్వారా మనిషికి కలిగే శుభాశుభాలను తెలిపేవి కొన్ని పశు పక్ష్యాదులు తరతరాల నుంచి మానవునితో అవిభాజ్య సంబంధాన్ని కలిగి ఉండడమే ఇలాంటి నమ్మకాలు పుట్టడానికి కారణం. రాత్రి పూట కుక్క ఏడిస్తే ఏదో అశుభం జరుగుతుందని, బల్లి పలికితే శుభం, బల్లి మీద పడితే జరిగే శుభాశుభాలు గురించి వాడుకలో నమ్మకం ఉంది. పిల్లిని చంపితే దానికి గుడి కట్టించాలని, గుడ్లగూబ ఇంటి మీద వాలితే అశుభం అని పశు పక్ష్యాదులకు సంబందించిన నమ్మకాలు వందలు, వేలున్నాయి. ప్రకృతిలోని ఇతర వస్తువులని గురించిన నమ్మకాలు అనేకం ఉన్నాయి. నువ్వులు, ప్రత్తి ఊరకనే తీసుకోరాదని, తులసి చెట్లు పవిత్ర గుణం గురించి విశ్వాసాలున్నాయి. పౌరాణిక కథలు ఐతిహ్యాలు కూడా కొన్ని నమ్మకాలు పుట్టడానికి కారణమువుతాయి. గర్భవతిని పుట్టింటికి పిలుచుకొని రావడానికి అన్నను పంపరాదంటారు. ఇవన్ని కూడా మనం గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ అక్కడక్కడ చూస్తుంటాం.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధించిన మానవుడు ఎంత చదువుతున్న వారైనా సరే ఏ హోదాలో ఉన్న వారైనా సరే ఈ మూఢ నమ్మకాలపై విశ్వాసాలను చూపుతారు. తాము ఏ పని చేసిన, లేదా చేస్తున్న అవి సక్రమంగా అవ్వాలంటే పూజల పేరుతో రకరకాల తంతులు నిర్వహిస్తుంటారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# సాహిత్య ప్రస్థానంలో తెలంగాణ కథ

- డా. చవ్వా వెంకటరెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, హైదరాబాదు, తెలంగాణ.

ఒక ప్రాంతపు చారిత్రక, సాంస్కృతిక పరిణామాలను, ఒక జాతి ఎదుర్కొన్న సవాళ్లను, స్వీకరించిన అనుభవాలను, పంచుకున్న అనుభూతులను, ఉత్థానపతనాలను రికార్డు చేసేది సాహిత్యమే. కానీ రాజకీయ కారణాల వల్ల తెలంగాణ సాహిత్యానికి సముచిత స్థానం దక్కలేదనే చెప్పవచ్చు. విశాలాంధ్ర ఏర్పాటు వల్ల తన అస్తిత్వాన్ని, ప్రత్యేకతను, ప్రాతినిధ్యాన్ని కోల్పోయిన చరిత్ర ఈ ప్రాంతానిది. కేవలం రాజకీయ ఏకీకరణ మిగతా రంగాలపై సమదృష్టిని నిలుపలేకపోయింది, అంతరాలను పూడ్చలేకపోయింది. చారిత్రక అసమానతల కారణంగా తెలంగాణా చరిత్రకు, సాహిత్యానికి తెలుగుదేశ చరిత్రలో, సాహిత్యంలో తగిన వాటా లభించకుండా పోయింది. ప్రధాన ప్రవంతి తెలుగు సాహిత్య చరిత్ర గత ఆరు దశాబ్దాలలో తెలంగాణ సాహిత్య సంప్రదాయాలనూ, సాహిత్యకారులనూ, సాహిత్యానికీ, సాహిత్య చరిత్రకూ దక్కవలసిన న్యాయమైన స్థానం దక్కలేదు. ప్రత్యేక అధ్యాయాలుగా వెలుగొందవలసిన తెలంగాణా చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం ఉప శీర్షికల కిందికి చేరిపోయి, పరాయికరణకు గురయింది. దీనికి తెలంగాణా ప్రాంత సాహిత్యకారుల స్వంత నిర్లక్ష్యం కూడా కొంత తోడయిందనే చెప్పవచ్చు. అయితే ఈ విస్మృతిని, వివక్షను ఛేదించి, మూలాలను శోధించి, తెలంగాణా అస్తిత్వాన్ని నిలబెట్టే ప్రయత్నం గత దశాబ్ది కాలంగా దీక్షాబద్ధంగా కొనసాగుతున్నది.

నిజానికి తాతలు, తండ్రులు వారసత్వంగా అందించిన ఆస్తిని భద్రపరుచుకున్నప్పుడు ఎంత సంతృప్తి కలుగుతుందో, దాన్ని పోగొట్టుకుని వెతుక్కుంటునప్పుడు అంతే తండ్లాట కలుగుతుంది. ఇవాళ తెలంగాణ సాహిత్య ప్రస్థానం కూడా అలాంటిదే. అలా అని తెలంగాణ సాహిత్యం రాసి, వాసిలో చిన్నదేమీ కాదు గానీ తెలంగాణా సాహిత్య చరిత్ర మాత్రం ఇంకా శైశవదశలోనే ఉన్నదని మాత్రం చెప్పవచ్చు.

గత కొంతకాలంగా తెలంగాణాలో ఆధునిక సాహిత్య ప్రక్రియల పుట్టుక, క్రమవికాసం, లభించిన ప్రేరణలు, నిలువరించిన పరిస్థితులు మూల్యాంకనం చేయబడుతున్నాయి. సాహిత్యంలో ప్రముఖపాత్ర పోషించే సాహిత్య ప్రక్రియ కథ కూడా తనను తాను వెలికితీసుకుని, కొత్త నిర్వచనం రూపొందించుకుంటున్నది. ఇప్పటివరకూ తనకు తెలియని తన చరిత్రలో కొత్త ప్రేరణను పొందుతున్నది కనుక కనీసం గడిచిన వందేండ్ల చారిత్రక, రాజకీయ సందర్భాలను ఉటంకించకుండా ఇక్కడి కథా సాహిత్యాన్ని సమీక్షించటం సాధ్యపడదు. సమగ్రం కాదు కూడా.

## ఉర్దూ స్పర్శతో తెలంగాణ కథ..!!

ఉమ్మడి రాష్ట్రంగా అవతరించకముందే తెలంగాణాలో నెలకొన్న పరిస్థితులు వేరుగా ఉండేవి. సీమాంధ్ర తరహాలో ఇక్కడ తెలుగు వచనం విద్యాప్రసారమాధ్యమంగా లేదు. అందుకు భౌతిక వనరులుగా ఉన్న విద్యావ్యవస్థ, అచ్చుయంత్రాలు, అభివృద్ధి సాధనాలు తెలంగాణాలో వ్యాప్తిలో లేవు. నిజాం ప్రభుత్వం కొన్ని విద్యావిషయక సంస్కరణలు ప్రవేశపెట్టినా, అవి శైశవదశ దాటలేదు. మరోవైపు సంస్థానంలోని కులీన, ఉన్నతవర్గాలు ఉర్దూను రాజ్యభాషగానే కాక గృహభాషగా కూడా స్వీకరించాయి. సీమాంధ్రులు ఆంగ్లానికి ఇచ్చిన ప్రాధాన్యతను తెలంగాణా వతన్‌దార్లు, వారి అనుచరులు ఉర్దూకు కట్టబెట్టారు. స్వదేశీయమైన ఉర్దూ, దాని సాహిత్యం, ఆధునికత, అవసరం కూడా తెలంగాణా విద్యావంతులను ప్రభావితం చేశాయి.

అదే సందర్భంలో లక్నో కేంద్రంగా వర్ధిల్లిన ఉర్దూ సాహిత్యంలోని ప్రేమ్‌చంద్, కిషన్‌చందర్ వంటి కథకులు, వారి అభ్యుదయ, వాస్తవిక ధోరణలు సహజంగానే తెలంగాణా విద్యావంతులను ఆకర్షించాయి. సమకాలీన సామాజికాంశాలు కూడా ఇందుకు కారణమై,

తెలంగాణా సాహిత్యవికాసం పొరుగున ఉన్న తెలుగు సాహిత్యం కంటే భిన్నమైన వైఖరిని సంతరించుకున్నది. ఇంగ్లీషు, బెంగాలీ, బ్రిటిషాంధ్ర సాహిత్యాలతో సంబంధం లేని ఉర్దూ సాహిత్య స్పర్శతో, స్థానిక జీవితాలతో ముడి పడిన తెలంగాణా తెలుగుకథ మొదట పురుడు పోసు కున్నది. తెలంగాణా కథ పుట్టుపూర్వోత్తరాల పట్ల విశేష కృషి చేసిన ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, కె. శ్రీనివాస్ వంటి పరిశోధకులు ఈ విషయాన్ని చారిత్రక, సాహిత్య నిరూపణలతో నిర్ధారించారు.

### తెలంగాణాలో తెలుగుభాషా వికాసం - తెలంగాణా కథ :

తెలంగాణాలో తెలుగుకథ ఎప్పుడు, ఎట్లా పుట్టిందని తెలుసుకోవటానికి ముందు అప్పటి తెలుగుభాష పరిస్థితిని, సామాజిక స్థాయిని పరిగణనలోకి తీసుకోవాలసి వుంటుంది. మహారాష్ట్రులకు పూణే నగరం విద్యా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు కేంద్రస్థానం. నిజాం రాష్ట్రంలోని మరాఠీయులు కూడా ఇక్కడి నుండే ప్రేరణ పొంది హైదరాబాద్ నగరంలో, సంస్థానం మొత్తంలో ప్రబలమైన శక్తిగా ఎదిగారు. మహారాష్ట్రులతో పోల్చితే తెలుగువారు విద్యా, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో, చివరకు వ్యవసాయం రంగంలో కూడా వెనుకబడిపోయారు. కళా శాల విద్యలో, ప్రభుత్వ కొలువుల్లో, నగర వ్యాపార లావా దేవీల్లో మరాఠీయులదే పైచేయి. ఇది తెలుగు ప్రజల్లో దీర్ఘకాలిక అసంతృప్తిని, స్వభాషాభి మానాన్ని కలిగించింది.

ఇటు మహారాష్ట్రులను, అటు బ్రిటిషాంధ్రులను ప్రేరణగా తీసుకున్న తెలంగాణా విద్యావంతులు, మాతృ భాష ప్రాధాన్యాన్ని గుర్తించి, స్థానిక సాంస్కృతిక వికాసానికి గ్రంథాలయాలను స్థాపించుకున్నారు. 1901లో సుల్తాను బజారులో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయం, 1904లో వరంగల్లులో రాజరాజ నరేంద్ర భాషానిలయం, 1905లో సికింద్రాబాదులో ఆంధ్రసంవర్ధినీ గ్రంథాలయం, 1906లో విజ్ఞాన చరిత్ర గ్రంథమాల స్థాపించబడ్డాయి. తెలుగుభాషకు ఎలాంటి ఆదరణలేని ఆ సమయంలో రావిచెట్టు రంగారావు, రాజా నాయిని వెంకట రంగారావు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు వంటి క్రాంతదర్శులు తెలంగాణా ప్రజానీకంలో స్వాభిమాన బీజాల్ని నాటి, తెలుగు సాహిత్య వికాసానికి పాదులు తీశారు. ఆ మూలా ల్లోంచే తెలంగాణాకథ అంకురించింది.

### తెలంగాణాలో వచ్చిన తొలికథలు :

సమస్త తెలుగు సాహిత్యంలో గురజాడ అప్పారావు వ్రాసిన 'దిద్దుబాటు' మొదటి కథగా భావింపబడుతూ వచ్చింది. అయితే ఈ విషయంలో అనేక వాదప్రతివాదా లున్నాయి. 'దిద్దుబాటు' 1910 ఫిబ్రవరి ఆంధ్రభారతిలో అచ్చయింది. ఇదే ఆంధ్రభారతి పత్రిక 1910లోనే వెలువ రించిన సంవత్సరాది సంచికలో 'ఏబదివేల బేరము' కథ అచ్చయింది. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు 'రామానుజ రావు' అనే మారుపేరుతో ఈ కథవ్రాశారు. అట్లాగే తెలుగు వచన రచనల సూచి ప్రకారం మాడపాటి హనుమంత రావు వ్రాసిన 'నవ నాగరికత కథ' ఆంధ్రభారతి పత్రికలో 1911లో అచ్చయింది. తిరిగి 1912లో ఇదే పత్రికలో ఇదే రచయిత వ్రాసిన 'హృదయ శల్యం కథ' ప్రచురించబడ్డది. అయితే ఇటీవలి పరిశోధనల ప్రకారంగా బండారు అచ్చ మాంబ సమస్త తెలుగుకథా సాహిత్యంలో మొదటి కథా కర్తగా ప్రకటింపబడింది. 1902లోనే 'హిందూ సుందరి' పత్రికలో అచ్చమాంబ వ్రాసిన 'స్త్రీవిద్య', 'ధన త్రయోదశి' అనే రెండు కథలు అచ్చయ్యాయి. భార్గవీరావు కృషితో స్త్రీవిద్య, లలిత కృషితో ధనత్రయోదశి కథ వెలుగులోకి వచ్చాయి. సంగిశెట్టి శ్రీనివాస్ మరింతదీక్షగా పరిశోధించి 'తెలుగు జనానా' పత్రికలో 1892లో అచ్చమాంబ వ్రాసిన మూడు కథలు అచ్చయిన విషయం కనుగొని 'గుణవతి యగు స్త్రీ' అనే కథ గల పత్రిక ప్రతిని వెలికితీసి, ఇదే తెలుగులో మొదటి కథ అని నిరూపించాడు. "బండారు అచ్చమాంబ- తొలి తెలుగుకథలు" పేరుతో పది కథల సంకలనాన్ని వెలువరించాడు. దీనితో తెలుగులో ఏది మొదటి కథ అన్న మీమాంసకు పరిష్కారం దొరికింది.

అయితే పైన పేర్కొన్న నలుగురూ బ్రిటిషాంధ్ర ప్రాంతంలో జన్మించినప్పటికీ, గురజాడ అప్పారావు మినహా మిగిలిన ముగ్గురూ తెలంగాణా సాహిత్య,

సాంస్కృతిక వికాసంలో అంతర్భాగమైనవారు. తెలంగాణా సాంస్కృతిక పునర్వికాసం, గ్రంథాలయోద్యమం, చరిత్ర పరిశోధన, రచనావ్యాసంగం, పత్రికోద్యమం మొదలైనవి ఏకకాలంలో జమిలిగా పుట్టిపెరిగిన అంశాలు. వీటిన్నిటితో కొమర్రాజు వెంకట లక్ష్మణరావుకు, మాడపాటి హనుమంతరావుకు గాఢమైన సంబంధం ఉంది. మాడపాటి జీవితమంతా తెలంగాణాతో మమేకమై నడిచింది. లక్ష్మణరావు విద్యావికాసానికి, పరిశోధనకు, సాహిత్య కృషికి కార్యక్షేత్రం తెలంగాణమే. అచ్చమాంబ, లక్ష్మణరావులు అక్కా తమ్ముళ్లు. తమ్ముడి చదువు, పరిశోధనతో ప్రేరణ పొందిన అచ్చమాంబ సమాజాన్ని, సాహిత్యాన్ని తన కార్యరంగాలుగా స్వీకరించింది. గురజాడ అప్పారావుకు ఆంగ్ల, బెంగాలీ కథాసాహిత్యాలతో సంబంధం ఉండగా తెలంగాణా సమాజంతో ముడిపడిన ఈ ముగ్గురికి ఉర్దూ, మరాఠీ సాహిత్యాలతో ప్రత్యక్ష సంబంధం ఉంది. తెలంగాణా నుండి కథారచనకు పూనుకున్నవారిని ప్రేరేపించిన అంశాలు గురజాడ వంటి బ్రిటిషాంధ్రులకు లభించిన ప్రేరణల కంటే భిన్నమైనవి. కనుక అచ్చమాంబ, లక్ష్మణరావు, హనుమంతరావులు తెలంగాణా కథాసాహిత్యంలో మాత్రమే అంతర్భాగమని తెలంగాణా సాహిత్య పరిశోధకుల నిర్ణయం. ఈ నిర్ధారణ హేతుబద్ధతకు తగినన్ని సాక్ష్యాలు చరిత్రలో ఉన్నాయి.

### తెలంగాణాలో అచ్చయిన తొలికథలు :

తెలంగాణాలో తొలి పత్రిక 'హితబోధిని''. ఇది 1913లో పాలమూరులో ప్రారంభించబడింది. సకల రంగాల వార్తలకు తగిన ప్రాధాన్యం ఇచ్చింది. దీన్ని అన్నీ తానే అయి బండారు శ్రీనివాస శర్మ నడిపించాడు. హితబోధిని లభ్యమైన కొన్ని ప్రతుల్లోనే 1913-15 మధ్య శ్రీనివాస శర్మ స్వయంగా ఏడెనిమిది కథలు రాసి ప్రచురించటం కనుగొనబడింది. ఇందులో 'రాజయ్య సోమయాజులు', 'మృత్యువు దాని జ్ఞాపకం', 'కువైద్యరాజు' కథలు ఆనాటి కాలంచెల్లిన సంప్రదాయాలను చెబుతూ, వాటికి చురకలు వేసే చికిత్సలను అద్భుతంగా చిత్రించాయి. హితబోధిని పత్రిక ప్రతులు మరిన్ని లభిస్తే తెలంగాణా కథ పునాదులు మరింత స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి లభ్యమైన ఆధారాలను బట్టి తెలంగాణా ప్రాంత పత్రికలో అచ్చయిన తొలి తెలంగాణా కథగా 'రాజయ్య సోమయాజులు'ను గుర్తించవచ్చు. ఇతివృత్త పరంగా కూడా ఇది స్థానిక సమకాలీనతను ప్రదర్శిస్తూ, చక్కని శిల్పసౌష్ఠవంతో రూపొందింది. బ్రిటిషాంధ్ర నుండి పులుగుర్తి నరసమాంబ నడిపిన సావిత్రి పత్రికలో 1914లో 'జీవితార్ణవం' అనే కథ ప్రచురితమైంది. ఈ కథారచయిత హరి బాపయ్య. ఈయన వరంగల్లు నుండి వెలువడిన ఆంధ్రాభ్యుదయం పత్రికలో కూడా పలు రచనలు చేసినట్లు తెలుస్తున్నది. 1898 నుండి 1920 వరకూ తెలంగాణాలో రూపుదిద్దుకున్న తెలుగుకథ బుడి బుడి నడకలు స్థూలంగా ఇవే అయినప్పటికీ ఆనాటి పత్రికల సమాచారం, ప్రతులు మరింతగా లభిస్తే ఎన్నో విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది.

1917 ప్రాంతంలో 'ఆంధ్రమాత' లేదా దానికి దగ్గరి పేరుతో తెలంగాణాలో ఒక ప్రతిక వెలువడినట్లు మౌఖికాధారాలు దొరుకుతున్నాయని పరిశోధకుడు కె. శ్రీనివాస్ పేర్కొన్నాడు. ఇక కోస్తాంధ్రనుండి 1920 వరకు వెలువడిన పత్రికలను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తే తెలంగాణా ప్రాంతీయుల కథలు దొరికే అవకాశం ఉంది. హితబోధిని రెండేండ్లపాటు మాత్రమే కొనసాగింది. ఆపైన ఆరేడు సంవత్సరాల కాలం స్థానికంగా తెలుగు పత్రికలు కన్పించటం లేదు. 1921లో హైదరాబాద్‌లో జరిగిన ఒక సమావేశంలో మహారాష్ట్రుల చేతిలో తెలుగువారి భాషకు, ఆత్మగౌరవానికి భంగం కలిగింది. ప్రతిచర్యగా గంటల వ్యవధిలోనే "నిజాంరాష్ట్రాంధ్ర కేంద్ర జనసంఘం" పేరుతో తెలుగు స్వాభిమాన సంఘం ఏర్పడింది[9]. దీని ప్రేరణతోనే 1921లో తెలంగాణాలో తిరిగి రెండు తెలుగు పత్రికలు ప్రాణం పోసుకున్నాయి. అవే నల్లగొండ నుండి వెలువడిన 'నీలగిరి', వరంగల్లు జిల్లా ఇనుగుర్తి నుండి వెలువడిన 'తెనుగు' పత్రికలు. వీటి స్ఫూర్తితో 1924లో వరంగల్లు నుండి ఆంధ్రాభ్యుదయం, హైదరాబాదు నుండి 1925లో గోలుకొండ, 1927లో సుజాత పత్రికలు

ప్రారంభమయ్యాయి. స్థానికంగా తొలి తెలుగు మాస పత్రిక 'సుజాత' ఆవిర్భావం తెలంగాణా కథాసాహిత్య ప్రస్థానాన్ని గొప్ప మలుపు తిప్పింది. 1920వ దశాబ్దానికి సంబంధించిన తెలంగాణా కథాసాహిత్యపు రూపురేఖలు స్థూలంగా ఇవి. షబ్నవీసు వెంకట రామనరసింహా రావు, సోమరాజు రామానుజ రావు, మేఘాద్రి పెరుమాళ్ళు నాయుడు, సిరుగూరి జయరావు, ఒద్దిరాజు సోదరులు, ఆదిరాజు వీరభద్రరావు మొదలైనవారు 1920-30ల మధ్యకాలంలో తెలంగాణాలో చెప్పుకోదగిన కథారచయితలు.

నీలగిరి, తెనుగు పత్రిక రెండూ కూడా రాజకీయాల ప్రాతిపదికగా వెలువడినప్పటికీ, కథాసాహిత్యాన్ని ఆదరించాయి. నీలగిరి పత్రికను నడిపిన షబ్నవీసు వెంకట రామ నరసింహా రావు స్వయంగా కథారచయిత మాత్రమే గాక సంఘ సంస్కరణోద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర జనసంఘ ఉద్యమాల్లో కీలక పాత్ర వహించిన వ్యక్తి. 1921లోనే ఈయన 'బాలకావిలాపం' అనే కథ వ్రాసి, దాన్ని ఏక కథాపుస్తకంగా ప్రచురించాడు. శుద్ధ గ్రాంథికంలో వచ్చిన ఈ కథ బాల్యవివాహాల్ని నిరసించింది. రామనరసింహారావు తన పత్రికలో పనిచేసిన శేష భట్టర్ రామానుజాచార్యులు, నల్లగొండ నుంచి విభూతి పత్రికను నడిపిన వీరభద్రశర్మ మొదలైన వారి కథలను కూడా నీలగిరిలో ప్రచురించి ప్రోత్సహించాడు. రచయితల పేర్లు తెలియని స్వీయచరిత్ర, సాతాని జియ్యర్, కాపు, దురాశ వంటి కథలు నీలగిరి పత్రికలో దొరికినట్టు పరిశోధనల వల్ల తెలుస్తున్నది, ఆ పత్రికలో పనిచేసిన వారే పై కథలు వ్రాసి ఉంటారు. మానుకోట తాలూకా ఇనుగుర్తి గ్రామ దేశముఖ్‌లైన ఒద్దిరాజు రాఘవ రంగారావు, సీతారామచంద్రరావు సోదరద్వయం స్వయంగా సంపాదకులై నడిపినదే తెనుగు పత్రిక. వీరిద్దరూ బహుముఖ ప్రజ్ఞాశాలులే కాక బహుగ్రంథకర్తలు కూడా. ఇద్దరూ మంచి కథకులైనా, తెనుగు పత్రికలో వివిధ వ్యాసాలు రాసిన కారణాన తమ కథల్ని ప్రచురించుకోలేదు. వీరి కథలు అనంతర కాలంలో సుజాతలో అచ్చయ్యాయి. అయినా 'తెనుగు' పత్రిక సమకాలీనకథలకు ప్రోత్సాహం ఇచ్చింది. 1924లో భవానీసింగు వ్రాసిన స్నేహం, రాధా కృష్ణ శర్మ వ్రాసిన తీర్థయాత్ర కథలు, 1925లో కోదాటి శ్రీనివాసరావు వ్రాసిన "నా కల' కథ తెనుగు పత్రికలో అచ్చయ్యాయి. 1923-25 మధ్య వరంగల్లు నుండి కోకల సీతారామ శర్మ సంపాదకత్వంలో ఆంధ్రాభ్యుదయం అనే పత్రిక వెలువడింది. మాడపాటి రామచంద్రుడు వ్రాసిన 'అడవి గాచిన వెన్నెల' కథ ఆంధ్రాభ్యుదయంలోనే లభించింది. ఇది తెలంగాణాలో తొలి అపరాధ పరిశోధక కథగా కన్పిస్తున్నది. ఇతని మరో కథ 'జయాపజయాలు' 1927 సుజాత పత్రికలో వెలువడింది. మేధావి, పత్రికా రచయిత, ఉదార సంఘసంస్కర్త అయిన రామచంద్రుడు మరిన్ని కథలు వ్రాసి ఉండే అవకాశం ఉంది. 1925లో ఆంధ్రాభ్యుదయంలో జమలాపురం వెంకటేశ్వర రావు రాసిన 'సంస్కర్తలు', ఆదిరాజు వీరభద్ర రావు రాసిన 'చాతుర్యము', వి.శేషగిరి రావు రాసిన 'నవనాగరికుడు-భార్య', విద్యార్థి రాసిన 'మనోహరిణి', ప్రజాహితుడు రాసిన చిత్రకథ ప్రచురింపబడ్డాయి. ఈ కథల పరంపరను గమనిస్తే కథాసాహిత్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిన పత్రికగా ఆంధ్రాభ్యుదయం నిలుస్తుంది. తరువాతి కాలంలో వచ్చిన గోలుకొండ, సుజాత పత్రికలకు ఇది ప్రేరణగా నిల్చిందనటం సమంజసమే.

సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'మొగలాయి కథలు' కూడా అలనాటి తెలంగాణ జీవితాన్ని, నాటి తెలుగు - ఉర్దూ సమ్మిళితమైన భాషలో, పలుకుబడి ఎంత రమ్యంగా ఉండేవో తెలుపుతోంది. ఆ కథలని కేవలం వినోదం కోసమే రాసినట్లు వారు చెప్పుకున్నప్పటికీ, నాటి ప్రజల అమాయకత్వం, అధికారుల మోసకారితనం, ధనవంతుల దర్పం, పాశ్చాత్య పోకడల ప్రభావంతో పక్కదారి పట్టే యువకుల చందం ఆ కథల్లో ఆవిష్కృతమవుతాయి.

అదే కాలంలో తెలంగాణా తొలితరం దళిత ఉద్యమకారుడు, రచయిత భాగ్యరెడ్డి వర్మ 1931లో భాగ్యనగర్ అనే పత్రికను నడిపించాడు. ఇందులో 'అజ్ఞాతవాసి' అనే

మారుపేరుతో 'వెట్టిమాదిగ' కథ రాశారు. ఇది తెలుగు భాష మొత్తంలో దళితుడు రాసిన మొదటి దళిత కథ. 1934లో సికింద్రాబాదు నుండి వెలుబడిన దక్కన్ కేసరి పత్రిక కూడా కథలను ప్రచురించి, ప్రొత్సహించింది. వనాంబ, సత్యవతీబాయి, భాగి నారాయణ మూర్తి, మల్యాల శేషగిరిరావు వంటి కథకులు దక్కన్ కేసరికి పలు కథలు రచించారు. 1939-40ల మధ్య సికింద్రా బాదు నుండి వెలుబడిన 'తెలుగు తల్లి' పత్రిక బి.సీతా రామారావు రచించిన 'గరీబోన్ని' అనే కథను ప్రచు రించింది ఇది తెలుగులో తొలి మాండలిక కథగా ప్రకటిం చబడింది. ఈ పత్రికను నడిపిన వట్టికోట ఆళ్వారుస్వామి తన కథలతో బాటు మానేపల్లి తాతాచార్యుల కథలనూ ప్రచురించాడు.

జాతీయోద్యమ నాయకుడిగా, కమ్యూనిస్టుగా, రచ యితగా పేరెన్నికగన్న వట్టికోట ఆళ్వారుస్వామి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లాడు. జైల్లో ఉన్నప్పుడే బడుగు, బలహీన వర్గాలకు చెందిన తోటి ఖైదీల జీవితాలను 'పరిగె', 'మొదడుకు మేత', పతితుని హృదయం' వంటి కథలుగా రాశాడు. తెలుగులో జైలు జీవితపు కథలు రాసిన మొదటి రచయిత ఆళ్వారుస్వామేనేమో. జైల్లో రాసిన కథలన్నీ 1952లో 'జైలు లోపల' కథాసంపుటిగా వెలువడ్డాయి. తెలంగాణలో వచ్చిన తొలి సింగిల్ కాన్సెప్ట్ కథా సంపుటి ఇది.

తరువాతి తరం కథకుల్లో చెప్పుకోదగ్గ వ్యక్తి 'నెల్లూరి కేశవస్వామి'. సమస్త తెలుగు కథలకు తెలంగాణా ప్రతినిధి అనదగినవాడీయన. హైదరాబాదు మిశ్రమ సంస్కృతిని, వైవిధ్య భరితమైన హైదరాబాదు నగర జీవితాన్ని ఆధారం చేసుకుని ఈయన రాసిన కథల్లో శతాబ్దాల పర్యంతపు జీవన సంస్కృతి ఉంది. ఈ కథలు 1962లో 'పసిడి బొమ్మ', 1981లో 'చార్మినార్ కథలు' అనే రెండు సంపుటా లుగా వెలువడినా, ఇంకా మరుగున పడిన కథలు ఆయనవి చాలా ఉన్నాయని సాహితీ పరిశోధకులు అంటారు. చార్మినార్ కథల్ని హైదరాబాద్ 'తహెజీబ్'కు నిలువుటద్దాలని సాహిత్యకారులు భావించారంటే ఆ కథలకున్న ప్రాతినిధ్య విలువ అమూల్యమైనదని చెప్పు కోవచ్చు.

1970-90ల మధ్య కాలాన్ని తెలంగాణా కథా సాహిత్యానికి మైలురాయివంటిదని చెప్పవచ్చు. మొత్తం తెలంగాణ కథలకు దిశానిర్దేశం కలిగింది ఈ కాలంలోనే. తెలంగాణా కథకు ఇది విప్లవయుగం. జాతీయంగా, ప్రాంతీయంగా ఈ కాలం తెలంగాణా రాజకీయ చరిత్రలో ప్రత్యేకమైంది. కాలం, కథ ప్రజాసమస్యలతో మమేకమైన సందర్భమిది. ఒక రకంగా ఇది పోరాటాల కాలం. భారత దేశ స్వాతంత్ర్యం మోసుకొచ్చిన ఆదర్శాలు, ఆశలు సంపూర్తిగా ఆచరణలోకి రాలేకపోవటం, సమీప భవి ష్యత్తులోనైనా బతుకులు మారుతాయన్న భరోసా లేక పోవటం, భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటువల్ల అభివృద్ధి సాధ్యపడుతుందని భావించినా, అదీ కాకపోవడమేగాక, ఈ ప్రాంతంలో నయావలసవాదం రూపుదాల్చటం, ఆధి పత్య ధోరణి పెరిగిపోవటం వంటివి బడుగు వర్గాలను, పీడిత ప్రజానీకాన్ని సంఘర్షణకు, ఉద్రిక్తతకు లోను చేశాయి. ఈ పరిణామాల్లోంచే 1968లో దేశ రాజకీయాల్లో నక్సల్‌బరీ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమాలు ఆవిర్భవించాయి.

తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది ప్రాణాలు పణంగా పెట్టినా ఉద్యమం రాజకీయంగా మోసానికి గురికావడం, అదే సమయంలో శ్రీకాకుళం పోరాటం ఉధృతం కావడం, విశాఖ విద్యార్థులు రచయితలారా మీరెటువైపు అంటూ నిలదీయడం ఇవన్నీ విప్లవ రచ యితల సంఘం ఏర్పాటుకు దారితీశాయి. అప్పటికే తిరగ బడు కవులుగా, దిగంబర కవులుగా తెలంగాణ నుంచి సాహితీ పోరాటం చేస్తున్న వరవరరావు, చెరబండరాజు వంటి తెలంగాణ కవులతోపాటు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ వంటి వర్ధమాన రచయితలు విప్లవ సాహిత్యాన్ని సృష్టించారు. తెలంగాణ విద్యార్థి యువతరం దీన్ని బల మైన సాహిత్య సంస్థగా తీర్చిదిద్దుకుంది. అప్పటి వరకూ కాలక్షేపపు సాహిత్యాన్ని సృష్టిస్తూ, ప్రేమకథలకు, మధ్య తరగతి కుటుంబ సమస్యలకు పరిమితమైన దశలో కండ్ల ముందటి ప్రజాసమూహాల నుండి నేరుగా ప్రేరణ పొందుతూ అభ్యుదయ దృక్పథంతో చెరబండరాజు వంటి

యువ రచయితలు ముందుకు వచ్చారు. 1970లోనే విరసం 'ఇప్పుడు వీస్తున్న గాలి' కథా సంకలనం ప్రచురించింది. ఇందులో చెరబండరాజు రాసిన 'చిరంజీవి' కథ అచ్చయింది. 1971లో సృజన తరపున న్యూవేవ్ ప్రచురించిన 'హోరు' కథాసంకలనం వచ్చింది. విప్లవ రచయితలు కాని వారు కూడా ఉద్యమ ప్రభావంతో కథలు రాశారు. ఈ కదలికలన్నీ తెలంగాణా కథకు స్పష్టత నివ్వటానికి దోహదపడ్డాయి. ఈ కాలంలో వచ్చిన కథలను రైతాంగ పోరాట కథలు, గిరిజన పోరాట కథలు, కార్మిక పోరాట కథలుగా విభజించవచ్చు అంటారు కాసుల ప్రతాపరెడ్డి.

ఈ కాలంలో యశోదారెడ్డితో ప్రారంభించి తెలంగాణ నుంచి కథలు రాసిన రచయిత్రులు ఇల్లిందల సరస్వతి, మాదిరెడ్డి సులోచన, పోల్కంపల్లి శాంతాదేవి, బొమ్మ హేమాదేవి మొదలైన వారు కథాసాహిత్యరంగంలోకి ప్రవేశించారు. దిన, వార, మాస పత్రికల సంఖ్య పెరగటం వల్ల క్రమంగా రచనారంగంలోకి చదువుకున్న స్త్రీలు చాలా మంది ప్రవేశించారు. అలా 1960-1980 నాటికి తెలంగాణ నుండి మంచి కథలు రాసిన రచయిత్రులు చాలామంది ఉన్నారు. సుమారు నూటయాభై వరకు కథలు రాసిన రచయిత్రి మాదిరెడ్డి సులోచన రచనా జీవితం దీనికి నిదర్శనం.

నాటి ప్రధాని దేశంలో ప్రకటించిన అత్యవసర పరిస్థితి కూడా తెలంగాణ రచయితల్ని కదలించింది. తెలంగాణా యువతరం తమ కథారచనతో తమ ధిక్కారస్వరాన్ని ప్రకటించారు. అల్లం రాజయ్య, బి.ఎస్. రాములు, బోయ జంగయ్య. కె. రామ్మోహనరాజు, సదానంద్, పులుగు శ్రీనివాస్, పి.చంద్ మొదలైన యువకవులు కథారచనా రంగంలోకి అడుగుపెట్టి, తెలంగాణా సాహిత్య సృజనను వేగవంతం చేశారు. నూతన జవసత్వాలతో ప్రభావశీలంగా వస్తున్న ఈ కథాసాహిత్యంతో ప్రేరేపితులైన సాహు, ఉప్పల నరసింహం, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, కాలువ మల్లయ్య, నందిగం కృష్ణారావు, జాతశ్రీ, భానుమూర్తి వంటి యువ కవులు మలిదశలో కథారంగంలోకి ప్రవేశించారు. దీనితో ఈ కాలపు తెలంగాణా కథ మరింత పరిపుష్టిని సంతరించుకుంది.

1990 నాటికి తెలంగాణా సామాజిక జీవితంలో అనేకమైన మార్పులు వచ్చాయి. గ్రామాల ముఖచిత్రం మారింది. ఆంధ్ర వలస పాలకులతోపాటు, అమెరికా కనుసన్నల్లో అమలవుతూ వచ్చిన గ్లోబలైజేషన్ విధానాలు తెలంగాణా జీవితాన్ని మరింత దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో గాయపడ్డ తెలంగాణా జీవితాన్ని పాట తర్వాత వాస్తవికంగా, హృద్యంగా చిత్రించిన సాహిత్య ప్రక్రియ ఏదైన ఉందంటే అది కథ మాత్రమే. 1990 కాలం తర్వాత గ్లోబలైజేషన్ కారణంగా కల్లోలమైన తెలంగాణ బతుకు జాడల్ని కథకులు చిత్రించారు. యెన్నం ఉపేందర్ రాసిన 'గ్లోబల్ నగరం', గ్లోబల్ ఉప్పెన' కథలు ఇందుకు ఉదాహరణ. గ్లోబలైజేషన్ ప్రభావం కేవలం నగరాల్లో, పట్టణాల్లో ఉండేవాళ్లకే పరిమితమైన అంశం కాదని, అది పల్లె ప్రజల జీవితాల్ని సైతం అతలాకుతలం చేస్తుందని జాతశ్రీ కథలు చెబుతున్నాయి. 'ముళ్ళపాద', 'అంతర్ముఖం', 'చలివేంద్రం' కథల్లో ఉదారవాద ఆర్థిక విధానాల ప్రభావం వల్ల చితికిపోతు్న వివిధ వృత్తులవారి జీవన సరళిని చిత్రించారు జాతశ్రీ. వృత్తుల్ని కోల్పోవడమంటే ఉపాధిని కోల్పోవడం మాత్రమే కాదు, వాటిని అంటి పెట్టుకొని ఉన్న సజీవమైన గ్రామీణ సంస్కృతి హరించుకు పోవడం అని అర్థం. ఆ నిజాన్ని నిఖార్సయిన కథలుగా తీర్చిదిద్దినవారిలో పెద్దింటి అశోక్ కుమార్, కె.వి.నరేందర్, బి.వి.ఎన్.స్వామి వంటి రచయితలు అనేకమంది ముందువరుసలో కనిపిస్తారు.

ఈ కాలంలోనే తెలంగాణ దళిత, బహుజన, ముస్లిం వాద కథలు విరివిగా వచ్చాయి. జూపాక సుభద్ర 'నల్ల జెండా', పెద్దింటి అశోక్ కుమార్ 'బిందెడునీళ్లు', కె.వి. నరేందర్ 'చివరిచూపు' పి.చంద్ 'వలస', వెల్దండ శ్రీధర్ వంటి కథకులు తమ మూలాల్లోకి తొంగి చూసి, తమదైన జీవితాన్ని అక్షరబద్ధం చేశారు. తెలంగాణ నుండి ముస్లిం రచయితలు తమ జీవిత నేపథ్యంలో కథలు రాసి, తమ నోస్టాల్జియాను ప్రకటించుకున్నారు. అఫ్సర్ 'గోరిమా', 'తెలంగీ పత్తా', షాజహన్ 'సిల్‌సిలా', మహమ్మద్ నిసార్ 'వతన్', దిలావర్ 'గీ బూమి నాది' వంటి కథలు రాశారు.

స్త్రీవాదంలో ఒక కొత్త కోణాన్ని తెలంగాణ రచయిత్రులు ఆవిష్కరిస్తున్నారు. ముస్లిం మైనారిటీ వాదంలో స్త్రీ గొంతును కవయిత్రి షాజహానా వినిపిస్తే, దళిత, బిసీ వాదంలోని స్త్రీ వేదనను గోగు శ్యామల, జాజుల గౌరి, జుపాక సుభద్ర, అనిశెట్టి రజిత వినిపిస్తున్నారు. రగడ కథలో గోగు శ్యామల దళిత బాలిక చదువుకోవడం ఎన్ని కష్టాలతో కూడిన పనో సంవేదనాత్మకంగా చెప్పింది. జాజుల గౌరి 'మన్ను బువ్వ' కథలో దళిత జీవితంలోని పేదరికాన్ని, బాధలను వాస్తవికంగా చిత్రించింది. జూపాక సుభద్ర కథల్లోని శైలి బలమైంది. సామాజికంగా రాజకీయంగా దళిత స్త్రీలు ఎంత వివక్షకు గురవుతున్నారో సుభద్ర తన కథల్లో చెప్పింది. అనిశెట్టి రజిత బిసి స్త్రీల జీవితంలోని బాధలను 'మట్టిబంధం' కథలో చిత్రించింది.

గతం తొవ్వి తీస్తూ, వర్తమానాన్ని లిఖిస్తూ భవిష్యత్తు వైపు పయనిస్తున్న నేటి తెలంగాణ పరిశోధకులు తెలంగాణ సాహిత్యాన్ని ప్రజల ముందుకు తీసుకొస్తున్నారు. సాహిత్య చరిత్రలో మరుగున పడిన తొలితరం తెలంగాణ కథల వివరాలను సంగిశెట్టి శ్రీనివాస్ తెచ్చిన దస్త్రమ్ అందిస్తే, ముదిగంటి సుజాతారెడ్డి సొంతంగా ఒకటి, సంగిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి మరొక తొలి తెలంగాణ తొలితరం కథల సంకలనాలను అందించారు. కక్ర ఎల్లారెడ్డి తెలంగాణ వార్షిక కథాసంకలనాలు తీసుకువస్తుంటే, స్కైబాబ ముస్లిం కథాసంకలనాలను తీసుకువస్తున్నాడు. కాలువ మల్లయ్య వంటి సీనియర్ కథకులు బహుజన కథలను సంకలనాలుగా తీసుకొస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు వస్తున్న తెలంగాణ కథలో వైవిధ్యం ఎక్కువగా ఉంది. అనేక రకాల జీవనమూలాల్లోకి తెలంగాణా కథకులు ప్రయాణిస్తున్నారు. కథ కొత్తగా చెప్పాలన్న తపన వీరిలో బాగా కనిపిస్తున్నది.

కథకు కొత్త జీవితాలను, వస్తువులను, సంస్కృతిని, సంఘర్షణను, భాషను అందించేందుకు తెలంగాణ బహుజన కథకులు హైదరాబాద్‌లోని లా మకాన్ సమ్మేళనాన్ని నిర్వహించి, 'బహుజనులు ఇప్పుడేం రాయాలి?' అనే అంశంపై మేథోమథనం నిర్వహించారు. ఈ పరిణామాలన్నీ తెలంగాణ కథకు మంచిరోజులొచ్చినై అనే సంకేతాన్ని ఇస్తున్నాయి.

అయితే ప్రాంతీయ అస్తిత్వవాద దృక్పథంలోంచి కవిత్వం, పాట వచ్చినంత వేగంగా కథాసాహిత్యం రాక పోవడం గమనించదగ్గ విషయం. దీన్ని తెలంగాణలోకి కథా రచయితలు సీరియస్ అంశంగానే గుర్తించారు. ఈమధ్య కాలంలో 'తెలంగాణ తెలుగు కథ' అన్న శీర్షికన కాకతీయ విశ్వవిద్యాలయపు తెలుగు శాఖ ఒక సెమినార్ నిర్వహించింది. ఈ సెమినార్ పత్రాలని అదే శీర్షికతో పుస్తకంగా ప్రచురించింది. తెలంగాణ కథాసాహిత్య వికాసాన్ని, ఆ పరిణామ చరిత్రని అర్థం చేసుకోవడానికి ఉపకరించే విశిష్ట సంకలనమిది. ఈ క్రమంలో ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో వచ్చిన 'ముద్దెర' తెలంగాణ వ్యాససంకలనం, కాసుల ప్రతాపరెడ్డి రాసిన 'కొలుపు' 'ఇగురం' వ్యాససంపుటాలు, కె.పి. అశోక్ కుమార్ తీసుకువచ్చిన 'కథావలోకనం', సుంకిరెడ్డి నారాయణ రెడ్డి 'గనుమ' పుస్తకాలు చెప్పుకోదగ్గవి.

ఈ వందేళ్ల తెలంగాణ కథలను నిశితంగా పరిశీలించినప్పుడు కొట్టొచ్చినట్లు కనిపించే ప్రధాన అంశం తెలంగాణ కథకు వ్యాపారధోరణి లేదు అని. ఉబుసుకుపోక కథలు రాసే నైజం తెలంగాణ కథకుల్లో కనిపించదు. వారు నేలవిడిచి సాము చేయలేదు. ప్రజాస్వభావాన్ని కోల్పోలేదు. గ్రామీణ మాండలికం, అనాగరికుల భాష అని పండితులచే నిరసింపబడిన ప్రజల భాషను తెలంగాణ రచయితలు సాహిత్య భాషగా స్వీరించడానికి వెనుకాడలేదు. ఎన్ని విమర్శలు వచ్చినా, ఇదేం భాష అని నిరసింపబడినా, తెలంగాణ మాండలికంలోనే రచనలు చేసి, తెలంగాణ భాషకున్న సౌందర్యాన్ని, సహజత్వాన్ని ప్రపంచానికి చెబుతూనే ఉన్నారు. సువరవం ప్రతాపరెడ్డి మొదలుకొని నేటి కథా రచయితల వరకూ ప్రజల భాషకే పట్టం కట్టారు.

ఇదీ స్థూలంగా తెలంగాణ కథాసాహిత్య వికాసక్రమం. కాలానుగుణమైన కథాంశాలతో, ఈ ప్రాంతానికి సహజమైన భాషాభివ్యక్తితో తెలంగాణా కథ ముందుకు సాగుతున్నది. తనదంటూ ఒక ముద్రను తెలుగు సాహిత్య చరిత్రలో వేస్తున్నది.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలంగాణేతర నాటకాలు - తెలంగాణ విమర్శకులు

- డా॥ గంగు కిషన్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

తెలంగాణ విమర్శకులు తెలంగాణేతర నాటకాలపై ఎక్కువగా విమర్శ వ్యాసాలు రాశారు. దాదాపు వీరు 22 మంది కనిపిస్తారు. ఈ నాటక విమర్శకులలో దివాకర్ల వెంకటావధాని, హరి శివకుమార్, కేతవరపు రామకోటి శాస్త్రి, అనుమాండ్ల భూమయ్య, ఓగేటి అచ్యుతారాయ శాస్త్రి, కాత్యాయనీ విద్మహే, బన్న అయిలయ్య, పి.వి. రమణ, వరవరరావు, తక్కెళ్ల బాలరాజు, అమరేశం రాజేశ్వర శర్మ, కోవెల సంపత్కుమారాచార్యా, కోవెల సుప్రసన్నా చార్య, పాకనాటి జ్యోతి, కనకదుర్గ, ముదిగొండ వీర భద్రయ్య, అంపశయ్య నవీన్, కాలువ మల్లయ్య, వి.వి. ఎల్ నరసింహారావు, బి.ఎస్ రాములు, పంతంగి వెంకటేశ్వర్లు మొదలైనవారు వ్రాసిన వ్యాసాలు చెప్పుకోదగి నవి. వీరందరిలో కేతవరపు రామకోటి శాస్త్రి, కాత్యాయనీ విద్మహే, బన్న అయిలయ్య వ్యాసాలే ఎక్కువగా కని పిస్తాయి. తెలంగాణేతర ప్రాంతంనుండి వచ్చి ఇక్కడే స్థిరపడిన వారిని తెలంగాణ విమర్శకులుగా పరిగణించడ మైనది.

### పౌరాణిక నాటక ఇతివృత్త విమర్శలు :

ఈ విమర్శలలో భారత నాటక విమర్శలు, రామా యణ నాటక విమర్శలు, పురాణ సంబంధ నాటక విమర్శలు వచ్చాయి.

### భారత నాటక విమర్శలు :

భారత నాటక విమర్శలలో 1922లో మక్కపాటి వెంకటరత్నం రచించిన "ద్రౌపదీమానసంరక్షణ"పై ఆంధ్ర ప్రదేశ్ పత్రికలో దివాకర్ల వెంకటావధాని గారు చేసిన విమర్శ చెప్పుకోతగింది. కథౌచిత్యం కొరకు, పాత్రౌచిత్యం కొరకు చేయబడిన కల్పనలను ఇందులో ఆయన ప్రస్తా వించారు. ప్రథమాంకంలో కూర్చిన సత్యాద్రౌపది సంవా దము, ద్రౌపది కృష్ణభక్తిని వ్యక్తం చేసి నాటక గమనంలో వహించిన ప్రాధాన్యతను సూచిస్తుందని తెలిపారు. దుస్స్వప్ననివారణకై తీర్థయాత్రకు వెళ్ళిన భీముడు ధర్మరాజుకు ఉత్తరం వ్రాసినట్లు దానిననుసరించి ఆయన హస్తినాపురానికి వచ్చినట్లు కల్పించటం ధర్మరాజు ఉదా త్తుడిగా నిరూపించడానికి ఉపకరిస్తుందని అన్నారు. మయ సభలో దుర్యోధనుడి తత్తరపాటుకు ద్రౌపది కాక ఆమె చెలికత్తెలు నవ్వినట్లు వ్రాసి ద్రౌపది శీలాన్ని పరి పోషించటం జరిగిందని కూడా ఈ విమర్శలో ఆయన అన్నారు. ఇతిహాస కథా విషయాన్ని నాటకంగా కల్పిం చటంలో కవి ఉద్దేశించిన పరమార్థాన్ని వెలుగులోకి తెచ్చే విమర్శ ఇది.

విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన 'నర్తనశాల' నాటకం పైన హరిశివకుమార్ గారి విమర్శ సన్నివేశ కల్పనా చాతు ర్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. నిజానికి ఈ నాటకం విషాదాంతమైనప్పటికి ప్రాచీన లాక్షణిక సంప్రదాయాను సారం కీచకవధను చూపకపోవటమే కాక కనీసం వాచ్యంగా కూడా చెప్పకపోవటం నాటక శిల్ప విశేషమని పేర్కొన్నారు.

### రామాయణ నాటక విమర్శలు :

కేతవరపు రామకోటిశాస్త్రి గారు ఉత్తరరామచరిత నాటక కథ విషయాలను గురించి విస్తృతంగా చర్చించారు. రామా యణ కథా విషయాలు ఏయే పురాణేతిహాసాలలో ఏమేరకున్నాయో చెప్పి అందులో ఉత్తరకాండంనుండి పద్మపురాణం నుండి, జైమినీ భారతం నుండి భవభూతి ఏయే అంశాలను తీసుకొని ఉత్తరరామచరిత నాటకాన్ని కల్పించాడో వివరించారు. ఐతిహాసక సన్నివేశములను నాటకీకరించటంలో భాగంగా పూర్వ రామాయణ కథా చిత్రప్రదర్శన కంటే కల్పనలు అవసరాన్ని బట్టి సమర్థ వంతంగా చేయబడినవని నిరూపించారు.

భవభూతి ఉత్తరరామచరిత నాటకమందు సీతా పరిత్యాగహేతువు, సీతాపరిత్యాగము, లవకుశుల జన

నము వాల్మీకంల పెంపకం శ్రీ రాముని అశ్వమేధమును లవకుశులు బంధించుట, శంబూకవధ, లవణాసురవధ, లవకుశులను తన కుమారులని రాముడు గుర్తించుట మొదలుగా గల కథా ఘట్టాలను చుట్టుకొనుచు ఉత్తర రామకథ రూపుగట్టుకున్నది. ఇందులో భవభూతి కొత్తగా కల్పింపవలసిన దొక్కటియును లేదు. అంతకుముందే ఈ కథ ఈ రీతిగా సిద్ధమైయున్నది. దానికి మార్పులు గాని చేర్పులు గాని గణింపదగినట్లుగా చేయవలసిన అక్కర భవభూతికి కలుగలేదు. ఉన్నదానిని ఉన్నట్లుంచి రసపరిప్లుతము గావించుటకే ఉత్తరరామచరిత నాటకముగా వ్రాయబడినది అని చెప్పి శాస్త్రిగారు మూలకథలో కంటే మూలకథను నాటకంగా నిర్వహించటంలోని భవభూతి సృజనాత్మక ప్రతిభావిశేషాలకు అనితర ప్రాధాన్యతను ఇచ్చారు. కథాంశాలు నామమాత్రాలు. వాటికి పూర్వోత్తరాలను విలక్షణంగా నిర్వహించటం వలన వాటిని పరమాద్భుతాలుగా చేయటం జరుగుతుందని చెప్పారు.

ఈ నాటకం మొదటి నుండియు సీతారాముల పునస్సమాగమము నుద్దేశించి ప్రవర్తించినదని చెప్తూ పునస్సమాగమమునే భవభూతి సృష్టించినాడని శాస్త్రిగారన్నారు. నిర్వహణ క్రమంలోనే భవభూతి ఉత్తరరామచరిత, గొప్పనాటకంగా చేయగలిగాడని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ ఇతివృత్తానికి ఒక మూలకథ అంటూ వుండాల్సిన అవసరం లేదని, నాటక నిర్వహణ కవసరమైన సముచిత కల్పనలకు అవకాశం వుండాలని నాటకరచయిత సృజనాత్మక ప్రతిభ వ్యక్తమయ్యేది ఆ సందర్భంలోనే అని ఈ విమర్శ ప్రతిపాదించింది.

రామాయణ కథా ప్రధాన నాటకాలను భక్తికోణం నుండి విమర్శించటం అనుమాండ్ల భూమయ్య గారి 'శబరి' నాటక విమర్శలో (1993) కనబడుతుంది. భక్తిని ప్రధానాంశంగా చేసుకొని చింతా దీక్షితులు 'శబరి' నాటకాన్ని రచిస్తే విమర్శ కూడా తదభిముఖంగానే సాగింది. ప్రకృతి మానవీకరింపబడి భక్తిలో లీనము కావడం శబరి తన భక్తి విశేషం చేత ప్రకృతినంతటిని శ్రీరామునికి అభిముఖం చేయటం, ఈ నాటక కథలో ప్రధానాంశాలని చెప్తూ విమర్శకులు భక్తిమార్గం జ్ఞానమార్గం కంటే గొప్పదని నాటకకథలో నిరూపించబడినట్లు భావించారు.

## పురాణ సంబంధ నాటక విమర్శలు :

పౌరాణిక నాటకంగా ప్రసిద్ధికెక్కిన 'గయోపాఖ్యానం' (1983) నాటక విషయం వాస్తవానికి ఏ పురాణంలోనూ లేదు. శ్రీకృష్ణుడు అర్జునుడు మొదలైన పురాణపాత్రలు మాత్రం వున్నాయి. ఈ ముగ్గురి మధ్య ఒక విశిష్ఠ సంబంధాన్ని కల్పన చేసి వ్రాసిన పద్యగ్రంథాలను ఆధారంగా చేసుకొని ఈ నాటకం వచ్చింది. ఈ నాటకాన్ని విమర్శిస్తూ రామకోటిశాస్త్రి గారు ఇతివృత్త నిర్వహణలోని ఔచిత్యానికి క్రమోన్మీలానానికి ప్రాధాన్యత ఇచ్చి చర్చించారు.

## చారిత్రక నాటక ఇతివృత్త విమర్శ :

కేతవరపు రామకోటిశాస్త్రి గారు ముద్రా రాక్షస నాటకం మీద ప్రత్యేకమైన వ్యాసాన్ని వ్రాసారు. (1993 నాటక విశ్లేషణ) సాధారణంగా శృంగార విషయం సంబంధం లేకుండా ప్రపంచంలో సాహిత్యమే లేదని స్త్రీ పురుష విషయాభిలాష స్పర్శ కూడా లేని రచనలు వేళ్ళమీద లెక్కబెట్టదగిన సంఖ్యలో కూడా వుండేవని చెప్తూ విశాఖదత్తుడు మాత్రం ముద్రారాక్షస నాటకాన్ని అట్లా రచించాడని ఈ వ్యాసంలో ఆయన అన్నారు. భారతీయ సాహిత్యంలో ఇంతటి రాజకీయ నాటకం లేదని, ఈ నాటకం కర్మను గాక కర్మఫలాన్ని ప్రదర్శనయోగ్యంగా చేసిందని అన్నారు. చారిత్రక పురుషులయిన చాణక్య చంద్రగుప్తులకు, రాక్షసులకు మధ్య వేయబడిన రాజకీయ ఎత్తుగడలతో ఎక్కడికక్కడ పరమాద్భుతాన్ని సృష్టిస్తూ నిర్వహించబడిన నాటకంగా ముద్రారాక్షసాన్ని ప్రస్తావించటం జరిగింది. ఏడంకాల ఈ నాటకంలో కథా నిర్వహణ సాగిన విధానాన్ని చెప్పటమే గాక ఈ నాటకాన్ని ప్రతినాయక ముఖంగా అంటే మలయకేతు, రాక్షసామాత్యుడు దృష్టికోణం నుండి చూచినపుడు బ్రౌనింగు వ్రాసిన (స్టాపర్ట్ నాటకంతో పోలిక కనిపిస్తుందని సూచించారు కూడా. చరిత్ర నాటకాన్ని చరిత్ర సంబంధంలో విశ్లేషించటం కంటే సాహిత్య సంబంధంలో విశ్లేషించటమే ఇందులో ప్రధా

నంగా కనబడుతుంది. వీరు హామ్లెట్ అనే మరోనాటకాన్ని కూడా విశ్లేషించారు.

కేతవరపు రామకోటిశాస్త్రి గారే "ధర్మవరం వారి విషాద సారంగధర" వ్యాసాన్ని వ్రాశారు. ఈ నాటకం ఇతివృత్తానికి మూలమైన కథాంశము గౌరన వ్రాసిన నవనాథ చరిత్రలో చేమకూర వేంకటకవి వ్రాసిన సారంగ ధర చరిత్రలో బాణాల శంభుదాసుడు వ్రాసిన ద్విపదకావ్యంలో కూచి మంచి తిమ్మకవి వ్రాసిన కావ్యంలో ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు. 'నవనాథ' చరిత్రలో మాలవదేశానికి సంబంధించిందిగా చెప్పబడిన ఈ కథ కూచిమంచి తిమ్మకవి కల్పనలో గోదావరి ఒడ్డున వున్న రాజమహేంద్ర వరానికి వచ్చి స్థిరపడిన విషయాన్ని ప్రస్తావించటం జరిగింది.

రాజరాజనరేంద్రుడికి అన్వయించి ఇతివృత్తాన్ని నిర్వహించినప్పటికి ఈ కథ యదార్థం కాదని కల్పితమే నని శాస్త్రి గారు స్పష్టం చేశారు. కల్పనకు ఒక కారణాన్ని కూడా ముందుకు తెచ్చి చూపించాడు. ఈ కథానిర్మాణం అంతా ద్రావిడ సంస్కరణమునకు ఉపస్కారకంగా కల్పింపబడిందని, 'మాతుల కన్యాద్వాహము నింద్యము' అనే ఆర్యభావనను ప్రచారం చేయటానికి అట్టి ద్రావిడుల ఆచారాన్ని నిర్మూలించటానికి ఆర్యులు ఈ కథ అల్లి వుంటారని ద్రావిడ భాషా లక్షణ పరిణామాలను ఆధా రంగా నిరూపించారు. ట్రాజడీల క్షణాలను అనువర్తింపజేసి నాటక ఇతివృత్తాన్ని వ్యాఖ్యానించటం కూడా జరిగిందీ వ్యాసంలో. నాటకం పేరును బట్టి సారంగధరుడు నాయ కుడని అతనికి సంభవించిన కష్టమే విషాదమని అను కోవచ్చు. కాని ఇతివృత్తదమనాన్ని పరిశీలిస్తే రాజరాజ నరేంద్రుని పశ్చాతప్త హృదయాంతర్గత భావవ్యక్తీకరణగా ముగిసిన నాటకానికి నాయకుడు రాజరాజనరేంద్రుడే అని అప్పుడే అది ట్రాజడీ అయినట్లని వివరించారు. ఈ నాటక కథ కల్పనకుండే దేశీయ సాంస్కృతిక కారణాన్ని చర్చిం చటం నాటక విమర్శలో భాగంగా వ్యక్తం చేశారు రామ కోటిశాస్త్రి గారు.

దివాకర్ల వెంకటావధాని గారు 1952లో 'కౌముదీ మహోత్సవం' అనే నాటకాన్ని అనువదిస్తూ దానికి వ్రాసిన ఉపోద్ఘాతంలో నాటక విషయానికున్న చారిత్రక సంద ర్భాన్ని ప్రస్తావించారు. ఈ నాటకంలోని వస్తువు నాయికా నాయకుల ప్రణయవ్యాపారంతో కూడిన ఒక సాధారణ చారిత్రక విషయమని ఆయన చెప్పారు. లిచ్ఛవులు మగథపై దండెత్తటం చారిత్రక విషయమే అని చెప్పి నాటకంలోని నాయికా నాయకులకు ఇతర పాత్రలకు చారిత్రక వ్యక్తులతో గల సంబంధాన్ని నిర్ణయించటం ఆవశ్యకమని పేర్కొన్నారు. దీనిని బట్టి చారిత్రక నాటకాన్ని చరిత్ర సంబంధంలోనే వ్యాఖ్యానించాల్సిన అవసరం వుందన్న దృష్టి దివాకర్ల వెంకటావధాని గారికి వుందని అర్థమవుతుంది.

దివాకర్ల వెంకటావధాని గారే విశ్వనాథ వారి 'అన ర్కాలీ' నాటకాన్ని సమీక్షించారు. సలీం ప్రేమ వైఫల్యానికి కారణమైన అనార్కలీ మరణంతో ముగుస్తుండటం వలన ఇది విషాదాంత నాటకం అవుతున్నదని నాయికా నాయ కుల ప్రణయంలోని నైర్మల్యం ఆ విషాదానికి వుత్కర్షను కల్గిస్తున్నదని పేర్కొన్నారు. ఆ రకంగా నాటకంలోని విషాదాంత స్వభావాన్ని ఆయన ప్రధానంగా చర్చించారు.

వీరశైవమత స్థాపకుడైన బసవేశ్వరుని జీవితాన్ని వస్తువుగా చేసుకొని విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన "త్రిశూలం" నాటకం మీద దివాకర్ల వెంకటావధాని, పి. జ్యోతి వ్యాసాలు వచ్చాయి. దివాకర్ల వెంకటావధాని ఈ నాటకంలో వీరశైవ వాతావరణం బాగా కల్పింపబడిందని అన్నారు. పి.జ్యోతి విమర్శిస్తూ బసవపురాణం నుండి ఇతి వృత్తాన్ని స్వీకరించి మూలకథలో ఎటువంటి మార్పులు చేయకుండా నాటకంగా రచించాడని చెప్పారు. బిజ్జలున్ని కథానాయకునిగా చెప్పి దీనిని విషాద నాటకంగా పేర్కొ న్నారు. బిజ్జలుడు విషాద నాయకుడు కావడానికి కారణ మేమిటో కూడా వివరించారు. వీరత్వమూర్తి అనే బిజ్జ లుడు తన ప్రవృత్తిని మరచి కేవలం బసవని మహిమలు నమ్ముకొని తన ఆశయం ఫలించాలని అనుకోవటం అతని ప్రధాన లోపమని మానవులు లౌకిక ప్రపంచంలో

తమ కర్మాచరణల చేత కార్యాలు సాధిస్తారు. కాని బిజ్జలుడి వలె స్వార్థానికి లోబడి శమధమాది గుణ సంపత్తితో కూడుకొనిన భక్తి మహిమవల్ల రాజ్యాలు విస్తరింప జేయాలనుకోవడం సరియైన పద్ధతి కాదని ఈ వివేక రాహిత్యం వల్లనే బిజ్జలుడు పతనమైనాడని వివరించారామె. మొత్తం మీద ఈ నాటకం మీద వచ్చిన విమర్శలు చరిత్రను వ్యాఖ్యానించే విశ్వనాథ వైఖరిని, విషాద నాటక లక్షణాలను చర్చించాయి.

### సాంఘిక నాటక ఇతివృత్త విమర్శ :

### స్త్రీల జీవిత సమస్యాసంబంధ నాటక విమర్శలు :

తొలి సాంఘిక నాటకం గురజాడ అప్పారావు రచించిన "కన్యాశుల్కం" స్త్రీ జనజీవిత సమస్యలను చిత్రించింది. 1955 భారతిలో కేతవరపు రామకోటిశాస్త్రి గారు ఈ నాటకాన్ని అలంకారిక పద్ధతిలో విమర్శిస్తూ ధనుంజయాదుల దృష్టిలో ఇది నాటకమే కాదని నాటక ఇతివృత్తానికి సార్వజనీనత సార్వకాలికత తప్పని సరిగా ఉండాలని కాని అవి ఈ నాటకంలో కొరవడ్డాయని, వేశ్యా సంపర్కం కన్యాశుల్కం ఈ రెండింటిని ఆధారంగా చేసుకొని కథ పెరిగినదని చెప్పిన విషయాన్ని గమనిస్తే వాటిని సామాజిక శ్రద్ధ పెట్టవలసిన సమస్యలుగా ఆయన గుర్తించకపోవటం అర్థం అవుతుంది.

'తెలుగు నాటకంపై సంస్కృత నాటక ప్రభావం' అనే వ్యాసంలో ఓగేటి అచ్యుత రామశాస్త్రి కన్యాశుల్క నాటకం శకుంతలచ్ఛాయల గూర్చి, కన్యాశుల్కంపై మృచ్ఛకటిక ప్రభావాన్ని మరియు కన్యాశుల్కం మాలతీమాధవాన్ని వివిధ రకాలుగా పోలుస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తీకరించారు. శాకుంతలంలో కథానాయికా నాయకులైన శకుంతలా దుష్యంతులతో కన్యాశుల్కంలోని బుచ్చమ్మ గిరీశాలు పోల్చబడినట్లుందని మృచ్ఛకటికంలో, వసంత సేన నగలు, చారుదత్తునిపై ఖూనీకేసు మోపటానికి కారణమై చివరికి ఆ నగలే శిక్ష తప్పించుటకు ఉపయోగపడినాయని, కన్యాశుల్కంలో మధురవాణి యొక్క 'కంటె' లుబ్ధావధానులపై ఖూనీకేసు మోపటానికి కారణమై చివరికి అదే శిక్ష తప్పించటానికి ఉపయోగపడింది. మాలతీ మాధవీయంలోని మాయ మాలతి పెళ్ళికి కన్యాశుల్కంలోని మాయసుబ్బి పెళ్ళికి పోలికలున్నట్లు సమీక్షకుడు అభిప్రాయపడ్డాడు.

కేతవరపు రామకోటిశాస్త్రి మళ్ళీ కన్యాశుల్కం గురించి అనే గ్రంథాన్ని వ్రాశారు (1992). ఈ గ్రంథంలో కన్యాశుల్కంలోని వేశ్యాసమస్య, ప్రాచ్యనాటక లక్షణాలు కూడా ఉన్న కన్యాశుల్కం, బ్రాహ్మలు - మహాత్ములు, వీరేశలింగం రచనల మీద అభివృద్ధి రూపం, కన్యాశుల్కం నిర్మాణ మార్మికత, కన్యాశుల్కం నాటకం అనే శీర్షికలతో వ్యాసాలు వ్రాశారు.

1992 అడుగుజాడల్లో అనే పుస్తకంలో "కన్యాశుల్కంలో కుటుంబ వ్యవస్థ" అనే వ్యాసంలో కాత్యాయనీ విద్మహే ఈ నాటకంలో పురుషాధిక్యతను పితృస్వామిక సంస్కృతిని ఋజువు చేసుకుంటూ కనిపించే కుటుంబాలు రెండువున్నాయని అవి అగ్నిహోత్రావధాన్ల కుటుంబం, లుబ్ధావధాన్ల కుటుంబం అని పేర్కొని పురుషుడు యజమానిగా అధికారస్థానంలో వుండి స్త్రీల జీవితాన్ని నియంత్రించిన తీరు ఈ నాటకంలో అడుగడుగున కనబడుతుందని వివరించారు. అగ్నిహోత్రావధాన్లు తన చిన్ని కూతురు సుబ్బుపెళ్ళి లుబ్ధావధాన్లతో కుదిర్చినపుడు "నాకు చెప్పకుండానే నిర్ణయాలు చేశారా" అని అంగలారుస్తున్న భార్యకు "ఆడముండల్తోనా ఆలోచనా" అని ఒక్కమాటలో సమాధానం చెప్పి ఆమె అభిప్రాయాన్ని కొట్టిపారేశాడని చెప్పి తన కొడుకును ధనికవర్గంలో చేర్చేందుకు తన కూతుళ్ళనే పెట్టుబడిగా పెట్టగలిగినంతగా ఆడపిల్లల పట్ల తక్కువచూపును అతను పెంచుకున్నాడని విమర్శకులు అభిప్రాయపడ్డారు. మొత్తం మీద కన్యాశుల్క నాటకం కుటుంబవ్యవస్థ, స్త్రీల జీవితాన్ని నియంత్రించే అధికార వ్యవస్థగా ఉన్న స్థితిని సూచిస్తుందని ఇది ఆనాటి సామాజక పరిస్థితి అని అది ఈనాటికి కొనసాగి వస్తున్న దురవస్థ అని పేర్కొన్నారు.

'ఆధునిక నాటకారంభం గురజాడ' అనే వ్యాసంలో (1989) పి.వి. రమణ కన్యాశుల్క నాటకం దుష్ట సాంప్ర

దాయ విలువలపై తలలు వాల్చేసి వ్రేలాడే మానవ విలువల్ని బంధాలు, అనుబంధాలు, ధనానికి అమ్ముడు పోతున్న ఒక వికార నిర్వీర్య వివాహవ్యవస్థను సజీవంగా ఫోటో తీసి మనముందుంచుతుందని పేర్కొన్నారు.

1992 అరుణతారలో 'కన్యాశుల్కం' గురించి వరవర రావు సమీక్షించారు. ఆనాడు సమాజంలో వ్యవస్థీకరించ బడుతున్న కొన్ని విలువల్ని గురజాడ తన నాటకం ద్వారా ప్రతిఫలింపచేశాడని అవి ఈ నాటికి సామాజిక వ్యవస్థలుగా రూపుదిద్దుకున్నాయని అందుచేతనే కన్యాశుల్కం అంత సమకాలీనంగానూ, సజీవంగానూ ఈనాటికి ఉందని పేర్కొన్నారు.

1994 ఆంధ్రప్రభలో కన్యాశుల్కం గూర్చి వ్రాస్తూ దీంట్లో ఒక సమస్యలేదు. ఒక పరిష్కారము లేదు అని కోవెల సంపత్కుమారాచార్య విమర్శించారు.

సంఘాన్ని సంఘజీవితాన్ని, కుటుంబ సంబంధాలను, మానవ సంబంధాలను స్త్రీ పురుష సంబంధాలను ఎన్ని భిన్న కోణాలనుండి అర్థం చేసుకోవచ్చో కన్యాశుల్క నాటకం ఒక్కదాని మీద వచ్చిన విమర్శలు చూస్తే స్పష్ట మవుతాయి. పితృస్వామ్యం, ధనస్వామ్యం, మానవసంబం ధాలను నియంత్రిస్తున్న సమకాలీన సామాజిక విషాదాన్ని అర్థం చేసుకోవడానికి కన్యాశుల్క నాటకం ఒక బలమైన సాధనం అవుతున్నదని ఈ విమర్శలు స్పష్టం చేశాయి. ఈ రకమైన గుర్తింపు అవగాహన కన్యాశుల్కం నాటకేతి వృత్త విమర్శలో వచ్చిన పరిణామాలు.

బి. రుక్మిణి 1993లో వ్రాసిన వరవిక్రయం వ్యాసంలో ఈనాడు ప్రబలివున్న వరశుల్కదురాచారం స్త్రీలపైన వారి తల్లిదండ్రులపైన ఎలాంటి దుష్పరిణామాలను చూపెడు తుందో కాళ్ళకూరి '70' సంవత్సరాల క్రితమే ఊహించి వ్రాయగలగడానికి అభిప్రాయపడ్డారు.

సాహిత్యంలో 'సజీవ స్త్రీ మూర్తులు' అనే వ్యాసంలో (1991) కాత్యాయనీ విద్మహే గారు వరవిక్రయనాటకంలో కాళింది చైతన్యస్థాయిలోని ప్రత్యేకతను వివరించారు. సంస్కరణవాది అసహాయవాది అయిన పురుషోత్తం రావు గారి పెద్దకూతురు కాళింది తండ్రి చెప్పించిన చదువు, పెంపకంలో వారసత్వంగా ఇచ్చిన సంస్కారంవల్ల అల వడిన ఆత్మాభిమానం ఆమెను ప్రాణాలైనా విడుస్తాను కాని కట్నపు వివాహానికి సమ్మతించనని ప్రతిజ్ఞ పూనేటట్లు చేశాయని, కట్నమిచ్చి పెళ్ళి చేసుకోవడాన్ని ఆత్మగౌరవానికి వ్యక్తిత్వానికి సంబంధించిన సమస్యగా ఆమె చూచిందని, స్త్రీల సమస్యలను పట్టించుకోని, జాతీయోద్యమ రాజ కీయాలను ఆమె విమర్శించిందని, పెళ్ళి లేకుండా స్వతంత్ర వ్యక్తిగా జీవించే అనుకూల వాతావరణం ఉంటే ఆమె ఆత్మహత్యకు సిద్ధపడేది కాదని ఈ వ్యాసంలో పేర్కొనటం జరిగింది.

ఈ వ్యాసంలో వరకట్నం సమస్యను ఆడపిల్లల కుటుంబాలకు సంబంధించిన సమస్యగా చూడటం కనబడుతుంది.

1987 తెలుగు వైజ్ఞానిక మాసపత్రికలో 'చలం సాహిత్య జీవిత దృక్పథం' అనే వ్యాసంలో భాగంగా కాత్యాయనీ విద్మహే చలం నాటకాల ఇతివృత్త ప్రత్యేకతలను వివ రిస్తూ చలం నాటకాలలో చాలా వరకు స్త్రీ సమస్యలే ప్రధాన ఇతివృత్తాలని "ఏం జబ్బు" అనే నాటికలో స్త్రీలు, భర్తల, అత్తమామల అధికారుల క్రింద అనేక కష్టాలకు గురి అవుతూ మరణ సదృశ జీవితాన్ని గడుపుతున్న పరిస్థితులను దృశ్యమానం చేసిందని, అలాగే ఆడవాళ్ళ ఆకలి, పంకజం త్యాగం మొదలైన నాటికలద్వారా స్త్రీజన సమస్యలను గురించి చలం వివరించాడని పేర్కొన్నారు.

స్త్రీల ఇతివృత్తంగా కలిగిన నాటకాలమీద వచ్చిన ఈ విమర్శలన్నీ ప్రధానంగా కుటుంబ వ్యవస్థలోని లొసుగుల్నే చర్చించాయి. కుటుంబానికి పరిమితం చేయబడిన స్త్రీల జీవితాలు ఎంత అపరిమిత సమస్యల మధ్య కొట్టు మిట్టాడుతున్నాయో చూపించాయి.

**ఆర్థిక సమస్యా సంబంధ నాటక విమర్శలు :**

జమీన్ రైతు, మాభూమి నాటకాలు భూమిని కేంద్రంగా చేసుకొన్న ఉత్పత్తి సంబంధాల కోణం నుండి జీవితాన్ని చిత్రిస్తే ఎన్.జీ.వో. నాటకం ఉత్పత్తి ప్రక్రియతో ప్రత్యక్ష సంబంధం లేని మధ్య తరగతి వర్గం ఆర్థిక సమస్యల వలయంలో ఎలా జీవిస్తున్నదో చిత్రించింది.

ఎన్.జీ.వో. నాటకాన్ని కాత్యాయనీ విద్యహే, బన్న అయిలయ్య సమీక్షించారు. సోషల్ ట్రాజిడీ ఎన్.జి.వో. వ్యాసంలో (1979) బ్రిటిష్‌వాళ్ళు మనదేశాన్ని వదలి పోయేటప్పటికి ఎన్.జి.వోల జీవితపు గతులు ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతున్నవో స్వరాజ్యం వచ్చిన ఊపులో యువకులలో చెలరేగిన అభ్యుదయం అభిలాషవల్ల కూడా ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొవలసివచ్చిందో మధ్యతరగతి కుటుంబాలు ప్రిస్టేజీ పేరిట పడుతున్న ఆర్థిక సాంఘిక బాధలు ఎటువంటివో చిత్రించిన ఎన్.జి.వో నాటకం విషాదాంతనాటకమని అయితే ఈ విషాదపరిస్థితికి సామాజిక వ్యవస్థ కారణం కనుక దానికి సోషల్ ట్రాజడీ అనడం సమంజసంగా వుంటుందని కాత్యాయనీ విద్మహే అన్నారు. దీనితో ఏకీభవిస్తూ బన్న అయిలయ్య గారు ఆత్రేయ నాటకాల వ్యాసంలో ఇది సగటు మానవుని ఊగిసలాటను నిలువుటద్దంలో చూపిన నాటకమని పేర్కొన్నారు.

## రాజకీయ సమస్యా సంబంధ నాటక విమర్శలు:

1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించి స్వదేశీ ప్రభుత్వం ఏర్పడింది. ప్రజాస్వామ్య ప్రభుత్వమే అయినా ఇది సారంలో ఎట్లా వుందో నిరూపిస్తూ రావిశాస్త్రి 'నిజం' నాటకాన్ని వ్రాశారు. 1983లో విమర్శినిలో ఈ నాటకాన్ని విమర్శిస్తూ కాత్యాయనీ విద్మహే "సత్యం హత్య" నిమిత్తంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో శాశనశాఖ, కార్య నిర్వాహక శాఖ న్యాయశాఖ పరస్పరం ఒక దానికొకటి ఆశ్రయించి నిజాలను కప్పిపుచ్చి అబద్దాలను నిజాలుగా చలామణిలోకి తెచ్చి నేరాన్ని న్యాయంగా కనబడేటట్లు చేస్తున్న విధానాన్ని ఈ నాటకం నిరూపించిందని అన్నారు. నేరం చట్టబద్ధంగా సాగుతున్న ఈ సమకాలీన సామాజిక విషాదవాస్తవికతను నిజం నాటకం సమగ్రంగా ప్రతిఫలించగలిగిందని అన్నారు. సర్వ స్వతంత్రాధికారాలతో పనిచేయాల్సిన కోర్టు వ్యవస్థ కూడా రాజకీయాధికారాలకు లోబడి ఉన్నత వర్గాలవారి ప్రయోజనాలకనుగుణంగా తన వర్గ స్వభావాన్ని నిరూపించుకుంటున్న వైనాన్ని నాటకంగా వ్రాసిన రావిశాస్త్రి నిరూపించగలిగాడని అన్నారు. సామాజిక గతిక్రమ స్వభావాన్ని "సూక్ష్మదర్శినిలో బాగా ప్రదర్శించిన "నిజం నాటకం" ఈ వ్యవస్థలో రానున్న మార్పు సాయుధ విప్లవం ద్వారానే సాధ్యమని సుశీల మాటల ద్వారా సూచించి ముందుగానే చూపించగలిగిన "దూరదర్శిని" కూడా అయిందని కాత్యాయనీ విద్మహే అభిప్రాయపడ్డారు.

ఆత్రేయ వ్రాసిన "విశ్వశాంతి" ఒక నీతిని శాంతి సందేశాన్ని వెలిబుచ్చిందని శ్రీశ్రీ సమీక్షించగా (1970) దీనితో ఏకీభవిస్తూ బన్న అయిలయ్య యుద్ధం సమాజానికి ఎంత అనర్థదాయకమో ఈ నాటకం తెలియజేసిందన్నారు.

## సాధారణ సామాజిక సంబంధనాటక విమర్శలు:

1993 విశాలాంధ్రలో 'ఆత్రేయ నాటకాలు సామాజికత' అనే వ్యాసంలో బన్న అయిలయ్య 'భయం' నాటకం మానసిక, ఆర్థిక, రాజకీయ భయాలతో వ్యక్తులు ఎలా మనుగడ సాగిస్తున్నారో చూపిస్తుందని అన్నారు. అలాగే తెప్పలుగ చెరువునిండిన కప్పలు పదివేలు చేరుగదరా 'సుమతీ' అనే సామెతను ఆధారంగా తీసుకొని "కప్పలు" అనే నాటకం వ్రాశారని అన్నారు. నీళ్ళున్న చోటికి కప్పలు ఎలాగైతే చేరుతామో, ధనమున్న వ్యక్తి దగ్గరికి బంధువులు కూడా అలాగే చేరుతారని ఇదే నాటకంలోని ఇతివృత్తమని అన్నారు.

బోయి భీమన్న రూపకాలలోని తాత్త్విక చింతన అనే అంశంపై పరిశీలన చేసి తక్కెళ్ళ బాలరాజు పిహెచ్.డి. డిగ్రీని పొందాడు.

## పాత్రాదృక్పథం :

నాటక సాహిత్య విమర్శలో ఇతివృత్తం తరువాత నాటక పాత్రను కేంద్రంగా చేసుకొని వచ్చిన విమర్శలు కనబడుతాయి.

## పౌరాణిక నాటక పాత్రా చిత్రణ విమర్శ :

నర్తనశాల నాటకంలోని పాత్రలను గూర్చి కోవెల సంపత్కుమారాచార్య, దివాకర్ల వేంకటావధాని, హరిశివకుమార్ విమర్శవ్యాసాలు వచ్చాయి. దివాకర్ల వేంకటావధాని ఈ నాటకమున పాత్రాపోషణమున భారత

మందలి విరాటపర్వంలోని పాత్రపోషణకు దీనికిని చాలా వ్యత్యాసమున్నదని నర్తనశాలలో కీచకునిలో విషాదాంత నాయక లక్షణాలన్నియు పుంజీభవించి ఉన్నవని తెల్పారు. ఈ నాటకాన్ని హరిశివకుమార్ (1993) సమీక్షిస్తూ మహాభారతంలో పాండవులకు ఆశ్రయభూతులై, అజ్ఞాత వాసానికి ఆధారభూతమైన విరాటరాజు భార్య సుదేష్ణ, తమ రాజ్యరక్షణ అనే స్వార్థబుద్ధితో స్వయంగా తానే సైరంధ్రిని పిలిచి కీచకుని వద్దకు పంపినట్లు కనపిస్తుందని, కాని ఈ నాటకంలో ఆ మహారాణి పాత్రకు లోపం రాకుండా అది వల్లకి పన్నిన పన్నాగంగాను, అందుకు సుదేష్ణ నిమిత్తమాతృరాలైనట్లుగాను అది కూడా మద్యం సేవించి ఆ మైకంలో తప్పిదం చేసినట్లు మార్చి విశ్వనాథ మూలంలోని అనౌచిత్యాన్ని పరిహరించారని అన్నారు. అంతేగాక మూలంలో కీచకుడు కేవలం కాముకుడుగా కనిపిస్తాడు. కాని ఈ నాటకంలో మంచి వివేకి, దూరదృష్టికలవాడు, మహాసత్త్వసంపన్నుడు, రసికావంతకుడునై, ధీరోధాత్తుడుగా కనిపిస్తాడని భావిభారత కథకు ముఖ్యురాలైన ఉత్తర కూడా సామాన్య స్త్రీ కాదని, రాజకుమార్తె అయిన ఆమెలో కూడా ధర్మనిష్ట మూర్తీభవించి ఉన్నదని విశ్వనాథ ధ్వనింపచేశారని, కట్టలు తెంచుకొని ప్రవహించే కీచకుని మోహానికి అడ్డుకట్టలు వెయ్యటంలోనూ, ధర్మమూర్తి అయిన ధర్మరాజు ఎక్కడ నిలబడితే అక్కడే సభయని నిర్ధారించి చెప్పటంలోను ఉత్తర యొక్క గొప్ప తనాన్ని సూచించిన వారు విశ్వనాథ అని బావించినారు.

విశ్వనాథ సత్యనారాయణ రచించిన శశిరేఖ నాటకంపై 1993లో కోవెల సుప్రసన్నాచార్యుల వ్యాసం వచ్చింది. ఈ నాటకంలో 19 రంగాలున్నాయని, శశిరేఖ, సౌభద్రులే ప్రధాన పాత్రలని పేర్కొన్నాడు.

1993 విమర్శినిలో పరిశోధన పత్రికలో 'శబరి' నాటకాన్ని గూర్చి వ్రాస్తూ డా. అనుమాండ్ల భూమయ్య ఈ నాటకమందు గురువు మాతంగముని చేసిన ఉపదేశ ఫలితంగానే 'శబరి' భగవద్దర్శనాన్ని, తదనుగ్రహాన్ని పొంది పుణ్యలోకాలకు చేరుకున్న విషయం ఈ నాటకంలో వుందని గురువుకు, గురూపదేశానికి నాటక రచయిత ప్రాధాన్యాన్ని కలిపించాడని, మూలంలో లేని పాత్రలను సన్నివేశాలను రచయిత కలిపించాడని పేర్కొన్నారు.

## చారిత్రక నాటక పాత్రా చిత్రణ విమర్శ :

విశ్వనాథ సత్యనారాయణ గారి 'త్రిశూలం' నాటకంలో బిజ్జలుడు నాయకుడని అతని పరాక్రమము బుద్ధియు నిరుపమానములైనవని, సామ్రాజ్యస్థాపన, ఆశ, ఇతనిలో మితిమీరినదని ఈ దురాశ ఒక్కటే ఇతని పతనానికి కారణమైనదని వెంకటావధాని అభిప్రాయపడ్డారు. త్రిశూలం నాటకంలో 'నీల' పాత్రను కల్పించడంలో కవి స్వతంత్రత పాత్ర ప్రయోజనం వ్యక్తమైందని, భక్తిలో వున్న పారవశ్యం మోక్షమేనని, మోక్షానికి దానికి భేదం లేదని సహజ భక్తి లక్షణాలను రచయిత నీల పాత్ర ద్వారా వ్యక్తం చేశాడని శివశక్తి స్వరూపిణిగా ఆమెను చిత్రించి ఆమె నిష్క్రమణం వల్ల బిజ్జలునికి అపాయం సిద్ధించినట్లు చిత్రించడం ద్వారా ఆ పాత్రకు ఒక ప్రయోజనాన్ని కల్పించి విశ్వనాథ కృతకృత్యులయ్యారని డా. పి. జ్యోతి అభిప్రాయపడ్డారు. బిజ్జలుడు తన దౌర్బల్యం, అహంకారం, అనుమానం, అత్యాశ మొదలైన గుణాల కారణంగా పతనమైనాడని మానవప్రకృతిలోని పాశవాసుర ప్రవృత్తులకు అతనిని ఒక ఉదాహరణగా చూపి ఆ పాత్రకు విశ్వనాథ ఎంతో న్యాయం చేకూర్చారని పేర్కొన్నారు.

## సాంఘిక నాటక పాత్రా చిత్రణ విమర్శ :

కేతవరపు రామకోటిశాస్త్రి, మళ్ళీ కన్యాశుల్కం గురించి నాటక విమర్శ గ్రంథంలో మధురవాణికి వసంత సేనతోను, కామందకితోనూ వున్న సంబంధాన్ని ప్రస్తావించారు. కాత్యాయనీ విద్మహే కనకదుర్గ వ్రాసిన మధురవాణి వంటి మరో చతురవాణి మంచన సృష్టించిన చతురిక పాత్ర అని మధురవాణి చతురిక కంటే ఎంతో పరిణతి చెందిన వ్యక్తి అని అభిప్రాయపడ్డారు.

కాత్యాయనీ విద్మహే గారి "సినిమాగా కన్యాశుల్కం నాటకం సాధించిందేమిటి" అనే వ్యాసంలో (1992) సినిమాలో వెంకమ్మ పాత్ర అభివృద్ధి పరచబడిందని స్వప్రయోజనం ముఖ్యమై ప్రతి అంశాన్ని తనకు

అనుకూలంగా వ్యాఖ్యానించే, అతి తెలివితో ప్రవర్తించే గిరీశాన్ని సినిమా రౌడిగా మార్చిందని రామప్పంతులును విలన్‌ను చేసిందని గిరీశాన్ని పెళ్ళాడిన బుచ్చమ్మ నాయిక అయిందని, గిరీశాన్ని నాయకుడిగా స్థాపించటానికి వీలుగా మధురవాణి చేత ఆతనికి బుచ్చమ్మతో పెళ్ళి జరిపించమని, సౌజన్యారావుకు సలహా ఇప్పించటం జరిగిందని తెలిపారు.

గిరీశం పాత్ర విశిష్టతను గూర్చి నవీన్, పి.వి. రమణ, కేతవరపు రామకోటిశాస్త్రి గిరీశానికి అన్యాయం జరిగిందని కోవెల సంపత్కుమారాచార్య విమర్శ వ్యాసాలు వ్రాశారు.

నవీన్ తన వ్యాసంలో గిరీశం పాత్ర కన్యాశుల్కం నాటకాన్ని వంద సంవత్సరాలుగా, సజీవంగా ఉంచగలిగిందని గిరీశం పాత్రలోని స్వారజనీనతే ఆ నాటకాన్ని బ్రతికించిందని, నిజానికి నాటకంలోని సమస్య దృష్ట్యాగాని, కళాదృష్టితోగాని చూస్తే గిరీశం పాత్ర అంతముఖ్యమైనదేమీ కాదని, గిరీశాన్ని దుర్మార్గుడని ఏ ఎండకా గొడుగు పట్టే అవకాశవాదని, అవినీతిపరుడని పైకి అందరూ అసహ్యించుకున్న లోలోపల మాత్రం గిరీశాన్ని ఆరాధించేవాళ్లు చాలామందే వుంటారని పేర్కొన్నారు.

కన్యాశుల్కం నాటకంపై ముదిగొండ వీరభద్రయ్య, కోవెల సంపత్కుమారాచార్య వ్యాసాలు ప్రచురించబడ్డాయి. ఈ నాటకంలోని పాత్రలన్నీ సజీవం చేయటం కోసం, స్వాభావికతను పెంచటం కోసం సభ్యతకాని స్థాయికి కూడా అనేక సందర్భాల్లో దించారని, కన్యాశుల్కంలోని ప్రతీపాత్ర ఆకర్షనీయతను సంపాదించుకుందని తెలిపారు.

వరవరరావు కన్యాశుల్కం సమకాలీనత గూర్చి వ్యాఖ్యానించారు. ఈ నాటకంలో ప్రకటితమైన పాత్రల లక్షణాలు, స్వభావాలు ఆనాటి సమకాలీన సమాజాన్ని ఎంత గాఢంగా ప్రతిబింబించిన వంటే అవి కాలంతో పాటు, సమాజంతో పాటు పెరుగుతూ పోయి విశ్వజనీనమైనవని అన్నారు. గురజాడ ఆనాడు వ్యవస్థీకరించబడుతున్న కొన్ని విలువల్ని తన పాత్రల ద్వారా ప్రతిఫలింప చేశారని పేర్కొన్నారు.

కన్యాశుల్కం నాటకం మీద వచ్చిన విమర్శలు గురజాడ పాత్రచిత్రణ నైపుణ్యాన్ని ప్రధానంగా ప్రస్తావించాయి. మొత్తం మీద కన్యాశుల్కం నాటక పాత్రల విశ్లేషణలో సామాజిక రాజకీయార్థిక సంస్కృతీ సంబంధంలో పాత్రల పుట్టుపూర్వోత్తరాలను, అస్థిత్వాన్ని, నిరూపించే ధోరణి చోటు చేసుకోవటం కనబడుతుంది.

ఆత్రేయ వ్రాసిన 'కప్పలు' నాటకాన్ని బన్న అయిలయ్య సమీక్షించారు. ఈ నాటకంలో ప్రతీపాత్ర మనకళ్ళ ముందు కదలాడే మనుష్యుని గుర్తు తెచ్చే విధంగా వ్యంగ్య ధోరణిలో చిత్రించడం రచయిత ప్రతిభగా పేర్కొన్నారు.

**భాషాదృక్పథం :**

నాటక సాహిత్య విమర్శలో భాష గురించిన చర్చ ఒక ప్రధానాంశమే కేతవరపు రామకోటిశాస్త్రి గారు గయోపాఖ్యానం నాటకమందలి పద్యములందు ప్రసన్నత ఉన్నది కాని గాంభీర్యము లేదని దీర్ఘమైన వాక్యరచన, ప్రామాణిక గ్రాంథికరచన నేడు కొందరికి క్లిష్టంగా నుండునని సమకాలీన సాంస్కృతిక చైతన్యం దృష్ట్యా వ్యాఖ్యానించారు. వీరే కన్యాశుల్కం నాటకాన్ని విమర్శిస్తూ (1955) తెలుగు నాటకాలలో అన్యభాషాపదాల ప్రయోగం హాస్యం కోసమే జరిగిందని పల్లెలలో 'కన్యాశుల్కం' జీవించలేదని అందుకు కారణం అచటి వారికి ఆంగ్లభాషా జ్ఞానముండదని, ఆంగ్లశబ్దాలు వాడనిచో కన్యాశుల్కం హాస్యరూపకమై ఉండేది కాదని అభిప్రాయపడ్డారు.

'నర్తనశాల' నాటకంలో వ్యవహారికతను చెరిగిపోసిన గడుసైన పలుకుబడి నుడికారాలతోడి సంవాదశిల్పము వుందని, ఈ సంవాద శిల్పముతో బాటు నాటకంలోని పద్యశిల్పం రమణీయమైందని కోవెల సంపత్కుమారాచార్య పేర్కొన్నారు. వీరే కన్యాశుల్క నాటకాన్ని విమర్శిస్తూ నాటకం ఆద్యంతమూ మాండలికం కావటంతో అక్కడక్కడ కొంత అర్థం కాకపోయినా ప్రవాహశీలత వలన ఆకర్షణ కొరవడంలేదని కన్యాశుల్కం అనగానే జనానికి మొదట కొన్ని పాత్రలు, సంభాషణలు వాటిలోని హాస్య చమత్కారాలు గుర్తుకువస్తాయని పేర్కొన్నారు (1994).

'అవిమారకం' నాటకం దివాకర్ల వెంకటావధాని 'పండితాభిప్రాయంలో ఈ నాటకంలోని పద్యాలు, మూల శ్లోకముల భావమును స్పష్టసుందరంగా వెల్లడిస్తూ ధారా శుద్ధి కలిగియున్నవని అన్నారు. వీరే 'సాంసను డెలీలా' నాటకాన్ని విమర్శిస్తూ సంభాషణలు మనోహరంగా నున్నవని పేర్కొన్నారు.

## రసదృక్పథం :

దృశ్యప్రకియ అయిన నాటకం ప్రదర్శనవేళ ప్రేక్షకులలో కలిగించే అనుభూతి తీవ్రతను రసమనే పేరుతో వ్యవహరిస్తారు. కనుక నాటిక విమర్శలో ఇది ఒక ప్రధాన కోణం అయింది. నాటకాలలో ఏయే రసాలు ఏయే విధాలుగా పరిపోషింపబడుతున్నాయో చర్చించటం పరిపాటి అయింది. నాటక రస విమర్శను పరిశీలించినపుడు, దివాకర్ల వెంకటావధాని (1965) కావ్యేషు నాటకం రమ్యమ్ అని నుడివినారని పేర్కొని నాటకం రసప్రధానమైన కావ్యవిశేషమని పేర్కొన్నారు.

కేతవరపు రామకోటిశాస్త్రి గారు "ఉత్తరరామచరిత" నాటక రసాన్ని గురించి వివరంగా చర్చిస్తూ భవభూతి ఉత్తరరామచరిత్రమున శృంగారముకాక కరుణాద్భుతాలను ప్రాతిపదికలుగా చేసుకున్నారని నిరూపించారు. ఉత్తరరామ చరిత్రలో అంగీరసమని కరుణాద్భుతమని స్పష్టం చేశారు. వీరే ముద్రా రాక్షస నాటకం వీరరస ప్రధానమైందని ఉత్సాహం స్థాయీభావమని పేర్కొన్నారు.

'నలచక్రవర్తి' నాటక రచయిత శివశ్రీ ముదిగొండ శివరామశాస్త్రి. ఈ నాటకం వీరరస ప్రధానమని. శృంగార వీరములందు ధర్మప్రవృత్తికి భంగము కాని శృంగారము తీసుకోబడ్డదని తెలిపాడు రచయిత.

'విశ్వంతర' నాటకంలో యుద్ధభీభత్సాన్ని కళ్ళకు కట్టినట్లు చూపెడుతాడు ఆత్రేయని బన్న అయిలయ్య పేర్కొన్నారు.

కాలువ మల్లయ్య (1987), 'కన్యాశుల్కం' భీభత్స రసప్రధానమైందన్న అభిప్రాయాన్ని బలపరిచి నిరూపించారు. భీభత్సరసస్వరూపం వస్తుదోష సందర్శనాదుల వలన కలిగే రోత అని సహృదయులైన పాఠకులలో కన్యాశుల్కం నాటకాన్ని చదివితే లేదా చూస్తే గిరీశం, అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు మీనాక్షి పాత్రలపై, మరికొన్ని సంఘటనలపై, సంఘంలోని దురాచారాలపై ఆనాటి సాంఘిక పరిస్థితులపై రోత కలిగి భీభత్సరసానికి స్థాయీ భావమైన జుగుప్స జనించక మానదని పేర్కొన్నారు.

కాత్యాయనీ విద్మహే గారు (1992) చలనచిత్రంగా చిత్రీకరించబడిన కన్యాశుల్కనాటకం ఏమీ సాధించలేదని అభిప్రాయపడుతూ నాటకంలోని జీవిత దృక్పథాన్ని సినిమా సరిగా వ్యాఖ్యానించి నిరూపించలేకపోయిందని దానితో భీభత్సరసప్రధానమైన నాటకం సుఖాంతమైన సినిమా అయిందని విమర్శించారు.

కోవెల సంపత్కుమారాచార్య "కన్యాశుల్కం కాదా ఒక విరస రచన" అని ప్రశ్నిస్తూ కన్యాశుల్కం మలికూర్పు ముఖపత్రం మీద కన్యాశుల్కం హాస్యరస ప్రధానమైన నాటకమని అప్పారావు గారే అచ్చువేయించుకున్నారని, కన్యాశుల్కం హాస్యరస ప్రధానమైతే అది నాటకం కావటానికి వీలులేదని, ఒకవేళ నాటకమే అయితే హాస్యం ప్రధానంగా ఉండటానికి వీలులేదని అన్నారు. నాటకం కావాలంటే, శృంగార, వీర, కరుణ, అద్భుత రసాలలో ఏదో ఒకటి ఉండాలని చెప్పాడు.

సాహిత్య సామాజిక దృక్పథం నుండి చూస్తే భీభత్సం ప్రధానరసంగా చాలామంది భావించటం గమనించదగిన అంశం.

ఈ రకంగా తెలంగాణేతర నాటకాలపై తెలంగాణ విమర్శకులు వ్యాసాలు వ్రాసారు. ఇంకా తెలంగాణ నాటకాలను విమర్శలను సమీక్షలను పరిశోధించి వెలికి తీయవలసిన అవసరం వుంది.

# భాషా పరిణామం ఒక చారిత్రక అవసరం

- డా॥ పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం.

భావ వినిమయం కోసం భాష పుట్టింది. మనిషి గుంపులుగా విడిపోవడం, భౌతిక అవసరాల కోసం వలసపోవడం లాంటి దూరభారాల వల్ల మాండలికాలు పుట్టాయి. దీనికి భౌగోళిక, వైయుక్తికాది కారణాలు దోహదం చేశాయి.

మాండలికం నుంచి భాష మరో భాషగా రూపాంతరం చెందడం కూడా ఈ దూరభారాల వల్లనే! వ్యవహర్తల మధ్య రవాణా సౌకర్యాలు, భావ వినియయగు మాధ్య మాలు లేని రోజుల్లో ఒక మాతృక నుండి చాలా భాషలు పుట్టాయి.

భావ వినిమయం కోసమే భాష పుట్టింది అన్నప్పుడు భావ వినిమయానికి గుంపుల మధ్య దూరభారాలు అడ్డు నిలిచినప్పుడు చాలా భాషలు పుట్టుకొస్తాయన్నప్పుడు, అసలు భాషా వినిమయానికి ఆటంకాలు చెరిగి పోయినపుడు చాలా భాషల అవసరం లేకుండాపోతాయి.

అంటే రవాణా సౌకర్యాలు, మాధ్యమాలు, వలసలు పెరుగుతుంటే భాషల వినియోగం తగ్గుతుందన్నమాట!

ఈ నేపథ్యంలో ప్రాబల్య వర్గాల భాష వినియోగంలో నిలబడి ఉపశ్రేణి వర్గాల భాషల్ని, మాండలికాల్ని యాసల్ని, క్రమక్రమంగా తుడిడిపెట్టేస్తుంది. దీనికి మౌలిక కారణంగా భాష కేవలం భావ వినిమయ సాధనంగా మాత్రమే కాకుండా ప్రతిష్టావసరంగా చలామణిలోకి వచ్చింది. అంతే కాకుండా భాష ఆర్థికావసరం అయ్యింది.

అంటే ఆర్థికంగా ముందంజలో ఉన్నజాతుల భాషలు ఉపశ్రేణి వర్గాల ప్రతిష్టావసరాలుగా, ఆర్థికావవసరాలుగా పరిణమిస్తాయన్నమాట.

ఉపశ్రేణి వర్గాల ఆర్థికపరమైన వెనుకబాటుతనం ప్రతిష్టాపరంగాను వారిని వెనుకబాటుతనంలో ఉంచు తుంది. ఇది సాంస్కృతికంగా కూడా వెనుకబాటుతనం లోకి వారిని నెట్టేస్తుంది.

ఇదంతా ఉపశ్రేణి వర్గాల ఆర్థికబలహీనతలోంచి పుట్టుకొచ్చిన ఆత్మన్యూనత వల్లనే జరుగుతుంది.

భావ వినిమయం దగ్గరనుంచి దూరభారాలు రవాణా సౌకర్యాలు, మాధ్యమాలు, వలసలు, ఆర్థిక శక్తులు ప్రతిష్టావసరాలు, సాంస్కృతిక వెనుకబాటుతనం దాకా భాషా పరిణామం మొదట చిన్నగా మధ్యలో పెద్దగా చివరిదశలో సన్నగా కనిపిస్తుంది. ఇవన్నీ భాష బాల్య, యౌవన, వృద్ధ దశలు అన్నమాట.

ఊళ్ళు, ఏళ్ళు, కడలులు, ఖండాలు దాటిన మనిషి ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసిన క్రమంలో భాషల అవసరం సన్నగిల్లిపోతుండటం సహజ పరిణామం.

భాష, వినిమయావసరం, ప్రతిష్టావసరంల నుంచి సాంస్కృతిక అవసరంగా కూడా ఉనికిలోకి వచ్చింది.

ఎవరి సంస్కృతి వారికి గొప్ప ! భాష సంస్కృతికి ఉనికిపట్టు. కాబట్టి భాషను పోగొట్టుకుంటే సంస్కృతిని పోగొట్టుకున్నట్టే అన్న వాదం తెరమీదకొచ్చింది.

ఆర్థికంగా ప్రాబల్య వర్గాల భాష ఆర్థికంగా బల హీనుల భాషల్ని తుడిచిపెట్టేస్తున్న సందర్భంలో మాతృ భాషా రక్షణ కోసం ఎదురొడ్డి పోరాడడం కూడా సహజం.

అన్నింటికంటే ముఖ్యంగా మార్పు సహజం, అని వార్యం. మార్పుకు ప్రతిబంధకాలు కూడా అంతే సహజం.

మాట తరువాత, పాట, పాట తరువాతే అన్ని సాహిత్య ప్రక్రియలు, ప్రయోగాలు అన్నది తరచూ వింటాం. భాషను ప్రతిష్టావసరంగా భావించినందువల్లనే సంక్లిష్టత వచ్చిందని చెబుతాం.

ఈ సంక్లిష్టత విరామం దొరికి పండితులనిపించుకున్న వాళ్ళు ప్రతిష్టావసరాల కోసం పుట్టింది. అది మామూలు ప్రజల భాషకు దూరంగా జరిగి వాళ్ళకు అర్థంకానంతగా పరాయి భాషగా మడికట్టుకుని కూర్చిందనీ మనకు తెలుసు.

కాగితాలు, కలాలు కాదు కదా పలకాబలపాలు కూడా లేని రోజుల్లో 'చదువు' చాలా కొద్దిమందికే పరిమితం. కాని పారిశ్రామిక విప్లవం తరువాత బ్రిటీష్‌వాళ్ళ రాకతో దేశభౌతిక ముఖ చిత్రమే కాదు, జాతిలో పెద్ద సాంస్కృతిక విప్లవం కూడా వచ్చింది.

ఈ నేపథ్యంలో 'చదువు' గడప గడపకూ రావడం మొదలెట్టింది. చదువుకున్న వాళ్ళు ఎక్కవయ్యే కొద్దీ మాధ్యమాలూ పెరిగాయి. మాధ్యమాలు పండితులమని చెప్పుకునే వాళ్ళ అవసరాల కంటే సామాన్య ప్రజల అవసరాలు తీర్చడంకోసం పుట్టుకొచ్చాయి. లేకపోతే వాటికి పాఠక, ప్రేక్షక ఆదరణ కొరవడుతుంది. ఇది వాటి ఉనికికే ప్రమాదం కాబట్టి మాధ్యమాలు ప్రజల భాషకు కొమ్ము కాయడం సహజం, అనివార్యం.

అప్పుడు పండితులమనుకునే వాళ్ళు, సామన్య ప్రజల మధ్య సాంస్కృతిక ఘర్షణ కూడా అనివార్యం అవుతుంది. అప్పుడు ఒకే భాష పండిత భాష ప్రజల భాషగా విడ గొట్టబడుతుంది. ఇక ఈరెంటి మధ్య అస్తిత్వపోరాటం కూడా సహజపరిణామం.

పండితులమనుకునే వాళ్ళు భాషను ప్రతిష్టావసరంగా భావించారు కాబట్టే ప్రజల నోళ్ళలో భాష భ్రష్టు పట్టి పోతుందని వగచిపోరాడారు. ఓడిపోయారు. తప్పొప్పుల సంగతి ఎలా ఉన్నా మెజారిటీ ముందు మైనారిటీ తల వంచవలసిందే. పదిమంది నడిచిందేబాట. ఈ పోరాట క్రమంలో పండితులమనుకునే గ్రాంధికవాదులు మాధ్యమాల్లోను, పాఠ్యగ్రంథాల్లోను, మెజారిటీ ప్రజలకు అపరిచితమయిన కృతకభాష ఉండాలని అప్పటి ప్రభుత్వాలను ప్రభావితం చేశారు.

జీవద్భాషే శక్తిమంతం కాబట్టి ప్రజల భాషే పాఠ్య గ్రంథాల్లో ఉండాలని గిడుగు రామమూర్తి పంతులు పోరాటమే జీవితంగా చేసుకున్నారు. ఏది ఏమయినా ఎడ్లబండి పోయి విమానం వచ్చినట్టు ఏది అవసరమో అదే నిలబడుతుంది. అవసరంలేనిది తిరస్కరించబడు తుంది. మరుగున పడిపోతుంది. ఉనికి కోల్పోతుంది. సాంస్కృతిక చిహ్నంగా గతకాలపు గుర్తుగా మిగిలిపోతుంది.

భాషకూడా అంతే ! వర్తమానానికి పనికిరాని భాషా సామగ్రి అంతా కోశంలో జీవచ్ఛవం అవుతుంది. ఆర్థిక శక్తులే రాజకీయంగాను, సామాజికంగాను చివరకు సాంస్కృతికంగాను ప్రబలంగా నిలబడతాయి. భాష సాంస్కృతిక సంబంధి. కాబట్టి ఆర్థిక శక్తుల భాషే ఉనికిలో ఉంటుంది. కాబట్టి పదికాలాల పాటు వర్త మానంలో ఒక భాష నిలబడాలంటే దాని వ్యవహర్తలు ఆర్థికంగా బలంగా ఉండటం తప్పనిసరి.

**ఉపసంహారం :**

ధనవంతుడి గాలి పాటయినా ఈల పాటే, పేదవాడి ఈలపాట అయినా గాలి పాట కిందే లెక్క. కాబట్టి ఏ సమాజమమైనా ఆర్థిక శక్తుల్నే అనుకరిస్తుంది, అను సరిస్తుంది. భాషయినా, మనిషి అయినా పరిస్థితులకు అవసరాలకు అనుగుణంగా మారితేనే మనుగడలో ఉండటం జరుగుతుంది. పరిణామం అనివార్యం. అవసరం అనివార్యం. అవసరాల భూమికగా పరిణామం, పరిణామం ప్రాతిపదికగా మనుగడ ఇదే భాషకయినా దేనికయినా వర్తిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
2. సామాన్య భాషా శాస్త్రం- ఆచార్య పి.ఎస్.సుబ్రహ్మణ్యం
3. భాషానువర్తనం - ఆచార్య చేకూరి రామారావు
4. తెలుగు మౌలిక అంశాలు - డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

(వ్యావహారిక భాషోద్యమ పిత గిడుగు రామమూర్తి జన్మదిన సంచికకోసం)

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# సామాజిక జ్వాలా కెరటాలు

- డా॥ వెల్దండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్, రంగారెడ్డి, తెలంగాణ.

కథలు ఇలాగే ఉండాలి. ఈ ఫ్రేమ్‌లోనే సాగిపోవాలని కథను నిర్వచించడం సాహిత్య అజ్ఞానుల పనేనని అనిపిస్తుంది. ఎందుకంటే జీవితం ఎంత విభిన్నంగా ఉంటుందో కథ కూడా అంతే విభిన్నంగా ఉంటుంది. ఉండాలి కూడా. ఒక స్పెక్ట్రంలో అన్ని రంగులూ ఒదిగిపోయినట్లుగానే కథలో కూడా జీవితం యొక్క అన్ని పార్శ్వాలు ఇమిడిపోతాయి. ప్లాటు, పాత్రలు, క్లైమాక్స్‌లాంటి పడికట్టు పదాలను కథ గురించి చెప్పేటపుడు మాట్లాడుతుంటాం. ఇవన్నీ కాసేపు పక్కన పెడితే ముడి రాయిలాంటి నిజ జీవితానికి కొంత పరిమళంలాంటి కల్పనను జోడించి మనస్సుకు హత్తుకునేలా చెప్తే అదే గొప్ప కథ. ఒక కథ ఎందుకు గొప్ప కథ అయిందో, ఇంకో కథ ఎందుకు మామూలు కథ అయిందో, మరో కథ ఎందుకు అధమంగా ఉందో చెప్పడం కథకు వ్యాకరణం రాసేవాళ్ల పని. కాని సగటు పాఠకుడు ఇవన్నీ ఆలోచించడు. అతనికి కావాల్సింది. కథ ఆకట్టుకుందా, తొలకరి జల్లు నేలను తాకినప్పటి మట్టివాసన వస్తుందా, గుండె గోడలకు కాసింత చెమట గంధాన్ని పూసిందా లేదా అనే. అలాంటి కథలు రాసే వాళ్లు ఎప్పటికీ పాఠకుల హృదయాల్లో చిరంజీవులె ఉండిపోతారు. దాదాపు నూటా పాతిక సంవత్సరాల ఆధునిక తెలుగు కథా ప్రయాణంలో ఇలాంటి కథకుల్ని ఎందర్ని గుర్తుపెట్టుకున్నాం మనం. కథా వినీలాకాశంలో కొన్ని వేల నక్షత్రాలున్నా నిరంతరం సూర్యునిలా జ్వలించే కథకుల కథలు మధ్యాహ్నపు ఎండలాగా నిఖార్సయిన బతుకుపొరల్ని తేటతెల్లంగా చూపిస్తాయి. అలాంటి వాస్తవాధీన రేఖ మీద నిలబడి 'ఆత్మాన్వేషణ' సాగిస్తూ ఇప్పుడు 'రూపాంతరం'తో తన కథల సమగ్ర కథల సంపుటితో పాఠకుల ముందుకు వస్తున్నారు జ్వలిత.

కథకులు సామాన్య జీవులతో పాటు ఎద్దు మెడకు కట్టిన 'తుంట'లాంటి జీవితాన్ని లాక్కుపోతూనే ఒక్కడుగు ముందుకు వేసి ప్రకృతిలాగా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ, ప్రమాదగంటికలను మోగిస్తూ పోతుంటారు. అయితే చాలా సార్లు మనం ప్రకృతి ముందస్తు హెచ్చరికల్ని పట్టించుకోం. పైగా దాన్నే విధ్వంసం చేస్తూ గర్వంగా ముందుకు అడుగులు వేస్తున్నామనుకుంటాం. ఇక్కడే కథకులు రంగస్థలం మీదికి వచ్చి మనం ఆడుతున్న నాటకం ఏ మలుపులు తిరుగుతుందో దాన్ని పర్యవసానాలేమిటో చాలా జాగ్రత్తగా చెప్తుంటారు. జీవితంలోని అనేక మలుపులు బాధ్యతాయుతమైన కథలుగా కుప్పపోస్తే జ్వలిత కథలు. ఈ కథలు ఎన్నో ప్రశ్నలకు జవాబులు. ఎన్నో వేదనలకు ఊరడింపులు. ఎన్నో సంఘర్షణలకు ముగింపులు. ముక్కలుగా విరిగిపడిన సమాజాన్ని మళ్లీ అతికించడానికి ప్రయత్నించే 'నల్లాలం' వంటి కథలు. జీవితం ఇలా ఉంది అని రక్తమోడుతోన్న గాయాన్ని మన ముందుంచి దీనికి మందు ఏంటో చెప్పకుండా మన గుండెకు నొప్పిని కలిగించే కథలు. కథ

చదవడం ముగించిన తరువాత గాయానికి మందును మనమే కనుక్కొంటాం. అలా మనలో ఒక మార్పును రెచ్చగొట్టి తప్పుకునే కథలివి.

జీవితంలో ఏ బంధమైనా శాశ్వతం కాదు. "ఉన్నంత కాలమే ఉంటుంది ఏదైనా, అది స్నేహమో, మరోటో కావచ్చు. ఏవో కారణాలతో ఆగిపోతే పోతుంది. ఆ స్మృతులు అనుభూతులుంటాయి. ఎవరో మళ్లీ పరిచయం అవుతారు. కాకపోవచ్చు కూడా. దేనినైనా స్వాగతించాలి... చాలా చిన్నదైన ఈ జీవితం భ్రమలతో, భయాలతో, ప్రలోభాలతో వ్యర్థపరుచుకోవడం అర్థం లేని పని" అని చెప్తుంది 'ఆత్మాన్వేషణ' కథ. ఈ కథలో పైన ఒక కథ నడుస్తూనే అంతర్గతంగా మరో కథ నడుస్తుంటుంది. ఇదొక శిల్ప నైపుణ్యం.

స్వార్థంతోనో, ఉద్యోగ వేటలోనో కన్న కొడుకు దూర మైతే పల్లెటూళ్లో ఒంటరిగా మిగిలిపోయిన తల్లి దండ్రుల బాధ వర్ణనాతీతం. కనీసం పండుగకు కూడా ఇంటికి రాని కొడుకు కోసం ఆ తల్లి పడే వేదన 'పండుగ పడిగాపు' కథ. ఇది ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్‌తో సాగే కథే అయినా మారి పోతున్న మానవ సంబంధాలను ప్రశ్నించే కథ. ఒక రకంగా ఇది ఇప్పటి పరిస్థితుల్లో ప్రతి ఇంటి కథ. ఇంటి నిండా పండుగ వస్తే బావుండునని తపించే తల్లిదండ్రులు ఎంతో మంది పల్లెల్లో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఒక కొడుకును కుటుంబానికి దూరం చేసే కుట్ర ఆ అమాయక తల్లికి అర్థం కాదు. ఎంతసేపు తన కొడుకు తనను చేరితే చాలనుకునే అల్ప సంతోషి.

కోటమ్మ, లచ్చుమమ్మ అనే ఇద్దరు వృద్ధ తల్లుల దీనగాథ 'మాయవుతున్న మనసు' కథ. ప్రపంచీకరణ ప్రభావంలో పడి ఎవరి వృత్తాల్లో వారు గిరిగీసుకొని బతుకుతున్నారు. "ప్రపంచీకరణ అభివృద్ధి మేధస్సుకే కాని మనసు అనే పదార్థానికి వర్తించడం లేదు. మనసు కుంచించుకు పోయింది. కొంచెం కొంచెంగా మాయ మైంది. దీనికి కారణం ఎవరు? ఎవరు బాగుచేయాలి?" అనే అంతు పట్టని ప్రశ్నల్ని రేకెత్తించే కథ ఇది. నిజానికి మనుషుల మధ్య మనసు ఇగిరిపోయి కేవలం ఆర్థిక సంబంధాలు, స్వార్థం మాత్రమే పర్చుకున్నాయని తెలిపే కథ.

జీవితం కొసదాకా పిల్లల కోసం, వాళ్ల బాగు కోసం సర్వం ధారపోసి చివరాఖరికి కనీసం తల్లిదండ్రులను చూడడానికి కూడా ఇష్టపడని పిల్లల చేత ఒక రకంగా బహిష్కరింపబడి ఒంటరిగా మిగిలిపోయిన వారి కొత్త బంగారు లోకం 'మానవ సరోవరం' అనే కథ. "ఒకరికి ఒకరు కాకుండా మనుషులు ఏమైపోతున్నారు. మనుషులు మధ్య అవకాశవాదం, స్వార్థం ఎట్లా పెరుగుతుందో ఆలోచించేకొద్దీ దిక్కుతోచట్లేదు" సరోజమ్మకు. నాలా ఏకాకులుగా మిగిలిపోయిన వాళ్లం అంతా ఒక దగ్గర చేరి ఒక ఉమ్మడి కుటుంబంలా కలిసి జీవిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనే మానవ సరోవరం. ఈ తీరం దిక్కులేని "చేపలు, కప్పలు, అనేక జలచరాలు, ఉభయ చరాలు అన్నిటికి నెలవు." ఇలాంటి ప్రయోగాలు కొంత మంది ఆధ్యాత్మిక వేత్తలు చేయకపోలేదు. అయితే ఏ పొరపొచ్చాలు లేకుండా బంధాలు వికటించకుండా నడపడం ఆచరణలో కష్టసాధ్యమైన పని. అయినా ఇదొక కొత్త దారి.

భారతదేశంలో ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో పాఠశాల విద్యమీద జరిగినన్ని ప్రయోగాలు బహుశా ఏ వ్యవస్థ మీదా జరగలేదేమో! స్వాతంత్ర్యానంతరం పాఠశాల విద్య మీద అనేక కమీషన్‌లు వేశారు. ఎన్నో పథకాలు అమలు పరిచారు. తీరా చూస్తే ప్రతి తరగతిలో తరగతి స్థాయికి దగ్గ పరిజ్ఞానం లేని విద్యార్థుల సంఖ్య ఎనభైశాతం పైనే. ఉపాధ్యాయుల్లోనే ఎన్నో రకాల ఉ పాధ్యాయులున్నారు. ఎమ్మెల్యేలనో, ఎంపీలనో ఇలా రకరకాలుగా విభజిస్తే ఊర్కుంటారా? ఇదొక వైపైతే మౌళిక సౌకర్యాల లేమి, పెరుగుతున్న ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి, ప్రతియేటా రిక్రూట్‌మెంట్ లేక పోవడం, ఇప్పటికీ నల్లబల్లలు లేని పాఠశాలలు ఉన్నా యంటే, తాగు నీటి వసతి లేని పాఠశాలలున్నాయంటే, మరుగుదొడ్లులేని పాఠశాలలు ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. పాఠశాల విద్యా వ్యవస్థను కడిగి పారేసిన కథ 'సహస్రధార' అంటే జల్లెడ. జల్లెడకు ఎన్ని రంధ్రా లున్నాయో పాఠశాల విద్యా వ్యవస్థకు కూడా అన్ని లోపా లున్నాయని ధ్వన్యాత్మకంగా చెప్పిన కథ.

జీవితం మరింత సంక్లిష్టం అవుతున్నా కొద్దీ స్త్రీ, పురు షుల సంబంధాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కేవలం భర్త సంపాదనే సరిపోదు. "ఆడవాళ్లు చదువు సంపాదన పేరుతో పాటు కష్టాలు పెంచుకుంటున్నారు. కష్టాలు తెచ్చిన కసితో కొంత సున్నితత్వాన్ని కోల్పోతున్నా రనిపిస్తుంది." తద్వారా పిల్లల్ని, ఇంట్లో ఉన్న వృద్ధుల్ని పట్టించుకోకుండా కేవలం డబ్బు చుట్టే తిరుగుతున్నారు. ఇట్లా సమాజం నిత్యం తీరిక లేకుండా ఉరుకులు పరుగుల మీద సాగిపోతుంటే మధ్యలో రేపటితరం పిల్లలు 'బలికుసుమాలు' అవుతున్నారనే ఆవేదనతో కూడుకున్న కథ 'బలికుసుమాలు'.

పరాయి ఆడదాని పొందు కోరితే ఊళ్లో దొరకైనా ఏగతి పడుతుందో చెప్పే కథ 'ఊరిడిచిన ఉత్తరం'. "నీకు తెల్వదా దొర సేతుల అందరు తోలుబొమ్మలే కదా... కోడైనా.. ఆడదైనా.. దొర కంటబడితేమయితదో" అంటుంది ఈ కథలో ఒక పాత్ర. ఇలాంటి నిరంకుశ వాతావరణంలో చంద్రమ్మ తెగించి దొరకు ఏ శిక్ష విధించిందో కథలోనే చదవాలి.

బహుజన చైతన్యాన్ని నింపే కథ 'సహ అనుభూతి వెలిగించిన దీపం.' కథలో చారీ కూతురు "బహుజనుల రాజ్యం కోసం కలలు కనడంతో పాటు పునాదులు పడుతున్నాయి. విద్య ఒక్కటే దిక్కని అందరు తెలుసుకుంటున్నరు. బహుజనులంతా చేయి కలుపుతున్నరు. బలాలు, బలహీనతలను గుర్తించగలుగుతున్నరు. సంఘం శరణం గచ్ఛామి. బౌద్ధమొక్కటే బహుజన సుఖాయ అన్నది. నీవు పొందిన దాంట్లో కొంత తిరిగి సమాజానికివ్వు. ఆ సూత్రానికి నా జీవితం ఒక ఉదాహరణ. నేను సంఘం చెక్కిన శిల్పాన్ని. సహ అనుభూతి వెలిగించిన దీపాన్ని." అని మానవులంతా సమాజ సేవకు పునరంకితం కావాలని ఆచరించి చూపిస్తుంది.

ఈ కథా సంపుటిలో వస్తువైవిధ్యం అపారంగా కనిపిస్తుంది. మనవలకు ఇప్పటి చదువులు చెప్పలేక, ట్యూషన్ మాస్టారుకి 'ప్రత్యామ్నాయం' కాలేకపోయిన రిటైర్డ్ టీచర్, ఆడపిల్లలను రక్షించుకుందామనే 'అమ్మ ఓడిపోయింది', జీవితంలో నిలబడి పోరాడాలని తెలిపే 'కొత్తమందు', విశ్వకర్మల్లోని తద్దినం తంతును వివరించే 'కర్మరుణం', ప్రపంచీకరణలో వేగవంతమైన బిజీ లైఫ్‌ను చెప్పే 'మాయమవుతున్న మనుసు', ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని చిత్రించిన 'సిబ్బి', 'పాతగాయం' అన్నీ ఏదో కొత్త కోణాన్ని విప్పి చెప్పి మనలో కొంత మార్పును తీసుకువచ్చేవే.

"అవునక్కా కులం, మతం, వర్ణం, ప్రాంతంతో సంబంధం లేకుండా అన్ని రంగాల మహిళలను సంఘటిత పరచాలి. చదువు అన్ని రకాల అవకాశాలు అందరికి అందేలా కృషి చేయాలి. మానవీయ విలువల్ని గౌరవించడం ద్వారా స్వార్థాన్ని వదిలి కుటుంబ సంబంధాలను పునరుద్ధరించగలగాలి. హింసకు కారణమయ్యే ప్రతి ఎలిమెంటును వ్యతిరేకించాలి" అంటుంది పుష్ప 'పసి దెట్లయితది' కథలో.

ప్రపంచీకరణ దెబ్బకు కుదేలయిపోయిన వృత్తులెన్నో ఉన్నాయి. కొన్ని పనిముట్లు, యంత్రాలు అభివృద్ధికి సూచననుకుంటాం కాని అవి పేదవారిని, కుల వృత్తుల వారిని తీసే దెబ్బ పైకి కనిపించదు. ఒకప్పుడు చేతినిండా పనితో వడ్రంగి పని చేసి కుటుంబాన్ని పోషించిన బ్రహ్మయ్య కుల వృత్తి మూలకు పడడంతో గత్యంతరం లేక వ్యవసాయ కూలిగా 'రూపాంతరం' చెందడం అత్యంత విషాదం. కులవృత్తులు నాశనం అయినప్పుడు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు చూపించకపోవడం వ్యవస్థ లోపం. ఈ మట్టిమనుషుల గోస ఎవరికి పట్టింది? కుర్చీలు కాపాడుకుంటూ, సమీకరణలు చేసుకుంటూ రాజ్యం ఎప్పటికప్పుడు నెట్టివేసే ధోరణిలోనే కాలం కరిగిపోతుంది. నిర్మాణాత్మక పాలన అందినప్పుడు ఇలాంటి కథల అవసరమే రాదు. ఏ రచయితకైనా అంతకంటే కావాల్సింది ఏముంటుంది? తాను తన కథల్లో చిత్రించిన సమాజం మారిపోవాలనే ఏ కథకులైనా కోరుకునేది. అలాకాకుంటే ఇలాంటి కథలు వ్యవస్థ మీద అనేక ప్రశ్నల్ని సంధిస్తూనే ఉంటాయి.

కథకులుగా మొదలు కావడం చాలా సులభం. కాని కథకులుగా కొనసాగడం చాలా కష్టం. కొంతమంది తొలి నాళ్లలో హడావుడిగా కొన్ని కథల్ని రాసి కథా రచయితగా గుర్తింపు పొంది తరువాత దృక్పథ రాహిత్యం వలన ఆగిపోతుంటారు. జ్వలిత కథల్ని చదివితే ఆమె దృక్పథం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. సమాజంతో ఒక ఉపనదిలా కలిసి ప్రయాణిస్తూ, సంక్షోభాల్ని అవగతం చేసుకుంటూ గత రెండు దశాబ్దాల జీవితంలోని అనేక శకలాల్ని కథలుగా మలిచారు. ఇవి కాలక్షేప కథలు కాదు. శైలి కోసమో, శిల్పం కోసమో, భాష కోసమో రాసిన కథలు అంతకన్నా కాదు. ఒక్కో కథ ఒక నిప్పు కణంలాగా నెగడు చిమ్మే 'దగడు'ను మన గుండెకు చేరవేస్తుంది. తాను చెప్పాలను

కున్నది చాలా సూటిగా చెప్పేస్తుంది రచయిత్రి. డొంక తిరుగుడు లేదు. శిల్పం కోసమో, శైలీ కోసమో ప్రాకులాట లేదు. తోటి మనుషుల పట్ల, సమాజం పట్ల ఒక ఆవేదన నిండిన స్వరం ఆమెది. ముఖ్యంగా వృద్ధుల పట్ల చాలా కలవరపాటును వ్యక్తపరుస్తారు రచయిత్రి. ఈ సంపుటిలో ఎనిమిది కథలు (ఆత్మాన్వేషణ, పండుగ పడిగాపు, మాయమవుతున్న మనసు, మానవ సరోవరం, ప్రశ్నించే పంజరాలు, యశోదమ్మ కల, కర్మరుణం, ప్రత్యామ్నాయం) వృద్ధుల రకరకాల సమస్యల గురించి మాట్లాడేవే. జ్వలిత సహజంగానే స్త్రీల పక్షపాతి. ఈ కథల నిండా పైకి వివిధ రకాల సమస్యల ఏకరువు కనిపించినా అంతర్గతంగా స్త్రీల ధైన్య స్థితి తొంగి చూస్తుంది. తాను Subaltern, Marginalized ప్రజల పక్షాన నిలబడి మాట్లాడుతుందని ఈ కథలు చెప్తాయి. అందుకే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంగా రాసిన రెండు కథలు (సిబ్బి, పాతగాయం) కూడా కనిపిస్తాయి ఈ సంపుటిలో. అన్ని కథల్లో పర్చుకున్న బహుజన దృక్కోణం ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది.

మానవ సంబంధాల చుట్టూ, మానసిక సంఘర్షణల చుట్టూ అల్లిక కథలు ఎప్పటికీ నిలిచిపోతాయి. వాటి నుండి పుట్టిన పాత్రలు కూడా నిత్యం మన చుట్టూ సంచరిస్తూనే ఉంటాయి. జ్వలిత కథల్లోని పాత్రలు కూడా మనల్ని ఒక దగ్గర 'కూకుండనీయవు'. ఈ కథలు చదువుతున్నప్పుడు రచయిత భావాలకు అనుగుణంగా మనం కూడా అనునాదం పొందుతుంటాం. కథ రాయడం కూడా ఒక కళే. అందులో కొంత దూరం ప్రయాణించిన జ్వలిత రానున్న రోజుల్లో మరిన్ని మంచి కథల్ని తెలుగు కథా సాహిత్యానికి జోడిస్తుందనే ఆకాంక్ష.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 
UGC Approved Journal No. 42500

# ఒక దశాబ్ది రాయలసీమ నవలలు - సాంస్కృతికాంశాలు (2001 - 2010)

**- డి. తోసేనా,** పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

ఒక నిర్దేశపు ప్రదేశంలో నిర్దిష్టమైన జీవన విధానంతో బతికే జన సమూహం సమాజం. ప్రకృతిలో మానవ సమాజం ఒక భాగం. ప్రకృతి చరిత్రలో మానవ సమాజ చరిత్ర ఒక అంతర్భాగం. ఏ సమాజానికైనా ఒక చరిత్ర, సంస్కృతి రక్తమాంసాలవంటివి. వాటితోనే సమాజ పురోగతి, అభివృద్ధి సాగుతుంది. అవి పరస్పరసంబంధాన్ని కలిగి మిళితమైపోయి సమాజంపై వాటి ప్రభావాన్ని చూపుతున్నాయని చెప్పవచ్చు.

చరిత్రలో అంతర్భాగమే సంస్కృతి. సంస్కృతి అంటే జీవన విధానం లేదా జీవన రీతి. నేటి వ్యవహారంలో నాగరికత, సంస్కృతి అంటే పెద్ద తేడా లేకపోయినా, నాగరికత అనేది సంస్కృతిలో భాగమే. సంస్కృతి అంటే మతం, తత్వశాస్త్రం, చట్టరీతులు, సాహిత్యం, కళలు, సంగీతం అనే అంశాలు స్పృశించేదిగా మనం చూస్తున్నాం. సంస్కృతికి ఎల్లలు లేవు. అన్ని దేశాల్లోనూ, అన్ని జాతుల వారు తమ తమ ప్రాంతాల్లో సంస్కృతిని సంపన్నం చేసుకుంటున్నారు. అదే సకల మానవ సంస్కృగా ఉమ్మడి శ్రమ ఫలితంగా పరిగణించబడుతున్నది.

సంస్కృతిని సాహిత్యం ప్రతిబింబిస్తుంది. ఒక కాలం నాటి సంస్కృతిని తెలుసుకోవాలంటే ఆనాటి సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది. సంస్కృతి లేని మానవ సమాజం ఉండదు. ఒక జాతి స్థితిగతులను అభివృద్ధిని ఆ జాతి సంస్కృతిని బట్టి చెప్పవచ్చు. దానికి ఆలంబన మైనది సాహిత్యం. ఈ సాహిత్యం ఏ ప్రక్రియలోనయినా ఉండవచ్చు. ఈ దృక్కోణంతో 'ఒక దశాబ్దపు రాయలసీమ నవలల్లో' పేర్కొనబడిన సాంస్కృతికాంశాలు ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది.

ఒక దశాబ్ది రాయలసీమ నవలల్లో (2001-10) చిత్రించబడిన సాంస్కృతికాంశాలను ఇలా పేర్కొనవచ్చు.

1. ఆంగ్ల సంవత్సరాది వేడుకలు
2. ఆంగ్ల సంవత్సరాది రోజు చేసే పూజలు
3. బోరు పాయింటు పెట్టుట
4. మాతమ్మల దుర్భర జీవనం
5. ముగ్గుల ప్రాధాన్యం
6. ఇంటి ముంగిట ముగ్గులు
7. మాల పున్నమి
8. గోవుపట్ల ఆరాధనాభావం
9. గోమూత్ర మహత్యం
10. చితా భస్మాన్ని పవిత్ర నదుల్లో కలుపుట
11. మొలకల పున్నమి - పల్లె ప్రజల ఆటలు
12. సాంప్రదాయానికి తిలోదకాలు
13. గజ్జె పూజ
14. ఉగాది
15. రైతు పొలం దున్నేటప్పుడు పాటించే సంప్రదాయం
16. మహాభారత యజ్ఞం
17. అర్జున తపస్సుమాను
18. వర్షంకోసం చేసే పూజలు
19. గంగజాతర
20. వివాహ శుభలేఖ
21. పశువులు - సుడులు - ఫలితాలు
22. దండోరా వేయుట
23. రాశింటి ఆచారం
24. కొత్త కోడలిని ఇంటికి వేసుకొనుట
25. కొత్త పెళ్ళి కూతురిని గెలిచేయుట - వంటి సంస్కృతి కాంశాలు

2001-2010 మధ్య కాలంలో వెలువడిన రాయల సీమ నవలలను ఇలా పేర్కొనవచ్చు.

1. నీరు నేల మనిషి - సుంకోజి దేవేంద్రాచారి
2. నేల నవ్వింది - పలమనేరు బాలాజి
3. చినుకుల సవ్వడి - సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
4. తోలుబొమ్మలాట - సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
5. బతుకాట - డా॥ వి.ఆర్.రాసాని

6. సర్కార్ గడ్డి - ఆచార్య కీలకచారి ఇనాక్
7. పెన్నేటి మలుపు - డా॥ శాంతి నారాయణ
8. ముద్ర - డా॥ వి.ఆర్. రాసాని
9. పరస - డా॥ వి.ఆర్.రాసాని
10. మునెమ్మ - డా॥ కేశవ రెడ్డి
11. కక్షశిల - డా॥ చిలుకూరి దేవపుత్ర
12. రెండు కలల దేశమ్ - బండి నారాయణ స్వామి
13. మంచుపూవు - కాశీభట్ల వేణుగోపాల్
14. తెరవని తలుపులు - కాశీభట్ల వేణుగోపాల్
15. నేనూ - చీకటి - కాశీభట్ల వేణుగోపాల్
16. దిగంతం - కాశీభట్ల వేణుగోపాల్
17. కొత్త బంగారు లోకం - టి.ఎస్.ఏ. కృష్ణమూర్తి
18. కలువ విరిసింది - టి.ఎస్.ఏ. కృష్ణమూర్తి
19. సిటీ బూన టీప్సర్ - డా॥ కేశవ రెడ్డి
20. ప్రలోభం - నాయుని కృష్ణమూర్తి
21. హీరో - సి.ఎన్. చంద్ర శేఖర్
22. స్రవంతి - సి.ఎన్.చంద్రశేఖర్

ఈ నవలల్లో అక్కడ కూడ సాంస్కృతికాంశాలు చిత్రించబడ్డాయి. మనం తినేతిండి, కట్టుకునే బట్ట, అలంకరించుకునే తీరు, నిర్మించుకునే ఇల్లు వంటి అంశాలన్నీ సంస్కృతి కిందకు వస్తాయి. ఈ సాంస్కృతికాంశాల ద్వారా రచయితలు తాము చెప్పదలచిన అంశాన్ని పాఠకుల మనస్సుకు హత్తుకునేటట్లు చెప్పగలుగుతున్నారు. ఈ కొవలో ప్రప్రథమంగా చెప్పదగిన సాంస్కృతి కాంశం 'ఉగాది పండుగ'.

**ఉగాది :**

తెలుగువారు జరుపుకునే పండుగల్లో అత్యంత విశిష్టమైనది ఉగాది. ఇది తెలుగు వారికి సంవత్సరాది. అందువల్ల ఈ పండుగను తెలుగు ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ పండుగను జరుపుకునే తీరును గూర్చి డా॥ వి.ఆర్.రాసాని ఇలా తెలిపాడు.

"ఆ రోజు ఉగాది. అదే ... ఆంధ్రుల సంవత్సరాది! ఊరు ఊరంతా ఆనందంతో ఉత్సాహంతో ఓలలాడుతున్న రోజు! ఆ రోజు కోసం ... రెండు రోజుల ముందే ప్రతి ఒక్కరూ ఎర్రమన్ను తెచ్చి, నీళ్ళతో తడిపి పెచ్చులూడిపోయిన గోడలకు వేసి, ఇంటి కప్పుల్ని సరిచేసుకొని, సున్నం పూసుకున్నారు. అరుగులకు గడపలకు ఎఱ్ఱ మట్టి పూసి అలంకరించారు.

ఆ రోజు ఉదయాన్నే అందరూ తల స్నానాలు చేసి కొత్త బట్టలు వేసుకున్నారు. అందరి ముఖాల్లోనూ ఆనందం తొణికిసలాడుతుంది. ప్రతి గుమమ్మమూ పచ్చటి తోరణాలతో, పసుపు కుంకాలతో ... విరగబూసిన చెనిగిచెట్ల కొంగ్రలా అనిపిస్తోంది. పల్లె వీధి విరగకాసిన చెట్లసాలులా కనిపిస్తోంది.

ఉత్తర దక్షిణంగా వ్యాపించి వున్న ఆ ఊర్లో పడమటి వరుసలో దక్షిణం వైపు చివరనున్న రాశింటి నానుకొని మోకాటెత్తున్న రాతి రూపంలో వీధి గంగమ్మ వెలసివుంది. ఆ రాతిని పసుపు కుంకాలతో అలంకరించి వున్నారు" (బతుకాట - పు:8) అంటాడు. చైత్రశుద్ధ పాడ్యమినాటి ఉగాదితో చంద్రయానాన్ని అనుసరించే తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. అయితే ఎప్పుడూ ఇలాగే జరుగుతుందని అర్థం కాఆదు. రామాయణంలో పన్నెండో మాసమైన చైత్రలో నవమి దినం నాడు శ్రీరాముడు జన్మించాడని చెప్పబడింది. అందువల్ల ఆకాశంలో వైశాఖ మాసం నుంచి కొత్త సంవత్సరం ప్రారంభమవుతున్నదని తెలుస్తున్నది. క్రీ.శ. 5వ శతాబ్దిలో వారాహమహిడు చైత్ర మాసం నుంచి కొత్త సవ్సరం ప్రారంభమయ్యే సంప్రదాయాన్ని ప్రారంభించాడంటారు. ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్రలలో ఈ దినమే ఉగాదిని పాటిస్తారు.

ఉగాది జీవితంలోని సుఖదు:ఖాలను ప్రతిబింబించే ఉత్తమ పర్వదినం. కన్నడిదలు సుఖదు:ఖాలకు ప్రతీకగా వేపపూలను బెల్లాన్ని కలిపి తింటారు. తెలుగు వారి ఉగాది పచ్చడి సుఖదు:ఖాలనేగాక జీవితంలోని వగరును, రౌధాన్ని పులుపును కూడా ప్రతిబింబిస్తుంది. పండుగలు సాంకేతికమైనవని చెప్పడానికి తెలుగు వారి ఉగాది పచ్చడి ఒక్కటే చాలు. వేపపూలు, కొత్త బెల్లం, ఉప్పు, కొత్త చింత పండు, పచ్చి మిరపకాయలు, మామిడి పిందెలు కలిపిన

ఉగాది పచ్చడి షడ్రుచులతో నిండిన వింత అనుభూతిని కలిగిస్తుంది. పంచాంగ శ్రవణం కూడా ఉగాది పండుగలో ఒక భాగమైపోయింది. పల్లెటూళ్ళలో ఇది కేవలం ఒక ఉత్సవంగాగాక, రాబోయే శుభాశుభాలను తెలుసు కోవాలనే ఉత్సుకతను రేకెత్తించే సందర్భంగా ఉపయోగ పడుతున్నది.

## మొలకల పౌర్ణమి :

ఉగాది తర్వాత వచ్చే పౌర్ణమిని మొలకల పౌర్ణమి అంటారు. ఆ నెలలో వెన్నెల పట్టపగటిని తలపిస్తుంది. ఆ వెన్నెల్లో పల్లె ప్రజలు ఆబాలగోపాలం వివిధ రకాల ఆటలు ఆడతారు. ఆ క్రమంలోనే మొలకల పున్నమి పండుగను వినూత్నంగా జరుపుకుంటారు. ఈ విషయాన్ని రచయిత సుంకోజి దేవేంద్రాచారి ఇలా తెలిపాడు.

"రామచంద్ర తలలో ఎప్పటియో ... ఇరవై ముప్పై ఏండ్ల కిందటి జ్ఞాపకాలు మొదలతాండాయి". అపుడు మొలకల పున్నమి నెలోస్తేచాలు. అందరికీ ఎంత సంతోషమో.

అమావాస్యపోయి పడమర చందమామ కనిపించిన రోజునించి సాయంత్రాలు పిల్లలు ఈదుల్లో ఆటలాడే వాళ్ళు. చందమామదినదినాకి పెరగతా రేత్తిరిపూట ఆకాశంలో ఉండేది పెరిగే కొద్దీ ... పిల్లోళ్ళుకూడా ఎన్నెలతో బాటు ఆడుకునేవాళ్ళు.

ఎన్నెల కుప్పలు
ముక్కులు గిల్లేఆట
ఒత్తొత్తి సూరొత్తి
కుచుకుచు పుల్ల
రుల బండ ...
సారసక్క సవరా బండి
గడగడ చక్కా ... గంధం చెక్క
పాపలాట
దాగుడుమూతలూ ...
ఉప్పురా పట్టె ...
చెడుగుడు ...

రకరకాల ఆటలు ... పిల్లోళ్ళ సంఖ్యను బట్టి వాళ్ళలో స్నేహాలను బట్టి ఆటలాడే వాళ్ళు. పున్నమి ఇంక అయిదారు రోజులుండాదనంగా రేత్తిరిపూట సందడి పెరిగేది. (నీరు నేల మనిషి - పు : 144) అంటూ ఒకప్పటి పల్లెటూరి ప్రజల ఆటలను పూసగుచ్చినట్లు వివరిస్తాడు.

2000 సంవత్సరానికి పూర్వం వరకు పల్లె ప్రజలు మొలకల పౌర్ణమి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునేవారు. అయితే వివిధ కారణాలతో పల్లెలు బోసిపోయిన తరువాత ఈ పండుగ నేడు దాదాపుగా తెరమరుగయిందని చెప్పవచ్చు.

## మాతమ్మల దుర్భరజీవనం :

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని దళిత, వెనుకబడిన కులాల వారిని పట్టి పీడిస్తున్న దుర్భర సమస్య మాతమ్మ వ్యవస్థ. ఈ వ్యవస్థ తీరు తెన్నుల గురించి డా॥ వి.ఆర్.రాసాని ముద్ర నవలలో కొటమ్మ వృత్తాంతాన్ని ఆధారంగా చేసుకుని ఇలా తెలిపాడు.

"ఎప్పుడో అరవై పండ్లకు ముందుమాట. నేను ఈ వూర్లో పుట్టి పెరిగిందాన్నే. ఇప్పటి బద్దెగురవయ్య నాయనకు తోడబుట్టిందాన్ని. వాడికి మెన్నతని. అందరి మాదిరిగానే నేను యీ యింట్లో అల్లారు ముద్దుగా పెరినా. నన్ను కన్నోళ్ళ ముద్దు మురిపాలు మూలు గట్టుకున్నె. మానాయనకు పెండ్లయ్యి అయిదేండ్లయినా బిడ్డలు పుట్టలేదంట. అప్పుడు ఆ అయితమ్మ గుడిలో దీపం పెట్టి. 'నాకు బిడ్డలు పుడితే తొలి ఆడబిడ్డను మాతమ్మగా మార్చి నీకిచ్చి పెండ్లి చేస్తానని మొక్కుకొని మరదీసి కట్టినాడంట' అట్ల మొక్కుకున్న సంవత్రానిక నేను పుట్నానంట. నాఎనక పరివిగాని నాయనబుట్టె. మొక్కు ప్రకారం నాకు పద్నాడు ఏండ్లు వచ్చిరాగానే అయితమ్మకిచ్చి పెండ్లి చేసి ముద్దరేసి ... యిదో ఈ గుడిసెలో వదిలి పెట్నారు. ఆ తంతు ఆకాలంలో ఒకే అట్టహాసంగా, పటాటోకంగా జరిగింది. ఇప్పుడు సర్పంచిగా ఉండే శంకరయ్యతాత నాకు కన్నెరికం ఈ గుడిసెలోనే జేశం మాతమ్మలకు తొలి కన్నెరికం చేసి ఆచారం వాళ్ల వంశానికొస్తావుండేయిది. (ముద్ర - పు : 20) అంటుంది కొటమ్మ హసీనాతో. శాస్త్ర సాంకేతిక వైజ్ఞానికంగా

దేశం ఎంతో ఎత్తుకు ఎదిగినా ప్రజల్లో మూఢనమ్మకాలు, దురాచారాలు, ఇంకా పూర్తిగా తొలగిపోలేదని చెప్పవచ్చు. దీనికి నిదర్శనమే మాతమ్మల వ్యవస్థ నేటికీ కొన సాగుతుండుటను పేర్కొనవచ్చు. ఈ దురాచారాలను రూపుమాపుటకు సామాజిక స్పృహ కలిగిన రాయలసీమ నవలారచయితలు చక్కగా కృషి చేస్తారు. వారి కృషి ఫలితంగానే సమాజంలో అక్షరాస్యత తగ్గి మూఢ నమ్మకాలు తొలుగుతున్నాయని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. జోగిని వ్యవస్థ - డా॥ వకులాభరణం లలిత
2. సమాజ శాస్త్రం - పి రాజేశ్వరి
3. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాప రెడ్డి
4. ప్రపంచ ప్రజల చరిత్ర - క్రిస్ హార్మాన్
5. హిందువుల పండుగలు - ఆచారాలు - ఆచార్య తిరుమల రామచంద్ర
6. సంస్కృతి - ఎ.ఎన్. మూర్తి

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలంగాణ నవల - బహుజన అస్తిత్వ చిత్రణ

- డా. పంతంగి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

తెలంగాణ సాహిత్యానికి సంబంధించినంతవరకు బి.సి.అస్తిత్వ రచనలను బహుజన సాహిత్యంగా పేర్కొం టున్నారు. దీనికి కారణం దళిత సాహిత్యంలో లేదా నవలల్లో దళితుల అస్తిత్వ జీవన చిత్రణ ఉండడం, దానికొక సిద్ధాంత భూమిక ఉండడం కారణం. పూలే, అంబేద్కర్ ఆలోచనా విధానం ఆయా నవలా రచయిత లను దళిత అస్తిత్వ చిత్రణ చేయడానికి ప్రేరేపించింది. అస్తిత్వ ఉద్యమ సాహిత్యంలో ఎవరి బాధలను వారే రాసుకోవాలనే వాదన ప్రబలంగా వినిపించడంతో బి.సి. రచయితలు రాసిన సాహిత్యాన్ని గుర్తించాల్సి వచ్చినపుడు బహుజన సాహిత్యంగా వ్యవహరించడం జరుగుతున్నది. బహుజనుల జీవితాల నుండి ఎన్నో అంశాలను ఈ నవలాకారులు చిత్రించడం చూడవచ్చు. వీటిల్లో కుల అస్తిత్వాన్ని గుర్తించడం, కులపరంగా జరిగిన అవమానా లను సాహిత్యంలో చిత్రించడం, కుల ప్రాతిపదిక మీద అణచివేత, దోపిడీలు ఏవిధంగా చోటు చేసుకుంటాయో విశ్లేషించడం ఇటువంటి రచనల్లో మనం గమనించవచ్చు.

బి.సి అస్తిత్వాన్ని గుర్తించి చిత్రణ చేసిన నవలాకారులు విశేషంగా కుల మూలాలను, బాధిత అస్తిత్వాలు చెల్లించిన మూల్యాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. బహుజనుల జీవితాలు, సంస్కృతి,భాష, కులవృత్తులు, వెనుకబడి పోతున్న జీవన విధానాలు నవలా సాహిత్యంలో చిత్రించబడ్డాయి.

ఇంతకుముందు నవలా సాహిత్యంలో లేని ఒక ముఖ్యమైన మలుపు ఏమిటంటే అగ్రవర్ణ రచయితలు కుల సంబంధ పాత్రలను, వాళ్ల బాధలను చిత్రించి నప్పటికీ అవి భూస్వామ్య వ్యవస్థ పెడుతున్న హింస, అణచివేతలకు బలైపోయిన వారిగా చూపడం జరిగింది. ఆయా అస్తిత్వాల జీవన సంఘర్షణ అంతగా చిత్రిత మయ్యేది కాదు. ఆయా కుల వృత్తులకు చెందిన వ్యక్తుల బాధలు చూసి చలించకపోయిన తీరు కనబడుతూ ఉండేది. తరువాత కాలంలో వచ్చిన నవలల ప్రత్యేకత ఏమిటంటే సమాజంలో కింది కులాలుగా పరిగణింప బడిన యువకులు కథకులుగా, నవలా రచయితలుగా రూపొందారు. తమ తమ కులాల్లోని అస్తిత్వాన్ని ప్రత్యక్షానుభవం ద్వారా గ్రహించి నవలా రచనలు చేశారు.

తెలంగాణ అస్తిత్వ బాధను, సమస్యలను చిత్రిస్తూ తెలంగాణ భాషలో బి.స్. రాములు, బోయ జంగయ్య, పులుగు శ్రీనివాస్, కాలువ మల్లయ్య, ఆడెపు లక్ష్మీపతి, శిరంశెట్టి కాంతారావు పంజాల జగన్నా థం, బి.వి.ఎన్ స్వామి, కె.వి.నరేందర్, చొప్పదండి సుధాకర్, భూపాల్, బోధనం నర్సిరెడ్డి, పెద్దింటి అశోక్‌కుమార్, నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ మొదలైన ఎంతోమంది తెలంగాణ రచయితలు నవలలు, కథలు రచించారు. నేను ఈ వ్యాసంలో కాలువ మల్లయ రాసిన 'బతుకు పుస్తకం, గువ్వలచెన్నా' నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ రాసిన 'బతుకుతాడు' నవలలను తీసుకొని వాటిలో బహుజన అస్తిత్వాన్ని పరిశీలించే ప్రయత్నం చేస్తాను.

కాలువ మల్లయ్య 'బతుకుపుస్తకం' నవల అయిదు దశాబ్దాల గ్రామజీవితంలోని అనేక పరిణామాలను చిత్రించింది. ఇందులోని ఎన్నో పాత్రలు వాటి సంభాషణలు, స్వగతాలు, మనోగతాలు తెలంగాణ మాండలికంలోనే సాగుతాయి. కుల అస్తిత్వాల మీద ఒక అవగాహన, సరైన ఆలోచనాదృక్పథం గల రచయిత సాధికారికంగా కుల అస్తిత్వాన్ని గురించి ఇందులో ప్రస్తావించడం జరిగింది. "సమాజానికి అవసరమయ్యే వస్తువులు ఉత్పత్తి చేయ డంలో ఏ కులం ప్రాముఖ్యత ఆ కులానికుంది. ఉత్ప త్తితో సంబంధమున్న ప్రతి కులం గొప్పదే. ఆయా వృత్తులు చేసేవాళ్లను ఆ కులమని అనడంలో తప్పులేకపోవచ్చు గాని ఫలానా ఎద్ద ఫలాన కులం చిన్న అనడం వల్లనే ఈ కుల భేదాలు ఘోర ప్రభావాన్ని చూపుతున్నాయి." (బతుకు పుస్తకం - కాలువ మల్లయ్య పుట;177)

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 12 ఏళ్లకు కరీంనగర్ జిల్లాకు దగ్గరగా ఉన్న ఒక కుగ్రామంలో జరిగిన సంగతులు, సంఘటనలు, మార్పులు, పరిణామాలు 'బతుకు పుస్తకం' నవలా నేపథ్యంగా కనిపిస్తాయి. ఇందులో కొండలరావు దొర, రాజయ్య కుటుంబం, భూమయ్య కుటుంబం ప్రధాన పాత్రలుగా సాగుతాయి. గ్రామం కొండలరావు దొరను ఎంతో ఆత్మీయంగా పంతులు అని పిలుచుకుంటుంది. గ్రామ అభివృద్ధే ధ్యేయంగా అతను పాటుపడుతుంటాడు.ప్రతి అభివృద్ధి కార్యక్రమం పంతులు చేతులమీదుగానే జరుగుతుంది.దొర డబ్బున్న వాడైనప్పటికీ ఆధిక్యతను ప్రదర్శించకపోవడం విశేషం.

దొర భార్య ఆనందబాయమ్మ ఊరందరికి తల్లిలాగా ఉండి ఆదరిస్తుంది. అలాగే కాపుకులానికి చెందిన లసుమయ్యకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కొద్దిపాటి వ్యవసాయాన్ని నమ్ముకొని జీవితం గడుపుతున్న లసుమయ్య ఆర్థిక స్థితిగతులు సహకరించకపోవడంతో పెద్దవాడైన మల్లేశాన్ని వ్యవసాయనికి ఉంచి చిన్న కొడుకు రాజయ్యను చదివించాలనుకుంటాడు.ఇక దళిత కులానికి చెందిన సాంబయ్య రామ సింహకవి రాసిన కీర్తనలను బాగా పాడుతుంటాడు. ముఖ్యంగా ఇతను ఊరిలో జరిగే ఉత్సవాలలో కీర్తనలు పాడుతుంటాడు. ఇతనికి నలుగురు సంతానం. పెద్దకొడుకు భూమయ్యను బాగా చదివించాలనుకున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సహకరించదు. కొండలరావు దొర ఈ విషయం తెలుసుకొనిభూమయ్యను చదివించేలా ప్రోత్సహిస్తాడు. ఈ నవలలో కొండలరావు దొర కొడుకు పురుషోత్తమరావు, రాజయ్య, భూమయ్య ఒకే తరానికి చెందిన వ్యక్తులు. వీరి జీవిత విశేషాలతో నవల చిత్రితమైంది.

ఈ నవలలో సమకాలీన రాజకీయాలు కూడా చిత్రితమయ్యాయి. ఒక గ్రామం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అవసరాలు తీరడానికి సకల వృత్తులు, సమస్త కులాల అవసరం ఉంటుంది. ఒక గ్రామం అవసరం తీరడానికి కనీసం 16 కులాలవాళ్ల అంటే వృత్తులవాళ్లు అవసరమని చెపుతారు. కులాల మధ్య హెచ్చుతగ్గులు, చిన్నా పెద్ద తారతమ్యాలు ఉండకూడదంటాడు రచయిత. చేతి వృత్తులవాళ్లు అయిన చాకలి, మంగలి, కుమ్మరి, వడ్రంగి, గొల్ల, కుర్మ, గౌడ, వడ్డెర మొదలైన కులాలు, వాళ్లవెతలు కూడా 'బతుకుపుస్తకం' నవలలో చిత్రించబడ్డాయి.

సంప్రదాయ మగ్గాలు పోయి మరమగ్గాలు వచ్చిన తరువాత చేనేత కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. బ్రతుకు గడవని స్థితిలో బలవంతంగా బొంబాయి, సూరత్ లాంటి పట్టణాలకు ఈ కార్మికులు వలసలు పోవడం మొదలైంది. ఆర్థికంగా ఇబ్బందులను తట్టుకోలేక కుటుంబాలకు కుటుంబాలే ఆత్మహత్యలకు పాలు పడ్డాయి.ఇటువంటి నేత పనివారల జీవితాలను చిత్రించిన మరో నవల కాలువ మల్లయ్య రాసిన 'గువ్వలచెన్నా' కరీంనగర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో నేత పని చేసుకునే సిప్ప మల్లయ్య కుటుంబం ఎదుర్కొన్న బాధలే ఈ నవలలో ప్రధానాంశం. లింగమ్మ, మల్లయ్య దంపతులకు ముగ్గురు కొడుకులు. రాజమల్లు, వీరయ్య, శంకరయ్య. కొడుకులను చదివించాలన్న ఆకాంక్ష ఎంతగా ఉన్నప్పటికీ అంత స్తోమత లేని మల్లయ్య పెద్ద వాన్ని మినహా చిన్న కొడుకులను మాత్రమే చదివిస్తాడు. తమ పిల్లలను చదివించలేకపోతున్నమనే బాధ వృత్తిపనివారల కుటుంబాలలో సాధారణంగా ఉంటుంది. చిన్న కొడుకు శంకరయ్య తండ్రి చేసే కులవృత్తికి చేదోడువాదోడుగా ఉంటూనే చదువుకుంటాడు. తండ్రి చేసే పనిలో ఏమాత్రం వృద్ధి కనిపించదు. తండ్రి బాధ, ఆర్థిక పనిలో ఏమాత్రం వృద్ధి కనిపించదు. తండ్రి బాధ ,ఆర్థిక లోతు శంకరయ్యను కలచివేస్తుంది. ఎన్నోబట్టలు నేసినా తన తల్లి ఒక పట్టుచీరయినా ధరించాలన్న కోరికను తీర్చు కోలేకపోవడం అనుభవపూర్వకంగా గ్రహిస్తాడు.

ఇటువంటి కుటుంబాలు వృత్తిని నమ్ముకొని ఎంత నిజాయితీగా శ్రమించినా ఈవర్గాల శ్రమని గుర్తించని దొరలు 'సాలెసంకటం గోచిలిరుకటం' అంటూ అవమానాలకు గురిచేయడం రాజమల్లు, శంకరయ్యలను బాధకు గురిచేస్తుంది. కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న

రాజమల్లు ఆర్థికంగా స్థిరపడటం కోసం భీవండి వెళ తాడు. అయితే అక్కడ మతఘర్షణలతో హత్యకు గురవు తాడు. కొడుకు మరణాన్ని లింగమ్మ, మల్లయ్యలు తట్టు కొలేకపోతారు.

ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మూడు రకాల జీవన విధానాలలోకి మారి కులవృత్తికి మార్పులకు మధ్య నలిగిపోవడాన్ని ఈ నవల చిత్రించింది. గిట్టుబాటు కాని వృత్తులను వదిలేసి కొందరు వ్యవసాయం, మరి కొందరు వ్యాపారం, ఇంకొందరు ఉద్యోగాలు ఇంకా వలసలుపోవడం వంటి రకరకాలమార్గాలలో బతికేందుకు ప్రయత్నం చేయడం కనిపిస్తుంది. జగిత్యాల, సిరిసిల్ల లాంటి ప్రాంతాల్లోని పద్మశాలి కుటుంబాల దుర్భర పరిస్థితులను ఈ నవల చిత్రించింది.

కులవృత్తుల మీద నవలలు రాసిన రచయితలు ఆశ్రిత కులాల అస్తిత్వ సమస్యలను కూడా చిత్రించారు. పద్మశాలీలపై ఆధారపడి బ్రతికే ఉపకులం సాధనా శూరులు. వాళ్లు జానపద కళాకారులు. ఊళ్లో ఉన్నన్ని రోజులు వారి పోషణ భారం అంతా పద్మశాలీలదే. సాధనాశూరులు ఊర్లో కొస్తే సాలీలకు పండుగలాగా ఉంటుంది. కులాలు అంతరించే క్రమంలో కులాలపై ఆధారపడి బ్రతుకుతున్న ఉపకులాల మనుగడ ప్రశ్నార్థకమైపోయింది. నేడు సాధనాశూరుల విద్యలు కను మరుగయ్యాయి. చొప్పబెండ్ల పల్లకిపై నిల్చోవడం, మనిషిని మాయం చేయడం వంటి అద్భుతమైన కళా రూపాలు నేడు అంతరించిపోయాయి.

నిజానికి ఆశ్రిత కులాలు అనే కాకుండా నేత కార్మికు లవి కూడా పరాధీన జీవితాలే. అందరికి బట్టలు నేసి ఇచ్చేవారైనా వాళ్లు వంటి నిండా బట్టలు ధరించలేని పరి స్థితి. ఆయా కుటుంబాలలో ఒకరిద్దరు ఉద్యోగస్థులున్న ప్పటికీ వాళ్లు కూడా ఆర్థిక ఉన్నతిని సాధించినవారు కాదు. పొట్టకు బట్టకు వెళ్లదీసుకోగలిగిన వెసులుబాటు మాత్రమే శంకరయ్యలాంటి వ్యక్తులకు కలిగింది. మిల్లు వస్త్రాలు వచ్చి కొద్దిమందికే లాభాన్ని చేకూర్చాయి. ఎక్కువ మంది ఉపాధిలేని వారయ్యారు. పదిమంది చేయ్యాల్సిన పనిని యంత్రం ఒక్కటే చేయడంతో ఉపాధి భద్రత, ఆహార భద్రత ఆ కుటుంబాలకు కరువయ్యింది. ఒకప్పుడు గౌరవప్రదంగా భావించిన నేతవృత్తి నేడు పద్మశాలీలను నేత కూలీలుగా మార్చింది. అప్కోలాంటి సంస్థలు పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న స్థితిని నవలలు బహు ముఖంగా చిత్రించాయి.

నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ రాసిన 'బతుకుతాడు' గౌడ కులం వారి అస్తిత్వం గురించి సమగ్రంగా చర్చించింది. ఇది వెలువడిన సంవత్సర కాలంలోనే దీని ప్రభావంతో నల్ల గొండ జిల్లా సూర్యాపేటకు చెందిన కె. వెంకటేశ్వర్లు 'కల్లు మండువ' రాశాడు. కులవృత్తి నేపథ్యంగా ఒక నవల వచ్చాక దాని ప్రభావంతో వెంటనే మరో నవల రావడం కుల అస్తిత్వ చిత్రణ నవలా సాహిత్యంలో ప్రబలంగా సాగాల్సిన అవసరాన్ని చెపుతుంది. బతుకుతాడు నవల ప్రధానంగా మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. మూడు కుటుంబాలలో ఒక కుటుంబం రచయిత పెద నాన్నది కాగా రెండవది రచయితది. మూడవ కుటుంబం చిన్నాన్నది. మరొక విశేషం ఏమిటంటే నవలలో రచ యిత శ్రీనివాస్ గౌడ్‌ది కూడా ఒక ముఖ్యమైన పాత్ర.

ఈ మూడు కుటుంబాలలో పెదనాన్నది అభివృద్ధి చెందిన కుటుంబం. చిన్నాన్న కుటుంబం దరిదాపులేక మధ్యలోనే అంతమైపోయింది. రచయిత కుటుంబం మూడు దశాబ్దాలు శ్రమించినా బాగుపడింది లేదు సంపా దించి నిలబడింది లేదు. ఇట్లా గౌడ కులస్థుల జీవితాల్లోని దుర్భర దుస్సహ జీవన పరివేదనలను ఈ నవల చిత్రిం చింది. కుల వృత్తిని వదులుకోలేక దానినే నమ్ముకొని ఎటుకాని బతుకు బతికేస్తున్న అనేక వేల కుటుంబాల బతుకులు ఛిద్రం కావడం ఈ నవలలో గమనించవచ్చు.

ఈ వృత్తి ఎంతటి ప్రమాదభరితమో ప్రజలలో ఉన్న సామెతలు కూడా తెలియజేస్తాయి. "గౌండ్లోని పెళ్లాం రోజుకు మూడుసార్లు ముత్తైదువ, మూడు సార్లు ముండ" లాంటి సామెతలు ఈ వృత్తిలో గల ప్రమాదాలను తెలియ జేస్తాయి. తమ వృత్తి నిర్వహణలో భాగంగా గీత కార్మికులు

తమ ప్రాణాలను కూడా కోల్పోవలసివస్తుంది. ఒకే కుటుంబం నుంచి మూడు తరాలవాళ్లు తాటిచెట్టుపై నుండి పడి మృత్యువాతపడటం ఈ నవలలో చూస్తాం.

"బోడయ్య చెట్టుపై నుండి కిందపడి మరణించిన కొంతకాలానికే అతని కొడుకు రామయ్య కూడా మరణించడం ఆ ఊళ్లోనే విషాదం నింపింది. రామయ్య భార్య సీతమ్మకు సీత కష్టాలేవచ్చాయని అనుకున్నారంతా. ప్రభుత్వం ఏ విధమైన ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా గీత కార్మికుల పట్ల నిర్లక్ష వైఖరి ప్రదర్శిస్తున్న రోజులవి. పిల్లల కోసం సీతమ్మ గుండె దిటవు చేసుకొని బతుకు వెళ్ల దీస్తుంది. కొంత కాలానికి సీతమ్మ కూతురు స్వరాజ్యం కూడా విధవరాలవుతుంది. అల్లుడు తాటిచెట్టుపై నుండి పడి మరణించడం వల్ల కుటుంబానికి మగదిక్కు లేకుండా పోయింది." (కల్లు మండువ - కె.వి.ఆర్)

తెలంగాణ నవలా కారులు వృత్తి జీవితాలను ఇతి వృత్తాలుగా చేసుకొని వారి స్థానిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ జీవన అస్తిత్వ సంబంధ విషయాలను నవలా సాహిత్యం ద్వారా చర్చించి తెలంగాణ నవలకు కొత్త కోణాన్ని ఇచ్చారు.తెలంగాణ నవలకున్న అదనపు గుణం కాల్పానికత లేకపోవడం. యదార్ధ జీవన చిత్రణ ఇక్కడి రచనల నేపథ్యం. రచయితలు ఏమిరాసినా ఇక్కడి జీవితాల అస్తిత్వ సంక్షోభాల చిత్రణే ప్రధాన లక్ష్యంగా చేసుకున్నారు. 1960 తరువాత తెలంగాణ ప్రాంతంలో తలెత్తిన పలు సామాజిక, రాజకియ ఉద్యమాలు తెలంగాణ నవలను పరిపుష్టం చేశాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. భాస్కర్ మడత- తెలంగాణ నవల-జన జీవిత చిత్రణ (అముద్రిత సిద్ధాంత గ్రంథం).
2. మల్లయ్య కాలువ - బతుకు పుస్తకం, గువ్వల చెన్నా.
3. శ్రీనివాస్ గౌడ్ నేరెళ్ల - బతుకుతాడు.
4. కె.వి.ఆర్ - కల్లుమండువ.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలుగు వారి జానపద సంస్కృతిలో 'కుండ' పరిశీలన

- యస్. రాకేష్, పాలమూరు విశ్వవిద్యాయలయం, పాలమూరు, తెలంగాణ.

తెలుగు జానపద సంస్కృతిలో బోనాలకు ప్రత్యేకత ఉంది. శక్తి దేవతల పండుగల్లో "బోనాలు" సమర్పించడం జరుగుతుంది. అయితే తెలుగు ప్రాంతంలో బోనాలను రకరకాల పేర్లతో పిలుస్తారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా బోనమని, కరగని, కడవని, బోనం కడవని కూడా బోనమని, ఘటమని, ఘటం కుండ్లనీ, బోనం కుండలని కుంభమని వ్యవహరిస్తారు. అదే విధంగా ఈ మట్టి కుండలని వాటి ఆకారాలను బట్టి, వాటి వాడుకను బట్టి వివిధ రకాలుగా పిలవడం జరుగుతుంది. అవి ఒత్తు, పోయిఒత్తు, మంచి ఒత్తు, పేర్పు, కలికుండ, మాన్యం, అటుక, నీళ్ళకుండ ముంత లొట్టి, గురిగి, ఉట్టి, కలాయి, గల్లబుడ్డి, అన్నంకుండగా వ్యవహరిస్తుంటారు. పేరులాగే వీటి ఆకారం ఒక్కో విధంగా ఉంటుంది.

కుండ మానవుని సృష్టి. ఆ మానవుడు భగవంతుని సృష్టి అని మతవాదులు చెప్తున్నారు. అతను భగవంతుని సృష్టికాదని "పోటిస్టా" అనే జీవకణం నుంచి లక్షల కొద్ది సంవత్సరాలు పరిణామం చెందిన "ప్రాణి" అని పరిణామ వాదం, విజ్ఞాన శాస్త్రం నిరూపిస్తుంది. అతను కూడా ఎకాఎకి నాగరిక జీవితంలోకి అడుగిడలేదని అటవిక అనాగరిక యుగాలు దాటిన తరువాతనే నాగరిక జీవితంలోకి అడుగు పెట్టాడని నరవర్గ శాస్త్రం, సమాజ శాస్త్రం చెప్తుంది. మానవ జీవితం, సమాజం గురించి 40 సంవత్సరాలు నిర్వీరామంగా కృషి చేసిన లూయీ హెన్రీ మోర్గాన్ సమాజాన్ని మూడు ప్రధాన భాగాలుగా విభజించాడు. అవి 1) ఆటవిక యుగం, 2) అనాగరిక యుగం, 3) నాగరిక యుగం. మళ్ళీ వీటిని ఒక్కోదాన్ని మూడు విధాలుగా దిగువ చూపినట్లు విభజన చేశారు.

### 1) అటవిక యుగం :

ఎ) దిగువ దశ - మానవ జాతి శైశవదశ నుంచి తర్వాతి దశ ఆరంభం వరకు.

బి) మధ్యదశ - చేపలను ఆహారంగా ఉపయోగించుకోవడం, నిప్పును కనుక్కోవడం, దాని ఉపయోగం తెలుసుకోవడం వగైరాతో.

సి) ఎగువదశ - విల్లంబులు కనుక్కోవడం, బుట్టలల్లడం నేర్చుకోవడం.

### 2) అనాగరిక యుగం :

ఎ) దిగువ దశ - కుండలు చేయడం దగ్గర నుండి

బి) మధ్య దశ - పశువులను మచ్చిక చేయడం, నీటి సాగు కింద పైరులు పండించడం, పచ్చి ఇటుకలతో ఇండ్లు కట్టుకోవడంతో.

సి) దిగువదశ - కాకిరాయి కరిగించి ఇనుము చేయడం ఇనుప పనిముట్లు వాడకం నుంచి.

### 3) నాగరిక దశ :

ధ్వని సంకేతాలను కనుక్కొని రాతకుపయోగించడం నుంచి నేటి వరకు. మొర్గాను కుండను చేయడాన్ని ఆటవిక యుగంలోని ఎగువ దశకు, అనాగరిక యుగంలో దిగువదశకు సరిహద్దుగా తీసుకున్నాడు. దీనికి కారణం కూడా గ్రామీణ జీవితాన్ని సూచించడం వల్లనే.

దీనిని బట్టి మనకు కుండకు ఉన్న సహచర్యం ఈనాటిది కాదని కొన్ని వందల ఏళ్లదని తెలుస్తుంది. అయితే మాత్రం ఎందుకు పూజార్హమైంది. ఇది తెలుసుకోవడానికి ఇంకా ఆనాటి జీవితాన్ని తరచి చూడాల్సి ఉంది. మానవుని ఆటవిక దశ ప్రధానంగా ఆహార సేకరణ మీద ఆధారపడ్డ దశ. ఆహారం సేకరించుకోవడానికి, సేకరించిన ఆహారాన్ని దాచుకోవడానికి కొన్ని పరికరాలు అవసరం ఉన్న కాలం అది. అదే సమయంలో స్త్రీకి వరంగాను, శాపంగాను భావించబడుతున్న మాతృత్వం, శారీరక అసమానతలు తాత్కాలికంగానైనా కొద్ది కాలం ఒకచోట ఉండవలసిన పరిస్థితిని కల్పించాయి. ఆ సమయంలో ఏదో ఒక పనికి అలవాటు పడిన

చేతులు ఊరకుండలేక అవసరం తీర్చే బుట్టలల్లడం నేర్చుకున్నాయి. అదే మొట్ట మొదటి సారిగా ఆటవిక సమాజపు ఉత్పత్తి శక్తుల్లో వచ్చిన మార్పు. ఈ బుట్ట కేవలం ఆహార సేకరణకే గాక, ఆహార నిల్వ కోసం కూడా ఉపయోగపడింది. దానికే ప్రకృతి నుండి ఎదురయ్యే ఆటుపోట్ల నుంచి తమ ఆహారాన్ని సంరక్షించుకునే ప్రయత్నంలో భాగంగా మెత్తటి మన్ను మెత్తడం ఆరంభించారు. మన్ను మెత్తిన బుట్టలను, మన్ను మెత్తిన కర్ర పాత్రలనే వంట పాత్రలుగా కొంత కాలం వరకు ఉపయోగించారు. కాల క్రమంలో మట్టి మెత్తడం నుంచి మట్టిని జంతికల పిండిలాగ సాగదీసి ఒక చుట్టుపై ఇంకో చుట్టు పెట్టి కుండను చేయడం. ఆ క్రమంలోనే లోపల పాత్ర ఏది లేకుండా మట్టితోనే కుండను చేయడం నేర్చుకున్నారు. ఇలా తయారు చేసిన కుండలను దేవదారు బొందుమీద సన్నటి సెగతో కాల్చేవారు. కొన్ని కుండలను కాల్చే అవసరం లేకుండా, ఒండ్రుమట్టి ఇసుక కలిపి గాని, మంచినీటి ఆలిచిప్పలగుండను కలిపిగాని చేసే వారు. ఈ విధంగా కుండను తయారు చేసుకోవడం నేర్చుకోవడంతోనే మానవ జీవితం పురోగతిలో ఓ వినూత్న దశకు ఆరంభం జరిగింది. జీవన పద్ధతులు మెరుగయ్యాయి. ఆహారం ఉడక బెట్టుకోవడానికి నీరు తెచ్చుకోవడానికి మంచి పాత్ర దొరికింది. అలాగే ప్రకృతి వైపరీత్యాల నుండి సేకరించిన ధాన్యాన్ని సంరక్షించుకోవడానికి ఓ మేలైన సాధనం అందుబాటులోకి వచ్చింది.

బుట్టలు అల్లడం నేర్చుకోవడానికి స్త్రీకి ఏ పరిస్థితులు కారణమయ్యాయో అవే పరిస్థితులు వ్యవసాయం కనుక్కోవడానికి కూడా కారణం అయ్యాయి. వ్యవసాయం వల్ల పునరుత్పత్తి చర్య గురించి మానవుడికి తెలిసింది. భూమి నుండి విత్తనం మొలకెత్తడం, అది అభివృద్ధి చెందడం, ఆ అభివృద్ధికి భూమి కారణం కావడం మనిషికి వింతగా అనిపించింది. ఇదే సమయంలో తాను అష్టకష్టాలుపడి సేకరించి భద్రంగా దాచుకున్న ధాన్యం ప్రకృతి వైపరిత్యాల వల్లనో, యాదృచ్ఛిక సంఘటనవల్లనో లేక ఏ ఇతర కారణాల వల్లనో తడిసి మొలకెత్తడం సంభవించింది. ఈ చర్య పునరుత్పత్తి చర్యతో అయోమయంలో పడిన మానవునికి అతని ఎంతైన ఊహకు ఊతమైంది. దానితో విత్తనం మొలకెత్తడానికి నీటి అవసరాన్ని అది ఎదగడానికి భూమి అవసరాన్ని గుర్తించడం జరిగింది. తన మస్తిష్కానికి పదునుపెట్టి విలువైన ఆలోచన చేశాడు. నిత్య జీవితంలోని సంఘటనలకు, స్త్రీ పురుషుల సంగమాన్ని భూమిని దున్నడానికి, నీరు పోయడానికి అన్వయించుకొన్నాడు. దినదిన ప్రవర్తమానమయ్యే గర్భం ఆకారం కుండ ఆకారంలా ఉంది. అంతేకాక విత్తనాన్ని భద్రపరిచే సాధనంగాను (కుండ), సఫలతకు కారణమైన కుండలో, భూమికూడా తోచింది. వారికి ఇప్పటికీ భూమిని స్త్రీలాగా, పురుషున్ని నాగలిలాగా, సంతానాన్ని ధాన్యంతో పోల్చడం ఉంది.

అది తరచు వ్యంగ్యపు విసుర్లల్లో - నల్ల రేగడిని దున్ని చేస్తే తెల్లజొన్న పంట పండుతుందని వినవస్తుంటుంది. సాహిత్యాలలో సరేసరి. స్త్రీని క్షేత్రంతో పోల్చడం ఉండనే ఉంది.

పై విషయాలను బట్టి కొన్ని అంశాలను మనం చెప్పుకోవచ్చు. 1) స్త్రీ యే కుండను కనుక్కోవడానికి, వ్యవసాయం కనుక్కోవడానికి కారణభూతురాలైంది. 2) భూమి సఫలతకు కారణమని గ్రహించిన తర్వాతనే స్త్రీని మానవ జీవి సృష్టికర్తగా గుర్తించడం జరిగింది.

ఇవన్ని జరిగేకాలం నాటికి ఆనాడున్న వ్యవస్థ మాతృ పరంపర వ్యవస్థ. స్త్రీ పురుషులకు కట్టుబాట్లు అనేవి లేక పోవడం వల్ల స్త్రీ పురుషుల కలయిక వల్ల కలిగిన ఫలితం, సంతనాన్ని స్త్రీయే సంరక్షించుకునేది. తండ్రి ఎవరో తెలిసేది కాదు. ఆ కారణంగా తల్లిపైన స్త్రీపైన భయ భక్తులు, ప్రేమాభిమానాలు ఉండటం సహజం. అలాంటి స్థితిలో 'సఫలత' గురించి తెలుసుకోవడం జరిగింది. దీనితో అంతకు మునుపే ఆమెపై ఉన్న భయభక్తి గౌరవాలు కాస్తా ఇబ్బడి ముబ్బడి అయ్యాయి. తన సంతోషాన్ని వ్యక్తం చేయడానికి, తన ఆలోచనలను వ్యక్తపరచడానికి ఆనాడు తనకున్న పరిమిత పనిముట్లనే ఉపయోగించుకున్నాడు. మనకొక విషయాన్ని సాంకేతిక లిపి ద్వారా తెలియజేశాడు.

1) స్త్రీ గర్భం అతనికొక వింత, ఆశ్చర్య జనకం, ఇందుకు ఉదాహరణ అతను జీవం పోసిన మట్టి ప్రతిమలు (ఎ) ఆస్ట్రియా, మినపటోనియా, నాగార్జున కొండలో నగ్నంగా ఉబ్బెత్తుగానున్న కడుపుతో నున్న ప్రతిమ స్త్రీ ఆగార్ల (అక్కగార్ల విగ్రహాలు) ఆర్ట్స్ కాలేజి షోక్ మ్యూజియంలో ఉన్నాయి.
వీటన్నింటిలోను కన్నుముక్కు చిన్న చిన్న స్తనాలు లేక జారిన స్తనాలు ఉండటం, ఆ రువాతి భాగాన్ని ఉబ్బెత్తుగా, బోలుగా కాగుగా కడుపును సూచించడం.
2) స్త్రీని కుండగా భావించడానికి ఆధారం స్త్రీ దేవతల విగ్రహాలుగా కుండను ప్రతిష్టించడం, వాటికి మానవ రూపు తీర్చిదిద్దడం - కంఠానికి అలంకారణ (నగ) చేయడం, శవ పేటికల్లో కుండలు పెట్టడం: హిరణ్యగర్భ సంస్కారం చేయడం, ముత్తైదువ పడవను పెట్టుకోవడం ఉదహరణగా చెప్పుకోవచ్చు.
3) స్త్రీకి భూమి గుణారోహణ చేసారనడానికి ఆధారం, సింధునది లోయ తవ్వకాల్లో బయల్పడ్డ ప్రతిమలు - తలకిందులుగా స్త్రీని చిత్రించి ఆమెకాళ్ళ మధ్య నుండి చిగుళ్ళు, మొక్కలు మొలకెత్తిచడం లాగా చూపడం.
4) స్త్రీకి, భూమి గుణారోహణ చేసిన విధంగానే స్త్రీకి కుండారోహణ చేశారు. (ఎ) శిశువు క్రమ పరిణామం చెందే కొద్ది రోజు రోజు పెరిగే ఉదరం. చేతితో అదుముతున్న కొద్ది సాగే కుండ పరిమాణం ఒకేలా ఉండటం. (బి) కుండలోని విత్తనం నీటితో తడిసి సఫలత చెందడాన్ని స్త్రీ గర్భం పురుష వ్యర్యంతో సఫలత చెందడంతో అన్వయించుకొన్నాడు. ఈ సఫలతకు చిహ్నంగానే వివాహ సమయంలో గడి కొడుకలు పెట్టడం, వాటిని నీటితో నింపడం, వాటి కింద వడ్లు పోయడం, నవధాన్యాలు పోయడం, గరగలు ఘటం, బోనం పూర్ణకుంభం, కలశం మొదలగునవి వాటిలో రెమ్మలు పెట్టడం పూర్ణ కుంభాన్ని 'స్త్రీ గర్భ పతికని' పాశ్చాత్య శాస్త్రజ్ఞులు అన్నారు.

ఇదే విషయాన్ని జానపద సాహిత్యంలోని పెద్దమ్మకథ, కాట్రేనికథ నిరూపిస్తుంది. పెద్దమ్మ కాట్రేడు బ్రాహ్మణుని కూతురు వారి ఇంటిలో పని చేస్తూ ఒక వ్యక్తి ఊరుపేరు లేనివాడు శ్రుతపాడిత్యాన్ని గడిస్తాడు. అతని పాండిత్యాన్ని మెచ్చిన బ్రాహ్మణుని కూతురు అతన్ని స్వయం వరంలో వరిస్తుంది. కులగోత్రాలు ప్రశ్నించకుండా వివాహమాడుతుంది. ఇద్దరు పిల్లలు కూడా కలుగుతారు. అలాంటి సమయంలో ఆమె అత్తగారిని భర్త తీసుకొని వస్తాడు.

ప్రేమతో కోడలు భక్ష్యాలు చేసి పెడుతుంది. వాటిని చూసి కొడుకు చెప్పిన విషయాలన్ని మరిచి, గొడ్డు నాలికల్లా ఉన్నాయని వాటికి వంకపెడుతుంది. అత్తగారి ఆహార అలవాట్ల వల్ల వారు బ్రాహ్మణ వర్ణానికి చెందిన వారు కారు హరిజనులని గ్రహిస్తుంది. వెంటనే తండ్రి వద్దకు వెళ్ళి నర్మ గర్భంగా కుక్కముట్టిన కుండను ఏం చేయాలి అని ప్రశ్నిస్తుంది. తండ్రి ఏది తెలుసుకోకుండా ప్రశ్నించకుండా కాల్లితే పవిత్రమౌతుంది అని సమాధానం చెప్తాడు. ఆమె వెంటనే తనను, తన పిల్లలను అగ్నికి ఆహుతి చేస్తుంది. ఇక్కడ పెద్దమ్మ తన శిలాన్ని, గర్భాన్ని కుండతో పోల్చుకోవడం గమనార్హం.

## అలాగే మరొక ఉదాహరణ :

బాలిక వ్యక్తురాలైతే జాజుగురిగి పగిలిందంటారు. ఈ విధంగా స్త్రీని కుండతో పోల్చడం గురించి పాశ్చాత్య జీవాశాస్త్రజ్ఞుడు ప్రకృతి స్వభావాన్ని గురించి విస్తృత పరిశోధన జరిపిన వాడైన జి. ఇలియట్ చెప్పిన అభిప్రాయం ఎన్నదగింది. ఇతను "భూమిలో విత్తనాలు ఫలవంతం కావడానికి నీరు అవసరమనే సిద్ధాంతాన్ని సమస్త జీవులకు అన్వయించి చెప్పాడు. పై సిద్ధాంతాన్ని ఆధారంగా తీసుకొని పశువుల వీర్యం వల్ల పశుగణాభివృద్ధి జరుగుతుందని, పురుషుల వీర్యం వల్ల స్త్రీ గర్భం ఫలవంతం అవుతుందని స్త్రీకి సామ్యం చెప్పాడు ఓసిరిన్‌కు నీటితత్త్వం, ఐసిన్‌కు భూమి తత్త్వాన్ని వర్తింపజేశాడు. అందుకే హిందువులకు భూమి భూదేవి, పృధ్వి మాత అయిందంటారు. ఈ విషయం భూమికి స్త్రీకి సామ్య చెప్పడం : నీటికి, వీర్యానికి కుండకు గర్భానికి సామ్యం

చెప్పడం ఎంతవరకు సమంజసం? ఇది పాశ్చాత్యులు చేసిన తప్పుడు సిద్ధాంత, దాన్ని మనపై రుద్దటం న్యాయం కాదు అని ఎవరైనా అంటే అందుకు తగిన సాక్ష్యాధారాలు, తర్కాణాలు మన సాహిత్యంలో కోక్కొల్లలుగా లభిస్తాయి. వాటి ఆధారంగానే నిజనిజాలు తేల్చుకోవచ్చు.

అగ్ని వరుణుడు ఎటో వెళ్ళివస్తుండగా మార్గ మధ్యంలో వీరు ఊర్వశిని చూస్తారు. ఆమెను చూడగానే వీరికి వీర్యస్కలనం అవుతుంది. దీనిని ఆమె 'కుంభం'లో భద్రపరుస్తుంది. అందులో నుంచి వశిష్టుడు అగస్త్యుడు జన్మిస్తారు.

ఈ విధంగా ఉన్న కుండను దాని యొక్క ఉప యోగాన్ని మరియు ఆకారాన్ని వివిధ రకాలుగా పిలవడం జరుగుతుంది. కొన్ని గ్రామాలలో మంచి నీరు తాగడానికి ఉపయోగించే కుండను "ఒత్తు" అని అంటారు. అదే విధంగా నీళ్ళు వేడి చేయడానికి ఉపయోగించే కుండను "పేర్పు" అని అంటారు. ఈ పేర్పు విశాలంగా ఉంటుంది. ఒడ్లు మరియు బియ్యం నిలువ చేసుకోవడానికి మాన్యం అనే పొడవాటి కుండను ఉపయోగిస్తారు. అదే విధంగా అన్నం వండేటప్పుడు నీటిని తీసి ఒక కుండలో పోస్తారు. తరువాతి రోజు వాటిని ఉపయోగిస్తారు. దీని కోసం ఉపయోగించే కుండను "కలికుండ" అంటారు. చెట్ల నుండి కల్లు తీయడానికి "లొట్టి" అనే కుండను ఉప యోగిస్తారు. కల్లు తాగడానికి మరియు నీళ్ల తాగడానికి "ముంతను" ఉపయోగించడం జరుగుతుంది. ఈ ముంతలు చిన్నవిగా ఉంటాయి. ముంతకన్న చిన్నపాటి కుండలను "గురిగి" అని పిలవడం జరుగుతుంది. దీనిలో చట్నీలు నిలువ చేస్తారు. అదే విధంగా ఆహారం పొడవ కుండా ఉట్టిలలో నిలువ చేస్తారు. డబ్బులు దాచుకోవడా నికి గల్లబుడ్డి అనే కుండను ఉపయోగిస్తారు. ఈ విధంగా కుండను ఉపయోగించే విధానాన్ని ఆకారాన్ని వివిధ రకాల పేర్లతో పిలవడం జరుగుతుంది.

ఈ వ్యాసంలో చెప్పుకున్న ఆచారాలు, శిష్ట సాహిత్యం జానపద సాహిత్యంలోని రుజువులు ఆటవిక సమాజం లోని పరిణామం ఆదిమానవుని సాంకేతిక లిపిని వీటన్నిం టిని అన్వయించుకుంటే మన ఆలోచన కుండ = కుంభం: నీరు = వీర్యం : మొక్కలు = సంతానం, సఫలతకు చిహ్నమని ఋజువైంది. అంతేగాక నాగరికత ఎంత ఎత్తు ఎదిగిన, మానవుడు అద్భుతమైన విజ్ఞానాన్ని ఎంతవేగంగా సమకూర్చుకున్నా అది ప్రాచీన నాగరికత లను దిగతొక్కి కనబడకుండా చేసేటంత అధికం మాత్రం కాదు. అది ప్రాచీన నాగరికతలను దిగదొక్కి కనబడ కుండా చేసేటంత అధికం మాత్రం కాదు అది ప్రాచీన నాగరికతలోని మంచినంతయూ స్వాయత్తం చేసుకొనే విధంగా ముందడగు వేస్తుందని తెలుస్తుంది.

కుండ ఆటవిక యుగంలోని ఎగువదిశకు, అనాగరి కపు యుగపు దిగువ దశకు సరిహద్దుగా ఉంది. ఉంటూ ప్రాచీనమైన గ్రామీణ సమాజాన్ని సూచించే ఆధారంగా మిగిలి, ఆహార సేకరణ కోసం నిలవకోసం ఉపయోగించ బడింది. అటు తరువాత నీటి పాత్రగా, వచన పాత్రగా, శక్తులు కలిగిన అక్షయ పాత్రగా సఫలత చిహ్నంగా స్త్రీ గుణారోహణ చేసుకొని స్త్రీకి ప్రతిరూపంగా శక్తి దేవతగా క్రమాభివృద్ధి చెంది నేటివరకు సుస్థిరంగా నిలిచి ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1) జానపద గేయ వాఙ్మయం - ఆచార్య బిరుదురాజు రామారాజు.
2) జానపద గేయ గాథలు - ఆచార్య నాయిని కృష్ణకుమారి.
3) జానపద సాహిత్యంలో శక్తి ఆరాధన - ఆచార్య మాదిరెడ్డి అండమ్మ.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పల్లె జీవన విధానంకు ప్రతీక – "పెద్దింటి అశోక్‌కుమార్ కథలు"

– రంగు శ్రీకాంత్ గౌడ్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, తెలంగాణ.

## పరిచయం :

మానవ జీవితంలో ఉన్న సంక్లిష్టతను, వాస్తవికతను వస్తు, శిల్ప పరంగా వ్యక్తికరించడాన్ని కథ అంటారు. ఇలాంటి అనేక కథలు రచయితలు మనకందించారు. తెలంగాణలోని పల్లె జీవితాన్ని సాంస్కృతిక పునర్వికాస వెలుగులో కథా సాహిత్యంలో రికార్డు చేసిన వారిలో అగ్రగణ్యులు పెద్దింటి అశోక్‌కుమార్.

సిరిసిల్ల వాస్తవ్యుడైన అశోక్‌కుమార్ తన ఊరి పరిస్థితులను దగ్గర నుండి పరిశీలించి, తన రచనల్లో ప్రతిబింబింపజేశాడు. తన ఊరి యొక్క సంస్కృతి అస్తిత్వం కోల్పోతున్న ఆ రోజుల్లో అశోక్‌కుమార్ తన రచనల ద్వారా తన ఊరిని, సమాజాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేశాడు. ఆయన రచనలన్ని తన ఊరు కేంద్రంగా నడిచినవే. తన ఊరు సంస్కృతిని మానవ సంబంధాలను, స్నేహ భావాన్ని జీవన విధానాన్ని సాదక బాధకాలను తన రచనలలో చూపించిన కథకుడు అశోక్ కుమార్.

దీర్ఘశ్రుతితో, తీవ్ర ధ్వనితో విజృంభించిన తెలంగాణ ఉద్యమం ఆయనను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆయన చాలా మాట్లాడదలచుకున్నాడు. కరీంనగర్ జిల్లాలో మారుమూల పల్లెలలో ఉద్యోగం చేస్తూ, కథల ద్వారా బయటి ప్రపంచంతో సంభాషించే అశోక్, కళ్లెదుట సాగుతున్న సామాజిక రాజకీయ సంచలనాన్ని వ్యాఖ్యానించదలచుకున్నాడు.

## అశోక్‌కుమార్ కథలలో పల్లె జీవన విధానం :

"మాఊరి బాగోతం కథలో" మనిషి మనిషికి బతుకు ఉంటుంది. ఆ బతుకులలో కథలు, దుక్కాలు, సంబరాలు, మంచి చెడులు అన్ని ఉంటాయి. అసలు అశోక్ కుమార్ గొప్పతనమంత ఆయన వాడిన పల్లె భాషలో ఉంది. ఆయన రాసిన మాటలు అచ్చమైన తెలంగాణ మాండలిక మాటలు. ఈ మాటలతోనే మా ఊరి భాగోతం కథకి నిండుదనం వచ్చింది. పల్లెలలో వేసుకునే సామెతలు, శాత్రాలు, ఇసొంటియన్ని ప్రాణం పోసుకొని మన కళ్ల ముందర నిలబడ్డట్లు కనబడతాయి. చదువుకున్న భాష మర్చిపోయి మల్ల తల్లితోని మాట్లాడినట్టు ఉంటది. అశోక్‌కుమార్ కథలలో .. రచయిత తన ఊరిలోని మానవ సంబంధాలు, ప్రకృతిని జంతువుల జీవన విధానంను కథల రూపంలో తెలియజేయడం మనకు కొత్తగా కనిపిస్తుంది.

"ఊటబాయి కథలో" తెలంగాణ గ్రామాల్లో ఎవరి వృత్తి వారిది. ఎవరి బతుకు వారిది, "తెనుగు"లు పండ్ల తోటలను గుత్తకుపట్టి పండ్లను అమ్ముకొని జీవనం వెళ్లదీస్తారు. ముత్తయ్య ఈ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. లాభం వస్తే వస్తుంది. లేకుంటే నష్ట మొస్తుంది. ఈ వృత్తిలో అతనికి ఏనాడూ లాభం వచ్చింది లేదు. ముత్తయ్యకు రెండేండ్ల కిందనే భార్య మరణించింది. ఒక్కగానొక్క బిడ్డ దేవేంద్రకు పెళ్ళి చేస్తే అల్లుడు క్రేన్‌పై నుండి పడి మరణించాడు. బిడ్డ బీడీలు చుడుతుంది. ఎట్లనొగట్ల పొట్టకెల్లుతుంది. ఈ యేడు "బత్తాయి" తోట గుత్తకు పడితే, దానిలో కూడా లాభం రాలేదు. బిడ్డతో చెప్పుకుంటూ బాధ పడుతుంటే, బిడ్డ అంటుంది. నువ్వు ఉత్తగుండు నేను బీడిలు చేసి సాత్తా అయ్యా అంటుంది.

బిడ్డా రంది పడకు ... మన బతుకు ఊటబాయి వంటిది బిడ్డ. నీళ్ళను తోడి పోస్తుంటేనే నీళ్ళు ఊరుతై. సల్లె చెలిమి సల్లితే, ఊరే చెలిమి ఊరుతది అని అంటాడు ముత్తయ్య. ఇలా ప్రతిసారి ముత్తయ్య ఖాళీగా ఉండకుండ, ఏదో ఒక పని చేసుకుంటూ ఉండేవాడు. మనిషి బతుకే ఒక ఊటబాయి అని ఈ కథ ద్వారా రచయిత బతకలేమనే వారికి ఆత్మస్థైర్యాన్ని నూరి పోస్తున్నాడు.

"పోరుగడ్డ కథ సంపుటిలో మలిదశ తెలంగాణలోని గ్రామ గ్రామాన ఉవ్వెత్తున ఎగిసి మరోసారి ప్రజా ఉద్యమం అయింది. ఆంధ్ర రాజకీయ నాయకుల కుట్రలు, బ్లాక్ మెయిలింగ్‌తో ఇచ్చిన మాటను వెనక్కి తీసుకొని డిసెంబర్ 23న ఏకాభిప్రాయమని ప్రకటన చేసింది. ఆ రోజు నుండి తెలంగాణ పల్లె పల్లె అగ్నిగుండమై రాజు కుంది. పల్లె, పట్టణ ప్రాంత విద్యార్థులు, యువకులు ఆత్మబలిదానం చేసుకున్నారు. కథా రచయితగా రంగం మీద జిగేలు అన్నప్పుడు అశోక్‌కుమార్ వలస కథలను, పల్లె జీవితాలను రాస్తున్నారు. తెలంగాణ వాదం బల పడిన తరువాత, ఆ వాదాన్ని కాల్పనిక కథనంలో జోడించడంలో ఉన్న పరిమితులను అర్థం చేసుకున్న ఆయన భిన్నమైన కథనాన్ని ఆశ్రయించారు. "యుద్ధా నాదం" కథలో ప్రాంతీయ అస్తిత్వాన్ని చిత్రించడానికి కథలో ఉన్న పరిమితి, ఆ అస్తిత్వం పోరాట రూపం తీసుకుని, తీవ్ర ఘర్షణగా మారిన తరువాత పోతుందన డానికి ఈ కథ ఉదాహరణ. ఇందులో నేరుగా పోరాట వాతావరణం అమరవీరుల ప్రస్థావన, ఉద్యమంలో భాగస్వాములైన వారి ఉద్వేగాలూ అన్నీ ఉంటాయి.

"భూమడు కథలో" పల్లెలలో మానవత్వం ఉట్టిపడేలా చిత్రించినాడు. ఈ కథలో అమాయకుడు భూమడు అతని తల్లి పిచ్చిది. భూమన్ని చేరదీసి రాములు భార్య ఎంకటి తమ హోటల్లో పనికి పెట్టుకున్నారు. అతన్ని ఇంట్లో మనిషిగానే ప్రేమతో చూసేవారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కొరకు అధికారులు పకడ్బందీగా అమలుకై సర్పంచ్‌లను ఆదేశించారు. భూమన్ని తీసుకపోయి స్కూల్లో వేస్తారు. వాడు తప్పించుకొని రెండు రోజులకే గ్రామం చేరుకుంటాడు. ఇక భూమనికి ఇల్లు లేదు వాకిలి లేదు. బీడిలు తాగడం అలవాటు చేసుకున్నాడు. గ్రామంలో ఎవరు బీడి ఇచ్చి ఏ పని చేయమన్నా చేస్తుం టాడు.

రాములు భార్య ఎంకటితో అబద్దమాడి భూమని గూర్చి ఊరంతా తిరిగినా ప్రయోజనం లేకపోయింది. చివరికి అలసిపోయి రాములు హోటల్‌కు వచ్చిండు. భార్య ఎంకటి కోపగించుకుంది. మన వాగులో ఎవరో సచ్చిపోయింద్రు పోలీసులు వచ్చింద్రని ఛాయ తీసుక రమన్నారని రాములుతోని చెప్పుతుంది. ఛాయ తీసుక పొమ్మంటుంది. భూమనికేం కాలేదు. కదా ! అనుకున్నాడు. రాములు మనస్సులో ఛాయ తీసుకొని సైకిల్‌కి కట్టి ఎక్కిండు. అక్కడ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. భూమడు శవాన్ని తీస్తున్నప్పుడు, పోలీసులు బీడి ఇస్తం తియ్యరా అంటున్నారు. శవాన్ని తీసి ఏర్పాటు చేసి .... అవ్వా అన్నడు గాని ఏడువలేదు. పోలీసులు శవంతో పాటు వెళ్ళిపోయినారు.

భూమన్ని తీసుకొని ఇంటికి వచ్చిండు. "ఇక్కడ బాల కార్మికులు లేరనే" అట్టను తీసి కాల్చేసిండు. ఇక ఎవడైనా రానియ్యి ... ఆరు నెలలు వాన్ని ఎవరు పట్టించుకున్నారు అని రచయిత పల్లెలలోని బాల కార్మికులు పడుతున్నా బాధలను చిత్రించారు.

"మాయి ముంత" కథలో మనిషికి జన్మ సంబందాన్ని మూయిముంతకు మనిషికి ఉన్న పేగు సంబంధాన్ని తెలియజేసేదే మాయిముంత. మనిషైనా జంతువైనా "నీళ్లాట (నీల్లాడడం) ఒకటే తల్లికి నీళ్లాట చావు పుట్టుకల సమస్య. ఈ పురిటి నొప్పులలోని కష్టాన్ని తల్లి బిడ్డను చూడగానే మర్చిపోతుంది. జంతువులైనా అంతే, తల్లికి బిడ్డ జన్మించగానే "మాయి" పడుతుంది. ఈ మాయిని ఒక ముంతలో చేర్చి ఇతర జంతువులు ముట్టకుండా ఎవరి కంట పడకుండా ఎక్కడైనా పాతిపెడుతారు.

సాయన్న సాయమ్మ దంపతులకు ముగ్గురు బిడ్డలు వారు యమ శరపడి ముగ్గురు బిడ్డలకు పెండ్లి చేశారు. చిన్న బిడ్డ అయిన దేవను ఊరి సంబంధానికే ఇచ్చారు. ఆ పతికి సాపతికి అక్కరకు వస్తారనుకున్న బిడ్డలు అక్కరకు రాకపోగా తల్లిదండ్రుల మీద ఈర్షలు పెంచు కుంటారు. ముగ్గురు బిడ్డలకు సాయమ్మ బర్రెల నిచ్చింది. చిన్న బిడ్డ దేవకు ఇచ్చిన గొంగికొమ్ముల బర్రె సూటిది కాలేదు. కాబట్టి దేవ గొడ్డు బర్రెను ఇచ్చినదని తిట్టి పోసింది. ఊళ్లె సంబంధం చేసుకుంటిమి ఇంకా ఆస్తి వస్తదని దేవ అత్తగారి ఆశ. వారి సాధింపులు కూడా కలిసినాయి. ఇవన్నీ సాయమ్మ భరిస్తూ వస్తుంది.

చివరికి దేవకిచ్చిన బర్రె సూటిదైంది. పొద్దులకచ్చింది ఆ రోజు దేవ అత్తింటి వాళ్లందరు పుట్టువెంట్రుకలు తీయ పోయింర్డు, తల్లి మాటెత్తలేదు సాయమ్మ బాధపడ్డా బిడ్డ సల్లగుండాలని అనుకున్నది. సూటి పొద్దులతో ఉన్న బర్రెను ఇంటికి తోలుకచ్చి దానికి పురుడు చేసింది. దూడ పుట్టింది కాని? మాయ పడలేదు. ఇది సచ్చిపోతే! నా బిడ్డ మంచిది కాదు. బర్రెకు ఎన్నో సేవలు చేసింది. తండ్లా డింది, యాతన పడ్డది, చివరికి మాయపడ్డది. తెల్లారింది అల్లుడు శంకరయ్య బర్రె కొరకు తిరుగుతూ అనుప చేను కాడికి వచ్చిండు. అల్లుడు నవ్వుకుంటూ బర్రెను తోలుక పోతుంటే సాయమ్మ అల్లుడితో దేవ బాగుందా? మందులు వాడుతుందా? అని అడిగింది అల్లుడిలోని సంతోషాన్ని చూపింది సాయమ్మ ... తనకు బిడ్డ పుట్టి నాడు. ఆడ పిల్ల అయిందని అలిగిండు ఇయ్యాల ఆడ దుడ్డె పుట్టిందని మురుత్తుండు అనుకుంది. ఇలా పల్లెలలోని జంతు జీవన సంబంధాలను రచయిత చిత్రణ చేశాడు.

**ముగింపు :**

మారుతున్న కాలంతో పాటు ఎదుగలేక, వ్యవసాయా నికి అనుకూలంగా నీటి వసతి లేక ఎడారిగా మారిన అనేక ప్రాంతాలు, గ్రామాలు, ఇక్కడ బతుకలేక వలస పోతున్న వలస పక్షులైన వారి జీవిత గాథలను, కుటుంబా లను పోషించలేక అప్పులపాలైన వారి స్థితిగతులను, చివరికి బతకడానికి అర్హులం కాదంటూ ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు, చేనేత కార్మికులు, వివిధ వర్గాల ప్రజలు అటువంటి బడుగు జీవుల వెతలను పెద్దింటి అశోక్‌కుమార్ చిత్రించిన తీరు ఎంతగానో వాస్తవికతను దగ్గరగా ఉంది. తెలంగాణ పల్లెల్లో నెలకొన్ని అనేకానేక పరిస్థితులను పెద్దింటి సృజించినారు.

పల్లెలలో నెలకొన్న అనేక సమస్యలను ఆయన చిత్రిం చిన తీరు వాస్తవంగా ఉంది. ఈ కథనంలో ఆయన తన చుట్టూ తిరగాడే సమస్యలు, తను తిరిగిన గ్రామాల్లోని విషయాలను, ఏర్చికూర్చారు.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. పోరుగడ్డ కథా సంపుటి - పెద్దింటి అశోక్‌కుమార్.
2. మా ఊరి బాగోతం ఒక పరిశీలన (సిద్ధాంత గ్రంథం).
3. తెలంగాణ తెలుగు కథ - సంపాదకులు డా॥ పంతంగి వెంకటేశ్వర్లు.
4. పరీక్షణం (వ్యాస సంకలనం), సంపాదకులు - మద్దిరాల సత్యనారాయణరెడ్డి.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అలపర్తి రామకృష్ణ నవలలు - సామాజిక స్పృహ

- సి .విజయలక్ష్మి, పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయనశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమాజం పరిణామశీలి. ఆ పరిణామాలకు మూల హేతువులు ప్రజలు. ప్రజల ఆలోచనలు అభిరుచులు నిరంతరం మారుతుంటాయి. వాటికనుగుణంగా సమాజంలో మార్పులొస్తుంటాయి. అవి వ్యక్తిగతమైనవి కావచ్చు లేదా సామాజికమైనవీ కావచ్చు. అయితే ఈ మార్పులు ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. ఒక మార్పు వచ్చినపుడు ముందటి సామాజిక స్థితిగతుల్లో మార్పు లొస్తుంటాయి. ఈ మార్పుల్లో కొన్ని సమాజహితాన్ని కలిగించేవీ ఉంటాయి, హానిచేసేవి ఉంటాయి. హాని చేసేటివి ప్రజాజీవితంనుంచి తొలగిపోతాయి. ఉదాహరణకు సతీ సహగమనాన్నే తీసికోవచ్చు. అది స్త్రీ సమాజానికి గొడ్డలి పెట్టు వంటిది. అందువల్ల అది చాలా కాలం రాజ్యమేలినా ఆ తరువాత నామరూపాలు లేకుండా పోయింది. ఇలాంటి దురాచారాలు ఎన్నో కాలగర్భంలో కలసి పోయాయి.

సమాజంలో వచ్చే మార్పులను వాటి మంచి చెడ్డలనూ వివేచించేవారూ, చిత్రించేవారూ కవులు, రచయితలు. సమకాలీన సామాజిక స్థితిగతులను వారు తమ రచనల్లో ప్రతిబింబిస్తారు. కొందరు రచయితలు వాటి మంచి చెడ్డలను తాత్వికంగా చెబుతారు. అయితే కొందరు వాటిని మార్చాలని ప్రబోధిస్తూ, చైతన్య పరుస్తూ రచనలు చేస్తారు. ఉన్న విషయాన్ని ఉన్నట్లుగా కళ్ళకు కట్టినట్లు వర్ణించిన వారికి నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథాది కవులను పేర్కొనవచ్చు. అలా గాకుండా సమాజాన్ని మార్చాలని రచనలు చేసిన కోవకు చెందిన కవులుగా కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ, చలం వంటి వారిని పేర్కొనవచ్చు. అయితే ఇరువర్గాలకు చెందిన వారినీ గొప్ప రచయితలుగానే పేర్కొనక తప్పదు.

ఆధునిక కాలంలో వందలాది మంది కవులు, రచయితలు సమాజాన్ని సంస్కరించాలనే దృక్పథంతోనే రచనలు చేస్తున్నారు. అందుకు వారు కథ, నవల, నాటిక వంటి ప్రక్రియలను ఎన్నుకుంటున్నారు. ఈ క్రమంలోనే కాలానుగుణంగా పాఠకుల్లో వచ్చిన మార్పు మూలంగా రచయితలు సరళ శైలిలో రచనలు చేస్తూ ఎక్కువ మందిని ఆకట్టుకుంటున్నారు. అందుకు వారు నవల ప్రక్రియను ఎన్నుకుంటున్నారు. అలాంటి నవలా రచయితల్లో చెప్పదగినవారు అలపర్తి రామకృష్ణ. వారి కలం నుంచి దాదాపు ఇరవైకి పైగా నవలలు వెలువడ్డాయి. ప్రతి నవలలోనూ సమకాలీన సమాజ పోకడలను ఈయన చక్కగా చిత్రించారు. ఈయన కలం నుంచి అయిన వాళ్ళు, మంచి గంధం, వెన్నెలదారి, వెలుగు లోగిలి, అనబంధాలు, మజిలీ, మాయ, పేగు బంధం, అమ్మకడుపు చల్లగా, అనురక్తి, కొంగుముడి, జీవనలిపి, పాలకొండలు, గుండెగుప్పెడంత, వలపు వరద, మలుపు తిరిగింది, వాలిపోయేపొద్దు, సంచారి, యాత్ర, జీవన లాలస వంటి నవలలు వెలువడ్డాయి. ప్రతి నవల పరిమాణంలో చిన్నదైనా వస్తురీత్యా ఘనమైనదని చెప్పవచ్చు. ఈయన సమాజ శ్రేయస్సు కోరుతూ సరళశైలిలో నవలలను రాశారు.

అలపర్తి రామకృష్ణ నవల్లో డ్రగ్స్, కిడ్నాప్, ప్రైవేటు పాఠశాలల ధనదాహం, ప్రైవేటు పాఠశాలలపట్ల తల్లి దండ్రుల వ్యామోహం, ఆంగ్లభాషా వ్యామోహం, ప్రేమలు, పబ్ కల్చర్, పరస్త్రీ వ్యామోహం, ఉద్యోగులు పనిచేసే చోట ప్రేమించుకోవడం, తల్లిదండ్రులు పెళ్లి సంబంధాల కోసం వెంపర్లాడటం, అక్రమ సంబంధాలు, ఒంటరిజీవితం, పెద్దలపట్ల నిరాదరణ వంటి సామాజికాంశాలు చిత్రించబడ్డాయి. ఇవన్నీ మనం నిత్యం ఎలక్ట్రానిక్ ప్రింట్ మాధ్యమాల్లోనో, మన ఊర్లోనో, ఇంటిలోనో చూస్తున్నవే. ఇవన్నీ సామాజిక అరాచకాలు. దండనలు, నైతికవిలువలు లేకపోవడం వంటివాటి మూలంగానే పైన పేర్కొన్న సంఘటనలు జరుగుతున్నాయని చెప్పవచ్చు.

**డ్రగ్స్ :**

సమకాలీన సమాజాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి డ్రగ్స్. ఆర్థికంగా బాగా స్థిరపడినవారు వీటిని తీసికుంటు న్నారు. హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్మేముఠాలు తరచుగా దొరుకుతున్నాయి. వీరు ఉన్నత వర్గాలను, వారి పిల్లలను లక్ష్యంగా చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో సినిమా కళాకారులు చాలామంది డ్రగ్స్ తీసి కుంటున్నట్లు హైదరాబాదులో బయటపడింది. వారిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో పోలీసుల దర్యాప్తులో నమ్మలేని నిజాలు చాలా బయట పడ్డాయి. ఎంతో ఉత్తములు అని అనుకున్న కళాకారు లంతా ఈ రాకెట్లో చిక్కుకున్నారు. దీనితో సభ్యసమాజం ఒక్కసారిగా నివ్వెరబోయింది. ఇలాంటి డ్రగ్స్ గురించి అలపర్తి రామకృష్ణ 'గుండె గుప్పెడంత' అనే నవలలో ఇలా తెలిపారు.

"ఘటికాచలం పెద్ద ప్లాన్‌లో ఉన్నాడు. ఇబ్రహీం వచ్చి కె.జి. కొకైన్ ఇచ్చి వెళ్ళాడు. అపుడపుడు అతను వచ్చి బ్రౌన్‌షుగర్, కొకైన్, హెరాయిన్ ఇచ్చి వెళ్తుంటాడు. చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసిన డ్రగ్స్‌ను తను సంపన్నులకు అందజేయాలి. వాళ్ళిచ్చిన డబ్బు తీసికొని తన కమీషన్ మినహాయించుకొని మిగతాపైకం ఇబ్రహీంకు ఇచ్చే యాలి. ఎక్కడా ఏ తేడా రాకూడదు.

ఇబ్రహీం డ్రగ్ తనకు సరఫరా చేస్తున్నట్లు ఎక్కడా మాటదొర్లకూడదు. అంతా సీక్రెట్‌గా జరిగిపోవాలి. పోలీసు లకు చిక్కినా ఎటువంటి పరిస్థితుల్లోనూ తనకు ఏ ముఠా సరఫరా చేస్తున్నది చెప్పకూడదు.

చిల్లర మల్లర వ్యక్తులకు డబ్బుకు ఆశపడి డ్రగ్స్ అమ్మకూడదు. సంపన్నుల పిల్లలను, సినిమా వాళ్ళనూ, బిజినెస్ చేసే వాళ్ళనూ టార్గెట్‌గా చేసుకోవాలి. రిస్క్‌తో కూడిన వ్యవహారమే! కష్టపడితే లక్షల్లో ఆదాయం" అంటాడు. డ్రగ్స్‌ను ప్రభుత్వం నిషేధించింది. అయినా చట్టాన్ని ధిక్కరించి సంపన్నులు దాన్ని వినియోగిస్తున్నారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకొని కొన్ని ముఠాలు డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నాయి. అలా చేయడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసికుంటున్నారో నవలా రచయిత కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

**ప్రైవేటు పాఠశాలల పట్ల వ్యామోహం :**

ప్రభుత్వపాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. దీనికి చాలా కారణాలున్నాయి. అలాంటి కారణాల్లో కొన్నింటిని అలపర్తి రామకృష్ణ ఒక నవలలో ఇలా తెలిపారు.

"ప్రైవేటు స్కూళ్ళలో సౌకర్యాలు, టీచింగ్ ఎయిడ్స్ లేక పోయినా తల్లిదండ్రులు ఈ కాన్వెంటు సూళ్ళమీదే మోజు చూపిస్తున్నారెందుకు? శర్మను అడిగింది అనూ రాధ.

ప్రభుత్వ పాఠశాలలు మరీ ఘోరంగా వున్నాయండి. ఉపాధ్యాయుల ఖాళీలుంటాయి. అవి భర్త చెయ్యరు. ఈవాళో, రేపో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉంటాయి. కొన్ని స్కూళ్ళకి తలు పులు, ఇంటి కప్పులు కూడా ఉండవు. వాటికంటే మెరుగ్గా ప్రైవేటు పాఠశాలలుండడంతో తల్లిదండ్రులు ఈ పాఠశాలలను ప్రిఫర్ చేస్తున్నారు" అంటాడు రచయిత 'అమ్మకడుపు చల్లగా' నవలలో. ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని ప్రతిబింబించాడు రచయిత. ప్రభుత్వం ఈ లోపాలను సరిదిద్దకుండా ఉండడం మూలంగా ప్రభుత్వ పాఠశాలలో నిరుపేదలు కూడా చేర్పించడానికి వెనుకంజు వేస్తున్నారు. వివిధ నివేదకలు, ప్రభుత్వ సర్వేలు కూడా ఈ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి.

**యాసిడ్ దాడులు :**

నేడు సమాజంలో ప్రేమ పేరుతో కొందరు యువ కులు వికృత, అనాగరిక, దుర్మార్గపు చేష్టలకు పాల్పడు తున్నారు. ప్రేమ పేరుతో ఆడపిల్లల జీవితాలను బుగ్గి చేస్తున్నారు. ఈ విషయాన్ని నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా చిత్రించారు.

"మౌర్య ప్రక్కన ఉన్న కుర్చీలో కూర్చుంది లాలస. తదేకంగా లాలసను చూస్తుండి పోయాడతను. ఎంతో వింతగా ప్రత్యేకంగా కనిపించిందామె. హత్యచేస్తే తప్పు,

రేప్ చేస్తే తప్పుగాని ప్రేమిస్తే తప్పేముందండి? అన్నాడు మౌర్య.

ప్రేమతోనే చిక్కులు వచ్చిపడతాయండి. ప్రేమ సామ్రాజ్యాలను కూల్చివేసింది. అమ్మాయి తనను ప్రేమించలేదని కక్ష కట్టి రేప్ చేస్తాడు. మరొకడు యాసిడ్ పోస్తాడు. హత్య చేయడానికి కూడా వెనుకాడడు. అన్నీ మగవాళ్ళే ఈ పనులు చేస్తారు. ప్రేమించలేదని ఏ అబ్బాయి మీద ఏ అమ్మాయి యాసిడ్ పొయ్యదు" అంటాడు 'కొండముడి' నవలలో. ఒక అబ్బాయిని ప్రేమించడం, ప్రేమించకపోవడం అన్నది అమ్మాయికి రాజ్యాంగం కల్పించిన హక్కు. దాన్ని కొందరు యువకులు కాలరాస్తున్నారు. మగవాడిననే అహంకారంతో అమ్మాయిల ముఖంపై యాసిడ్ పోయడం, హత్యచేయడం, రేప్ చేయడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి దుర్మార్గులపట్ల ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించి కఠినంగా అణచి వేయాల్సిన అవసరం ఉంది.

## పబ్ కల్చర్ :

పాశ్చాత్య సంస్కృతికి భారతీయులు విపరీతంగా ఆకర్షితులవుతున్నారు. వారి వికృత వికార చేష్టలకు దాసోహమంటున్నారు. అలాంటి వాటిలో చెప్పదగినది 'పబ్ కల్చర్'. ఇది కుటుంబ జీవితాన్ని భ్రష్టుపట్టిస్తుంది. దీని ద్వారా పవిత్రమైన భారతీయ కుటుంబ జీవన వ్యవస్థ ఘోరంగా దెబ్బతింటున్నది. ఈ విషయాన్ని గూర్చి నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు ఒక వ్యక్తి అనుభవం ఆధారంగా.

"ఓ రోజు పబ్‌కు వెళ్ళాడు ఆకాష్. స్వర్గం అవుట్ లెట్స్ అవి. ఇంద్రుడు కుబేరుడు అక్కడే ఉంటారు. చూపులతో మైకం తెప్పించే మగువలు, మధు పాత్రలు అమ్మాయిలు సయ్యాటలు..... ఖుషీ ఖుషీగా ఉంటుంది అన్నాడో స్నేహితుడు.

అతనితోబాటు నైట్ క్లబ్‌కు వెళ్ళాడు. అందమైన పార్టీవేర్‌లో అద్భుతంగా కనిపించారు, అమ్మాయిలు - అబ్బాయిలు లోపలికి వెళ్ళేటప్పుడు కాక్‌టైల్‌చప్పరిస్తూ మ్యూజిక్‌కు అనుగుణంగా షోర్ మీద డ్యాన్సులు చేసేటపుడు మొదట్లో పద్ధతిగా డిగ్నిఫైడ్‌గానే కనిపించారు. ఆ తర్వాత మొదలైంది కోలాహలం.

ఎక్కువసేపు అక్కడ ఉండలేక బయటకు వచ్చేశాడు. నైట్‌హోటల్లోనే రూము తీసుకొని వుండిపోదామన్న మిత్రుడు మాట విన్పించుకోకుండా.

కారుపార్కింగ్ వైపు వెళ్ళాడు. ఎటువైపు చూసినా అన్నీ ఖరీదైన కార్లే! వాచ్‌మెన్ ఎక్కడో దూరంగా గేటు దగ్గర ఉన్నాడు. ఓ కారు పక్కన అమ్మాయి ఏడ్పు వినిపించింది. అటువైపు వెళ్ళాడు. ముగ్గురు కుర్రాళ్ళమధ్య వో అమ్మాయి సన్నగా ఏడుస్తూ నిలబడి ఉంది. ఆ అమ్మాయి కూడా డ్రింకు పుచ్చుకున్నట్లు ఉంది. తూలిపోతూ ఉంది. ఆ అమ్మాయిని కారు సీట్లోకి నెట్టేప్రయత్నం చేస్తూ వున్నాడో అబ్బాయి.

నా తర్వాత నీటర్న్‌రా అన్నాడు కుర్రాడు.

ఆ అమ్మాయి వాళ్ళ ప్రయత్నాలను అడ్డుకోవాలని ప్రయత్నిస్తోంది. కానీ ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. వాళ్ళను అడ్డుకోబోయాడు.

తనను చితకదన్ని అవతలకు తోసేసారు. తన కళ్ళ ముందే ఆ అమ్మాయిని కారు వెనుక సీట్లోకి నెట్టడం, లోపలికి ఓ కుర్రాడు దూరడం తలుపు వేసుకోవడం జరిగిపోయింది. మిగిలిన ఇద్దరూ కుర్రాళ్ళూ బాడీగార్డులా పక్కన నిలబడ్డారు" అంటూ ఆ దుర్మార్గ వర్తనాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు 'గుండె గుప్పెడంత' నవలలో.

పెద్ద పెద్ద నగరాల్లో ఈ పబ్ సంస్కృతి విచ్చల విడిగా సాగుతున్నది. ఒకరి భార్యతో మరొకరు, ఒకరి భర్తతో మరొకరు వెకిలి డ్యాన్సులు వేస్తారు. అర్ధనగ్నంగా ఉన్న అమ్మాయిలు డ్యాన్సులు చేస్తుంటే వీరు డ్రింక్స్ తీసికుంటూ మత్తులో మునుగుతామేమో కూడా తెలియనంతగా రాసలీలలు చేస్తుంటారు. భారతీయ సంస్కృతిని ఇవి మంటగలుపుతున్నాయి.

## అక్రమ సంబంధాలు :

నేటి సమాజంలో అక్రమ సంబంధాలు రాజ్యమేలుతున్నాయి. దీనిమూలంగా హత్యలు చోటుచేసికుంటున్నాయి. అక్రమ సంబంధం కొనసాగించడం కోసం భర్త

భార్యను, భార్య భర్తను హత్య చేస్తున్నారు, చేయిస్తున్నారు. ఈ దుర్మార్గాలు రోజురోజుకూ పెరుగుతున్నాయేగాని తగ్గడం లేదు. ఇలాంటి అక్రమ సంబంధాన్ని గూర్చి నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు.

"మా పిన్ని గాయత్రి బ్యాంకులో పనిచేసేది. బ్యాంకు మేనేజర్‌ని ప్రేమించింది. అతనికి అంతకు ముందే పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు... మా పిన్ని వలలో పడి భార్యను, పిల్లల్ని సరిగ్గా చూడటం లేదని బ్యాంకు మేనేజరు భార్య బంధువులు వచ్చి మా పిన్నితో పోట్లాడారు. నేను మానాన్న వాళ్ళకు సర్దిచెప్పి పంపాం. నా అనుమానం ఏమిటంటే వాళ్ళే మా పిన్నిని వ్యాన్ కిందికి నెట్టేశారేమోనని" అని తెలిపాడు 'పేగుబంధం' నవలలో.

ఏరోజు పత్రిక చూసినా అక్రమసంబంధాలు, దాని దుష్టపరిణామాలకు చెందిన వార్తలు మనకు కనిపిస్తాయి. అవినీతి బాహ్యమైనవని తెలిసినా వాటికి పాల్పడుతున్నారు. ఇలా చేస్తున్నవారు బాగా చదువుకున్నవారు కావడం గమనార్హం.

### దెబ్బతిన్న మానవసంబంధాలు :

ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు మంట గలసిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఉండాల్సిన ఆత్మీయ అనురాగాలు ఘోరంగా దెబ్బతింటున్నాయి. పిల్లలకు అవ్వతాతలకు సంబంధమే లేకుండా పోతున్నది. అవ్వ, తాతలు అనాథాశ్రమాల్లోనో, వృద్ధాశ్రమాల్లోనో ఉంటుండగా పిల్లలు హాస్టళ్ళలో ఉంటున్నారు. అందువల్ల పూర్వము ఉన్నట్లుగా కుటుంబ సభ్యుల భవబంధాలు తెరమరుగవుతున్నాయి. ఈ విషయాన్ని గూర్చి నవలారచయిత అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు.

"మీ పిన్నిది నాదీ ఎన్నో జన్మల బంధం. ఢిల్లీలో ఉండే నా కొడుకు నన్నెప్పుడూ తలచుకోడు. నాలుగైదు నెలలకోసారి ఫోన్ చేస్తాడు, నేను బతికి ఉన్నానో లేదో తెలుసుకోవడానికి. నన్ను చూడడానికి రాడు. కోడలికి నా పోడే గిట్టదు. మనవడికి తెలుగురాదు. ఇంట్లో అందరూ హిందీ మాట్లాడతారు. ఓసారి ఢిల్లీ వెళ్ళానుగానీ వారం రోజుల కంటే ఎక్కువ ఉండలేకపోయాను.

నేను ఎప్పుడు చనిపోతానా... ఇల్లు ఎప్పుడు సొమ్ము చేసుకుందామా అని ఎదురు చూస్తూ ఉన్నాడు నా కొడుకు అని రాజమ్మ పాత్ర ద్వారా 'వెలుగులోగిలి' నవలలో తెలిపాడు రచయిత.

తల్లిదండ్రులు తిని తినక బిడ్డలకు ఎలాంటి కొరత లేకుండా, రాకుండా, కంటికి రెప్పలా చూసుకుంటారు. మరిన్ని ఉన్నత చదువులు చదివిస్తారు. అయితే ఆ బిడ్డలు తమకు పెళ్ళి కాగానే అమ్మనాన్నలను అనాథలుగా వదిలేస్తారు. వారి బాగు పట్టించుకోరు. ఉద్యోగం నెపంతో వేరే ఊర్లో కాపురం పెడతారు. అన్ని విధాల వారిని నిర్లక్ష్యం చేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. కొందరు బిడ్డలు తల్లిదండ్రులపై భౌతిక దాడులు కూడా చేస్తున్నారు. బతికుండగానే స్మశానంలో పారేస్తున్నారు. అలపర్తి రామకృష్ణ తన నవలల్లో చిత్రించిన సామాజి కాంశాలన్నీ ప్రస్తుత సమాజంలో మనం చూస్తున్నవే. వాటిని సామాజిక స్పృహతో నవలల్లో చిత్రిస్తున్నాడు. ఈ విధంగా ఒక రచయితగా తన సామాజిక బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు.

### ఉపకరించిన గ్రంథాలు :

1. తెలుగు నవల - అంపశయ్య నవీన్
2. తెలుగు నవలా వికాసం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3. నవలా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
4. తెలుగు నవల - మనోవిశ్లేషణ - కోడూరి శ్రీరామమూర్తి
5. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీజోగారావు
6. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీనకాంతం
7. తెలుగు సాహిత్యసమీక్ష - ఆచార్య జి.నాగయ్య
8. అలపర్తి రామకృష్ణ నవలలు.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జానపద కళల ఆవిర్భావం - వికాసం

**– జె. విజేందర్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, నిజాం కాలేజ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

జానపద కళలు కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే ప్రదర్శించబడుతుంటాయి. ఈ సమయ సందర్భాలనేవి జానపదలు నమ్మకాలపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. అందువల్లే ఈ నమ్మకాలనేవి జానపదుని జీవితంలో దిశానిర్దేశకాలుగా రూపుదిద్దుకున్నాయి. అయితే జానపదుల నమ్మకాలను నిరద్మనాలయిన ఆచార, సాంప్రదాయాల ఆధారంగా జానపద కళల ఆవిర్భావ వికాసాలు పొందుతున్నాయి అని చెప్పవచ్చు. ఆధునిక దిశలోకి ప్రయాణిస్తున్న జానపదుడు తన జీవితంలో తన తన నమ్మకాలకు ప్రాధాన్యత ఇస్తూనే జానపద కళా ప్రదర్శన సమయ సందర్భాలను తనకు అనుకూలంగా మార్చుకుని ప్రదర్శిస్తున్నారు.

## ఆచార, సంప్రదాయ (సంస్క ృతి) ఆధారంగా జానపద కళల ఆవిర్భావం :

జానపదుడు తన పూర్వీకుల నుండి తనకు సంక్రమించిన ఆచార, సంప్రదాయాల ఆధారంగానే తన జీవితాన్ని గడుపుతున్నాడు. జానపదుని జీవితంలో జరిగే ఆచార, సంప్రదాయ సందర్భాలు క్రింది విధంగా ఉంటాయి.

1. జననం, 2. మరణం, 3. కర్మకాండలు, 4. నోములు, 5. వ్రతాలు, 6. ఉత్సవాలు, 7. ఊరేగింపులు, 8. జాతరలు, 9. పండుగలు, 10. పెళ్ళిళ్ళు, 11. కులమతాచారాలు, 12. వృత్తి సంబంధాలు మొదలగునవి.

సమయ సందర్భాలను బట్టి జానపద కళలు ప్రదర్శించబడుతున్నాయి. పండుగ సమయాల్లో తెలంగాణలో బతుకమ్మ పాటలు, నృత్యాలు, ఆంధ్ర ప్రాంతంలో సంక్రాంతి రోజుల్లో గొబ్బి నృత్యాన్ని చేస్తారు, గంగిరెద్దులాట ప్రదర్శన జరుగుతుంది. హోళీకి తెలంగాణలో 'జాజిరాట' ప్రదర్శిస్తారు.

అదే విధంగా పెళ్ళిళ్ళు, జాతర సమయంలో, ఊరేగింపులు, ఉత్సవాల సమయంలో, ఆయా కుల మత ఆచార వ్యవహారాల్లోనూ జానపద కళలు ప్రదర్శిస్తుంటారు. ఉదా:- డప్పుల నృత్యం, డోళ్ళ నృత్యం, జానధ కథాగేయాలు, జానపదుల కులాచారాల్లో భాగంగా కూడా జానపద కళల ఆవిర్భావం జరుగుతుంది. ఉదా:- మాదిగ వారు తమ జీవితంలో ప్రతి సందర్భంలోనూ డప్పు వాయిద్యాన్ని ఉపయోగిస్తున్నారు. అలాగే గొల్ల కుర్మలు 'ఒగ్గు డోలు'ను ఉపయోగిస్తారు.

జానపద కళలు ప్రాచీన మానవుని ఆలోచనల నుండి పుట్టిపెరిగి వికసించాయి. వీటిని అధ్యయనం చేయడం వల్ల నాటి ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, వారి అనుభూతులు తెలుసుకునే అవకాశముంది. జానపద కళలు అనేవి ప్రదర్శన ప్రాధాన్యం కలిగినవి. తెలుగులో కొన్ని వందలకు పైగా జానపద ప్రదర్శన కళలు ఉన్నాయి. వీటిలో కొన్ని వీటిని ప్రదర్శించే గాయక భిక్షుకుల పేరుతో పిలువబడుతున్నాయి. కొన్ని నృత్యం పేరుతో, కొన్ని కథల పేర్లతో, కొన్ని భాగవతాల పేర్లతో, కొన్ని దాసరి పేర్లతో, కొన్ని జంగాల పేర్లతో, కొన్ని నాటకాల పేర్లతో, కొన్ని భజనల పేర్లతో, కొన్ని వేషాల పేర్లతో పిలువబడుతున్నాయి. జానపద కళలు ప్రాచీన మానవుని జీవన కార్యకలాపాలలో భాగంగా అవతరించి, తరువాత లౌకిక పరంగా మార్పు చెందాయి.

## జానపద కళలు - లక్షణాలు :

జానపద కళలు కళారూపాలుగా ఏర్పడక ముందు కేవలం ఆచార, సంప్రదాయ సంస్కృతిలో భాగంగా మరియు కేవలం కుల, మతాలకు మాత్రమే పరిమితమై ఉండేవి. కానీ నేడు జానపద కళారూపాలుగా ఏర్పడిన తరువాత వాటి రూపు, రేఖల్లోనూ, మౌళిక లక్షణాలలోనూ మార్పు వచ్చింది. గత కాలంలో జానపద కళలు అనేవి

కులాలపరంగా, మతాలపరంగా ఒక నిర్దిష్టమయిన ప్రాంతాలకు మాత్రమే సంబంధించి ఉండేది. కానీ రాను రాను వచ్చిన మార్పుల వల్ల అనగా వలసవాదం, నగరీకరణం లాంటి ప్రభావల వల్ల జానపద కళల వ్యాప్తి, ప్రభావం, సంస్కృతులు అనేవి అన్ని ప్రాంతాలలో వ్యాపించాయి. జానపద కళలు నేడు సర్వ జనామోదాన్ని పొందుతున్నాయి. ప్రోత్సాహం లభించిన కొద్దీ వికసిస్తున్నాయి. జానపద కళలు అనేవి ప్రేక్షకుల మనస్సుల్లోకి తొందరగా చొచ్చుకుపోయే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఉదా : జానపద గేయాలు, ఒగ్గుకథ, డప్పుల నృత్యం పాటల ద్వారా ప్రజాచైతన్యాన్ని తీసుకురావడం కోసం, ఉద్యమాల కోసం ఉపయోగించుకోవడం, రాజకీయ పార్టీల ప్రచారాల విషయంలోనూ ముఖ్య పాత్రను నిర్వహిస్తున్నాయి.

## మతాల ఆధారంగా జానపద కళల ఆవిర్భావం :

వివిధ మతాలకు చెందిన జానపదుడు తన పుట్టుక నుండి మరణం వరకు తన మతంలోని ఆచార, సంప్రదాయాలను కొనసాగిస్తూ జీవితాన్ని గడుపుతాడు. ఇందులో భాగంగా దైవారాధన సమయంలో నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ తన భక్తిని తెలుపుతాడు.

## శైవమతం ఆధారంగా జానపద కళల ఆవిర్భావం:

హిందూ మతంలో అతి ప్రాచీనమైంది శైవ మతం. ఆదిమ జాతులు ఎక్కువగా పూజించేది పశుపతిని, అమ్మతల్లిని. పశుపతి అంటే శివుడు, అమ్మతల్లి అంటే గ్రామ దేవత. అయితే శైవ మత ప్రార్థనలో భక్తులు కొలిచే విధానంలో భాగంగా నృత్యాలు చేస్తుంటారు. ఉదా:- ఒగ్గుడోళ్ళ నృత్యం, గొరవయ్యల నృత్యం, వీరనాట్యం, శివతాండవం, పేరిణీ నృత్యం, మొదలగునవి.

## వైష్ణవ మత ఆధారంగా జానపద కళల పుట్టుక :

భారతదేశంలో వైష్ణవ మతం అంతటా ఉన్నప్పటికీ ఉత్తర భారతంలో ఎక్కువగా ఉంది. ఈ మతంలోని జానపదులు విష్ణువుని, రాముడిని, క్రిష్ణుడిని కొలిచే, ఆరాధించే సమయాల్లో తమ భక్తి నివేదనలో భాగంగా ఆడుతూ, పాడుతూ భక్తిలో లీనమై పారవశ్యాన్ని పొందుతుంటారు. ఈ కళలు నేడు కేవలం దైవారాధన సమయాల్లోనే కాకుండా వినోద కార్యక్రమాల్లో కూడా ప్రదర్శింపబడుతూ ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తూ వారి మన్ననలను, ఆదరణలను పొందుతున్నాయి. వైష్ణవ సంబంధ కళలకు ఉదా:- కోలాటం, చెక్కభజన, పండరి భజన, తప్పెటగుళ్ళు నృత్యం, మొదలగునవి.

## శాక్తేయ మత ఆధారంగా జానపద కళల ఆవిర్భావం :

హిందూ మతంలో ప్రతివారు ఈ శాక్తేయ దేవతలను కొలుస్తారు. శాక్తేయ దేవతలు అంటే గ్రామదేవతలు అనీ, శక్తిస్వరూప దేవతలు, స్త్రీ దేవతలు అని చెప్పవచ్చు. శైవ మతం వారైనా, వైష్ణవమతం వారైనా ఈ శక్తిదేవతలను తమ దైనందిన జీవితంలో ఏదో ఒక సందర్భంలో కొలుస్తూనే ఉంటారు. బోనాల పండుగల్లో, బతుకమ్మ పండుగల్లోనూ, గ్రామ దేవతల జాతర్లలో హిందువులు శాక్తేయ దేవతల సంప్రీతికోసం, తమ కోరికలు తీరడం కోసం, తమకు మంచి జరగడం కోసం గ్రామ దేవతలను కొలుస్తూ ఆడుతూ పాడుతూ తమ భక్తిని ప్రదర్శిస్తారు. గ్రామ శాక్తేయ మాతల పేర్లు ఈ విధంగా ఉన్నాయి. 1. పోలేరమ్మ, 2. అంకాలమ్మ, 3. మాంకాలమ్మ, 4. ఎల్లమ్మ, 5. నూకాలమ్మ, 6. ఉప్పలమ్మ, 7. పోచమ్మ, 8. మైసమ్మ, మొదలగునవి. ఈ గ్రామ దేవతలను కొలిచే సందర్భంలో ప్రదర్శించే కళలు ఉరుముల నృత్యం, పాటలు, పులి నృత్యం, డప్పు నృత్యం, అశ్వ నృత్యం, నెమలి నృత్యం, పోతురాజు నృత్యం, మొదలగునవి.

## కులా ఆధారంగా (జాతుల) జానపద కళల ఆవిర్భావం :

వివిధ రకాల మతాల ఆధారంగా వివిధ రకాల జానపద కళలు ఆవిర్భావం చెందినట్లే వివిధ రకాలయిన కులాల ఆధారంగా వారి సంస్కృతికి, ఆచారాలకీ, సంప్రదాయాలకు అనుగుణంగా వివిధ రకాలయిన జానపద కళలు ఆవిర్భావం చెంది వికాసం పొందుతున్నాయి. ఈ

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


విధంగా కులాచారాల్లో భాగంగా ఏర్పడిన జానపద కళలు నేడు వినోద కార్యక్రమాల్లోనూ, ఉత్సవాల్లోనూ జాతర్ల లోనూ, ఊరేగింపులోనూ ఇతర కులస్థులు కూడా ప్రదర్శి స్తున్నారు. వివిధ రకాల కులాల వారు ప్రదర్శించే జానపద కళలు క్రింది విధంగా ఉన్నాయి. కురుమ గొల్లులు - ఒగ్గు డోళ్ళ నృత్యం, ఎర్ర గొల్లలు - తప్పెటగుళ్ళు, చిందువారు - చిందు యక్షగాణం, చిందు నృత్యం, మాదిగవారు - జమిడిక నృత్యం, మాలవారు - ఉరు ముల నృత్యం, చిరుతల భజన, బైండ్ల - గంగిరెద్దులాట, మొదలగునవి.

**ప్రచార, ప్రసార సాధనాలు - జానపద కళలు :**

జానపద కళల వైశిష్ట్యాన్ని, ప్రజాదరణను గమనించి, ప్రభుత్వం, ప్రజా ఉద్యమాల నాయకులు, రాజకీయ నాయకులు తమ తమ కార్యక్రమాల్లో వీటిని ప్రచార నిమిత్తం విరివిగా వాడుకుంటున్నారు. తమకు అను గుణంగా మలుచుకుంటున్నారు. ఈ విధంగా జానపద కళలు నిలదొక్కుకోవడానికి దోహదం చేసినట్లు కూడా అవుతుంది. ప్రభుత్వం తమ కార్యకలాపాలు, అనగా పచ్చదనం - పరిశుభ్రత, కుటుంబ నియంత్రణ, అక్షర జ్యోతి, వయోజన విద్య ప్రచారం, నీరు-మీరు, ఎయిడ్స్‌పై అవగాహన వంటి కార్యక్రమాలను ప్రచారం చేయడానికి జానపద కళలను చక్కగా ఉపయోగించు కుంటున్నారు. జానపద కళల మీద ఉన్న ఆసక్తివల్ల ప్రజలు ప్రదర్శనతో పాటు విషయాన్ని కూడా గమనిస్తారు. వీలైతే అమలు పరచడానికి ప్రయత్నిస్తారు. వరకట్నం, వెట్టిచాకిరి, బాల్య వివాహాలు మొదలగు సాంఘిక దురా చాలను అరికట్టుటలో కూడా జానపద కళల పాత్ర అమోఘమైనది.

ప్రసార సాధనాలైన ఆకాశవాణి, దూరదర్శన్‌లలో కూడా జానపద నృత్యాలు, ఒగ్గుకథ, బుర్రకథ, శారద కథ, జానపద సంగీత సంబంధిత కార్యక్రమాలు, వివిధ జానపద రూపక ప్రక్రియలు మొదలైన కళారూపాల ద్వారా జానపద కళలు ప్రదర్శింపబడుతున్నాయి.

జానపద కళారూపాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమా లైన పల్స్ పోలియో, మహిళా సంక్షేమం, అంటరానితనం నిర్మూలనపై అవగాహన మొదలైన కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకువెళ్ళుటకు అనుగుణంగా జానపద కళారూపాలను మలుచుకొని ప్రదర్శనలిస్తుంటారు. జానపద కళలు ప్రజల్ని విపరీతంగా ఆకట్టుకునే ప్రక్రియ లుగా పేరు తెచ్చుకున్నాయి. విశిష్ఠ ప్రజాదరణ పొందిన ఈ కళారూపాలను ఆశ్రయించి ప్రభుత్వం తమ కార్య క్రమాలను చక్కగా ప్రచారం చేయిస్తుంది. ఈ కళారూపాల వల్ల విషయం ప్రజల్లోకి సులబంగా చేరిపోతుంది.

**ముగింపు :**

జానపద కళారూపాలు తరతరాల సాంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తూనే జీవనోపాధిగా కూడా మారాయి. జానపద కళల మీద ఉన్న ఆసక్తి వల్లనో, వాటిపట్ల ప్రజల కున్న ఆదరణ వల్లనో అన్ని కులాలవారు జానపద కళా రూపాలను నేర్చుకొని ప్రదర్శిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జానపద కళలపై ప్రత్యేక శ్రద్ధ వహించి కళల యొక్క విషయ విశిష్ఠతలను ప్రతి పౌరునికి చేరే విధంగా కృషి చేయాలని ఆశిస్తున్నాము.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పత్రికా రచన విస్తరణ మరియు సరళీకరణ

- డా॥. హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, బి.జె.ఆర్. ప్రభుత్వ కళాశాల, నారాయణగూడ, హైదరాబాద్, తెలంగాణ.

పత్రికా రచనలో ప్రపంచాన్ని నడిపించే శక్తి ఉంది. నిజాలను నిర్భయంగా తెలిపి అన్యాయాలపై ప్రజలను సాయుధులను చేస్తూ సభ్య సమాజానికి ఊపిరి పోస్తుంది. పత్రిక రచనలు రాజులు, రాజ్యాల గతులను మార్చి నూతన ప్రభుత్వాలను ప్రజలకు అనుకూలంగా నడిపిస్తున్నాయి. అంటే పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు. కావున పత్రికలు సమర్థవంతంగా తమ పాత్రను నిర్వహించాలంటే దానికి ప్రాణం పోసే రచనా విధానంను గుర్తుచేసుకోవలసిన ఆశ్యకత ఎంతైనా ఉంది.

పత్రికా రచన రాయడం అంటే కంటికి రాయటం అన్నమాట. సాధారణ రచనకు, పత్రికా రచనకు చాలా తేడా ఉంటుంది. పత్రికా రచన అంటే దిన పత్రికలకు, వార పత్రికలకు, పక్ష పత్రికలకు, మాస పత్రికలకు, త్రైమాస పత్రికలకు, ప్రత్యేక పత్రికలకు రాయడం చెప్పవచ్చును. రచనాంశం, పాఠకులు, పత్రికా స్వభావం అనే మూడు అంశాల మీద పత్రికా రచన ఆధారపడి ఉంటుంది. పత్రికా రచనలో వార్తలు, ఫీచర్లు, సంపాదకీయాలు, గ్రంథ సమీక్షలు, వ్యాపార ప్రకటనలు, కార్టూన్‌లు లాంటివి ప్రధానమైనవిగా ఉంటాయి.

వివిధ ప్రాంతాల నుండి సేకరించిన విషయాలను స్పష్టంగా, క్లుప్తంగా, ఆసక్తిని కలిగిస్తూ, ఆకట్టుకొనేటట్లుగా వార్తలు రాయడం నైపుణ్యంతో కూడిన పని సాంఘీక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, శాస్త్ర సాంకేతిక వాణిజ్యాది అంశాలపై విలేకరులకు స్పష్టమైన అవగాహన గలిగినప్పుడే పత్రికా రచనలు సమర్థవంతంగా ఉంటాయి. కావున ఇవి ప్రజలమీద అమితమైన ప్రభావం చూపగలవు. కాబట్టి విలేకర్లు, సంపాదవర్గం రచనా విషయాలను జాగ్రత్తగా పరిశీలించి ప్రచురించాలి. శీర్షికలు, ఉపశీర్షికలు, వరుసక్రమం, ఆపాదితాలు. గుర్తింపు సకాలికత, విరామాలు శైలి ముగింపు తెలుసుకోవాల్సిన అవసరం వారికి ఎంతైనా ఉంది.

ఆధునిక కాలంలో వార్తా ప్రసార సాధనాలు సామాన్యులకు కూడా అందుబాటులో ఉంటున్నాయి. పల్లెల్లో కూడా వార్తాపత్రిక కోసం ఎదురుచూసేవాళ్ళూ ఉన్నారు. వాళ్ళు కూడ అనేక విషయాలను తెలుసుకోవడానికి ఉత్సాహంతో ఉన్నారు. "వార్తయందు జగము వర్ధిల్లుచుండు" కావున లోకంలోని అన్ని వార్తలు అందరు తెలుసుకోవడానికి వార్తాపత్రికలు అవసరమవుతున్నాయి.

వార్తా పత్రికలు మానవజాతికి విజ్ఞానము అందించి చైతన్యము కలిగిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు, వాటి మంచి చెడులను, విలేకరులు నిర్మాణాత్మకంగా చర్చించాలి. ఉద్యోగులకు, నిరుద్యోగులకు, కర్షకులకు, కార్మికులకు, విద్యార్థులకు, పిల్లలకు, స్త్రీలకు అన్ని వయస్సుల వారికి ఉపయోగపడే విధంగా శీర్షికలతో రచనలు వెలువడాలి. ఇవి లేనిదే విద్యావంతులు కూడా లోకంలో జరుగుతున్న మంచి, చెడు విషయాలను తెలుసుకొనుట అసాధ్యమగును.

స్వాతంత్ర్య ఉద్యమకాలంలో "కేసరి" వంటి పత్రికలలో రచయితలు నిజనిజాలను ప్రజలకు తెలియపరుస్తూ చైతన్యవంతులుగా చేసి ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశారు.

ఆజాద్ నడిపిన పత్రికలు అల్‌హిలాల్, అలాబలాగ్ వంటి వాటి వలన ప్రజలు ప్రభుత్వాన్ని విమర్శించే స్థితి వస్తుందని ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం వాటిని నిషేధించింది. దీని ద్వారా పత్రికలు ప్రభుత్వాల దమననీతిని కూడా ఎండగట్టాయి అని భావించవచ్చును.

వాక్ స్వాతంత్ర్యపు హక్కుకు వేదికలు వార్తాపత్రికలు ఇవి జాతి పురోగమనాన్ని ప్రతిబింబిస్తాయి. పాలకులను పాలితులను దగ్గరకు చేర్చేవి గూడ పత్రికలే అనేక స్కాములు, కుంభకోణాలు, తెర వెనుక జీవితాలు, అధికారంలో చేసే అవాంఛనీయ సంఘటనలు విపులకరించి

తెలిపేవి పత్రికలే. "ఒక కలంపోటుతో ప్రభుత్వాలచే గతులు తప్పేటట్లు చేసే శక్తి సామర్థ్యాలు పత్రిక రచనకు" మాత్రమే గలదు.

శీర్షికలు - ఉపశీర్షికలు వార్తలను ఎన్నుకోవడానికి ఉపకరిస్తాయి. ఇవి పాఠకులను ఆకర్షించే వేగవంతంగా చదివిస్తాయి. నేటి సమాజంలో వార్త పత్రికల స్థాయి పెరిగి పోయింది. కావున నీటి మధ్య పోటీ ఎక్కువైంది. కాబట్టి పోటీని తట్టుకొనే విధంగా శీర్షికలు, ఉప శీర్షికలు రచనా విధానాలలో రోజూ రోజుకు మార్పులు సంభవిస్తున్నాయి. నూతన పదజాలంతో వినూత్నంగా రచనలు వెలువడాలి. ప్రాధాన్యతలను బట్టి వార్తలు వరస క్రమం ఉండాలి. ఎందుకంటే ప్రముఖమైన వ్యక్తులు చెప్పే విషయాలు మొదటి వరసలోనే ఉండాలనుకోవడం సహజం. వార్తల్లో ముందు లీడ్ తర్వాత పేరా, తర్వాత ముగింపు తప్పని సరిగా ఉండాలి.

వార్తల్లోని సంఘటనలను, స్థలం, ఊరు, పేరు తొందరగా గుర్తించి వార్తలు రాయాలి. ఒకదానికొకటి రాస్తే పాఠకులు సహించరు. పొరపాటు దొర్లితే పాఠకులు ఇట్టే గుర్తిస్తారు. వార్తల్లోకి వ్యక్తులు ప్రత్యక్షంగా, దొరక నపుడు ఓటర్ల జాబితా నుంచో, ఇతర డాక్యుమెంట్ల నుంచో సేకరించి సరిచూసుకోవాలి అక్షర దోషాలు అనర్థా లకు దారి తీస్తాయి, కనుక జాగ్రత్త వహించాలి.

పత్రికలకు వార్తలను వ్రాసేటప్పుడు సంఘటన ఎప్పుడు జరిగింది? ఏరోజు జరిగింది? అనే అంశాలను పేర్కొనాలి. ఎన్నిక గంటలకు, ఎన్ని నిమిషాలకు ఆ సంఘటన జరిగిందనే విషయాన్ని ఆ వార్త సూచించేదిగా ఉండాలి. పత్రికలు సర్వసాధారణంగా అవి వెలువడిన రోజుకంటే ముందురోజు జరిగిన విషయాలను నివేదించేవై ఉంటాయి. కాబట్టి పత్రికలలోని భాష భూతకాలిక క్రియ లతో కూడుకున్నదిగా ఉండాలి.

ప్రజాస్వామ్య మనుగడ పత్రిక రచనకు మన్నిక పర స్పరం ఒకదానిపై ఒకటి ఆధారపడియున్నది. మంచి విలువలు కలిగిన పత్రికలు. నైతికంగా సిద్ధాంతాలకు కట్టు బడి ప్రజలకు మేలు చేస్తాయి. చిరకాలం మన్నుతాయి. ప్రజాస్వామ్యం సార్థకత చెందేది పత్రికల వలననే అనే విషయాన్ని గమనించాలి. ప్రజలకుండే భావస్వాతంత్ర్యం ఆధారంగా ప్రభుత్వాన్ని ప్రజలు విమర్శిస్తే, అందలి మంచి చెడులను విశ్లేషించి ప్రచురించేవి పత్రికలు వాటి ఫలితంగా ప్రభుత్వం తన తప్పును దిద్దుకోవచ్చును. ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలిపేవి పత్రికలు. ఇటీవల ప్రభుత్వం అవినీతిని అరికట్టడానికి ప్రజలను చైతన్యవంతుల్ని చేసింది. ప్రజాభిప్రాయాలను వర్గీకరించి ప్రచురించి ప్రభుత్వం ఆత్మ విమర్శ చేసుకొనేటట్లు కల్పిం చేది పత్రిక రచనా, ప్రజా సమస్యల్ని - వారి కోరికల్ని కావలసిన సదుపాయాలను ప్రభుత్వము తెలుసుకోవడా నికి దాన్నిబట్టి ప్రణాళికను ఖరారు చేసుకొనేందుకు సహాయపడేది పత్రికలు. అంతేగాక పత్రిక అంటే ప్రతి సామాన్య మానవుడు నుంచి పెద్ద రాజకీయ నాయకుడి వరకు ప్రతి ఒక్కరు తాము చేసే పనులలో జాగ్రత్త పడుతారు. కాబట్టి మనిషికి సమాజానికి రక్షణ వంటిది పత్రికలు.

ఏ రచనకైన విరామ చిహ్నాలు ముఖ్యం. చిన్న వాక్యా లకు ఫుల్‌స్టాప్‌లు, పెద్ద వాక్యాలకు కామాలు, కోలన్, సెమికోలన్, డాష్ ఇన్‌వెర్టడ్ కామా, ప్రశ్నార్థకం మొదలగు వాటి అవసరం ప్రాముఖ్యతను గుర్తించి వార్తా రచనలను వాటిని వినియోగించుకోవలసిన అవసరం వార్తా రచనలో ఎంతైనా ఉంది.

సరళత స్పష్టత, చదివించే గుణం వార్తకు చాల అవసరమైనది. చిన్నచిన్న వాక్యాలతో, మంచి క్రియలతో, నామవాచకాలతో, విశేషణాలతో చక్కని పలుకుబళ్ళతో, జాతీయాలతో రాసిన వార్త చాల ఆసక్తిదాయకంగా ఉం టుంది. పాఠకులకు అర్థమయ్యే పదాలు, మాత్రమే రాయాలి. మరి కఠినమైన పదాలు వాడకూడదు. సామాన్యులను చదివించే రీతిలో రచన ఉండాలి. ఎందు కంటే పత్రికకు వార్తా రచయితలు శైలిననుసరించి రాస్తే బాగుంటుంది.

వార్తా పత్రికలలోని వార్తలు మంచి ప్రారంభాన్నిచ్చి అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేదిగా ఉండాలి. ఒక

చక్కని విశ్లేషణతో వార్త ముగింపు ఉంటే వార్తా రచనకు సార్థకత ఉంటుంది.

పత్రికా రచనలో ఫీచర్ అనేది కొంత వాస్తవాన్ని మరి కొంత కల్పనను జోడించి చెప్పేదిగా ఉంటుంది. ఫీచర్లను తెలుగులో సృజన వ్యాసాలు, లేదా కల్పనా వ్యాసాలు అనవచ్చు. ఫీచర్లలో ప్రధానంగా వార్తా ఫీచర్ల సమాచార ఫీచర్లు. ప్రత్యేక ఫీచర్లు అనేవి ఉంటాయి. ఫీచర్ స్వరూప స్వభావాలను రచయిత తెలుసుకోవలసిన అవసరం ఉంది. మంచి ఫీచర్లను రాయడానికి మంచి ఆకారాలు, మంచి భావాలు, మంచి శైలి అత్యంత అవసరమైనవిగా ఉండాలి.

పాఠకులు చదువుతూ నవ్వించడానికి హాస్యంతో కూడుకున్న కార్టూను కూడా పత్రికలో ఉండాలి.

పత్రికకు సంపాదకీయం ప్రాణం వంటిది. "ప్రజలు అభిప్రాయాలను ప్రజలకే వ్యాఖ్యానం చేసి వారి భావా లను మార్చగల నాయకుడౌతుంది" పత్రిక. ఎడిటోరియల్ అన్న ఆంగ్ల పదానికి సమానార్ధకంగా సంపాదకీయం అన్నది వాడబడుతున్నది. ముఖ్యమైన అంశాలు వివరణాత్మకంగా సంపాదకీయంలో ఊపిరి పోసు కుంటాయి. అవి పత్రికలకి హైలెట్‌గా ఉండాలి. ఎలాంటి విషయమైన సామాన్య పాఠకుడికి చక్కగా అర్థమయ్యే రీతిలో ఇది ఉండాలి. ఈ సంపాదకీయాలు ఒక్కసారి సూచనలిచ్చేవిగా, హెచ్చరించేవిగా, ప్రజాతీర్పును తెలియ జెప్పేవిగా ఉంటాయి. పత్రికంతా ఒక ఎత్తు సంపాద కీయం ఒక ఎత్తు. పత్రిక ప్రజల్లోకి చొచ్చుకొని పోయి జీవించాలంటే సంపాదకీయం అదిరేటట్లు ఉండాలి.

## ముగింపు :

వార్తా పత్రిక రచనల చాలా నిగ్రహము హుందాతనం కల్గి ఉండాలి. వార్తలలోని సత్యాసత్యములను తెలుసు కొని ప్రచురించాలి. ఏకపక్ష నిర్ణయాలు గానీ, మత కల హములు ఏర్పడే పరిస్థితులను గానీ, మోసపుచ్చే వార్త లను గానీ ప్రచురించరాదు. ప్రజలకు సేవచేసే ఉద్దేశం తోనే యివి వెలువడి సక్రమంగా నిర్వహించబడినప్పుడు చిరకీర్తిని పొందుతాయి అనడంలో సందేహం లేదు.

## ఆధార గ్రంథాలు :

1. సాహిత్య చరిత్రలో చర్చానీయాంశాలు, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం.
2. మహతి - సమీక్షావ్యాస సంకలనం.
3. ఆచార్య యస్.జి.డి చంద్రశేఖర్ - వ్యాసం.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 
UGC Approved Journal No. 42500

# ప్రపంచీకరణ నేపథ్యంలో గ్రామ దేవతలు

- డా॥. ఎ. రవీంద్రబాబు, అతిథి అధ్యాపకులు, తెలుగు విభాగం, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

మాతృస్వామ్య వ్యవస్థకు చిహ్నాలే గ్రామదేవతలు. పితృస్వామ్య వ్యవస్థ మన సమాజంలో వేళ్లూనుకోక పూర్వం కుటుంబంలో తల్లే ప్రధాన పాత్ర పోషించేది. కుటుంబ బాధ్యతలన్నీ ఆమె మోసేది. వ్యవసాయం, పిల్లల పెంపకం, జీవన మనుగడ కావాల్సినవన్నీ చూసుకొనేది. వేద కాలనికి పూర్వం అంటే ముఖ్యంగా ఆర్యుల రాకకు పూర్వం మన దక్షిణ భారతదేశంలో మాతృస్వామ్య వ్యవస్థ ఉండేదని చారిత్రక ఆధారాలున్నాయి. అదే విధంగా హైందవ సంస్కృతి ప్రకారం సృష్టికి మూలం త్రిమూర్తులు లేదా బ్రహ్మ అనే భావన కన్నా ముందు ఆదిశక్తే ఈ చరాచర జగత్తును సృష్టించిందని నమ్మేవాళ్లు. ఆ క్రమం లోనే ప్రజలను, ప్రకృతిని రక్షించే దేవతగా స్త్రీ స్వరూపాన్ని ఆరాధించే వాళ్లు. శిష్టసంస్కృతి కన్నా పూర్వం స్త్రీని శక్తిగా భావించి పూజించే వాళ్లు. ఆ నేపథ్యం నుంచే దక్షిణ భారతదేశంలో గ్రామదేవతలు వెలిశారని చెప్పొచ్చు.

వైజ్ఞానికంగా అభివృద్ధి చెందని కాలంలో ప్రజలకు వచ్చే క్షయ, కలరా, మసూచి, దద్దు, బొబ్బలు వంటి వ్యాధులను గ్రామదేవతలు నయం చేస్తారని నమ్మే వాళ్లు. అలాగే గ్రామల రక్షణ, పశువులు, వ్యవసాయానికి చెందిన పంటపొలాలు, ధాన్యం... అన్నింటిని రక్షించ డానికి ఒక దేవతను సృష్టించుకోవడాన్ని మనం చారిత్రక ఆధారాల వల్ల అర్థం చేసుకోవచ్చు. శిష్టదేవతలకు, గ్రామ దేవతలకు చాలా భేదం ఉంది. విగ్రహాలు, పూజా విధానం, ఆలయ నిర్మాణం, చరిత్ర... అన్నింటిలో ఈ తేడా గమనించవచ్చు. గ్రామదేవతల విగ్రహాలు రాతితో చేయబడి ఉంటాయి. పూజావిధానంలో వేపాకులు, నిమ్మకాయలు, పసుపుకుంకం, కోళ్లు, మేకల బలి ఉంటాయి. ప్రత్యేకంగా దళిత బహుజనులే ఈ గ్రామ దేవతలకు పూజారులుగా ఉంటారు. ఆలయ నిర్మాణం కూడా తూర్పు వాకిలితో, సూర్యకిరణాలు విగ్రహం మీద పడేవిధంగా నాలుగు గోడల మధ్య చిన్నగా కనిపిస్తుంది. ఎక్కువభాగం ఈ గ్రామదేవతలకు పురాణాలతో సంబంధం లేని స్థల చరిత్రలు లేదా గ్రామదేవతల పుట్టుకకు చెందిన కథలు స్థానికంగా వ్యాప్తిలో ఉంటాయి. ఇవి అక్కడ ప్రజల అస్తిత్వాన్ని, నేపథ్యాన్ని, జీవన విధానాన్ని తెలియజేస్తాయి.

ప్రతి గ్రామదేవత అక్కడి ప్రజల బౌగోళిక, వారసత్వ, జానపద విధానానికి ప్రతీకగా నిలుస్తుంది. జానపద సంస్కృతిలో భాగాలైన గ్రామదేవతలు అనేక చోట్ల అనేక పేర్లతో పిలువబడుతున్నారు. అంకమ్మ, పోలేరమ్మ, జాలమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ... ఏ పేరుతో ఉన్నా గ్రామ దేవతల పుట్టుక గురించి, వారి చరిత్ర గురించి కొన్ని సామ్యాలతో కూడిన కథలు ప్రచారంలో ఉన్నాయి. ప్రతి కథ అక్కడి ప్రజల జీవన విధానం, ఆచార సంప్ర దాయాలు, జానపద సంస్కృతితో ముడిపడి ఉంది. అందుకే గ్రామదేవతలు జానపదుల సొత్తు. వారి నమ్మ కాలకు ఉదాహరణ. తెలుగు రాష్ట్రాలలో మనకు కనిపించే అనేక మంది గ్రామదేవతల గురించి పరిశోధకులు అధ్య యనం చేశారు. ఇంకా చేయాల్సిన దేవతలు ఎందరో ఉన్నారు. ప్రస్తుతం అంతగా వెలుగులోకి రాని ఈతముక్క లమ్మ గ్రామదేవత గురించి మాట్లాడుకుందాం.

ఒకవైపు ప్రపంచీకరణతో అమల్లోకి వచ్చిన నూతన ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల స్థానిక చరిత్రలకు, సంస్కృతులకు, ప్రాంతాలకు, వృత్తులకు, భాషలకు, కుటీర పరిశ్రమలకు పెద్ద ఎత్తున ముప్పు వాటిల్లింది. ఈ క్రమంలోనే అస్తిత్వ ఉద్యమాలు తలెత్తుతున్నాయి. ప్రపంచీరణకు ప్రభుత్వాలు ద్వారాలు తెరచి వాణిజ్య పరమైన ఒప్పందాలను కుదుర్చుకొంటున్నాయి. కానీ వాటి వల్ల స్థానికంగా జరుగుతున్న నష్టాన్ని మాత్రం పట్టించు కోవటం లేదు. ఇప్పటికే వ్యవసాయం, కులవృత్తులు, కుటీరపరిశ్రమలు, పల్లెలు నాశనం అయి సామాన్య ప్రజలు రోడ్డున పడుతున్నారు. ఈ క్రమంలోనే స్థానిక

సంస్కృతులతో నిండిన చరిత్రలను అంటే జానపద విజ్ఞానాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాయి చాలా పరిశోధనా సంస్థలు. జానపదాంశాలలోని అనేక విశేషాలను తర్వాతి తరాలకు అందించాల్సిన అవసరాన్ని మనముందుకు తెచ్చాయి. గతాన్ని మర్చిపోతే భవిష్యత్తు ఉండదన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రపంచీకరణ నేపథ్యంలో స్థానిక పాటలు, మౌఖిక వాఙ్మయం, కథలు, నమ్మకాలు, సంప్రదాయులు, ఆటలు, ఆచారాలు, గ్రామదేవతల గురించిన అంశాలను సేకరించి, భద్రపరచి ఆ వారసత్వ సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలి. ఆ నేపథ్యం నుంచే ఈతముక్కల గ్రామదేవత గురించిన విశేషాలను అవగతం చేసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల గ్రామ దేవతగా వెలసింది ఈతముక్కలమ్మ. ఈతముక్కలకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో అడవిప్రాంతంలో కనిపిస్తుంది ఈ దేవత గుడి. ఒకప్పుడు అడవి ప్రాంతమైనా ప్రస్తుతం చుట్టూ పంటపొలాలున్నాయి. ఆకుతోటలతో నిండిన రాజుపాలెం గ్రామ పొలిమేరల్లో ఈ దేవత ఉంది. ఈ గుడి పక్కనే పోతురాజు విగ్రహం, గంగమ్మ దేవాలయం, జాలమ్మతల్లి చెట్టుగా చెప్పుకునే వేపచెట్టు ఉన్నాయి. ఆ చెట్టు ఆకులు మిగిలిన వేపచెట్లంత చేదుగా ఉండవని స్థానికులు చెప్తారు. ఈ గుడి నుంచి రాజుపాలెం ఉన్న బంగాళాఖాతం ఒక్క కిలోమీటరు మాత్రమే. అలాగే ఈ చుట్టుపక్కల జ్వాలాముఖి పేరుతో మరో గ్రామదేవత ఉంది. ఈ గుడి దగ్గర్లోనే అడవి రామలింగస్వామి గుడీ ఉంది. ఇంకా శిష్టఆచారాలకు నెలవైన రాములవారి గుళ్లు, ఆంజనేశ్వామి గుడి, శివాలయాలు చుట్టుపక్కల గ్రామాల్లో కనిపిస్తున్నాయి. ఈతముక్కలమ్మ వెలసేనాటికి రాజుపాలెమనే గ్రామం లేదట. అయితే వెంకటగిరి రాజులు తరచూ ఈ ప్రాంతం మీద నుంచి వెళ్తూ ఈ గుడి సమీపంలో విడిది చేయడంలో అక్కడ రానురాను ఒక ఊరు ఏర్పడింది. రాజులు విడిది చేశారు కాబట్టి దాని పేరు రాజుపాలెంగా వచ్చిందని స్థానికులు చెప్తున్నారు. ప్రస్తుతం ఈ గుడి రాజుపాలెంలో ఉంది.

పూర్తిగా సముద్ర తీరప్రాంతమైన ఈతముక్కలలో పల్లెకారులు, చాకలి, మంగలి, పద్మశాలి, మాల మాదిగ, రెడ్లు, బలిజె, గవండ్ల, యానాది, ఎరుకల వంటి పలు దళిత బహుజన కులాలకు చెందినవాళ్లున్నారు. వాళ్లే ఈ గుడిలోని ఈతముక్కలమ్మను ఆరాధిస్తున్నారు. ఈ గ్రామదేవత పుట్టుకకు సంబంధించిన ఒక కథ ప్రచారంలో ఉంది. ఇది పూర్తిగా స్థానిక కథ. జానపదలు కథ. వాళ్లు మౌఖికంగా అందిస్తున్నా కథ. ఈ కథ మిగిలిన గ్రామదేవతల చరిత్రలతో పోల్చి చూసినప్పుడు పెద్దగా మార్పులేవీ కనిపించడంలేదు. అందుకే ఇదో కల్పిత కథ అని చెప్పకపోయిన అక్కడి స్థానికుల నమ్మకంగా ప్రచారంలో ఉన్నదని మాత్రం చెప్పాలి.

ముందే చెప్పుకున్నట్లు స్థానికంగా ప్రజలు ధన, ధాన్య, ప్రాణ రక్షణకోసం గ్రామదేవతలను కొలవటం జానపదుల్లో కనిపించే సాధారణ లక్షణం. ఈ గ్రామదేవత చరిత్ర గురించి అక్కడ అర్చకులు మడనూరు మల్లయ్య చెప్తారు. సుమారు 400 ఏళ్ల పూర్వం ఈతముక్కల గ్రామం పూర్తిగా పశువులతో నిండి ఉండేది. అనేక రైతు కుటుంబాలుండేవి. నల్లపరెడ్డి వాళ్లు జమిందారులుగా చెలామణి అయ్యేవాళ్లు. వారికి అపారమైన గోసంపద ఉండేది. వాటిని పాలెగాళ్లు కాసేవాళ్లు. పాలెగాళ్లు తోలకెళ్లిన ఒక గోవు రోజూ ప్రస్తుతం గుడి ఉన్న పుట్ట దగ్గరకొచ్చి నిలబడేది. తీరా ఇంటికి వెళ్లాక దూడకు కూడా ఇవ్వడానికి దాని దగ్గర పాలు ఉండేవి కావు. కూలీలు పిండబోతే పొదుగులో పాలకు బదులు రక్తం వచ్చేది. దాంతో నల్లపరెడ్డి పాలెగాళ్లను తిట్టేవాడు. అలా మూడురోజులు అలాగే జరగడంతో ఆ ఆవుతో ఉన్న పాళెగాడు గొడ్డలి తీసుకొని ఆ ఆవును వెంబడించాడు. ఆ ఆవు పుట్టదగ్గర నిలబడి ఉండటం, పాలు పుట్టలోకి ధారగా పోవటం గమనించిన పాలెగాడు గొడ్డలితో పుట్టను నరికాడు. అప్పుడు లోపల నుంచి చిన్న పసిపాప గాయపడిన చెంపతో బయటకు వచ్చింది. 'ఎవరు?' అని కోపంతో అరుస్తూ అయిదుగురు పాలెగాళ్లను నరికి వారి తలలను కాళ్లకింద నొక్కిపట్టుకుందట.

ఇప్పటికీ ఆ దేవతా విగ్రహం కాళ్లకింద ఐదుగురి గుర్తులుగా చిన్న రాళ్లు ఉన్నాయి. అలాగే ఆ విగ్రహం చెంప మీద గాయం గుర్తులూ కనిపిస్తాయి. ఆ దేవత ఆగ్రహంతో ఊగిపోతుండడంతో ఆ విషయాన్నంతా అక్కడ ఆవులు మేపుకొంటున్న మరికొందరు నల్లపరెడ్డికి విషయాన్ని చెప్పారు. దాంతో నల్లపరెడ్డి అక్కడకు వెళ్లి పాపను క్షమాపన కోరాడు. పాప శాంతించి నల్లపరెడ్డితో 'కోడికూత, రోకలి పోటు వినిపించని చోట తనకు గుడి కట్టమని, ఊరికి దూరంగా అడవిలో తను వెలుస్తానని' చెప్పింది. ఆమె కోరిక ప్రకారం నల్లపరెడ్డి ఈతముక్కల గ్రామం పొలిమేరలో, ఆ పుట్టదగ్గరే గుడి కట్టించాడు. ఆ రోజు నుంచి ఆ దేవత గ్రామాన్ని రక్షిస్తూ ఉందని అక్కడి ప్రజలు నమ్ముతున్నారు. పైగా ఆటలమ్మ లాంటి వ్యాధులు సోకినప్పుడు కులాల వారీగా ఆమెకు సద్దులు పెడ్తారు. రెండేళ్లకోసారి లేదా మూడేళ్లకోసారి తిరునాళ్లు చేస్తారు. మాల, మాదిగ, చాకలి, మంగలి, రెడ్లు అనే కులాల భేదాలు లేకుండా అందరూ కలిసి ఆచారం ప్రకారం ఆ దేవతను ఆరాధిస్తారు. కోళ్లు, మేకలు గుడి దగ్గరకు తీసుకెళ్లి అమ్మవారికి బలిచ్చి, వాటిని అక్కడే వండుకొని తినేసి రాత్రిళ్లు ఇంటికి తిరిగివస్తారు. ఒకప్పుడు పొలి ఆచారం కూడా ఈ గ్రామంలో ఉండేదని పెద్దలు చెప్తున్నారు. అమ్మవారు ఒంట్లోకి రావటం కూడా జరిగే దట. రెండు లేదా మూడు రోజులు తిరునాళ్లు జరిగేవి. ఒక్కోరోజు ఒక్కో విధంగా అమ్మవారిని అలంకరించి పూజించేవాళ్లు. సద్దులుగా వేపాకుతో కప్పిన పెరుగన్నాన్ని నైవేద్యంగా పెట్టేవాళ్లు. కావిళ్లతో అమ్మవారి దగ్గరకు మోసుకువెళ్లే వాళ్లు. అలాగే ఆ ఊరిలో కొత్తగా పెళ్లైన జంటలు తప్పని సరిగా ఈతముక్కలమ్మ గుడికి వెళ్లి పూజ చేయడం ఆనవాయితీగా మారింది.

అదే విధంగా ఈతముక్కులలోనే జాలమ్మతల్లి అనే గ్రామదేవత ఉంది. ఆమెకు సంబంధించిన స్థానిక చరిత్రకూడా కనిపిస్తుంది. అయితే ఇది చరిత్రతో ముడి పడి ఉంది. జమిందారులు పరిపాలించే కాలంలో ఒంగోలును పాలించే వారికి, అద్దంకిని పాలించే వారికి మధ్య తరచూ గొడవలు వస్తూ ఉండేవి. దాంతో అద్దంకికి చెందిన జమిందారు తన బాధను అక్కడున్న మంత్రితో చెప్పుకోగా ఆయన, తనకు పరిచయం ఉన్న ఒక యోగీశ్వరుని సాయంతో ఒక శక్తిని పుట్టించి, ఆ శక్తి సాయంతో ఒంగోలు ప్రభువును నాశనం చేయాలను కుంటాడు. మంత్రి, సన్యాసి ఇద్దరూ కలిసి ఈత ముక్కలకు సమీపంలో ఉన్న మడనూరులో, సముద్రానికి వెళ్లే దారిలో ఉన్న రామలింగేశ్వరస్వామి గుడి దగ్గర పెద్ద యజ్ఞం మొదలు పెడతారు.

ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డు చెప్పినా పట్టించుకోకుండా, యజ్ఞానికి బ్రాహ్మణులను, ఋత్వికు లను రప్పించి సన్యాసి పెద్ద ఎత్తున నిర్వహిస్తాడు. అయితే యజ్ఞం 21 రోజులు పూర్తయ్యేసరికి లోపల నుంచి మంటలతో, వెలుగుతో, భయంకలిగించే విధంగా ఒక దేవత వాళ్ల ముందు ప్రత్యక్షం అవుతుంది. ఆ శక్తిని చూసి తట్టుకునే శక్తిలేక ఆ యజ్ఞం చేసిన సన్యాసి అక్కడికక్కడే మరణిస్తాడు. తోటి వాళ్లంతా భయంతో పరుగులు తీస్తారు. ఆ శక్తి మంటలతో ఎటు వెళ్లాలో తెలియక తూర్పు దిక్కుకు వెళ్తూ ఉంటే, అక్కడ పశువులు కాస్తున్న ఒక రైతు ఆమెను చూసి 'ఎవరు నువ్వు?' అని ధైర్యంగా అడుగుతాడు. అందుకు ఆమె "నేను ఎవరనేది తర్వాత చెప్తాను. నన్ను పుట్టించినవాళ్లు చనిపోయారు. ఈ శరీరం మంటలతో కాలిపోతూ ఉంది. వీటిని ఆర్పుకునే మార్గం చెప్పు' అని అడుగుతుంది. అందుకు ఆ రైతు కాస్త ముందుకు వెళ్తే సముద్రం ఉంది. అక్కడకు వెళ్లు. సముద్రంలో మునిగి మంటలార్పుకొని రా.. అని చెప్తాడు. ఆమె సముద్రంలో మునిగి మంటలు ఆర్పుకొని చల్లగా తిరిగి వస్తూ ఆ రైతును చూసి, 'నేను దేవతను మీ గ్రామాలను చల్లగా కాపాడతాను. నేను ఉండటానికి స్థలం కావాలి. అయితే అక్కడకు కోడికూత, రోకలి పోటు వినిపించకూడద'ని చెప్తుంది. అతను 'ఊరికి దక్షిణంగా వెళ్లు.. ఆకు తోటలు చాలా ఉన్నాయి' అని చెప్తాడు. అతను చెప్పిన ప్రకారం దేవత ఆకుతోటల్లో శిలలా వెలి స్తుంది. ఆ రోజు నుంచి మడనూరు, ఈతముక్కల గ్రామ ప్రజలు ఆమెను దేవతగా కొలుస్తున్నారు. జ్వాలల్లోంచి పుట్టింది కాబట్టి ఆమెను జ్వాలాముఖి, జాలమ్మ అని పిలుస్తారు. ఆ దేవతే ఆ మాట చెప్పిందని అంటారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

ఆ తర్వాత ఏడాదికి ఒకసారి రెండు గ్రామాల ప్రజలు కలిసి ఆమెకు తంతులు (తిరునాళ్లు) జరిపేవాళ్లు. ప్రస్తుతం ఐదేళ్లకొకనాడు జరుగుతుంది. అలాగే ఈ దేవత గుడిలో బ్రాహ్మణులు పూజారులు కాదు. జంగమదేవరలు పూజాధికార్యక్రమాలు నిర్వహిస్తారు. కోళ్లు, మేకలు బలిస్తారు. సద్దులు పెడతారు. ఊళ్లకు ఏ అరిష్టం జరగ కుండా ఆ దేవత కాపాడుతుందని నమ్ముతారు. బంగాళా ఖాతంలో తుఫాను ఏర్పడినప్పుడల్లా... సముద్రం పొంగి ఊళ్లోకి రాకుండా జాలమ్మతల్లి తన పైటచెంగు అడ్డు పెడుతుందని నమ్ముతారు. ఇంతవరకు సముద్రం ఎప్పుడూ ఊరిలోకి వచ్చి ఎరగదు. ఈతముక్కల్లో జాలమ్మతల్లికి గుడి కట్టారు. ఆ రెండు గ్రామాల ప్రజలే కాకుండా చుట్టుపక్కలున్న మండలాల నుంచి కూడా ఈ గుడికి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. నెల్లూరు, తమిళనాడు నుంచి కూడా జాలమ్మతల్లి దగ్గరకు వచ్చే వాళ్లు ఉన్నారు. ఈ గుడికి జరిగే కార్య క్రమాలలో కూడా బ్రాహ్మణులు పాల్గొనడం తక్కువ. దళిత, బహుజన కులాలే ఎక్కువగా పాల్గొంటాయి. ఊరికి ఏ అపచారం జరిగిందని అనుమానం వచ్చినా వెంటనే అమ్మవారికి పూజలు చేస్తారు. ఇప్పటికీ ఊరి మధ్యలో ఉన్న జాలమ్మ చెట్టు దగ్గర భజనలు చేస్తారు. రాత్రిళ్లు చిన్న అమ్మాయి రూపంలో తిరుగుతూ ఊరిని కాపాడతుందని నమ్ముతారు. గ్రామంలోని పెద్దవాళ్లు గజ్జల చప్పుళ్లు వినిపిస్తుంటాయని చెప్తుంటారు. ఇది గ్రామ ప్రజల నమ్మకంతో, కలిసి బతికే ఉమ్మడి జీవితంతో ముడిపడిన కథ. ఇది కల్పితం కాదని వారి వంశీకులు ఇప్పటికీ చెప్తుంటారు. అందుకే గ్రామదేవతలనే అంశం ఊళ్లలోని సామూహిక బంధంతో ముడిపడని విశ్వాసం. ఐక్యతకు చిహ్నం. ఎక్కువ తక్కువలు, భేదభావాలు లేకుండా అందరిని కలిసి ఉండే జీవన విధానం. ప్రతి నమ్మకం వెనుక ఒక కారణం ఉంటుంది. దానిలో సామూహిక తత్వం దాగి ఉంటుంది.

క్రమంగా గ్రామాలు నగరాలకు వలసలు పోవటం ప్రారంభమైంది. గ్రామాల్లోని పెద్దలు చనిపోవటం చదువుకున్న యువత సొంత ఊరి గురించి, అక్కడి సంప్రదాయాల గురించి, గ్రామదేవతల గురించి పట్టించుకోవటం మానేశారు. పైచదువులు, డబ్బు సంపాదన, ఉద్యోగం, సుఖవంతమైన జీవితం కోసం దేశం, రాష్ట్రం నలుమూలలకు వెళ్లిపోతున్నారు. విదేశాలకు వెళ్లి, స్థిరపడుతున్నారు. గ్రామంలో ప్రధానంగా సాగే ఒకప్పటి పద్ధతులు, ఆచారాలు, సంప్రదాయాలు కనుమరుగయ్యాయి. కులవృత్తులు కూడా పోతున్నాయి. గ్రామ ప్రజల మధ్య అన్యోన్యతలు, ఆప్యాయతలు తగ్గిపోయాయి. రాజకీయాలు ప్రవేశించి ప్రజలను పార్టీలుగా చీల్చాయి. దాంతో వైరాలు వాటికవే వచ్చేశాయి. పైగా ఎలాంటి లాభం లేని పనులు చేయడానికి ఇష్టపడని నేటితరం గ్రామదేవత గురించి పట్టించుకోవటం పూర్తిగా మానేశారు. ప్రస్తుతం తిరునాళ్లు అనేవి పూర్తిగా జరగటం లేదు. ఏడాదికో, రెండేళ్లకో ఓసారి సద్దులు మాత్రం పెడ్తున్నట్లు అక్కడి వాళ్లు చెప్తున్నారు.

వీటన్నింటి వెనుక వారికి తెలియకుండానే ప్రపంచీకరణ ఆలోచనా విధానం, అమలు ఉంది. 1990లలో అప్పటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన విదేశీ విధానం ఉంది. నేడు ప్రతి గ్రామంలో తిష్టవేస్తున్న పెద్దపెద్ద వ్యాపార సంస్థల కుట్ర ఉంది. ప్రతి వ్యక్తిని తెలియకుండానే వారి సంస్కృతికి దూరం చేసే అగ్రరాజ్యాల వాణిజ్య సూత్రం ఉంది.

ప్రతి వ్యక్తి సొంత ఊరిని, అక్కడి సాంస్కృతిక సంపదను, అక్కడి పాడిపంటలను, అక్కడి సంప్రదాయ ఆచారాలను మర్చిపోతున్న తరుణం ఇది. జానపదమే నిజమైన మనిషి వ్యక్తిత్వం. వాటిలో గ్రామదేవతలు, వాటికి జరిగే ఉత్సవాలు, పూజలు, తంతులతో మనుషుల అస్తిత్వం ముడిపడి ఉంది. ముఖ్యంగా దళిత, బహుజన, గిరిజనుల జీవితంలోని అనేక అంశాలకు సాక్ష్యాలు ఈ గ్రామదేవతలు, స్థానిక చరిత్రలు. మాతృస్వామ్య వ్యవస్థను నేటికీ గుర్తుచేస్తున్న వీటన్నింటిని సేకరించి, డిజిటలైజేషన్ చేసి భద్రపరచాల్సిన అవసరం ఉంది. మన వారసత్వం, నిజమైన అస్తిత్వ చరిత్రలు కనుమరుగు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత నేటి తరం మీద ఉంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలుగులో వచన కవిత్వానికి జెండా ఊపిన శిష్ట్లా

- డా. గోనిపాటి ధర్మారావు, సహాయ ప్రాంతీయ సంచాలకులు, ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం.

పఠాభి తరువాత భావకవిత్వంపై తిరుగుబాటుగా సరి కొత్త ప్రయోగాలు చేసినవారిలో శిష్ట్లా ఒకడు. 1931 నుండీ ఈయన ఈ రకమైన రచనలు చేస్తూ వచ్చినా, 1938లో విష్ణుధనువు, నవమిచిలుక అనే పుస్తకాలను ప్రచురించడం ద్వారా వెలుగులోకి వచ్చాడు. ఇతనికి వినాయక పండితుడు, ఉమా, విజయ మహేశ్వరం మొదలైన పేర్లు కూడా ఉన్నాయి.

తన కవిత్వాన్ని తానే నిర్వచిస్తూ తనది "ఇది పూర్వ కవిత్వం గాదు, నవ్య కవిత్వంగాదు. భావకవిత్వం గాదు.... ప్రాహ్లాద కవిత్వం....." ప్రాహ్లాదకవిత్వం ఆరిపోయే దీపాన్ని రగుల్పుతుంది. పరుగెత్తే పామరుణ్నీ నిలేస్తుంది అన్నాడు. తెలుగు సాహిత్య చరిత్రకారులుగానీ, విమర్శకులు గానీ చాలామంది శిష్ట్లాను అభ్యుదయకవుల వరుసల్లోనే పెట్టారు. "అభ్యుదయ కవిత్వతాత్త్వికభూమికకు దూరంగా ఉన్న శిష్ట్లాను ఆ వరుసలో చేర్చడం సమంజసం కాదని, సముచితం కాదని" అన్న వెల్చేరు నారాయణరావు కూడా ఈ ప్రయోగకవుల్ని అభ్యుదయ విప్లవంలోనే పొందుపరచడం విశేషం. "కేవల ప్రయోగవాద రచనలకి ఏ స్థానమూ ఉండదు కాబట్టి వాటిని ఉపేక్షించాడని" తానే చెప్పుకున్నాడు.

ఈ ప్రయోగవాదుల్లో ఒకడయిన నారాయణబాబు శిష్ట్లా గురించి చెప్తూ "ఈనాడు అతి నవీనులని బోర విరుచుకు తిరుగుతున్న అతి నవీనులకు కూడా నవీనుడు శిష్ట్లా. ఏనాడో అతి నవీనమైన మార్గంలో కవిత్వం రాసి లోకంచేత విస్మరింపబడ్డాడు" అని అంటాడు.

"కవిత్వంలో ఈయన ప్రత్యేకత ఏమిటంటే పదాల పునఃసృష్టి (Re-creation) కోసం ప్రయత్నం చేసాడు. ఆదిని పదాలు స్ఫటికాల (Crystal) లాగ, బహుముఖాలతో, జీవన చైతన్యంతో, నిండుగా కవులను పులకితం చేసేవి. రాను రాను పాతపడి, అరిగిపోయి, అందరి నోళ్ళా పడి, అర్థం తూచుకొనే గుండు రాళ్ళులా తయారయాయి. మర్మం తెలుసుకున్నది శిష్ట్లా కవిత్వం"

## శిష్ట్లా : వస్తువు

అభ్యుదయ కవిత్వంలోని ప్రగతిశీల భావాలు బలంగా లేకపోయినా ఈయన కవిత్వంలో కొంత సామాజిక స్పృహ కన్పిస్తుంది అక్కడక్కడా. పేదరికాన్ని వర్ణించడం 'బీదమందు' కవితలో.

"తూర్పు తెల్లారింది, వాన వెలిసింది! అమ్మ!
పోయే! మందెట్టుకు రాయే!
కాండబ్బైనా లేదు, కాసైనా లేదు, కాత్తె
కూత్తెకైతే డాక్టరురాడే!
సందేళ సలిజరం ఊర్కోపోదే" (శిష్ట్లా, శిష్ట్లా కవిత్వం, పు. 58) అంటూ సాగిపోతుంది. అలాగే పౌరాణిక కథల్ని కవిత్వంలో వాడుకోవడం 'అగ్రహారబ్బడితె', 'చిన్నమ్మాయి' పద్యంలో కన్పిస్తోంది. అలాగే చరిత్రలో రాజవంశాన్ని ఉపయోగించుకోవడం "చెప్పహోయ్ చూదాము.." అనే రచనలో (విష్ణుధనువు) కన్పిస్తుంది. ఇతని కవిత్వంలో స్త్రీకి సముచిత స్థానం లభించిందనే చెప్పాలి. 'ప్రేమ' కూడా ఇతని కవితా వస్తువే. విష్ణుధనువులో ప్రేమ అంటే ఏమిటో నిర్వచనం వేస్తాడు. స్త్రీని గూర్చి రాసిన వాటిల్లో 'ఊట్ల వెర్రెమ్మ', 'పుట్టింట పిల్ల' 'ఆడవాళ్ళు', జ్ఞాపకాలు అనే ఖండికలు ముఖ్యమైనవి. 'జ్ఞాపకాలు' ఖండికలో పుట్టింది మొదలు చనిపోయే వరకూ అందరూ ఉండి ఏకాకి అయిన స్త్రీ కథను అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరించాడు శిష్ట్లా.

"నాపేరు లీల!
ఆ ఊరి గోల పడలేక నేను పారుగూరొ
చ్చాను'. అందాల వాడే అడవిలో ముం
చాడు! అందరిని తలచుకొని అల్లాడు
చున్నాను.

ఏకాకినై నేను దూరాన ఉన్నాను. దారినే
పోయే అమ్మలక్కలు జేరి ముండ్ల చూపులు
చూచి అడుగుతూ పోతారు.
ఏకాకినై నేను నడిజాము వరకూ మేలుకొని
మృత్యువును బ్రతిమాలుకొన్నాను!
అమ్మమ్మ జ్ఞాపకం, అమ్మ జ్ఞాపకం, చెల్లెలు
జ్ఞాపకం! నాన్న జ్ఞాపకం, అన్నలే జ్ఞాపకం
తమ్ములే జ్ఞాపకం! రావేల! రావేల రాత్రి వచ్చింది!
మధురమౌ మగవాడ నాప్రేమ నిజమోయి....."

(శిష్టా, శిష్టా కవిత్వం, పు. 56)

## సి. నారాయణ రెడ్డి తన సిద్ధాంత గ్రంథంలో శిష్టాను ఉద్దేశించి :

"తన కవిత్వము ప్రజలలోని పామరత్వమును తొలిగించి, స్తబ్ధత తుడిచివేసి వారిలో ఆశలు పెంపొందించునని, జాగృతి కలిగించునని ఈ విధముగా అది ప్రయోజన గర్భితమని కవి అభిప్రాయం"అన్నారు. ఇలాంటి విమర్శకులు శిష్టాను ప్రయోగవాది అంటానే ఇతనిని కూడా అభ్యుదయ కవిత్వ ఆద్యులలో ఒకడని చెప్పడం జరిగింది. ఇది అర్థ సత్యమే. శిష్టా కవిత్వం ప్రజా సామాన్యానికి సంబంధించినది, గ్రామీణ జీవిత చిత్రణ జరిగింది. అయినప్పటికీ అభ్యుదయ కవిత్వ తాత్త్వికత లోపించింది.

శిష్టా తాను వ్రాసిన కవిత్వంలోనూ ప్రణయాన్నే చూపినప్పటికీ అది భావకవుల ప్రేమకాదు. ప్రేయసీ ప్రియుల్ని కేవలం శృంగార నాయికా నాయకులుగా చూపడం ఇతనికి తెలీదు. ఇక్కడ (విష్ణుధనువు) నాయికా నాయకులు సీతారాములు. అయితే సీతను వర్ణించినపుడు భావకవుల్లా శృంగార వర్ణనలు చేయలేదు.

"తల్లివలె చల్లని కనులతో జూతువు గాన
తల్లీయనగ తప్పులేదు!
చెల్లెలివలె చనువు మీర సరస జేరుదువు గాన
చెల్లీయన చేటు రాదు
మేధామద విదళిత వికసితవు గాన
మైథిలి వందు!
ఆత్మాంతరమున 'విట్' దేహవాసివి గాన
వైదేహినందు!
చాళుక్య హొయసాల చిన చోడాంబవు గాన
సాలగ్రామ సీత నందు!
కుండలినీ షట్చక్రవతికి యధిపతివి గాన
క్షేత్రవతి వందు
అందును, ఎందును లేని నామముల నేరి కూర్చి
గడియకొకరీతి పిలుతు
అదియును గాక అన్నిటికి మిన్నయౌ
శ్రీవి నీవేయని........." (శిష్టా, శిష్టా కవిత్వం, పు. 50)

నవమిచిలుకలో గ్రామీణ జీవిత చిత్రణ, స్త్రీ జీవిత చిత్రణ ఎక్కువగా కన్పిస్తాయి. "నవమిచిలుకలోని వస్తువు ప్రజాసామాన్యమునకు సంబంధించినది, ఇది అచ్చమైన ప్రజాకవిత్వము" సి. నారాయణ రెడ్డి అంటారు.

## శిష్టా శైలీ నవ్యత :

మాత్రాప్రస్తావన విడిచిపెట్టింది శిష్టా కవిత్వం. సాంప్రదాయక ఛందస్సును విడిచి పెట్టింది. వచన కవిత్వాన్ని ప్రారంభించినది కూడా శిష్టానే అని చెప్పవచ్చు. వచన కవిత్వం అభ్యుదయ కవిత్వరూపం అని భావించడం చేతనే శిష్టాను పెక్కుమంది విమర్శకులు ఇతనిని అభ్యుదయకవుల సరసన స్పష్టంగా చెప్పాలంటే, వారికి ముందు వరసలో పెట్టారు.

ఇతను ఛందస్సులో ప్రయోగాలు చేసాడు. సంప్రదాయ వాక్యాలు, జానపద వరుసలు, శుద్ధవచనం వీటన్నింటినీ కలగలిపి ఒక నూత్నశైలిని ప్రపంచానికి పరిచయం చేసాడు. అప్పటివరకూ తెలుగు సాహిత్యంలో కన్పించని ఈ శైలి పెద్ద దుమారాన్నే లేపింది. ఇతనిశైలిని గూర్చి రాస్తూ వడలి మందేశ్వరావు - ఇలా అంటారు.

"He was keen on creating an atmosphere with new rhythms rather than producing a closely knot poem conveying well defined meaning in traditional style"

ఇతని శైలిలో- గ్రాంథిక రూపాల్ని ప్రయోగించి వెన్వెంటనే వ్యావహారిక రూపాల్ని వాడడం కన్పిస్తుంది. ఈ

రెండింటినీ కలగా పులగంగా వాడడం జరిగింది. దుష్ట సమాసాల్ని, అపరూపాల్ని యథేచ్ఛగా వాడడం, భాషను కావాలనే మార్చి వాడడం కన్పిస్తుంది. దీని గురించే సి. నారాయణ రెడ్డి.

"ఇవి తెలియక చేసిన తప్పులమాటకు వీలులేదు. భాషను ప్రయత్నపూర్వకముగా వికృతమొనర్చవలెనను తిరుగుబాటు మనస్తత్వమిది" అంటారు.

భావచిత్రాన్ని వాడడంలోనూ ఈ కవి చాలా నిపుణత గల్గినవాడే. వెన్నెలను వర్ణించే ఖండిక ఒకటిచూద్దాం.

"ఇటు వెన్నెల అటు వెన్నెల
నడి శిరసుకు శ్రీవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
చిరునవ్వుల కలవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
విరులల్లిన జడవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
చెంగల్వల జిగివెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఈశ్వరునికి తలవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఆకాశము మొలవెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
మనసుల్లో మరువెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల
ఎటుచూచిన కనువెన్నెల
ఇటు వెన్నెల అటు వెన్నెల"

ఇలా పదహారు పాదాల్లో వెన్నెలను వర్ణించి..... ఒక్క సారిగా

"పిచ్చెత్తే వళ్ళంతా వెర్రెత్తే దిక్కులకై పరుగెత్తే
నా మనసున వెన్నెల్లో ప్రేయసి లేక
అమావాస్య! అమావాస్య! అమావాస్య!

(శిష్టా, శిష్టా కవిత్వం, పు. 20-21)

మహాలయ అమావాస్య! అంటూ వచనంలో దిగి ఇలా ముగిస్తాడు. అచ్చువేయడంలో కూడా "మహాలయ అమావాస్య" అని పెద్ద సైజులో అచ్చువేసి నవ్యత సాధించాడు. అలాగే విష్ణుధనువు కావ్యం నిండా హిందూ పురాణాలలోని అనేక ప్రతీకల్ని వాడాడు. ఈ పౌరాణిక ప్రతీకలు వాటితోపాటు చారిత్రక సంకేతాలు, రాజ వంశాలు, పేర్లు, స్థలాల్ని కూడా శిష్టా తన కావ్యంలో చూపించాడు.

"చెప్పవోయ్ చూదాము ఏ మాయ రూపముగ
సమృద్ధ సామ్రాజ్య శిల్పకళల కోవిదులు
శాతకర్ణి రాజు లేదారి పోయిరో
శౌర్యోదారులై రాష్ట్ర కూటులూ, వీర పల్లవులూ
సాహస ధైర్య స్థైర్యోపాసకులా ఓరుగంటి ఒంట
రులు....."

(శిష్టా, శిష్టా కవిత్వం, పు. 25)

శిష్టా కవిత్వంలోని శైలిని సమీక్షస్తూ ఆరుద్ర, "భారతంలో నన్నయ గారు వచనాలకు వాడిన టెక్నిక్కునే ఆధునిక కవిత్వంలో ఉమామహేశ్వరం అవలంబించాడు. భారత కవుల అక్షర గణబద్ధ ఛందస్సుల శృంఖలాలు తెంచుకొనడం కష్టం. అవి కవి కాళ్ళకు చుట్టుకొన్నట్లు ఫీలవగానే వృత్తపాదాన్ని ఖండించి, వచనం జోడించే విలక్షణమైన ధోరణిని ఉమామహేశ్వరం మొదలు పెట్టాడు." అంటూ కొన్ని ఉదాహరణలు చూపిస్తాడు.

"లలనా వెన్నెల వేళ తీయని - ఇది మత్తేభ వృత్తం ఆరంభం.

ఆ బ్రహ్మమున్నాదినే ఏలా వ్రాయగ లేదు నిన్ను దుటిపై - శార్దూలము

ఝుం ఝూమారుత ఝర్ఝరీ ధ్వనులు - శార్దూలము ప్రారంభం"

ఆంధ్ర సంస్కృతిలోని అనేక సంప్రదాయాన్ని నుడికాలాల్నీ, జాతీయుల్ని అత్యంత మనోహరంగా తన కవిత్వంలో వాడుకొన్నాడు ఇతడు. యాసలో కవిత్వం రాయడం కూడా ఇందులో కన్పిస్తుంది. 'బీదమందు' ఖండిక దీనికి ఉదాహరణ.

విశ్వనాథ ఈయన కవిత్వంపై తన అభిప్రాయం చెప్తూ-

"ఈయన కవిత్వంలో మాత్రాప్రస్తావనలేదు, పాద నియమము లేదు, కొత్తపాదము మొదలు పెట్టినపుడు సర్వత్ర విశేషార్థ ద్యోతకముగా మొదలు పెట్టబడిందని చెప్పుటకు వీలులేదు. కానీ ప్రతిగీతంలోనూ ఒక ఊపు ఉంటుంది. ఆ ఊపు మధ్య మధ్య విరిగిపోతూ ఉం టుంది." అంటారు.

## కుందుర్తి తన వ్యాసాలలో :

"భావకవిత్వంపై జరిగిన ప్రొలిటేరియన్ విప్లవానికి ఆయన మార్గదర్శకుడు. ప్రయత్నపూర్వకంగా ఛంద స్సును వికృతం చేయడం, విశృంఖలంగా రాయడం, వ్యాకరణాల పట్ల నిర్లక్ష్యత ప్రదర్శించడం వంటి కొత్త మార్గాలను తొక్కడమే కాకుండా వచన కవితలో మొట్ట మొదటి కావ్య సంపుటిని కూడా ఆయనే ప్రకటించాడు." అని అంటాడు. రచనా శైలిలో ఇతను అనేక మార్పుల్ని ప్రయత్నపూర్వకంగా పరిచయం చేసినప్పటికీ కవితా వస్తువులో చెప్పుకోదగిన మార్పు తీసుకురాలేకపోవడం ఇతన్ని ప్రయోగవాదుల సరసన మాత్రమే నిలబెట్టింది. ఎటువటి ప్రత్యేక సాంఘిక ద ృక్పథాన్ని, సిద్ధాంతాన్ని ఇతని కవిత్వం ప్రకటించలేదు. సమాజం ఇతని కవిత్వంలో కన్పించి నప్పటికీ అది అభ్యుదయవాదంగా పిలువబడే సిద్ధాం తంగా రూపాంతరం చెందలేదు. నవమి చిలుకలోని వస్తువు ప్రజాజీవితానికి సంబం ధించినది తీసుకున్నప్పటికీ అది అభ్యుదయవాద స్థాయిని అందుకోలేదు. తద్వారా కవితా వస్తువు సంబంధించినంత వరకూ కొత్తగా శిష్టా వెలిబుచ్చింది ఏమీలేదు.

## ఉపయోగపడిన పుస్తకాలు :

1. ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం, తెలుగు అకాడమి, హైదరాబాదు, (సం. 4), 2007.
2. ఆంజనేయులు, కుందుర్తి, కుందుర్తి వ్యాసాలు, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాదు, 1987.
3. ఆర్వియార్, సాహిత్య తత్వం, ప్రథమ ముద్రణ, విశాలాంధ్ర, హైదరాబాద్, 1988
4. డా. ప్రసాద్, ఎటుకూరి, శిష్టా ఉమామహేశ్వరరావ్ కవిత్వం %--% సమాలోచనం, అరసం, 1998.
5. నారాయణరావు, వెల్చేరు, తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, హైదరాబాదు బుక్ ట్రస్ట్, హైదరాబాదు, 1987.
6. నారాయణరెడ్డి, సి, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు, ఆరవ ముద్రణ, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 2007.
7. రంగనాథాచార్యులు, కె.కె, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, ద్వితీయ ముద్రణ, నవోదయ, హైదరాబాద్, 2005.
8. MandeswaraRao, V, Modern Poetry in Telugu, Self, Hyderabad, 1996.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# భారతీయ కుటుంబ సంబంధాలు - యువత నాడు - నేడు

- డా॥ భరోతు సరస్వతి, తెలుగు అధ్యాపకురాలు, ఐడియల్ కాలేజ్ ఆఫ్ సైన్స్& ఆర్ట్స్ సామర్లకోట రోడ్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా.

సామాజిక, మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయంలో ఒకే గొడుగు నీడలో ఉంటూ, మానసిక, ఆర్థిక సహయ సహ కారాలందుకుంటే,సహజ ఆమోద యోగ్యమైన సంబందాలున్న స్త్రీ పురుషులూ వారి పిల్లలూన్న సమూహమే కుటుంబం.

కాలాలు మారిన, ఏళ్ళు గడచిన భారతదేశంలో ఇప్పటికీ కుటుంబ వ్యవస్థ నలచి ఉంది.విశ్వసనీయత, సమాగ్రత, ఏకత అనే మూడు మూలస్తంభాల మీద మన కుటుంబ వ్యవస్థ ఆధారపడి ఉంది. అందరి సుఖంలో నా సుఖం ఉంది. వారి కోసమే నా జీవితం అనే త్యాగ భావన భారతీయ కుటుంబానికి ప్రాతిపదిక సామాజంలో కుటుంబం అత్యంత కీలకమైనది. ప్రప్రథమ సమూహం,కుటుంబమే,వ్యక్తి సమాజంలో ఒంటరిగా మనజాలడు.కుటుంబంలో తాను మమేకమై జీవించడం మానవుడు ఆనందాన్ని పొందుతాడు. అందుకే పుటుక తోనే మనిషికి కుటుంబంతో విడదీయలేని అనుబంధం ఏర్పడుతుంది.

పోషణ, భద్రత కల్పించడం కుటుంబ వ్యవస్థలో మౌలికాంశాలు, కుటుంబ వ్యవస్థకు పునరుత్పత్తి ప్రాథమిక లక్షణం. కుటుంబంలో అనుభవాలు, అనుభుతులు కాలానుగుణంగా మారుతుంటాయి. పిల్లలకు సామాజంలో ఒక స్థానాన్ని కల్పించడం, విచక్షణ జ్ఞానాన్ని వ్వడం, సంస్కృతిని వారసత్వంగా అందించడం కుటుంబ వ్యవస్థ ప్రధాన ఉద్ధేశాల్లో ఒకటి. నేటి కుటుంబ వ్యవస్థ, నిన్న మొన్నటిది కాదు.దీనికి వేల సంవత్సరముల చరత్ర ఉంది. భారతీయ పునాదులే కుటుంబ వ్యవస్థపై ఆధార పడి ఉన్నాయి.

మన రామాయణ, మహా భారతాలు ఇందుకు ఉదాహరణంగా చెప్పవచ్చు. కుగుంబమంటే ఎలా? ఎలా ఉండకుడదో ఈ రెండు గ్రంధాల ద్వారా తెలుసుకోవచ్చు. పెద్దన తన ''మనుచరిత్ర''లో వానది భాగ్యవైభవము వానిది ''పుణ్య విశేషమైన్నయిన్''అనే పద్యంలో సిద్దుని చేత గృహస్థత్రము గొప్పతనాన్ని ఈ విధంగా చెప్పించాడు. గృహస్థుడు, చెవిటివారు,కుంటివారు, గ్రుడ్డివారు, బిచ్చగాంఢ్రు, బ్రహ్మచారులు, వానప్రస్తులు, భౌద్ధ భిక్షువులు, దిగంబరులు, కాపాళికులు మొదలైన వారం దరికి సమీపమున తంగేడి చెట్టుయందు పెట్టబడిన తేనే పట్టు వంటివాడు. ఓడియందు వున్న పెట్టెలోని ధనము వంటివాడు. ఫలించిన దొడ్డిలో నున్న కల్పవృక్షము వంటి వాడు, పశువుల కొట్టములో ఉంచిన కామధేనువు వంటి వాడు. అంతము లేని అమృతపు దిగుడు భావి లాంటి వాడు, సమీపమున నున్న బంగారపు కొండవంటి వాడు. ఎడారిలో చలివేంద్రము వంటివాడు. ఆకలి వేళలో లభించిన పైరు వంటివాడు అని చెప్పించాడు అంటే గృహస్థ ధర్మానికి సరియయిన ధర్మము మరొకటి లేదని పెద్దన అభిప్రాయం.

ఎనబై నాలుగు లక్షల జనరాశులలో అత్యుత్తమ జన్మగా మానవ జన్మగా పేర్కొనబడింది. 'జంతునాం నర జన్మ దుర్లభమ్' అని చెప్పబడింది. నరజన్మ లభించడమే చాల కష్టం. మానవ శబ్ధం చాలా ప్రాచీనకాలం నుంచి ఉన్నట్టు తెలుస్తుంది.

## మానవుడు :

'వైపస్వత మనువు నుండి మానవులు పుట్టినట్లు' మహాభారతం చెప్తోంది. మానవ శబ్ధానికి అనేక పర్యాయ పదాలు కనబడుతున్నాయి.

''మనుష్యా మానుషా మర్త్యామనుజా మానవా నరా:'' (అ.కో.ద్వి.కాం.మనష్య వర్గ) 'మనోర సత్వాన్ని మనుష్యా:'' మనువు సంతతివారు కాబట్టి మనుష్యులు,మనుష్యులు అయ్యారు.' మ్రియంత మర్త్యఔ'- మృజ్ ఆడా త్యాగే అను ధాతువు నుంచి 'మర్త్య శబ్ధం వచ్చింది మృతిని పొందే వారు మర్త్యులు అని ఒక అర్ధం. మర్త: అంటే

భూలోకంల పుట్టినవారు మానవులు అని మరొక అర్ధం మానోర్జాతా మనుజా:"- జనీప్రాదుర్భావే అనే ధాతువు నుండి మనుజ శబ్ధం ఏర్పడింది. మనువు వలన పుట్టిన వారు మనుజులు.

## మనోరిమ్ మానవా :

మనువు సంబంధమైన వారు మాననవులు. 'న్నణంతి నయంతి సర్వం స్వవశమిత నరా:' అనుధాతువు నుంచి నరశబ్ధం వుట్టింది. అన్నిటిని తమ వశం చేసుకోగలిగిన వారు నరులయ్యారు.

పై నిర్వచనాన్ని పరిశీలిస్తే మనువునకు పుట్టినవారు, మనువు సంతతివారు మానవులు అని తేలుస్తుంది.

1. మను - జీవించు, వర్తించు
2. మనుగడ - జీవనం, జీవనోపాయం అనే రుపాలు కూడ వచ్చాయి. మనువు అనే శబ్ధం వివాహ సంబంధంలో కూడ కనబడుతుంది.

దేవతలలో కుబేరుని 'మనుష్యధర్మడు' అంటారు. మనుష్య ధర్మాధనపో రాజ రాజోధనా దివ:' (అ.కో. ప్ర. కా- స్వర్గవర్గ) 'మనుష్యాణం ధర్మ ఇవ ధర్మోయస్య, న:మనుష్యధర్మా' మనుష్యుల ఆచారాల వంటి ఆచారం గలవాడు.

ఈ విధంగా మనుశబ్ధం మానవ శబ్ధంగా పరిణమించినట్లు, రూపాంతరం చందినట్లు తెలుస్తుంది.

## మానవుడు - మనస్సు :

మానవ జన్మ ఎంత ఉత్కృష్ణమైనదో అంతకంటే ఎక్కువ ప్రాధాన్యతను కలిగినది మనుసు. కేవలం ఈ మనసును బట్టే మానవుడు ఇతర మానవుల కంటే కూడా అధికుడుగానో అల్పుడు గానో కాక మానవకోటితో కూడ ఎవరికి వారు తమ తమ ప్రత్యేకతను కలిగి ఉన్నాడు.

అచలము, చంచలమైనది మనసు. దీనిని గలిగిన మనుష్యుడు విచిత్రముగాను,ఆశ్చర్యయరముగాను ప్రవర్తించు స్వభావము కలవాడయ్యాడు.ఆ మనసునే ఆయుధంతోనే మనిషి తన మేధస్సును పదును పెట్టిన భూమి మీద జీవించడమే కాక గ్రహాంతరయానం చేశాడు. ఒంటరిగా కాక సమూహంగాను, గుంపులు, గుంపులుగా సంచార జీవితాన్ని గడుపుతూ మానవుడు క్రమంగా స్థిర జీవిగా మార్పు చెందుతూ కుటుంబ జీవనానికి అలవాటు పడ్డాడు. మనిషి తన ప్రవర్తనతోనే ఆధ్యాత్మికం గాను ఎదిగి స్వర్గ, నరకాలనే వాటిని కనుగొన్నాడు. ఆ మనిషే తన చిత్తాన్ని నిలిపి భవిష్యధ్ధార్శనం చేస్తున్నాడు కూడ. ఎన్నో వింతలకు విశేషాలకు మనిషి నలువెత్తు సాక్ష్యంగా నిలుస్తున్నాడు.

## తొలినాళ్లల్లో కుటుంబ వ్యవస్థ :

మొదట్లో సంచార జీవితాన్ని గడిపే మనిషి జంతుకు మల్లే ఆకలి వేసినపుడు తిండి దైహికవసరాలు తీర్చుకొనే జీవిగాను ఉన్నాడు. అప్పుడు జగమే కుటుంబంగా మనావుడు జీవించాడు. కాని రాను, రాను ప్రకృతి మనిషిని ఉన్నదాన్ని దాచుకోవడానికి అలవాటు పడేలా చేసింది. అతి చిన్న ప్రాణియైన చీమను చూచి ఇప్పుడు దొరకని ఆహారాన్ని ఇంకొకసారికి దాచడం అలవాటు చేసు కున్నాడు. దైహికావసరాలు పెరుగుతూ వచ్చాయి. స్వేఛ్ఛా జీవిగా ఉన్న మనిషి కొన్ని కట్టుబాట్లను ఏర్పరుచు కున్నాడు. కుటుంబ నిర్మాణ ప్రణాళిక రచన చేశాడు.ఆ మనిషే తనతోటి మానవులతో సత్సంబంధాలనే నెలకొల్ప డానికి కుటుంబ జీవనాన్ని ఆలంబనాన్ని చేసుకున్నాడు.

ఆ మనిషి తాను సుఖజీవనం గడపడానికి ఏర్పరచు కున్న కుటుంబంలో ఎన్నో బాంధవ్యాలను బంధాలను ఏర్పరచుకున్నాడు. బాధ్యతలను కుదుర్చుకున్నాడు.నేడు ఆ బాధ్యతల వలయాన్ని ఛేధించడానికి వస్తుమార్పిడి నుండి డబ్బు అనే మాధ్యమాన్ని కనుగొన్నాడు. నేడు ఆ డబ్బు ఆస్థిపాస్తులుగా ఏర్పడి మనుషుల మధ్య ఉన్న బంధుత్వాన్ని పలుచన చేసింది. ఆ స్థలంలో స్వార్థం పూరించబడింది. ఈ స్వార్థం వల్ల దివ్యపథంలో అడు గిడాల్సిన మనిషి జనన చక్రంలో కొట్టుమిట్టాడుతూ ఎన్నో వైషమ్యాలకు, వైరుధ్యాలకు కారణభూతులవుతున్నాడు. ఒక్క మానిషే అటుస్వార్ధజీవిగా ఇటు నిస్వార్ధజీవిగా మెలిగి మనిషిగా ఇదిమిద్ధంగా అంచన వేయ్యడానికి వీలు లేకుండ చేస్తున్నాడు.

## మానవుడు స్వభావం :

మనిసి స్వభావ రీత్య ఫలానా విధంగా ఉంటాడని నిర్దేశించి చెప్పడానికి వీలు లేకుండా ఉన్నాడు. దానివల్లనే కుటుంబ జీవితంలో వ్యక్తిగత జీవితం ఒకస్వార్ధం అయినప్పటికి వ్యక్తిగత జీవితం వైచిత్రని మనిషిని ప్రత్యేకంగా నిలబెడుతోంది.ఈ విషయాన్నే సాహిత్యం వెలారుస్తోంది. అన్ని జీవన వైచిత్రులను విశ్వేషించడానికి సాహిత్యం పెద్దభూమికగా నిలిచింది. ఈ సాహిత్యమే కథ, కథానిక, నవల నాటకం, నాట్యం, నృత్యం ఇట్లా ఎన్నో ప్రక్రయలనో రూపుదిద్ధుకుంది. అన్నింటలోకి మనిషి స్వభావాన్ని తెలుపుతూ చిత్రమయ్యే ప్రక్రియనే అందరి ఆకర్షణను కలిగి వుంది.

మనిషి ఎంత ప్రత్యేకతను కలిగి ఉన్నా పక్కవాని గురించి తెలుసుకోవాలన్న ఆత్రుతను కలిగి ఉన్నాడు. దాని వల్లనే సాహిత్య లోకంలో ఎన్నో కథలావిష్కరణ చేశారు. తన కలల సామ్రజానికి పెట్టనికోటను సాహిత్యంలో నిలుపుకోజూచే యనిషి అవాస్తవికాంశాలతోనూ కథలు అల్లాడు. మనిసిలోని మనసు మహత్యం వల్ల వాస్తవికాంశాలోను కార్యనిర్మాణానికి పనికి వచ్చేది. ఉత్తేజాన్ని ఇచ్చేది. ఉత్ప్రేరకంగా ఉండేచి. ప్రేరణ కలిగించేది. ఇలాంటి అంశాలను కూడ సాహిత్యంలో తడుముతూ వెళ్తున్నాడు మనిషి.

## కుటుంబరా మనిషి :

ఈ సాహిత్యంలో ఇప్పటి వరకూ వున్న కథలూ, కావ్యాలు, గ్రంధాలు, జీవిత చరిత్రలూ, చరిత్రకాంశాలు ఇలాంటి ఎన్ని పరిశీలంచినా మనిషి వ్యక్తిగత జీవితమైనా ఓ ప్రత్యేకతను కలిగి వుంది. ఉదాహరణకు కుటుంబ జీవితాన్ని ఏర్పరచుకున్న మనిషి తన కొరకు కాక కుటుంబ శ్రేయస్సు కొరకే నలుగురిలో నాణ్యమైన వాడనిపించుకుంటున్నాడు.

## పురాణ పురుషులు - కుటుంబ వ్యవస్థ :

ఉదాహరణకు భీష్ముడు శంతన మహారాజు కొడుకై ఉండి కూడ తన తండ్రి మనసును ఆకర్షించిన స్త్రీతో తండ్రి సుఖజీవనాన్ని గడపడానికి తాను ఆజన్మ బ్రహ్మచారిగా నిలిచాడు. చివరకు వంశోన్నతకే కాదు వంశం నిలబడుతుందో తాను మాటిచ్చిన తల్లికి చెప్పి ఆ తల్లి వంశాన్ని అభివృద్ధి చేయుటలో తన ప్రాణలనుసైతం ధారపోసిన మహావీరుడిగా చరిత్రలో నిలిచి పోయాడు.

ఇలా భీష్ముడు సువర్ణ పురుషుడుగా చరిత్రలో నిలిచిపో యాయాతి మహారాజు తాను అనుభవించిన భోగాలతో తృప్తిపొందక శుక్రాచార్యుని శాపం వల్ల తన యవ్వనం చేజారి పోయిందనే బాధను అనుభవిస్తుంటే యాయాతి మహారాజు కొడుకు పురూరవుడు తన తండ్రికి తన యవ్వనాన్ని ధారపోసి తన తండ్రికి సంతానాన్ని కల్గించాడు. పురూరవుడు త్యాగమే మహెూన్నతమైన గుణమని అదే మనుసులలో అసలు సిసలైన గుణమని చెప్పక చెబుతూనే చరిత్రలో కలికితురాయిగా నిలిచి పోయాడు.

యుగాల వెనక్కు వెళితే రాముడు తన తండ్రి ఇచ్చిన మాటకు కట్టుబడి వనవాసం చేసాడని, తానే ధర్మం కోసమే ఎన్నోకస్టనస్టాలను ఎదుర్కున్నడని తెలుస్తోంది. కృష్ణుడు కూడ తనను కన్న తల్లిదండ్రుల జీవితాన్ని ఉద్ధరించడమే కాక తనను నమ్ముకున్న ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపాడో భాగవత కధమనకు తెలుపుతుంది. ధర్మం కోసం రాముడు నేను మానవుడినైనా మాధవుడిగా మారుతాను అని అంటే కృష్ణుడు తాను మాధవుడైనా మనిషి లోకంలో ధర్మం కోసం నరుడిగాను, నారాయణుడి గాను నిలబడి ధర్మాన్ని పున:స్థాపిస్తాను అని చెప్పడం కాదు చేసి చూపించారు. ఆ మహానుభావులు. అంతేకాదు మనకందరకూ తెలిసిన శివాజీ గణేష్‌ని వీరాధి వీరుడుగా నిలిపిన జీజాయా బాయి గాని, ఝాన్సీ లక్ష్మీ బాయి గాని, డొక్కా సీతమ్మ గారు గాని, మహాత్మ గాంధి గారు కాని ఇలా ఎందరెందరో ఉదహరణలుగా నేటి యుగంలోను కనిపిస్తారు.

ఇట్లా మనిషి తన వ్యక్తిగత జీవితాన్ని కుటుంబ జీవతాన్ని కూడా ఈ రెండు పడవలనూ ఏకకాలంలో సంసార సాగరంలో నడిపిస్తూ తను ప్రత్యేకతను కలిగి ఉన్నాడు.

**నేటి మానవుడు - కుటుంబం :**

ఇట్లా మనిషి తాను ఏర్పరచుకున్న కుటుంబంలో ఉన్న తల్లి, తండ్రి, సంతానం అంటే తాత ముత్తాతలు తల్లి ముత్తమ్మలు ఇలా ఒకరి కోసం మరొకరు వారి వారి సంతోషానికి మనిషి కొవ్వోత్తుగా కరిగిపోతున్నాడు. అందు వల్లనే నేటి యుగంలోనూ తండ్రి అనాదిగా తిరిగే వాడైనా ఇల్లు పట్టించుకోని పోరంబోకు అయిన తల్లి ఒక్కత్తే నిల బడి తన సంసార రధానికి ఎదురయ్యే ఎన్నో కష్టనష్టాలకు, ఒడిదుడుకులకు క్రుంగి పోకుండా తాను రధసారధియై నడిపిస్తూనే వుంది. సంసార చదరంగంలో పావుగా మారి తన కుటుంబాన్ని గెలుపు ఒడ్డుకు చేరుస్తోంది.

ఏది ఏమైనా కూడ ఇన్ని చారిత్రాకాంశాలు గాని, కావ్యాలు గాని, కథలు గాని, గ్రాంధాలు గాని, ఇతి హాసాలు గాని వేటిని పిరిశీలించిన మనిషి మనుగడ కోసం పోరాడిన మనిషి తప మంచితనాన్ని గాని,మనిషి తనాన్ని గాని నిలుపుకోవడానికి కేవలం త్యాగమే మహెూన్నత మార్గమని తెలుస్తుంది.

**ప్రస్తుత పరిస్థితులు - కుటుంబ సంబంధాలు :**

కాలం మారింది కుటుంబం అనే మాటకు అర్థం, దాని నమూనా మారిపోతుంది. ఉమ్మడి కుటుంబంలో వ్యక్తి స్వేచ్ఛకు ఆర్థిక స్వాతంత్ర్యానికో, సమానత్వనికీ ప్రాధాన్యం లేక పోవడం, స్వార్థం పూర్తిగా పెరిగిపోవుడం, వీటి వల్ల ఉమ్మడి కటుంబ వ్యవస్థలో మార్పులు అని వార్యమయ్యాయి. చిన్న కుటుంబ భావన బలపడింది. సమిస్టి వ్యవస్థ పూర్తిగా వ్యష్టి వ్యవస్థగా మారింది. తత్కారణంగా జీవన సరళిలో అననూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదునికత వల్ల శ్రమ విభజనలో కొత్త మార్పులు వచ్చాయి. స్త్రీ, పురుష సంబంధాల్లో కొత్త ధోరణులు ఏర్పడ్డాయి.ఆర్థిక స్వేచ్ఛ, సమానత్వం వ్యక్తి స్వాతంత్ర్యం అనే మూడింటి పైనే 'వ్యష్టి' కటుంబం ఆధారపడింది. ఈ వ్యష్టి కుటుంబంలో వ్యక్తిగత గౌరవం, సమాజంలో ప్రత్యేక గుర్తింపు నిర్ణయాధికారం లభిస్తాయి. అయితే ఇలా వ్యక్తి ప్రాధన్యం పెరిగి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మరుగున పడిపోయింది.

దీని వల్ల కుటుంబ పరమైన వాస్తవ భావనలు అందు తున్నాయా! దేశీయసాంస్కృతిక, జీవన సంప్రదాయాలు నిలుస్తున్నాయా! మానవసంబంధాలు అప్యాయతాను రాగాలు ఉంటున్నాయా? ఆర్థిక స్వాలంబన కోసం భార్య భర్తలిద్దరూ సంపాదించాల్సిన అవసరం ఉన్నప్పటికీ జీవితానికి అదే గమ్యం, అదే లక్ష్యం అవుతుంది. పిల్లలకు టి.వీలు,కంప్యూటర్లే ఆటపాటలౌతున్నాయి. భాష పరి మితికి లోనౌతుంది. భావం సంకుచిత మౌతున్నది. అను భూతులు లోపిస్తూన్నాయి. తల్లిదండ్రులకు పిల్లల సంక్షేమమే తొలిప్రాధన్యం కావలసి ఉండగా, దాని పట్ల వాళు తగినంత శ్రద్ధ చూపడం లేదు. అది పిల్లల మన స్తత్వం మీద విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది. తల్లిదండ్రును పిల్లలకు వారసత్వంగా ఆరోగ్యం, సంస్కారం, చదువు, విజ్ఞానం, మంచితనం, పరోపకార గుణం అందించాలే తప్ప కేవలం డబ్బు కాదు అని గుర్తించాలి. పిల్లల సమస్త సద్గుణాలకు, దుర్గుణాలకు ఇల్లే పునాది కానీ ఆ ఇల్లే కనుమరుగౌతుంది.

పిల్లలు కేర్‌టేకింగ్ సెంటర్లలో...
భార్య భర్తలు ఉద్యోగాలలో....
వృద్ధులు వృద్ధాశ్రమాలలో....

ఆ మానవ సంబంధాలు ఏవి? అనురాగాలు ఏవి? వారసత్వ అనుభూతులు ఎక్కడ? కుటుంబ నేపథ్యం, గొప్పతనం తెలిపే అవకాశం ఏది?

ఆధునీకరణ, నగరీకరణ పాశ్చత్యీకరణ కంప్యూటరీ కరణాలు ఈ పరిస్తితికి కారణాలు కుటుంబ వ్యవస్థపై ఇవి ఎనలేని ప్రభావాన్ని చూపుతున్నాయనే సామాజిక శాత్రవేత్తలు అంటున్నారు. యంత్రశక్తి వినియోగం నానా టికీ పెరుగుతుంది. బట్టలుతకడానికి,కుట్టడానికి చివరకు గిన్నెలు కడగడానికి,కడిగిన చేతులు ఆరడానికి యంత్ర శక్తినే వాడటం వల్ల మనిషి బద్ధకస్థుడౌతున్నాడు. చలాకీ తనాన్ని కోల్పోతున్నాడు.

ఈ యంత్రిక జీవన విధానం వల్ల కుటుంబంలోని అందాలు, ఆనందాలు హరించి పోతున్నాయి. వ్యష్ఠి కుటుంబంలోని లోపభూయిష్ఠమైన, స్వార్థంతో కూడిన

జీవనవిధానం వల్ల ఈ మార్పులు సంభావించాయి. కుటుంబ సభ్యులు సుఖాల్నీ, సంతోషాల్ని, కష్టాల్ని, భాధల్ని పరస్పరం పంచుకోవాల్సి వుండగా ఎవరికి వారే యమునాతీరే అన్న విధాంగా ఉంటున్నారు బలియమైన కారణాలవల్లే పిల్లల్లో కొందరు అందరు వుండి అనాధలుగా, మరికొందరు సమాజ వ్యతిరేక శక్తులుగా మారిపోతున్నారు. సమాజానికి పెను సవాళ్లను విసురుతున్నారు. అశాంతి, హింసలకు ప్రధాన కారకులౌతున్నారు.

ఆర్థిక సంబంధాలు, వ్యక్తిగత స్వార్థమూ హక్కునూ, వీటిన్నింటి కంటే మన బాధ్యతలు మానవ సంబంధములూ ముఖ్యమని, అవి మన మనుగడకు ఆధార భూతాలనీ తెలుసుకోవాలి. వ్యష్టి కుటుంబంలో ఉన్నప్పటికీ కుటుంబ భావనలు పిల్లలకు వివరించి చెప్పగలగాలి. పెద్దల బలాన్ని పొందాలి.యాంత్రికతతో పాటు మానవ శక్తి యుక్తి నైపుణ్యాలు మన మన వారసత్వ సంపదలను పెంచేలా ఉపయోగపడాలి. ప్రకృతి వనరులను వాడుకోవడం మనకు ధర్మమే కాని వాటిని దోచుకోవడం, నిరుపయోగం చేయడం మన లక్ష్యం కాకుడదు. మనం చేసె పని ఏదైన మన సంస్కృతి, వారసత్వాన్ని, దేశ ఔన్నత్యాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచి వారసులను ఉత్తేజితులను చేసే విధంగా ఉండాలి. అందుకు అందరం కృషి చేయాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంధాలు:**

1. పోతన భాగవతం - తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ.
2. భాగవతం - ముసునూరు శివరామకృష్ణరావు.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ద్రావిడ భాషల్లో తొలి కథానికలు

-డా॥. సి. సంపత్, తెలుగుశాఖాధ్యక్షులు, సి.కందస్వామినాయుడు బాలుర కళాశాల, చెన్నై, తమిళనాడు.

**ప్రస్తావన :**

భారతదేశం వైవిధ్యానికి కొలువు కూటం. ఎవరి సంస్కృతి వారిది. ఎవరి ఆచార వ్యవహారాలు వారివి. ఎవరి సాహిత్యాలు వారివి. ఎన్నో భాషా సాహిత్యాలు ప్రచారంలో ఉన్నాయి. రామాయణం, భారతం, పంచతంత్రం కథలు మొదలగునవి. విభిన్న ప్రక్రియలలో వివిధ భాషలలోను అందాలు దిద్దుకున్నాయి. తుల నాత్మక సాహిత్యం పరిధి ఇంతా అంతా అని చెప్పలేం. తెలుగుకు సంబంధించి తులనాత్మక పరిశీలన కొత్త ఏమీ కాదు. భాషాద్వేషం తెలియని స్వభాషాభిమానం తెలుగు వారిది. ప్రతి సాహిత్యాన్ని స్వాయత్తం చేసుకోవాలనే ఉదారాశయులు వారు. అలా వచ్చినదే తులనాత్మక సాహిత్యం. గురజాడ వేంకట అప్పారావు, వ.వే.సు.అయ్యర్ (వరగనేరి వేంకటేశ సుబ్రమణ్య అయ్యర్), కెరూరు వాసుదేవాచార్య, వేంగయిల్ కున్హిరామన్ నయనార్ వార్లు వారి వారి భాషలలో ఆధునిక కథానికలకు ఆద్యులు. వారి కథలలో సామాజిక అంశాలకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలను సాంఘికంగా చైతన్యం చేయాలని భావించారు. సమాజంలోని సమస్యలే వారికి ఇతివృత్తాలు.

ఒక సాహిత్య ప్రక్రియ పుట్టుక, ప్రగతి, పరిణితి లాంటి దశలన్నీ దానికి రంగ భూమి అయిన సమాజంలోని పరిస్థితులపైన ఆధారపడి ఉంటాయి. వారసత్వంగానూ, అభ్యాసవశంగానూ జాతికి సంక్రమించిన నైతిక సంపద, విజ్ఞాన గరిమ, భావనా పటిమ, మానవ శ్రేయోకాంక్ష, ఆ సాహిత్య ప్రక్రియ స్థాయిని నిర్ధారిస్తాయి. మానవుడు మాట్లాడడం నేర్చి, ఆలోచించడానికి అలవాటు పడిన తరువాత సొంతంగా అనుభవాలను ఇతరుల ద్వారా విన్న విచిత్ర విషయాలను, పరంపరంగతమయిన పురాతన వృత్తాంతాలను, తరాలు మారిన కొద్దీ రూపం మార్చు కుంటూ వచ్చిన చారిత్రక విశేషాలను కథలు అల్లి చెప్పుకుంటూ వచ్చారు. కథ అనగా చెప్పడం కాబట్టి ఒకరు చెప్పగా ఒకరు వినడమే కథ యొక్క ఆదిమ రూపంగా ఉంటూ వచ్చింది.

**తెలుగు (దిద్దుబాటు) :**

1910వ సంవత్సరంలో 'దిద్దుబాటు' కథానిక ఆంధ్ర భారతి పత్రికలో వెలువడింది. సరికొత్త నూతన పక్రియకు ద్వారాన్ని చూపించింది కూడా గురజాడే. బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి ఆధునిక భావాలను అలవరచు కొని ఆంగ్ల విద్య వైపు మొగ్గుచూపి సామాజిక అంశాల మీద అవగాహన పెంచుకొని ప్రజల కోసం తన రచనా సాంగత్యాన్ని ప్రారంభించిన గురజాడ వేంకట అప్పారావు పుట్టుకతోనే తెలివైనవాడు. గ్రాంథిక మోజులో రచనలు సాగిస్తున్న ఆ తరుణంలోనే గిడుగుకు ఊతంగా నిలిచి భాషా సాహిత్యాలకు సేవ చేయుటవే కాకుండా ఛందస్సులో కూడా మార్పు తీసుకొచ్చాడు. కథలోనే కాదు. నాటకంలో కూడా తనదైన శైలిలో సాంఘిక దూరాచారా లను రూపుమాపదల్చిన గురజాడ కవే కాదు మంచి పాత్రికేయుడు కూడా. దేశం అస్థవ్యస్తంగా కుమ్ము దుమ్ములవుతున్న సమయంలోనే తన ప్రతిభతో సంగంలో నెలకొన్న దూరాచార శక్తులను తన కలంతో కడిగి పారేశాడు. నాది ప్రజల ఉద్యమం అని వెలుగెత్తిచాటిన మహాకవి గురజాడ నేటికి కూడా బ్రతికే ఉన్నాడని చెప్పడంలో తన రచనలే నిదర్శనం. ఇలా ఎన్నో రచనలకు శ్రీకారం చుట్టిన గురజాడ అప్పారావు 1862-1915 మధ్య కాలంలో జీవించి నలభై ఎనిమిదవ ఏట అంటే 1910వ సంవత్సరం 'దిద్దుబాటు' కథను రచించి 1915వ సంవత్సరం యాభై మూడేళ్ళ వయస్సులో కన్నుమూశారు. తాను ప్రజల కోసం నిరంతరం పోరాడుతూనే ఉన్నాడు. ప్రజల్లో ముసురుకొన్న దురాచారాలను రూపుమాప దల్చాడు. బాల్యవివాహాలను రద్దుచేశాడు. వితంతు

వివాహాలను ప్రోత్సహించడానికి వీరేశలింగానికి సహకరించారంటే ఆయన రచనా సాంగత్యం గురించి వేరే ఆలోచించవలసి అవసరం లేదు. వ్యవహారిక భాషోద్యమానికి నడుంబిగించి ప్రజలకు అనుకూలమయిన భాషలో రచనలు చేయగలిగారు. ఇంకా ప్రజల హృదయాన్ని దోచుకోవడానికి ఆంగ్ల ప్రభావం కారణంగా తెలుగులో అవతరించిన కథానికను ఎంచుకొన్నాడు. 'దిద్దుబాటు' కథానిక గురజాడ కవితా రూపసౌందర్యం. ప్రజల సమస్యలు, మధ్యతరగతి వేశ్యాలోలత్వం, స్త్రీ విద్యా, పురుషాధిక్యత, భాషోద్యమం, భార్యాభర్తల అన్యోన్య జీవితం, పాత్రోచిత భాష, మాండలిక భాష, వ్యవహారిక భాష, ఆధునిక సాహిత్య ప్రక్రియ ధోరణి ఇవన్నీ గురజాడ రచనలో అంతర్లీనంగా దాగి ఉన్న అంశాలు.

ఆంగ్ల విద్యా ప్రభావం అనుసరణ కొందరికి నచ్చకపోయినప్పటికీ భావ సమైక్యతకు తోడ్పడింది మాత్రం డౌల్హౌసీ రాజ్యసంక్రమణ సిద్ధాంతం, వేల్లస్లీ సైన్య సహకార పద్ధతి, బెటింగ్ సంస్కరణలో, మెక్కాలీ విద్యావిధానం ప్రజలను ఆలోచింపజేసింది. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన ద్వారాలకు మొగ్గ చూపేటట్లు చేసింది. ఆ బాటలోనే గురజాడ నడవడానికి ప్రయత్నం చేశారు. కథలో కథానాన్ని చూపించాడు. ఏ పాత్రకు నిండు ప్రాముఖ్యత నివ్వకుండా ఆ పాత్రలకు అనుగుణమయిన భాషను ప్రవేశ పెట్టాడు. వేశ్యలోలత్వంలో మగ్గుతున్న మధ్య తరగతి మేధావులకు బుద్ధి చెప్పదలచుకొన్నాడు. స్త్రీ చదువుకుంటే గల ప్రయోజనాలను ఒక ఉత్తరం ద్వారా చూపించగలిగాడు. రాముడు పాత్రను హాస్యంగా పడించాడు. అంటే దిద్దుబాటు కథానికలో నవరసాలు రంగరించి ప్రజలకు టానిక్‌లా తయారు చేశాడు. కథ మూడు పేజీలు అయినా అందులో భావ సౌందర్యం ఈనాటికీ కూడా సజీవంగా మిగిలే ఉంది. పండితులు నూతన అర్థాలకు త్రవ్వకాలు ప్రారంభించారంటే దిద్దుబాటులో ఉన్న జ్ఞాన సంపద ఎలాంటిదో పసిగట్టవచ్చు.

తాను చేసిన తప్పిదాలను కథా నాయకుడే పశ్చాత్తం పొందేటట్లు చేసి కథా నాయకను విద్యావంతురాలుగా తీర్చిదిద్ది భర్తకు అనుకూలవతిగా సిద్ధం చేసినా గురజాడ ఈనాటికీ కూడా మార్గదర్శకులే. భార్యాభర్తల వ్యవహారాన్ని వేరొక్కరికి చేరవేయకూడదన్న సందేశమే కాకుండా మెట్టింటిలో ఎన్ని జరిగినా పుట్టింటికి చేరనివ్వకుండా రచయిత తన రచనా శైలిని అవలంభించాడు. ఏ పాత్ర ఎంత వరకు మాట్లాడాలో అంత వరకే మాట్లాడపించాడు. కథను జరిపేదంతా స్త్రీ. అయితే ఆ స్త్రీ కంటికి కనబడదు. స్త్రీలోలుడయినా కథా నాయకుడు తనకు తానే బుద్ధి తెచ్చుకొనేటట్లు చేయగలిగినా గురజాడ స్త్రీల పక్షం నిలబడి స్త్రీ అబల కాదు సబల అనేటట్లు సిద్ధం చేశాడు. స్త్రీ మనోభావాలకు అవకాశాన్ని ఇచ్చాడు. కథా నాయకుని నోట స్త్రీ అవసరం, స్త్రీ ప్రాముఖ్యం ఎలాంటిదో తెలియపరిచాడు. స్త్రీలేని జీవితం ఎంత దుర్భరమో దిద్దుబాటు కథలో గురజాడ పలికిన పలుకులు నేటి ప్రేమికులకు ప్రేమలేఖలుగా పయనమవుతున్నాయి.

'దిద్దుబాటు' కథానిక పుట్టి 108 సంవత్సరాలు అవుతున్నా ఈ నాటికీ కూడా నిండు యవ్వనంగానే అందరినీ ఆకట్టుకొన్నదనే చెప్పాలి. సమాజ పరిస్థితులను ఆకళింపు చేసుకొన్న గురజాడ పాత్రచిత్రణలో, వస్తువైవిధ్యంలో, రూప సౌందర్యంలో నూతన మార్గాన్ని ఎంచుకొని కవితా శిల్పాన్ని ప్రజలకు చేరవేశాడు. శిల్పం ఎంత అందంగా ఉంటే శ్రోతలు అంత ఆహ్లాద పడతారని గురజాడకి తెలుసు. అందుకే ఫ్రెంచ్ కథానిక విధానం, ఆధునిక ఆలోచనలు తనలో తొలుస్తున్నాయి. కాబట్టే కథ ముగింపును శ్రోతలకే వదిలేశాడు. కథా నాయకి నవ్వుతో శ్రోతలకు ఇదంతా నాటకమేనని తెలియజేస్తాడు. హాస్యగాడయినా రాముడి యొక్క మాటలు తూటల్లా కథా నాయకుని ఆలోచింపజేస్తాయి. అంతవరకు రాముడు, కమలిని నాటకం ఆడారన్నా విషయం శ్రోతులు గ్రహించలేకపోతారు. ఇది ఈ కథలోని మర్మం. గురజాడలో దాగి ఉన్న అంతర్లీ భావ సౌందర్యం. కథా నాయకుడు చదువుకున్నవాడు కాబట్టే స్త్రీని అంత శీఘ్రంగా అర్థం చేసుకోగలిగాడు. రాముడు స్త్రీ విద్యను కించపరిస్తే కోపగించి కొట్టాడు. మరలా తాను చేసినా తప్పులకు తానే ప్రాధేయ

పడేటట్లు రచయిత చేయగలిగాడు. ఉన్నతమైన ఆలోచన లతో ఎంతటి అసాధ్యవిషయాన్ని కూడా సుసాధ్యం చేయగల స్థాయికి ఒక స్త్రీ ఎదగ గలిగిందంటే అప్పారావు స్త్రీ మనోభావాలకు ఎంత అవకాశం ఇచ్చాడో స్త్రీ ద్వారా సమాజ ప్రగతి ఎలా ప్రతిఫలింప చేశాడో అర్థం చేసు కోవచ్చు. ఈనాటికీ కూడా ఇందులోని ఇతివృత్తం, పాత్రలు సజీవంగానే ఉన్నాయి. ఇది గురజాడ మేధా సంపత్తికి మేరుపర్వం.

**తమిళం (కుళత్తంగరైయిల్ అరసమరం సొన్న కదై) :**

1908వ సంవత్సరంలో వచ్చినటువంటి 'కుళత్తంగ రైయిళ్ అరసమరం సొన్నకదై' (కొలను గట్టుమీద రావిచెట్టు చెప్పిన కథ) తమిళంలో మొట్టమొదటి కథానిక. వ.వే.సు.అయ్యర్ (వరగనేరి వేంకటేశ సుబ్రమణ్య అయ్యర్) ఈయనను తమిళ కథానికా పితామహుడు అంటారు. బహుభాషా కోవిదుడు. కాలం 1881-1925. ఈయన నలభై నాలుగు సంవత్సరాలు జీవించారు. ఇరవై తొమ్మిది సంవత్సరాల వయస్సులో ఈ కథను రచించిన వ.వే.సు.అయ్యర్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. మంచి పాత్రికేయుడు. న్యాయవాది. బాలభారతి పత్రికలో ఎన్నో వ్యాసాలను వెలువరించారు. ఏ రచయితైనా వస్తువుని ఎంచుకొని మరలా దానికి అనుగుణంగా రూపాన్ని దిద్దుకోవడం జరగదు. వస్తువుకి రూపానికి నాటి సామాజిక ఇతివృత్తాన్ని కథా వస్తువుగా ఎన్నుకొంటారు. వస్తువును ఎన్నుకొన్న తరువాత అది కథానిక రూపంలో చెప్పాలా? కవిత్వంలో చెప్పాలా? నవలలో చెప్పాలా? అనే ధోరణిని ఎంచుకొంటారు. అలా రూపాన్ని ఎంచుకొన్న తరువాత వస్తువుకి రూపానికి శిల్పానికి తగిన ప్రాధాన్యాన్ని ఇచ్చి కథను ఒక మలుపు తిప్పుతారు. అందులో అందె వేసిన చెయ్యి వ.వే.సు.అయ్యర్. నాటి సాంఘిక దురా చారాలను దుమ్ములేపి రూపుమాపాలని తన రచనా సాంగ త్యాన్ని ప్రారంభించారు. అప్పటిలో వరకట్న సమస్యలకు స్త్రీలు బలిపశువులా బలైపోతున్నారు. పెద్దలు తమ కుమారులకు రెండో పెళ్ళి చేయాలనే ముసుగులో ఉన్నారు. తల్లిదండ్రుల మాటలను బిడ్డలు ఎదిరించలేక నీరుగారిపోతున్నారు. అలాగని కట్టుకొన్న భార్యకు మోసం చేయలేక తల్లిదండ్రలును ఎదిరించే శక్తిలేక మగ్గిపోతు న్నారు. ఇలాంటి దుస్సంఘటనలకు ఎదురొడ్డి రచయిత పోరాడాడు. ఆడదాని అవసర బుద్ధిని, మగవాడి అల్ప బుద్ధిని రచయిత కళ్ళకు కట్టినట్లు చూపించారు. 'ఆలస్యం అమృత విషం'. ఏయే విషయాల్లో ఆలస్యం చేయవచ్చు, ఏయే విషయాల్లో ఆలస్యం చేయకూడదు అన్న విషయా లను రచయిత తెలియపరిచాడు. రెండో పెళ్ళి చేసుకోవా లనే తలంపులేని కథా నాయకునికి స్నేహితుడు సలహా ఇవ్వడం కథానాయకుని స్వభావం శ్రోతలకు తెలియ చెప్పడం మూలంగా కథా నాయకుని మీద శ్రోతలకు కాస్త సింపత్తి కలిగేటట్లు అయింది. లేకపోతే కథా నాయకుడు ఒక స్త్రీ పాపాన్ని ఒడికట్టుకొన్న వాడుగా నిలిచిపోయి ఉంటాడు. తల్లిదండ్రుల వరకట్న పిశాచా లను రూపుమాపాలని రెండో పెళ్ళికి అవకాశం ఇవ్వ కుండా మరో స్త్రీకి అన్యాయం చేయకుండా ఉండాలన్నదే రచయిత ఉద్దేశం. ఆర్థిక పరిస్థితులే మనుషుల మనస్తత్వా లను మార్చివేస్తాయనే చెప్పడానికి ఉదాహరణగా రుక్మిణి వాళ్ళ అత్తగారి కుటుంబం అంటే నాగరాజు తల్లి దండ్రులను పేర్కొనవచ్చు. శ్రీనివాసన్ స్నేహం ద్వారా కథా నాయకుని మనస్తత్వం గురించి తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. 'వసరపాటు పనికి చేటు' నిండు ప్రాణాలను కూడా బలిచేసేటట్లు చేస్తుందని తెలుసు కోవచ్చు. నాడు గ్రామ గ్రామాల్లో రచ్చబండతోపాటు పెద్దలు కూర్చోవడానికి పిల్లలు ఆడుకోవడానికి చల్లని చెట్టు కబురు చెప్పుకోవడానికి ఉంటుందని రచయిత తెలియజేశారు. స్త్రీల ఇష్టాయిష్టాలకు లోబడి పురుషుడు వ్యవహరించాలని ఈ ఆధునిక యుగంలో తెలుసు కోవాలని రచయిత ప్రాధేయపడతాడు. లేకపోతే మరో రుక్మిణిలను కోల్పోవాల్సి వస్తుందని నాగరాజు లాంటి ఉన్నత గుణాలు కలిగిన వంశోద్ధారకుడు సన్యాసులుగా మారిపోవడానికి కన్నతల్లిదండ్రులు కారణం కాకూడదనే

రచయిత అభిప్రాయం. నాటికే కాదు నేటికి కూడా ఇలాంటి సన్నివేశాలు జరుగుతున్నాయి. ఈ కథ ఆనాటి సామాజానికే కాదు ఈనాటి సామాజానికి కూడా అద్దం పడుతుందనే చెప్పాలి.

రచయిత కథా నాయకుని అభిప్రాయాన్ని, కథా నాయక మనో వేదనను, స్నేహితుని సలహాలను 'కుళత్తంగరైయిల్ అరసమరం సొన్నకదై' (కొలను గట్టుమీద రావిచెట్టు చెప్పిన కథ) కథ గానే నడిపించాడు. మనుష్యుల మనోభావాలను ఎన్నింటినో ఆ చెట్టు ద్వారా ఎత్తి చూపించాడు. నిండు ప్రాణం బలైపోతే చెట్టుకూడా చెలిస్తుందని రచయిత భావించినా మనుష్యుల మనస్తత్వాలను మార్చడానికి ఎంత ప్రయత్నించినా అది నత్త నడత గానే మిగిలిపోయింది. ఇద్దరి జీవితాలు వ్యర్థం కావడానికి కారణం రెండు పెద్ద ప్రాణాలే. ఏ ఒక్క పాత్రమీద ఏ నిందా వేయకుండా ప్రకృతిలోని ఒక చెట్టుని ఎంచుకొని ఆ చెట్టు ద్వారా సామాజానికి మేలుకలిగేటట్లు రచయిత చేయగలిగారు. చెట్టు స్వరూప స్వభావాలను రచయిత తెలియజేయడంతోపాటు గ్రామీణ వాతావరణ విశేషాలను చెప్పగలిగాడు. ప్రతి గ్రామంలో చెరువులు, చెట్లు నానాటికీ నశించిపోతున్నాయనే భావనను కూడా ఇందులో గ్రహించవచ్చు. ఏదీ ఏమైనప్పటికీ సామాజ శ్రేయస్సు కోసం రచయితలు ఎప్పుడూ వెన్నుముక్కగా నిలబడతారని రచయిత శైలి ద్వారా గ్రహించవచ్చు. ఈ కథ ఈనాటికీ కూడా సజీవంగానే మిగిలి ఉందంటే కారణం అందులోని కథా శిల్పం అలాంటిదని గ్రహించవచ్చు.

## కన్నడం (తౌళెదముత్తు) :

1897వ సంవత్సరంలో 'తౌళెదముత్తు' (కడిగిన ముత్యం) మొదటి కథానిక. కెరూరు వాసుదేవాచార్య కాలం 1866-1921. ఈయన యాబై అయిదు సంవత్సరాలు జీవించారు. ఈ మొదటి కథ వెలువడే నాటికి ఆ వయస్సు ముప్పై సంవత్సరాలు. ఈయన కూడా లాయరే. బ్రాహ్మణ కులంలో పుట్టినా సామాజిక అవసరాలను గుర్తించి, ప్రజల పక్షం వహించి స్త్రీ విద్యకు ప్రాముఖ్యత నిచ్చి, వరకట్న సమస్యను తుంచి, నాటి పరిస్థితులను కళ్ళకు కట్టేటట్లు చూపించాడు. ఇందులో ప్రధాన కథ దాంపత్య జీవితం. భార్య భర్తలు జీవించాలన్నదే ఇందు లోని అంశం. రెండో పెళ్ళి భార్య ఉండగానే చేసుకోవడం నేరమని రచయిత భావించడం చేతనే కథను విభిన్న కోణాలతో చిత్రించి, స్త్రీ పక్షపాతిగా నిలవగలిగాడు. స్త్రీకి అండగా నిలవాలని ఇరుకుటుంబాలకు తెలియజేశాడు. కథానాయకుడులో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి తన భార్యనే ప్రేయసిగా ప్రేమించుకొనేటట్లు కలిపాడు. అత్త మామల బాధ్యత తోబుట్టువుల సహాయ సహకారం, స్త్రీ ఓర్పు మొదలయిన విషయాలను రచయిత ఈ కథానికలో ఇమిడ్చారు. ఇందుకు గానూ కథా నాయకి తన పేరును మార్చుకొని భర్తలో ఉన్న మలినాన్ని శుద్ధి చేయడం, తన భర్త కోసం ఎదురుచూడడం, పెద్దల సహాయ సహకారాలను మెండుగా పొందడం లాంటి ఎన్నో సంఘటనలు ఇందులో చోటుచేసుకుంటాయి. పెద్ద సమక్షంలో పెళ్ళి చేసుకొంటే ఎన్ని సమస్యలు ఎదురైనా వారే పరిష్కరించి చేర్చిపెడతారని రచయిత సందేశాన్ని ఇచ్చాడు. స్త్రీ విద్యకు ప్రాముఖ్యం ఇవ్వడం కారణంగానే కథా నాయకి తన కాపురాన్ని సరిదిద్దుకోగలిగింది. కారణం ఆ స్త్రీ చదువుకున్నది కాబట్టి అంతటి కార్యాన్ని చేయగలిగింది. ఆధునిక భావాలు గల స్త్రీలు వాళ్ళ సమస్యలను వాళ్ళే సరిదిద్దుకోగలరన్న హితోక్తి మరోకటి రచయిత వెలిబుచ్చారు. ఇందులో పదమూడు పాత్రలు ఉన్నా ఏ పాత్ర మాట్లాడదు. అన్నీ పాత్రల మనస్తత్వాలను రచయితే కథా నాయకుని అన్న వెంకటరాయుడు ద్వారా చెప్పిస్తారు. ఉమ్మడికుటుంబం యొక్క ఆవశ్యకతను రచయిత కళ్ళకు అద్దినట్లుగా చూపిస్తారు. ఉమ్మడి కుటుంబం వల్ల ప్రయోజనాలను తెలియపరుస్తాడు. రచయిత తనకు తానుగానే రెండు కుటుంబాల్ని ఎన్నుకోవడం ఆ కుటుంబాల్లోని వ్యక్తుల వ్యక్తిగత బాధ్యతో పాటు తోటివారికి సహాయపడాలనే గుణాన్ని కూడా చెప్పగలిగారు. బహుభార్యాతత్వాన్ని వ్యతిరేకించడం, స్త్రీ విద్యకు ప్రాముఖ్యతను ఇవ్వడం ఉమ్మడి కుటుంబ అవసరాన్ని తెలియజేడం, తల్లిదండ్రుల బాధ్యతను నొక్కి చెప్పడం, భార్యాభర్తల కాపురాన్ని చక్కదిద్దడం, స్త్రీ సౌందర్య సౌజన్యాలకు అవకాశం ఇవ్వడం, దూరపు

ప్రాంతాల్లో అమ్మాయిలను పెళ్ళిళ్ళకు సిద్ధం చేయడం, రక్త సంబంధానికే కాదు, మిత్రునితో కూడా బంధుత్వాన్ని పెంచుకొనే అవకాశాన్ని పెంపొందించడం, ఆడబిడ్డ బాధ్యతను నేటి సమాజానికి సాక్ష్యంగా చూపించడం, ప్రాచ్య, పాశ్చాత్య విద్యావిధానంలో బేధాలను చూపిం చడం, నేటి విద్యావిధానంలో లోపాలను తమ్మన్న నాయ కుని ద్వారా చెప్పించడం రచయిత చేసిన పని. ఏ పాత్ర నోరు తెరవదు. ప్రతి పాత్రను వెంటరాయుని పాత్రచేతనే రచయిత మాట్లాడేటట్లు చేయడం ద్వారా రచయిత ఏ పాత్రకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వలేదు. కథా నాయ కుడు, కథా నాయక లేకుండా పోలేదు. ఇద్దరికీ రెండు కుటుంబాలను ఏర్పరిచి ఇద్దరు సమస్యలను పరిష్క రించేటట్లు చేయడం రచయిత శైలిలోని విశేషం. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో అభ్యుదయ అంశాలు అడుగడు గునా కనిపిస్తుంటాయి.

## మలయాళం (వాసనా వికృతి) :

1891వ సంవత్సరంలో 'వాసనా వికృతి' కథానికను రచించిన వేంగయిల్ కున్హిరామన్ నయనార్ ముప్పై సంవత్సరాల వయస్సులో రచించారు. ఈయన వృత్తి లాయర్. కేరళ పత్రిక ద్వారా ఎన్నో రచనలు చేశారు. సామాజిక అవసరాలను ఎత్తి చూపడం కోసం తన రచనా సాంగత్యాన్ని ప్రారంభించారు. ఈయనకు మద్రాసుతో ఎంతో అనుబంధం ఉంది. ఈయన బ్రాహ్మణ కుటుం బానికి చెందినవాడు. కాలం 1861-1914. యాభై అయిదు సంవత్సరాల వరకు జీవించారు. ఆనాటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజల్లో మార్పుతీసుకు రావలని తన రచనా సాంగత్యాన్ని అవలంభించారు. విద్యావిధానంలో నూతన భావాలను తెలిసినవారు కాబట్టే ఆనాటి స్థితిగతులను అంచనా వేయగలిగారు. నాటి సమాజంలో గుథాచార్య వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నప్పటికి అక్కడక్కడా దొంగతనాలు జరగడం ప్రజలు ఇక్కట్లకు లోనుకావడం రచయిత తట్టుకోలేకపోయాడు. తన స్పందనను తన రచనా సాంగత్యం ద్వారా తెలియజేయా లని బద్ధకంకణం కట్టుకొన్నాడు. కథానిక ద్వారా మాత్రమే కాకుండా కేరళ అనే పత్రిక ద్వారా ఎన్నో సమస్యలను నాటి అధికారుల దృష్టికి తెచ్చారు. సమాజంలో జరుగు తున్న దొంగతనాలకు కారణం ఏమిటని తెలుసు కోగలిగాడు. పోలీసు వ్యవస్థకు పునాదులు నెలకొల్పి వారి కర్తవ్యాన్ని గుర్తు చేసి శభాష్ అనిపించారు. కొంత మంది పుట్టుకతో దొంగతనం చేయడానికి బలమయిన కారణా లను రచయిత చూపించగలిగాడు. నాడు దొర్లపాలన ఉన్నప్పటికి ప్రజలకు కావలసిన సౌకర్యాలను చేయలేక పోయారు. గుడి గోపురాల్లో దొంగతనాలను నివారించలేక పోయారు. అందుకు కారణం నిరుద్యోగ సమస్య ఒకటయితే, మరొకటి వంశపారంపర్యంగా దొంగతనాన్ని వృత్తిగా చేపట్టేవారు మరి కొందరు. దొంగ సొమ్ము సంపా దించినవాడే పోలీసులను ఆశ్రయిస్తే ఎలా ఉంటుందో రచయిత ఎత్తి చూపించాడు.

దొంగే తనకు దొంగతనం అలవడడానికి కారణం తనకు తానుగా చెప్పుకోవడం ఇందులోని విశేషం. అప్పులపాలు ఎన్నో అనర్థాలకు దారితీస్తుందని చెప్పడానికి రచయిత దొంగకు తొత్తుగా నగలు దారపోసుకొన్న ఇంటి యజమాని కొడుకునే సమకూర్చాడు. ఇంటి యజమాని కొడుకు జూదాలకు పాల్పడి దొంగతో చేతులు కలిపి కన్నతండ్రికి మత్తుమందు ఇచ్చే స్థాయికి పోయాడని ఆనాటి వ్యక్తుల మనస్తత్వాలను రచయిత వ్యక్తపరిచాడు. పది రోజులు దొంగ ఒక్క రోజు చిక్కుతాడని ఈ కథలో నీతిబోధ బాగా స్పష్టమవుతుంది. ప్రేయసి మీద ఆశతో తాను దొంగిలించుకొన్న నగలు పెట్టెలోని ఉంగరాన్ని తన ప్రేయసికి తొడగడం, బదులుగా ప్రియునికి మరో ఉం గరాన్ని ఆమె తొడగడం ద్వారానే కథ అడ్డు తిరుగుతుంది. ఆ సమయంలోనే దొంగతనం రెండు మూడు చోట్ల జరగడం, పోలీసులకు ఈయన మీద అనుమానం రావడం, పోలీసులకు చిక్కిపోతాననే భయంతో అక్కడ నుండి మద్రాసుకు తప్పించుకొని రావడం, మద్రాసులో కొన్నిరోజులు జులాయిగా తిరగడం దొంగతనం చేయ కూడదని తనకు తానే సత్య ప్రమాణం చేసుకోవడం, దొంగ బుద్ధి మార్చుకోకపోవడం, సరదా కోసం దొంగతనం చేసి చిక్కుకోవడం, తనకు తానుగా బుద్ధిమాలిన పని చేశానని తనను తానే నిందించుకోవడం ఒక ఎత్తు

అయితే, మద్రాసులో ఒక వేశ్య ఒక కొట్టు దగ్గర అందంగా నిలబడుకొని ఉండడం, ఆ వేశ్యను చూసి మరొకడు కన్ను ఆర్పకుండా చూడడం, దానిని గమ నించిన దొంగ సరదా కోసం వాడి జేబులో ఉన్న చిన్న పుస్తకాన్ని దొంగలించడం, తన ప్రేయసి తనకు తొడిగిన ఉంగరాన్ని దారబోసుకోవడం, ఉంగరం కోసం చాలా కంగారంగా విచారంతో అందర్నీ అడగడం, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, పోలీసులు ఇతని కోసం మరలా రావడం, పోలీసులు తన ఉంగరం తెచ్చారని దొంగ సంబరపడి, సంతోషంతో పోలీసుకు లంచం ఇవ్వడం పోలీసు దొంగకు ఉంగరం చూపించడం, ఆ ఉంగరాన్ని గురించి ఆరాదీయడం, సంకెళ్ళు వేయడం, జైలుశిక్ష అనుభవించడం లాంటి ఎన్నో సమస్యలను రచయిత చిత్రించగలిగాడు. దొంగ చేసిన దొంగ పనికి కారణం తన పూర్వీకుల వాసన వల్లే ఇలా జరిగిందని చెప్పడంతో రచయిత నాటి దారిదోపిడీ విధానాన్ని అల వరచుకొన్న వ్యక్తులకు అధికారులు వాళ్ళు సరిదిద్దుకొని సాఫీగా జీవనం సాగించడానికి సరైన మార్గాన్ని చూపించ మని ప్రార్థేయపడినట్లు రచయిత చూపించారు. దొంగకు దొంగగానే మార్పు చెందడం, పోలీసు వాళ్ళ కర్తవ్యం నేరవేరడం, వేశ్యలు కొట్లు దగ్గర పడికాపులు కాస్తున్నారన్న విషయాన్ని ఎత్తి చూపించడం పండ పబ్బాల్లో దొంగత నాలు సరదాగా జరిగిపోతున్నాయని చెప్పడం, నాటి సాంఘిక వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి రచయిత ఎంతో గానో కృషి చేయడం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన వారిలో ఒక తెగ మంచి తెగ అని, మరో తెగ దొంగ తెగా అని చెప్పడం , తప్పు చేసిన వాళ్ళు శిక్షింప బడతారని హెచ్చరించడం, ఇందులో చోటుచేసుకొన్న అంశాలు. ఆనాడు సమాజం ఎదుర్కొంటున్న కష్టాలను, కన్నీటిని తొలగించడానికి రచయిత కథల మూలంగా తన బాధ్యతను అధికారుల దృష్టికి తేవడం లాంటి అంశాలు ఈ కథలో రచయిత క్రోడీకరించారు.

## ముగింపు :

ద్రావిడ భాషల్లో తొలి కథల్లోని వస్తువును గురించి పరిశీలించాను. ఈ నాలుగు కథల్లోని ఆయా రచయితలు తెలియజేసినటువంటి అంశాలనే కాకుండా వారి రచనా విధానం ఏవిధంగా కొనసాగించారనేటువంటి విషయాన్ని కూడా క్రోడీకరించాను. అంటే ఈ నాలుగు కథల్లోని వస్తువు ఏ అంశానికి సంబంధించినదనే విషయాన్ని ఈ కథలు చదివిన పాఠకుల పసిగట్టగలరు. అందువల్లే ద్రావిడ భాషల్లో తొలి కథానికలకు ఒక ప్రత్యేకమయి నటువంటి స్థానం ఉంది. కాబట్టి నేటి కూడా కథా సాహిత్యానికి విశిష్టమయినటువంటి స్థానం ఉందన డంలో సందేహంలేదు. అంతే కాకుండా నేటి రచ యితలు, రచయిత్రులు కూడా కథా సాహిత్యానికి చేస్తున్న టువంటి సేవ అపారమయింది.

## ఉపయుక్త గ్రంథాలు :

1. దక్షిణామూర్తి, పోరంకి - కథానికా వాఙ్మయం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాదు, ప్రథమ ముద్రణ, 1975
2. నాయక్, జి.హెచ్. (సంపాదకులు) -కన్నడ సన్నకథెగళు, నేషనల్ బుక్ ట్రస్ట్, బెంగుళూరు, 2001
3. పాండురంగారావ్, వాకాటి - తమిళ కథామంజరి, సాహిత్య అకాడెమీ, రవీంద్ర భవన్, న్యూఢిల్లీ, 1972
4. పాపారావు, జయంతి - ఆధునిక కథ - ప్రస్థానం ఆరు భాషల్లోని కథాయాత్ర, విశాఖపట్నం, మొదటి ముద్రణ, 2017
5. రమేశ్, సం.వెం., అర్.ఎం.ఉమామహేశ్వరరావు (సంపాదకులు) - భారతీయ భాషల తొలి కతలు, తొండనాడు తెలుగు రచయితల సంగం, విడుదల, జనవరి, 2014
6. రామలింగం, డి - తెలుగు కథ, సాహిత్య అకాడెమి, రవీంద్రభవన్, న్యూఢిల్లీ, మలిముద్రణ, 1993
7. శేషగిరిరావు,ఎల్.ఎస్. (సంపాదకులు) -.కన్నడ సన్నకథెగళు, బెంగుళూరు ప్రింటర్ & పబ్లిషర్స్, 1962

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# మట్టిలో మణిదీపాలు - తుమ్మల రామకృష్ణ కథలు

**- డా॥ జి. వెంకట రమణ,** తెలుగు అధ్యాపకులు, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల, గుడివాడ, కృష్ణా జిల్లా.

ఆచార్య తుమ్మల రామకృష్ణ గారు సాహితీ లోకాని కంతటికీ సుపరిచితులే కాబట్టి ఆయనని ప్రత్యేకించి పరిచయం చేయాల్సిన అవసరం లేదు అనుకుంటున్నాను. అయితే ఆయన నాకు ప్రత్యక్ష గురువులు. కాబట్టి ఆయనతో నాకున్న అనుబంధాన్ని గురించి ఓ నాలుగు మాటల్ని చెప్పాల్సిన బాధ్యత నాకుందని భావిస్తున్నాను. అందుకే ఈ నాలుగు మాటలు.

ప్రస్తుతం ఆయన హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. నిజానికి ఆయన ఓ కథక సృజనకారులు. కథల్ని రాసేవాళ్ళని సృష్టించారు. కథ చెబితే ఆయనే చెప్పాలనేంత పేరున్న మహా మనిషి. ఈ మధ్య మా కళాశాల సెక్రటరీగారు శ్రీ కె.ఎస్. అప్పారావుగారితో మాటల సందర్భంలో మా గురువుగారు పేరు ప్రస్తావనకు రాగా "కథా విశ్లేషూ చేస్తే ఆయనే చెయ్యాలి. నిజంగా కథ ఆయనలా చెప్పేవాళ్ళు మరొకళ్ళు లేరు" అని శ్లాఘించారు.

**సాహితీ సృజన :**

తుమ్మల రామకృష్ణ 12.10.57లో, చిత్తూరు జిల్లా సోమల మండలం ఆవులపల్లె గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య పుట్టినూళ్ళో, చుట్టు పక్కల కొనసాగించారు. ఇంటర్మీడియట్ నుండి. పిహెచ్.డి. వరకూ ఆయన విద్యాభ్యాసం తిరుపతిలో కొనసాగింది. 1981లో ఎం.ఎ. తెలుగు పట్టాను, 1983లో తెలుగులో ఎమ్.ఫిల్ పట్టాను, 1988లో తెలుగులో పిహెచ్.డి పట్టాను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరు పతి నుంచి పొందారు.

1989 ఫిబ్రవరి 18న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రం, తెలుగు శాఖ, కర్నూలులో ఉపన్యాసకుడుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 1989 నుంచి 2004 వరకూ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రం కర్నూలులో, శ్రీ కృష్ణదేవ రాయల విశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రం కర్నూలులో (ప్రస్తుతం రాయలసీమ యూనివర్సిటీ కర్నూలు) దాదాపు 16 సంవత్సరాలు తెలుగు ఉపన్యా సకులుగా, ప్రాచార్యులుగా తమ అమూల్య సేవలందిం చారు. 2004 నుంచి హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ప్రాచార్యులుగా, ఆచార్యులుగా తమ సేవలందిస్తున్నారు.

తుమ్మల రామకృష్ణ ఇప్పటి వరకూ వివిధ విశ్వ విద్యాలయాల్లో జరిగిన జాతీయ అంతర్జాతీయ (యు.జి.సి) సదస్సుల్లో పాల్గొని 150 పరిశోధనా పత్రాలను ప్రత్యేకించి ఆధునిక తెలుగు సాహిత్యానికి సంబంధించి నవి సమర్పించి ప్రసిద్ధ తెలుగు దిన, వార, పక్ష పత్రికల్లో, సాహిత్య ప్రత్యేక సంచికల్లో, సాహిత్య పత్రికల్లో అనేక వ్యాసాలు ప్రచురించారు. ప్రత్యేకించి తుమ్మల రామకృష్ణ సృజనాత్మక రచయిత. ఆయన రాసిన ఆణిముత్యాల్లాంటి కథలు తెలుగులోని ప్రసిద్ధ పత్రికలన్నింటిలోనూ ప్రచు రించబడ్డాయి. ఆయన రాసిన 'అడపం' 'ఊరి మద్దిస్తం', 'ఊబి' 'మహావిద్వాంసుడు', 'పరాభవం', 'రాలిన చింత రేగడి మిట్ట, తెల్ల కాకులు నల్లకోతులు మొదలయిన కథలు కన్నడ, తమిళ, ఉర్దూ, ఇంగ్లీష్ ఒరియా భాషల్లోకి అనువదించబడ్డాయి.

తుమ్మల రామకృష్ణ 'మట్టిపొయ్యి' (కథల సంపుటి) పరిచయం (ఆధునిక సాహిత్య వ్యాసాలు), బహుముఖం (ఆధునిక సాహిత్యవ్యాసాలు బారిష్టరు పార్వతీశం - ఒక పరిచయం (ఎమ్.ఫిల్. సిద్ధాంత వ్యాసం) స్వంత ప్రచు రణగా ప్రచురించారు. సాహితీ మిత్రులతో కలసి 'పల్లె మంగలి కథలు', 'ఫాక్షన్ కథలు', తుంగభద్ర కథలు, కథా సమయం కథలు ప్రచురించి సృజనాత్మక సాహిత్య అభివృద్ధికి తన వంతు కృషినందించారు. విశ్వవిద్యాలయ

స్థాయిలో రాయలసీమ కథాసాహిత్య అభివృద్ధికి తన వంతు కృషినందించారు. విశ్వ విద్యాలయ స్థాయిలో రాయలసీమ కథాసాహిత్యం అభివృద్ధికి తనవంతు కృషి నందించారు. విశ్వ విద్యాలయ స్థాయిలో రాయలసీమ కథాసాహిత్య కరువు ప్రభావం అనే అంశం మీద 'తెలుగు సాహిత్యంలో కరువు ప్రభావ చిత్రణ' అనే అంశం మీద మైనర్, మేజర్ యుజిసి రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. వీరి పర్యవేక్షణలో 30 మంది ఎమ్.ఫిల్ పట్టాను, 20 మంది విద్యార్థులు పిహెచ్.డి. డిగ్రీలు పొందారు.

తుమ్మల రామకృష్ణ ఆకాశవాణి కర్నూలు, హైదరాబాదు, విజయవాడ, తిరుపతి కేంద్రాల నుంచి, దూరదర్శన్ ఇంకా ప్రాంతీయ, జాతీయ టీ.వి. ఛానెళ్ళ నుండి ఎన్నో ప్రసంగాలు, చర్చలు, ఇంటర్వ్యూలు, పరిచయాలు, నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. తుమ్మల రామకృష్ణ Saint peterburg university (Russia) ఆహ్వానం అందుకుని అక్కడి తెలుగు విద్యార్థులకు ఆధునిక సాహిత్యాన్ని బోధించారు. 2004 నుంచి హైదరాబాదు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలో ఆచార్యులుగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తూ, వివిధ విశ్వ విద్యాలయాల పాఠ్య ప్రణాళికా సంఘాల్లో పాల్గొంటూ తమ సేవలందిస్తున్నారు, రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లోని సృజనకారులతో, బుద్ధిజీవులతో స్నేహ బాంధవ్యాల్ని పెంపొందించుకుని అపారమైన జీవితానుభవాలతో సాహిత్యాన్ని మేళవించి విద్యాబోధన చేస్తున్నారు. ఆయన నాకు ప్రత్యక్ష గురువు కావడం నా జీవితకాల అదృష్టం.

తుమ్మల రామకృష్ణ రాసిన తొలికథ 'ఓ సాయంత్రం' తన సాహితీ ప్రస్థానాన్ని 'ఓ సాయంత్రం' వేళ ప్రారంభించి తాజమహల్ కన్నీళ్ళతో మన కళ్ళలో నీళ్ళు తిరిగేటట్లు చేస్తాడు.

రామకృష్ణ రేగడి మట్ట నుంచి నేరుగా ఇంటికొచ్చి మట్టి పొయ్యి మీద ఉడుకుడుకు సంగటి ముద్దల్ని చేసి దాంట్లోకి 'రాలిన చింత కాయ ఊరిబిం వేసి' తినేసి తొందరగా ఊరి మద్ధి స్థానికి రమ్మని పిలుస్తాడు.

తరతరాల నుంచి వారసత్వంగా వస్తున్న అడపం సంచిని అటవలోంచి బయటికి తీసి ఆవల సారేసి అరక పట్టి వ్యవసాయం చేసి అన్నదాతగా మారి ఆదర్శంగా నిలుస్తాడు. అన్నిటినీ అందరినీ తనకు అనుకూలంగా మల్చుకునే డా॥గుర్నాధం లాంటి ఆధునిక పరిశోధకుల్ని, అవకాశవాదుల్ని మన కళ్ళముందుంచుతాడు. నేటి పరిశోధకుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీలేదు.

మహా విద్వాంసులకు కూడా కులం పీడిస్తుందా? సంగీతానికి కులం ఉంటుందా? కనీసం సంగీత విద్వాంసుని మనిషిగానైనా చూడరా? లాంటి ప్రశ్నలు తననీ మనల్నీ కలచివేస్తాయి.

'ఫ్యాక్షనిజం' ఊబిలో కూరుకుపోయిన వాళ్ళను 'స్పెషల్ స్వాడ్ ద్వారా బయటికి తెప్పించి 'పరాభవం' పాలయిన పెద్దల్ని పెద్ద మనస్సుతో మన్నించి వేస్తాడు.

'మట్టిపొయ్యి' అనే ఈ కథల సంపుటిలో 12 కథలున్నాయి. అయితే వీటిలో 4 కథల్ని మాత్రమే వివరించే ప్రయత్నం చేస్తాను.

సాధారణంగానే రామకృష్ణ సునిశిత పరిశీలనాదృష్టి కలవాడు. సున్నిత మనస్కుడు. తాను జీవిస్తున్న సమాజంలోని మనుషులపట్ల ఒక అవ్యాజమైన ప్రేమ కల్గినవాడు.

**ఓ సాయంత్రం** : 'ఓ సాయంత్రం' అనే ఈ కథ '6 గంటలు కావస్తోంది. అనే వాక్యంతో ప్రారంభమవుతుంది.

ఈ కథలో కథకుడు తన మిత్రుని కోసం ఎదురు చూస్తుంటాడు. తను చెప్పిన టైంకి రావని మనసులోనే విసుక్కుంటూ ఉంటాడు. ఈ కథ చైతన్య స్రవంతి శిల్పంలో రాయబడింది. ఈ కథలో రచయిత లోచూపు అంతర్మథనం, సత్యం కోసం తన అన్వేషణ కన్పిస్తాయి. కథారంభంలో 'సత్యం' ఒక మనిషిగా మనకు కనబడతాడు. అయితే చివరి వాక్యమైన ఒక గొప్ప 'సత్యం' తెలిసొచ్చింది. అనేదానితో 'సత్యం ఒక సంకేతంలా మనకు కనిపిస్తాడు.

కథకుడు ఓ సాయంత్రంలో సత్యాన్వేషణ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. జీవితంలోని అనేక ఒడిదుకుల్ని,

కష్టసుఖాల్ని, ఎత్తు పల్లాల్ని చవిచూస్తూ, అనుభవపూర్వకంగా జీవితం యొక్క పరమార్థాన్ని తెలుసుకొంటూ ముందుకు సాగిపోవడమే 'సత్యాన్వేషణ' అనే విషయాన్ని తెలియజేస్తాడు.

కథకుడు పిట్ట గోడ మీద ఎక్కి కూర్చుని నలువైపులా పారజూస్తూ సత్యం కోసం ఎదురు చూస్తుంటాడు. ఈ ఎదురుచూసే క్రమంలో కథకుని లోపల అనేక వేల ఆలోచనలు, సంఘర్షణలు, సంభాషణలు, సన్నివేశాలు, సమకాలీన అంశాలు చోటు చేసుకుంటాయి.

ఈ సమాజంలో ఉండే ప్రతి వస్తువు, జీవి, ప్రాణి కథకునితో మాట్లాడుతాయి. వాటన్నింటి వెనుక ఓ గొప్ప జీవిత సత్యం ఉంటుంది. స్టేట్‌బ్యాంక్ సెంటర్, స్టేట్ బ్యాంకు, నగదు నిల్వ ధనమేరా అన్నిటికీ మూలం అని పెద్దలన్నారు. బ్యాంకు ఓ జీవిత సత్యాన్ని బోధపరుస్తుంది. కిల్లీ కొట్లో - కూటికోసం కోటి విద్యలు. కిల్లీ కొట్టు వాడు తాను బతకడం కోసం చేస్తున్న వ్యాపారం తోపుడుబండి - ఇది కూడా జీవనాధారణ కోసం చేసేదే, బలిసిన గోమాత, గాడిదలు, కుక్కలు ఎవరేమైనా అయిపోనీ రోడ్లు మీద స్వేచ్ఛగా తిరుగాడుతున్నాయి. బహుశా మనుషులకు ఇవన్నీ సంకేతాలు కావచ్చు.

కథ మధ్యలో రచయిత 'కాన్షస్' లోకి వచ్చినట్లయింది' అనంటాడు. తనొక్కడే. అయితే తనను పలకరించేవి, మాట్లాడింపజేసేవి, ఆలోచింపజేసేవి అనేకం. వాటి ద్వారా ప్రభావితమై పాఠకుల్ని ఆలోచనల్లో పడేస్తాడు. రచయిత తన అంతఃచేతనలో అనేక విషయాలను చూస్తూ ఆలోచిస్తుంటాడు. పైకి మాత్రం సాదాసీదాగా కనిపిస్తాడు.

త్రివేది తన జీవనం కోసమే బ్రతుకు దెరువు కోసమే తైత్తరీయం, నీతినియమావళి, శ్రీసూక్తం అనేవి చదువుకుని వాటిని అందరిపై రుద్దాలని ప్రయత్నిస్తుంటాడు.

కథకుడు 'ఎవడికుంది నీతి', అని, కుంభకోణాలు, పైరవీలు, అధికారం, అంగబలం అని అసహనం వ్యక్తం చేస్తారు. నాటి రాజకీయ పరిస్థితులపై దుమ్మెత్తి పోస్తాడు. నాటివే కాదు నేటివి కూడా అలానే ఉన్నాయి అని చెప్పవచ్చు.

ఇది కథకాదు కానీ సమకాలీన రాజకీయ, సాంఘిక, ఆర్థికాంశాల పట్ల ఓ సమగ్రమైన అవగాహన.

ఓ సాయంత్రం కథా సారాన్నంతటినీ ఈ చివరి మాటల్లో రచయిత మనకు చూపిస్తున్నాడనిపిస్తుంది. ట్రాన్స్‌ఫర్స్, కాంట్రాక్ట్స్.. ఉద్యోగాలు ... నవ్వులు... కేరింతలు ఉద్రేకపు మంటలు, ప్రేమలు, త్యాగాలు, వాగ్దానాలు, ఆప్యాయతలు, కౌగిలింతలు, ఛీత్కారాలు, పైరవీలు ఎన్నో.. ఎన్నెన్నో అక్కడే... అప్పుడే... పల్చటి చీకటి... గుడ్డి వెలుతురు అన్నిటికీ సాక్ష్యం అన్నింటినీ సాక్ష్యాలుగా పెట్టి సత్యం కోసం ఎదురు చూడటంలో విసుగుంది, థ్రిల్ కూడా ఉందని మనల్ని సత్యాన్వేషకులుగా మార్చే ప్రయత్నం చేసి మనలో కొత్త ఆలోచనలు పుట్టిస్తాడు.

మహాకవి షేక్స్పియర్ అన్న మాటలు ఇక్కడ గుర్తొస్తున్నాయి. 'ప్రపంచమొక నాటక రంగం. మనమంతా అందులో నటులం. రచయిత దృష్టి ఎప్పుడూ ఉన్నతంగా ఉంటుంది. అందుకే తానొక గోడప్రక్క నిలబడి జన ప్రపంచాన్ని ఓ రంగుల వల ఎలా చుట్టేస్తూ ఉందో మనకు చూపిస్తాడు. ఆ రంగులవల పైన పేర్కొన్న వాటిలో ఏదయినా కావచ్చు. అంతా నటనే....అందరూ నటులే. కాదనలేం.

సత్యం ఇవాళ రాడని చెబుతూనే ప్రతివ్యక్తి జీవితం పొరల కింద సన్నటి కదలికలుగా మనసులో మెదిలే అనేక జీవిత సత్యాల్ని తెలియజేశారు. ప్రతి వ్యక్తి / వస్తువు / ప్రాణి / (మరేదయినా) ద్వారా ఓ జీవిత సత్యాన్ని మనకు బోధపరుస్తాడు.

**ఊరిమద్దిస్తం** : ఈ కథలో గ్రామీణ ప్రాంతంలో ఉండే భార్యా భర్తల మధ్య ఎలాంటి సంబంధాలంటాయనే విషయాన్ని, విడిపోయినప్పుడు జరిగే పంచాయితీల్ని, పెద్దల మాటల్ని, సమాజం తీరును తెలియజేశారు. సత్యాన్వేషణలో భాగంగానే ఈ కథ రాసినట్లు తెలుస్తోంది. ఈయన గ్రామీణప్రాంతం నుంచి వచ్చారు కాబట్టి గ్రామీణ, జీవితానికి సంబంధించిన మూలాన్ని పట్టుకోవడంలో ఆయన సిద్ధహస్తులు. సునిశిత పరిశీలనా దృష్టి కలవాడు.

రెండు ఊర్లు, రెండు కుటుంబాలు, రెండు మనసులు, రెండు భావావేశాలు, రెండు ఆలోచనలు, రెండు చైతన్య పూరిత నిర్ణయాలు...వెరసి ఊరిమద్ధిష్ఠం కథ.

**ఇతివృత్తం :**

నాగప్ప సాలమ్మలు భార్యాభర్తలు. వారికి ముగ్గురు పిల్లలు. ఈశ్వరి, రాజన్న, పెద్దోడు. సాలమ్మ తమ్ముడు గుండన్న. గుండన్న కూతురు నాగమ్మ మొగున్నొదిలేసి వచ్చిందని ఊర్లో ఉండే పెద్దలందరూ భజిని గుడి కాడ పంచాయితీ పెట్టి తలాకొక మాటనేటప్పటికి నాగమ్మ పైకి లేచి అందరినీ నాలుగు ఇదిలించి తనదైన సొంత నిర్ణయం తీసుకొని ముందుకెళ్ళడమే ఈ కథలోని ఇతివృత్తం.

ఈ కథలో గ్రామాల్లో ఉండే మొగోళ్ళు తమ భార్యల్ని ఎలా హింసిస్తారో మనకు చూపించారు. వాళ్ళు ఏ పనీ పాటా లేకుండా ఊరికే తిని, వీధుల్లో కూచుని పులి గీతాడుకుంటూ కాలక్షేపం చేస్తే, సాయంత్రమయ్యేసరికి భార్య సంపాదించిన కూలిడబ్బుల్ని లాక్కొని సారాయి తాగేసి, వారిని గొడ్డును బాదినట్లు చావబాదడం, ఏమీ పట్టించుకోకపోవడం లాంటివి చేస్తుంటారు. రాయలసీమ పల్లె జీవితాల ముఖ చిత్రమే ఈ ఊరి మద్దిష్ఠం. ఈ కథలో పెద్దమనుషుల్ని పేరుకే ఊరి పెద్దమనుషులు చేసేవన్నీ వెధవపనులే అని క్యాకరించి వూంచేస్తుంది రామక్క.

రచయిత వారి స్వభావాల్ని తెలుపుతూ నాగమ్మ పాత్ర చేత పలికించిన మాటలు ఎవర్నయినా ఆత్మ పరీక్ష చేసు కోమని నొప్పిపెడతాయి. నాగమ్మ "మా మొగముండా కొడుకులు మేము తెల్లగా ఉతికిచ్చిన గుడ్డలు కట్టుకొని, అట్లా వంకల్లో, వాదాల్లో కూచ్చోని సీటాకులు ఆడుకొని, కల్లో, సారాయో తాగొచ్చి వూరికినే కొట్టి సస్తావుంటే ఎవురు మాత్రం కాపురం జేస్తారు. ఆ మొగుడే లేకుంటే బద నాయిమేమి. అట్లా వానికి పుట్టే బిడ్డల కూడా అట్లే తయా రవుతారు. ఆ బిడ్డలకు కూడా వాళ్ళ బుద్ధులే వస్తాయి. ఆ ఊళ్ళో ఉన్నా ఈ ఊళ్ళో ఉన్నా మా చేతుల కట్టం మాకు తప్పదు. ఆడది తిండికోసమూ, గుడ్డ కోసమూనే కాపురం చేస్తుందా? మానం మర్యాద ఉండనక్కరలేదా! కూల్జేసుకునే వాళ్ళయితే మాత్రం మర్యాదగా బతకాల్సిన పనిలేదా!" అనంటూ అందరి కళ్ళలోకి సూటిగా చూస్తూ అక్కణ్నించి వచ్చేస్తుంది.

ఆడవాళ్ళ కష్టం మీద ఆధారపడి బ్రతికే మగవాళ్ళను గురించి, వారిని భరించే ఆడవాళ్ళను గురించి రచయిత స్పష్టం చేశారు. నాగమ్మ మాటలను చైతన్య పరచింది నాగప్ప, గుంపులోంచి కేక వేసిన ఆడమనిషి. ఈ ఇరువురి భావావేశాలు నాగమ్మ లోపల నాటుకున్న బానిస భావాల్ని, బానిస బతుకుల్ని నిర్మూలంచేసి ఒక నూతన చైతన్య స్ఫూర్తిని, తీర్మానాన్ని చేసుకునేట్లు తోడ్పడుతాయి. సమయానుకూలంగా సామెతలు, పాత్రోచితభాష, సన్నివేశకల్పనలో రచయిత చాతుర్యం మనకు ఈ కథలో కనిపిస్తాయి.

**అడపం :**

**ఇతివృత్తం :** మొగిలప్ప తరతరాలుగా వస్తున్న కుల వృత్తిని వదిలి, తన భార్య ద్వారా సంక్రమించిన 20 గుంటల మడి ఒక ఎకరం చేనును సొంతంగా సేద్యం చేయాలనుకోవడమే ఈ కథలోని ఇతివృత్తం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మొగిలప్ప కులవృత్తి నుండి విముక్తి పొంది వ్యవసాయంలోకి ప్రవేశించడమే ఈ కథలోని ఇదివృత్తం. మొగిలప్ప మంగలి కులంలో పుట్టినవాడు. మంచి నేర్పు, పట్టుదల, పౌరుషం కష్టపడి పనిచేసే స్వభావం, ధైర్యం కలవాడు. ఒకరిదగ్గర మాటపడే మనిషి కాదు. తన భార్య సరోజ, కొడుకు నర్సింహులు. ఎవర్నీ నొప్పించకుండా వృత్తిపని చేసుకుంటూ చినుకులు పడినప్పుడు తనకున్న కాస్తభూమిని సేద్యపరిచేవాడు.

పల్లె అంతట్లో నరసయ్య మోతుబరిరైతు. భూమి, సేద్యం, అంతా అతని చేతుల్లోనే ఉండాలనుకునేవాడు. తాను తప్ప ఇంకెవరూ సేద్యం చేయకూడదనుకునేవాడు. ఓ బూర్జువా సంస్కృతికి ప్రతీకగా కనబడతాడు.

చినుకులు నాలుగు పడినప్పుడు మొగిలప్ప తన కొడుకును వెంటపెట్టుకొని ఎదులు మడకతో చేను దగ్గరికి

చేరుకుంటాడు. అదేరోజు నరసయ్య రమ్మన్నాడనే విషయాన్ని తన భార్య సరోజ ద్వారా తెలుసుకుని మడకకిడిసేసి తొందరగా నరసయ్య ఇంటికి చేరు కుంటాడు. నరసయ్య ఎందుకు రమ్మన్నాడో గ్రహించ లేనంత మనిషికాడు మొగిలప్ప. తనని సేద్యం పనిని చేయనీయకూడదనే రమ్మని చెప్పి ఉంటాడు నరసయ్య.

మొగిలప్ప గతాన్ని, వర్తమానాన్ని తలచుకుంటూ నరసయ్య ఇంటికి రాగానే నరసయ్య "ఇంతకు ముందు మీ నాయనకి మా పల్లె ఆధారం. ఇప్పుడు నువ్వు స్వంత సేద్దిం చెట్టూ చూసుకుని ఎబ్బుడో నీకు బిడువున్నప్పుడు వస్తావు. నువ్వు ఎప్పుడు వస్తావని మేము ఎదురుచూస్తూ ఉండాల. పైగా నువ్వేమి ఈ ఊర్లో ఉండేవాడివికాదు. మాకు అవసరం పడినప్పుడు ఎవుర్తోనో ఒకర్తో చెప్పి పంపాల" అని మనసులో కసిపెంచుకుని మనసులో ఉంచుకున్న మాటలన్నీ మొగిలప్పపై విసరతాడు. అదేంది సామి! నేరుగా మీయింటికే వస్తున్నాకదా! గడ్డం పని చేయడానికి అని మొగలప్పంటే, అందుకు నరసయ్య నారాయణొచ్చి చేసి పోయినాడులే గడ్డం పనేం లేదు అనంటాడు. పనోన్ని నేనుండగా మళ్ళొకరేందని అడిగితే అతనికాదరవేం లేదంట. అందుకే ఊళ్ళోనే గుడిసేసు కుంటాడంట అని జవాబిస్తాడు.

నరసయ్యకు మొగిలప్పకు మాటా మాటా పెరుగు తుంది. నరసయ్య నీది కాదురా తప్పు. ఇరవై గుంటలు మడి, ఎకరా చేను చూసేసరికి నీకు కండ్లు పైకెక్కినాయి. రేపు పొద్దున్న నేను నారాయున్ని పిల్చికొచ్చి గుడిసేసిచ్చి పల్లిలో పెడతా. ...నాకొడకా నీకు అప్పటికి గాని పొగు రనగదు." అని మొగిలప్పను నానాతిట్లు తిడతాడు.

సాధారణంగానే రామకృష్ణ స్వతంత్ర భావాలు గల వ్యక్తి. దేనితో రాజీపడని మనస్తత్వం గలవాడు. అందుకే ఆయన పాత్రలు కూడా చైతన్యపూరితమైన, స్వతంత్ర్య భావాలు గల పాత్రలుగా కనబడతాయి.

మొగలప్ప కోపాన్ని అనచుకొని "యో..నారాయున్ని గాకుంటే వాడి నాయిన్ని పిల్చికొచ్చి పెట్టుకో. నాలుగు చినుకులు పడితే నీకు తెగే మడక నాకూ తెగుతుంద" ని తెగేసి చెప్తాడు. మొగిలప్ప చేసిన ఈ తిరుగుబాటు నరసయ్యకు ప్రతిగా ఉన్న తరతరాల కులం అనే బానిస కట్లపైన, దాని కుహనా విలువలపైన అని మనకు తెలుస్తుంది.

మొగిలప్ప పారేసింది అడపం సంచినికాదు. తరతరా లుగా గుదిబండలా మొడలో/సంకలో వేలాడుతూ వచ్చిన కులం, బానిసత్వం, అణచివేత, అవమానం, నిరాశ, నిస్పృహ, సంకెళ్ళని మనకు తెలుస్తుంది. కులవృత్తి సంచిని పారేసి పౌరుషంతో వ్యవసాయం చేయడానికి తీర్మానించు కొన్న మనిషి మొగిలప్ప.

మన సమాజం అభివృద్ధినితో కూడిన మార్పును అంత తొందరగా అంగీకరించదు. దానిని అణచివేయాలని చూస్తుంది. మొగిలప్ప సేద్యాన్ని నరసయ్య అణచివేయా లనుకున్నట్లు.

**డా. గుర్నాధం** : కథకుడు, డా॥ గుర్నాధం ఇద్దరూ క్లాస్‌మేట్స్. తను కళాశాలలో చదువుకునే రోజుల్లో గుర్నాధం చాలా మోటుగా, అందరూ ఎగతాళి, హేళన చేసేట్లుగా మజ్జుగా ఉంటాడు. అలాంటి గుర్నాధం అక స్మాత్తుగా కథకుని కెదురుపడతాడు. కొన్నేళ్ళ తర్వాత ఇద్దరూ కలుసుకుంటారు. ఆమాటా ఈ మాటా మాట్లాడు కుని కాఫీ తాగి హోటల్ నుంచి బయటపడతారు. ఈ క్రమంలో డా॥ గుర్నాధంలో వచ్చిన అనూహ్యమైన, ఆలోచనలకందని మార్పుని చూచి కథకుడు నివ్వెర పోతాడు. 'అప్పటి గుర్నాధమేనా ఇతను' అని. గుర్నాధం మార్పు గురించి అతని మాటల్లోనే....

"నన్ను చూసి నేర్చుకో. కొంచెం లౌక్యం ప్రదర్శించు, ఎవర్నీ విమర్శించకు. పొగడ్తలకు లొంగనివాడు, మందు ముట్టనివాడు భూమ్మీద వెతికినా దొరకడు. లోకం ఎల్లాపోతే నీకేం? ఈ లోకాన్ని నువ్వొక్కడివే ఉద్ధరించ గలవా? నీ బతుకు నువ్వు బతకడం నేర్చుకో. నాలుగు రాళ్లు సంపాయించడం నేర్చుకో. మనకి ఎవరితో అవసరం ఉందో ముందుగా పసిగట్టు అతని అలవాట్లు గమ నించు, తాగేవాడికి తాపించు. తినేవాడికి తినిపించు.

సన్మానాలు..... పూలదండలు..... పొగడ్తలు.... సీసాలు........ విందులు..... కానుకలు.....ఇవే ఇప్పుడు కావల్సింది.

మేమంతా తెలివితేటలు ఉండే పైకొచ్చామా! అంతా 'గురుదేవుడి' దయ. ఆయన చలవ. చచ్చి మహను భావుడు ఎక్కడున్నాడో చల్లని పొద్దులో తల్చుకోవాల. దీపం పెట్టిపోయాడు. ఈ మధ్య నాలుగు గ్రంథాలు ప్రచురించాను చూశావా! అంటూ చెప్పకపోతుంటాడు డా॥గుర్నాధం. కథకుడు తాను చెప్పాలను కున్నవన్నీ తన హేళనతో కూడిన నవ్వులో చెప్పేస్తాడు. ఈ సమాజం పోకడ, అందులోని కుళ్ళు, గుర్నాధం పాత్ర ద్వారా చెప్పిం చాడు. ప్రత్యేకించి విశ్వవిద్యాలయాల్లోని పరిశోధనా రంగంలో ఉండే డొల్లతనాన్నీ, చేతకానితనాన్ని అవ కాశంగా మలుచుకోవటాన్నీ, సృజనాత్మకత కంటే భజ నాత్మకతలో ఎంత శక్తి వుందో చెప్పే ప్రయత్నం చేశారు. దీనికి కొనసాగింపుగా తెల్లకాకులు, నల్లకోతులు కథల్ని రాశారు.

**ముగింపు :**

అచ్చంగా పల్లెజీవితాల పరిమళ వాసనలు ఈయన కథలనిండా గుబాళిస్తూ ఉంటాయి. కథకు తాను పెట్టు కున్న పేర్లు కూడా పల్లె ప్రజలు తాము నిత్యం వాడే వస్తువులు, జీవన సాధనాలుగా ఎంచుకున్న వస్తువులు పైనే ఉంటాయి. మొన్నీమధ్యనే తెలుగు సాహితీ విహాయసంలో 'తెల్లకాకుల్ని' ఎగరేసి కొంత ఆశ్చర్యానికి గురిచేశారు. ఇవేంటాయని తెల్లకాకుల్ని గురించి సాహితీ లోకం ఆలోచిస్తుండగానే ఒక నల్లకోతుల గుంపును తరుముకొచ్చి మన తలల్ని గోక్కొనేట్లు చేశారు. ఈ రెండు కథల్ని చైతన్య స్రవంతి శిల్పంలో రాశారు. కథకుడు సమకాలీన సమాజంతో నడుస్తూ, పరుగెడుతూ, తానను కున్న లక్ష్యాన్ని సాధించాలనుకునేవాడు.

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ద్రోణచార్య ద్రుపదుల బంధం - మనోవిశ్లేషణ

- డా॥. జె. వెంకటరమణ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, మధురై కామరాజు విశ్వవిద్యాలయం, మధురై, తమిళనాడు.

జనమేజయునికి వైశంపాయనుడు ద్రోణచార్య, ద్రుపదుల పుట్టుక గురించి చెప్పే సందర్భంలోనే వారి మధ్య ఏర్పడిన బంధం గురించి కూడా చెప్తాడు. ద్రోణుడు, ద్రుపదుడు ఇద్దరూ అన్నాదమ్ములు కాక పోయినా భరద్వాజుని ఆశ్రమంలో ఒకేచోట పెరుగుతారు. వేదాలు, విలువిద్య కలిసే నేర్చుకుంటారు. అందువల్ల వారి మధ్య మంచి స్నేహం ఏర్పడుతుంది. తర్వాత ద్రుప దుడు తన తండ్రి పాంచాలరాజైన పృషతుని వద్దకు వెళ్లి, పట్టాభిషిక్తుడై రాజ్యపాలన చేస్తూ ఉంటాడు.

ద్రుపదుడు అగ్నివేశ్యుడివద్ద ధనుర్విద్యను నేర్చుకొని, కృపుడి చెల్లెలైన కృపిని వివాహం చేసుకుంటాడు. వారిద్ద రికి అశ్వత్థామనే కొడుకు పుడతాడు. కుటుంబ పోషణకై పరుశరాముని దగ్గరకు వెళ్లి ధనాన్ని అడుగుతాడు. పరశు రాముడు తన దగ్గరున్న దివ్యాస్త్రాలు, మంత్రాలు, విలు విద్యను ఇచ్చి ధనం లేదని చెప్తాడు. అందువల్ల తన చిన్ననాటి స్నేహితుడైన ద్రుపదుడి దగ్గరకు వెళ్లి ధనాన్ని అడుగుతాడు.

## స్నేహం :

మానవ సంబంధాల్లో స్నేహానికున్న ప్రాధాన్యత చాలా విలువైంది. రక్తం సంబంధం పుట్టుకతో వస్తే స్నేహ బంధం మనిషి తనకు నచ్చిన వేరొక మనిషి భావాలు, అభి ప్రాయాలు, ఆలోచనలు నచ్చి ఏర్పరచుకునేది. స్నేహం అంటే అభిప్రాయాలు ఆలోచనలు కలవకపోయినా ఒకరికి మరొకరు విలువ, గౌరవం ఇచ్చుకుంటూ అభి మానంగా జీవించడం. అవసరాలకు. ఆశలకు, లక్ష్యాలకు అనుగుణంగా సాయం చేసుకుంటూ ముందుకు సాగటం స్నేహం. ఒక్కోసారి జీవనగమనంలో పరిస్థితుల వల్ల స్నేహం కలిగినా దాన్ని జీవితాంతం కొనసాగించుకోవచ్చు. మోసం, ద్వేషం, పగ, అసూయ వంటి చెడు గుణాలు లేకుండా కేవలం నిస్వార్థం, త్యాగం, అభిమానం వంటి మంచి గుణాలతో స్నేహం ముడిపడి ఉంటుంది. మనిషి ఎదుగుదలకు, అభివృద్ధికి మంచి స్నేహం తోడ్పడు తుంది. వ్యక్తిత్వానికి దర్పనం లాంటిది స్నేహం. మనిషి ప్రవర్తన ఆచరణలో మంచా చెడా అని ఆచరణలో చూపేది స్నేహం.

"స్నేహాలనీ, బాంధవ్యాలనీ వెంచుకోవాలనుకుంటే త్యాగమూ, విధేయతా, పరిపక్వతతో కూడిన మనస్త త్వమూ అవసరం. తన అవసరాలను పక్కన పెట్టి ఇంకొక రికి సాయపడటానికి త్యాగ బుద్ధి అవసరం. స్వార్థం స్నేహాన్ని చెడగొడుతుంది. పరిచయస్తులు సులభంగానే దొరుకుతారు. కానీ నిజమైన స్నేహం సంపాదించు కోవాలంటే కొంత సమయం పడుతుంది. కాస్త ప్రయాస పడితే గాని నిజమైన స్నేహాలు నెలకొనలేవు. స్నేహాలు పరీక్ష నెదుర్కోవలసి రావచ్చు. ఆ పరీక్షలకి తట్టుకొని నిలబడగల స్నేహాలే ఇంకా పటిష్ఠమవుతాయి. కృత్రిమ మైన బాంధవ్యాలని గుర్తించడం నేర్చుకోండి. నిజమైన మిత్రులు తమ స్నేహితులు బాధపడడం చూడలేరు. నిజమైన స్నేహం తాను పొందేదానికన్నా ఎక్కువ ఇస్తుంది. కష్టాలు వచ్చినప్పుడు పక్కన నిలబడుతుంది" (శివ్ ఖెరా. 2016 : 5)

మహాభారతంలోని ద్రోణుడు, ద్రుపదుడు ఒకేచోట చదువుకోవడం వల్ల వారిద్దరి మధ్య స్నేహం ఏర్పడు తుంది. ద్రుపదుడు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన రాజ్యానికి రాజై సకలభోగాలతో పాలన చేస్తూ ఉంటాడు. ద్రోణుడు వివాహం అయి, అశ్వత్థామ పుట్టిన తర్వాత కుటుంబ పోషణకై ద్రుపదుడి దగ్గరకు ధన సాయానికై వెళ్తాడు. చిన్నప్పుడు ఇద్దరూ కలిసి చదువుకున్న విష యాన్ని గుర్తు చేసి, మన బాల్య స్నేహితులం అంటాడు. అందుకు ద్రుపదుడు ఐశ్వర్య గర్వంతో, రాజనే అహం కారంతో స్నేహితుడిని తూలనాడతాడు, అవమానిస్తాడు.

"కొలది యెఱుంగ కిట్టి పలుకుల్ పలుకం దగు గాదు నా కనన్
బలుగు దనంబునం బలుక బాడియె నీ సఖి నంచు? బేదవి
ప్రులకును ధారణీశులకు బోలగ సఖ్యము సంభవించునే?
పలుకక వేగ పొ మ్మకట పాఱుడు సంగడికాడె యెందునన్?

(ఆ.పం.ప.203.పు: 559)

ధనపతితో దరిద్రునకు, దత్త్వవిదుడగు వానితోడ మూర్ఖునకు బ్రశాంతుతోడగడు గ్రూరునకున్, రణశూరుతోడ భీ
రునకు, వరూథితోడ నవరూథికి, సజ్జనుతోడ గష్టదుర్జనునకు నెవ్విధంబునను సఖ్యము దా నొడగూడ నేర్చునే?

(ఆ.పం.ప. 204 .పు:559)

సమశీలశ్రుతయుతులకు
సమధనవంతులకు సమసుచారిత్రులకుం
దమలో సఖ్యమును వివా
హము నగుగా కగునె రెండు నసమానులకున్.

(ఆ.పం.ప.205.పు:560)

'మఱియట్లుంగాత రాజులకు గార్యవశంబునం జేసి మిత్త్రామిత్త్ర సంబంధములు సంభవించుం గావున మా యట్టి రాజులకు మీయట్టి పేదపాఱువారలతో గార్య కారణం బైన సఖ్యం బెన్నండు గానేర' దని ద్రుపదుండైశ్వ గర్వంబున మెచ్చక పలికిన విని, ద్రోణుండవమాన జనిత మన్యు ఘూర్ణ మానమానసుండయి ....."

(ఆ.పం.వ.206.పు:560)

ద్రోణుడు తమ స్నేహం గురించి చెప్పగానే ద్రుపదుడు. 'మన ఇద్దరి తారతమ్యం తెలియకుండా నాతో ఈ విధంగా మాట్లాడటం తగునా కూడదా అని అనుకోకుండా నీ స్నేహితుడనని చెప్పడం న్యాయంగా ఉందా? పేద బ్రాహ్మణులకు, రాజులకు స్నేహం ఎట్లా సాధ్యం? మారు మాట్లాడకుండా పో. అసలు బ్రాహ్మణులకు రాజు ఎక్కడైనా స్నేహితుడు అవుతాడా? ధనవంతునితో దరిద్రునికి, పండితునితో మూర్ఖునికి, ప్రశాంతునితో క్రూరుడికి, వీరునితో పిరికివానికి, కవచ రక్షణ కలవానితో రక్షా కవచం లేనివానికి, సజ్జనునితో దుర్మార్గునికి స్నేహం ఏ విధంగా ఏర్పడుతుంది? సమానమైన స్వభావం, విద్య కలవాళ్లకు, సమానమైన సంపద కలవాళ్లకు, సమానమైన మంచి నడవడిక కలవాళ్ళకు స్నేహం, వివాహం ఏర్పడుతాయి. సమానులు కాని వాళ్లకు అవి ఏర్పడవు. ఇంకా చెప్పాలంటే, రాజులకు అవసరాన్ని బట్టి మిత్రశత్రుత్వాలు ఏర్పడుతుంటాయి. అందువల్ల మా వంటి రాజులకు, మీ వంటి పేద బ్రాహ్మణులతో ప్రయోజనం లేదు. కాబట్టి, ఎప్పటికీ స్నేహం ఏర్పడదు.' అని ద్రుపద మహారాజు సంపద గర్వంతో ద్రోణుడిని స్నేహితుడిగా గుర్తించక మాట్లాడాడు. దాంతో అవమాన భారంతో కలిగిన కోపం వల్ల కలతచెందాడు.

ద్రోణుడు, ద్రుపదుడు కలిసి విద్యను నేర్చుకున్నా ద్రుపదుడు రాజుకావడం వల్ల, ఐశ్వర్య గర్వం వల్ల స్నేహం సమఉజ్జీవుల మధ్యే ఏర్పడుతుందని చెప్పాడు. అహంకారంతో తన పూర్వ మిత్రుడైన ద్రోణుడు సాయం కోరి వస్తే అతడ్ని అవమానించాడు. నిజమైన స్నేహం మిత్రుడి అవసరాన్ని ముందే గుర్తించి సాయం చేస్తుంది. ఇక్కడ ద్రోణుడు వచ్చి అడిగినా ద్రుపదుడు స్నేహానికి సంపద, కులం, బలం, విద్య వంటివి సమానంగా ఉంటేనే స్నేహం ఏర్పడుతుంది. నేను రాజును, నీవు పేదవాడివి నీకు నాకు మధ్య స్నేహం లేదని అతడ్ని అవమానించాడు. ఇలాంటి వ్యక్తిత్వం వల్ల మనిషి అవమానాలను కోరి తెచ్చుకుంటాడు. మిత్రులను కూడా శత్రువులుగా చేసుకుంటాడు. ముఖ్యంగా ప్రవర్తన మీద ఇలాంటి మనస్తత్వం దుష్ప్రభావాన్ని చూపుతుంది. ఆత్మీయులు, అనుయాయులు ఎవ్వరూ ఉండరు. కేవలం స్నేహితుల్ని దూరం చేసుకొని, అవమానించడం వల్ల వాళ్లే ప్రాణాలు కూడా తీయొచ్చు. స్నేహం స్థానంలో కోపం, పగ వంటివి ఏర్పడతాయి. కాబట్టి మిత్రత్వాన్ని కాపాడుకోవాలి. ఎప్పటికప్పుడు ఆత్మీయుల్ని పెంపొందించుకోవాలి. అంతేకాని

నిజమైన స్నేహితుల్ని గర్వంతో దూరం చేసుకోకూడదని ద్రుపదుడి ప్రవర్తన మనకు తెలియజేస్తుంది.

**అవమానం - ప్రతీకారం :**

స్నేహితుడైన ద్రుపదుడిచేత అవమానం పొందిన ద్రోణుడు హస్తినాపురానికి వెళ్లి, అక్కడ కౌరవులకు, పాండవులకు గురువుగా చేరతాడు. వారికి తన దగ్గరున్న అస్త్రవిద్యలన్నీ నేర్పుతాడు. వారిని గొప్ప యుద్ధ వీరులుగా తీర్చిదిద్దుతాడు. బాల్యస్నేహితుడైన ద్రుపదుడు చేసిన అవమానం వల్ల ఏర్పడిన కోపాన్ని దిగమింగలేక పోతుంటాడు. ఆ అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాడు. అతడినీ అవమానించాలని అనుకుంటాడు. పగను శిష్యులైన కౌరవులు, పాండవుల ద్వారా తీర్చుకోవాలని భావిస్తాడు. యుద్ధ విద్యల్లో ఆరితేరిన శిష్యులందరినీ పిలిచి తనకు గురుదక్షిణ ఇమ్మని అడుగుతాడు.

"అంత బ్రభాతం బగుటయు సమయ నియమంబులు దీర్చి యాచార్యుండు శిష్యులనెల్ల రావించి 'మీరు నాకు గురుదక్షిణ యిం'డనిన నందఱు మ్రొక్కి యెదుర నిలిచి 'మీ కెద్ది యిష్టంబు సెప్పుం' డనిన విని 'యవివేక కారణ దారణైశ్వర్యావలిప్తుండైన ద్రుపదు నొడిచిపట్టి తెం: డిదియ నాకిష్టం బైన గురుదక్షిణ'యని పంచిన" (ఆ.ష.వ.64.పు:2)

ద్రోణుడు శిష్యులందర్ని పిలిచి 'మీరు నాకు గురుదక్షిణ ఇవ్వండి' అన్నాడు. శిష్యులందరూ ఆయనకు మొక్కి ఎదుటనిలబడి 'మీకు ఏది ఇష్టమో చెప్పండి' అని అడిగారు. అందుకు ద్రోణాచార్యుడు 'అధిక సంపదతో గర్వంతో వివేకాన్ని కోల్పోయిన ద్రుపదుడిని ఓడించి పట్టి తీసుకురండి. అదే నాకిష్టమైన గురుదక్షిణ' అని చెప్పాడు.

అవమానం వల్ల మనసు క్రుంగిపోతుంది. శరీరానికి తగిలిన దెబ్బకన్నా మనసుకు తగిలిన అవమానమనె దెబ్బ తీవ్రత చాలా ఎక్కువ. అది పగగా మారితే ఆపడం ఎవరికీ సాధ్యం కాకపోవచ్చు. ముందు వెనుకలు ఆలోచించకుండా మరో మనిషిని తూలనాడటం, డబ్బు, అధికారం వల్ల మరొకరిని తక్కువ చేసి అవమానించకూడదు. మానవ సంబంధాల్లో ధనం కన్నా, అధికారం కన్నా మరో మనిషికి ఇచ్చే గౌరవం, విలువే ముఖ్యమైనవి. కానీ ద్రుపదుడు ద్రోణాచార్యుడ్ని ఐశ్వర్య మదం వల్ల అవమానించాడు. అందువల్లే వారిద్దరి మధ్య ఉన్న స్నేహం కాస్త పగగా మారింది. ఇప్పుడు ద్రోణుడు తన శిష్యులతో ఆ అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. ద్రోణుడు అనుకున్నట్లే ముందు కౌరవలు వెళ్లి ద్రుపడి చేతిలో ఓడిపోయినా, తర్వాత పాండవులు వెళ్లి ద్రుపదుడ్ని యుద్ధంతో ఓడించి రథం ఇరుసుకు కట్టి తెస్తారు. ద్రోణుడు ద్రుపదుడ్ని చూసి, ఆనాటి అవమానాన్ని గుర్తుకు తెచ్చేలా వ్యంగ్యంగా మాట్లాడతాడు. అతనిలోని కోపాగ్నిని మాటల్లోని వ్యంగ్యంతో వ్యక్తపరుస్తాడు.

"వీరెవ్వ రయ్యా? ద్రుపదమ
హారాజులె! యిట్లు కృపణు లయి పట్టువడన్
వీరికి వలసెనె?యహహా! మ
హారాజ్యమదాంధకార మది వాసెనొకో?

(ఆ.ష.ప.90.పు:621)

'ఇంక నైన మమ్ము నెఱుగంగ నగునొక్కొ!' నుచు
నుల్లసంబు లాడి ద్రుపదు
విడిచిపుచ్చె గురుడు: విప్రులయుయుకయు
దృణహుతాశనంబు దీర్ఘ మగునె?"

(ఆ.ష.ప.90.పు:622)

ద్రోణుడి శిష్యుడైన అర్జునుడు ద్రుపదుడిని రథం ఇరుసుకు కట్టి తెచ్చి ద్రోణుడి ముందు పడేస్తాడు. అప్పుడు ద్రోణుడు ద్రుపదుడ్ని చూసి 'వీరెవరయ్యా? ద్రుపదమహారాజు లే!' దిక్కులేక ఈ విధంగా పట్టుపడ వలసిన అవసరం ఏర్పడిందే? మహారాజు అనే మదం వల్ల కలిగిన కన్నుగానని తత్వం తొలిగిపోయిందా? ఇక ముందైనా మమ్మల్ని గుర్తు పెట్టుకోగలరా?' అని ఎగతాళి చేసి, ద్రోణుడు ద్రుపదుడ్ని విడిచి పెట్టాడు. బ్రాహ్మణుని కోపం, గడ్డి నిప్పు ఎక్కువకాలం ఉంటాయా?

ద్రుపదుడు అతని బాల్య స్నేహితుడు ద్రోణుడ్ని అవమానించి, తిరిగి అవమానాన్ని పొందాడు. అంతేకాదు

ఇద్దరి మధ్య ఉన్న స్నేహం కాస్త పగగా మారేలా చేశాడు. జీవితంలో విజయం సాధించాలన్నా, మంచి ప్రవర్తనతో బతకాలన్నా స్నేహాలు, స్నేహితులు అవసరం. వారిని కాదని ఎవరూ జీవితంలో పైకి ఎదగలేరు. మనోహరమైన వ్యక్తిత్వంలో స్నేహానికి చాలా స్థానం ఉంది. బంధాలను సమయానికి తగిన విధంగా మార్చుకుంటూ, పెంచుకుంటూ జీవించాలి. తగిన విధంగా స్నేహితుల పట్ల, వారి స్నేహాల పట్ల సర్దుకుపోతూ, తగిన సాయం అందిస్తూ, స్వీకరిస్తూ బతకడమే స్నేహాల్ని నిలుపుకోవడం. అదే ఉన్నతమైన వ్యక్తిత్వానికి మార్గం.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. సుబ్రహ్మణ్యం, జి.వి. (సం.) 2014. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
2. స్వామి వివేకానంద. 2008. వ్యక్తిత్వ వికాసం. హైదరాబాదు: రామకృష్ణమఠం.
3. శాంతమ్మ, ఎన్. 2010. మహాభారత మహిళాదర్శనం. హైదరాబాదు: ప్లానో గ్రాఫర్స్.
4. గోపాలకృష్ణమూర్తి, నందుల. 2010. భారతామృతము (భారతమందలి పాత్రలు). హైదరాబాదు: మైత్రేయ ఆర్ట్స్ అండ్ ముద్రణ.
5. శివ్ ఖెరా. 2014. మీరూ విజయాన్ని సాధించగలరు. న్యూ దిల్లీ: బ్లూమ్స్‌బురీ. భోపాల్:మంజుల్ పబ్లికేషన్స్.
6. రాబిన్ శర్మ. మద్దూరి రాజశ్రీ. (అను.). 2012. మహోన్నత జీవనం. అహ్మదాబాద్: జైకో పబ్లిషింగ్ హౌస్.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# 'ద్వానా' కవితలు - వస్తువు

- డాక్టర్ కె.లక్ష్మణ, అతిథి ఉపన్యాసకులు, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం,చెన్నై, తమిళనాడు.

## ప్రస్తావన :

'ద్వా.నా.శాస్త్రి'గా సాహిత్యలోకానికి సుపరిచితుడైన వారు ద్వాదశి నాగేశ్వర శాస్త్రి గారు. ఈయన రచయితగా, సాహిత్యవేత్తగా, పరిశోధకుడుగా, మహాపండితుడుగా, విమర్శకుడుగా, సమీక్షకుడుగా ఇలా ఎన్నో రంగాల్లో రాణించారు. ద్వానా శాస్త్రిగారు 1948వ సంవత్సరం జూన్ 15వ తారీఖున కృష్ణాజిల్లా, లింగాల గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు ద్వాదశి లక్ష్మీ ప్రసన్న, ద్వాదశి కృష్ణశాస్త్రి. ద్వానాశాస్త్రిగారు ఏలూరులోని సర్.సి.ఆర్.రెడ్డి కళాశాలలో బి.ఎస్సీ. చదువుకొన్నారు. తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ.తెలుగు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైయ్యారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో 'మారేపల్లి రామచంద్రశాస్త్రి కవితా సమీక్ష' అన్న అంశం మీద ఎం.ఫిల్. పరిశోధన చేశారు. తెలుగు విశ్వవిద్యాలయంలో 'సాహిత్య సంస్థలు' అన్న అంశం మీద పిహెచ్.డి.పరిశోధన చేసి, పిహెచ్.డి.లో గోల్డ్‌మెడల్‌ను సాధించారు. పై చదువులే కాకుండా పి.జి.డిప్లొమా ఇన్ లింగ్విస్టిక్స్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. పై చదువుల్ని చదువుకొన్న ద్వానాశాస్త్రిగారు 1972వ సంవత్సరంలో అమలాపురంలోని ఎస్.కె.బి.ఆర్.కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, రీడర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. అలా ద్వానాశాస్త్రిగారి ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. తెలుగు అధ్యాపకులుగానే కాకుండా ఐఎఎస్, గ్రూప్ ఒన్, గ్రూప్ టూ, జూనియర్ లెక్చరర్లు, తెలుగు పండిట్ ఇలా వివిధ ఉద్యోగాలకు పరీక్షలను రాసే విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ద్వానాశాస్త్రిగారు అధ్యాపక వృత్తిలో భాగంగానే 1970వ సంవత్సరంలో రచనా వ్యాసాగానికి నాంది పలికారు. 1.సమాధిలో స్వగతాలు (వచన కవితా సంపుటి-మార్గశీర్షతో కలిసి) 1981, 2.వాఙ్మయలహరి (వ్యాస సంపుటి) 1982, 3.సాహిత్య సాహిత్యం (వ్యాస సంపుటి) 1985, 4.మారేపల్లి రామచంద్రశాస్త్రి కవితా సమీక్ష (ఎం.ఫిల్.సిద్ధాంత వ్యాసం) 1987, 5.ద్రావిడ సాహిత్య సేతువు - ఆచార్య చల్లా 1989, 6.వ్యాస ద్వాదశి (వ్యాస సంపుటి) 1991, 7.అక్షర చిత్రాలు (అరుదైన ఛాయాచిత్రాల సంపుటి) 1993, 8.సాహిత్య సంస్థలు (పిహెచ్.డి.సిద్ధాంత వ్యాసం) 1995, 9.ఆంధ్ర సాహిత్యము (3 వేల బిట్లుగల క్విజ్ పుస్తకం) 1996, 10.మన తెలుగు తెలుసుకుందాం 1997, 11.ద్వానా కవితలు (వచన కవితా సంపుటి) 1998, 12.శతజయంతి సాహితీమూర్తులు (సంపాదకత్వం) 1998, 13.తెలుగు సాహిత్య చరిత్ర 1998 ఇలా ఎనభైకి పైగా సాహిత్య గ్రంథాలను వెలువరించారు.

ద్వానాశాస్త్రిగారు సాహిత్య గోష్ఠిల్లో పాల్గొని అంతర్జాతీయ రికార్డులను కూడా సొంతం చేసుకున్నారు. ఈయన 2013వ సంవత్సరంలో12గంటల పాటు నిర్విరామంగా తెలుగు భాషా, సాహిత్య, సాంస్కృతిక అంశాలపై ఉపన్యాసం చేసి 'సాహిత్య సవ్యసాచి' అన్న బిరుదు పొంది, ప్రపంచ రికార్డును కైవసం చేసుకొన్నారు. అలాగే 2014వ సంవత్సరంలో ద్వానాశాస్త్రి 67వ ఏట, 67వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 'పలకరిస్తే ప్రసంగం' అన్న అంశం మీద 367 నిముషాలు నిర్విరామ ప్రసంగంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ వీరి పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.2015వ సంవత్సరంలో 'వెంటాడే వాక్యాలు' అన్న అంశంపై నాలుగు గంటల నిర్విరామ ప్రసంగం చేసి 'జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్' సాధించారు. ఇలా వివిధ అవార్డులు, సన్మానాలు పొందినటువంటి ద్వానాశాస్త్రి గారి ఉపన్యాసాలు సాహితీ ప్రపంచంలో కోకొల్లలని చెప్పుకోవచ్చు.

ఎంత ఎదిగినా, ఒదిగే ఉండే లక్షణం, వ్యక్తిత్వం కలిగిన ద్వానాశాస్త్రిగారు 2019వ సంవత్సరం ఫిబ్రవరి 26వ తారీఖున కీర్తిశేషులైయ్యారు. ఈయన మరణం

తెలుగు చదువుకొంటున్న విద్యార్థుల దగ్గర నుండి ఆచార్యుల వరకు ఒక 'సాహితీ విజేత'ను కోల్పోయి నటువంటి బాధ 'తెలుగు సాహిత్య చరిత్ర' గ్రంథాన్ని తాకినప్పుడంతా, ఆయన మన మనసులో మెదులుతూనే ఉంటాడు. మనల్ని ముందుకు నడిపించడానికి ద్వానా జీవన యానాన్ని అంతా కూడా సాహితీ జీవితానికి దారిపోసి ఒక 'తెలుగు సాహిత్య చరిత్ర'నే కాకుండా పలుగ్రంథాలను అందించిన ఘనుడు ద్వానాశాస్త్రిగారు. అలాంటి ద్వానా శాస్త్రిగారిని తెలుగును చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు, పరిశోధక మిత్రులు గుర్తుం చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఇలా ఎనభైకి పైగా రచనలు చేసినటువంటి ద్వానా శాస్త్రిగారు 1998వ సంవత్సరంలో 'ద్వానా' కవితలు అన్న వచన కవితా సంపుటిని వెలువరించారు. ఈ 'ద్వానా' కవితలు కవితా సంపుటిలో మొత్తం ఇరవై అయిదు కవితలున్నాయి. ఈ కవితల్లోని వస్తువును పరిశీలించడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

**వస్తువు :**

ఏ సృజనాత్మక రచనా ప్రక్రియకయినా ప్రాణప్రద మయింది వస్తువు. వస్తువులేకుండా ఏ ప్రక్రియా నడవదు, నడిచినా దాని ప్రయోజనాన్ని గురించి ఆలోచించాల్సి ఉంటుంది. "ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్" అన్నాడు భరతుడు. అందువల్ల ప్రతిరచనకూ వస్తువు అని వార్యం. ఈ వస్తువు ఎలా ఉండాలి? ఎవరికోసం రాయాలి? మొదలయిన విషయాలను గురించి కవులు ఏంచెప్పారన్న విషయం కవిత్వంలో మొదటి అంశంగా గమనించాలి. అందువల్ల కవితా వస్తువుకు సంబంధించి కవుల దృక్పథం ఏమిటన్నది ఆలోచించాలి. తెలుగు కవిత్వానికి ఒక రూపం కల్పించినవాడు నన్నయ. నన్నయకు ముందున్న కవిత్వం గురించిన స్పష్టమయిన అవగాహన లేకపోవడంవల్ల దాన్ని పరిగణనలోకి తీసుకొని ఒక నిర్ణయానికి రావడానికి వీలుకాదు. కాబట్టి నన్నయే కొలబద్ద. నన్నయ భారతరచనకుపక్రమించే ముందు కవిత్వానికి సంబంధించిన అనేక విషయాలను స్పష్టం చేశాడు. వాటిని దృష్టిలో పెట్టుకొని ఆయన కవితా దృక్పథాన్ని అంచనా వెయాల్సి వస్తుంది. తెలుగు కవితా రంభం ఎలా జరిగిందో కూడా అదే దృక్పథంతోనే ఆలో చించాల్సి ఉంటుంది. ఆంధ్రశబ్దచింతామణిలో మొదటి సూత్రం 'విశ్వశ్రేయ: కావ్యమ్'అని ఉంది. ఒక వ్యాకరణ గ్రంథంలో కావ్యం ఎందుకు రాయాలన్న విషయాన్ని గురించిన ప్రస్తావన అవసరంలేదు. అయితే అది ప్రస్తా వించింది. ఆంధ్రశబ్దచింతామణి సంస్కృత గ్రంథం అయి నప్పటికీ అది తెలుగుకు సంబంధించిన గ్రంథం కాబట్టి తెలుగు కవితాదృక్పథాన్ని పట్టివ్వడానికి ఉపయోగ పడుతుంది. ఆంధ్రశబ్దచింతామణి నన్నయ గ్రంథమని అంగీకరించినా, అది ఆయన భారతానికి ముందు రాశాడా? తరువాత రాశాడా? అన్న మీమాంస ఉండనే ఉంటుంది. దానికీ సరయిన సమాధానం లేదు. కాబట్టి ఆ చర్చకు వెళ్ళకుండా అందులోని విషయాన్ని మాత్రం గ్రహించాల్సి ఉంది. కావ్య వస్తువుకు సంబంధించి అది 'విశ్వశ్రేయ: కావ్యమ్' అంటోంది. అంటే కావ్యరచన ప్రపంచానికి మేలు చేకూర్చేదిగా ఉండాలని భావం. ప్రపంచమంటే ప్రజలు. ప్రజలకు మేలు చేసేదిగా ఉం డాలి. కావ్యంలోని వస్తువు ప్రజలకు మంచి చేసేదిగా ఉండాలన్నది సారాంశం. కవితా వస్తువుకు సంబంధించిన దృక్పథం స్పష్టమయిపోయింది. కవితా వస్తువు ప్రజలకు మంచి కలిగించేదిగా ఉండాలి.

'ద్వానా' కవితలు అన్న శీర్షికతో గ్రంథరూపం దాల్చిన 'ద్వానా' కవితలన్నీ ఆలోచనాత్మకంగానూ, సమాజానికి ఉపయోకరంగా ఉందనడంలో సందేహంలేదు. ఎందు కంటే ద్వానా శాస్త్రిగారి కలం నుండి వెలువడిన కవితలన్నీ కూడా వివిధ అంశాలతో, వివిధ కోణాలతో వెలు వరించారు. అందువల్లే ద్వానాస్త్రిగారికి ఆధునిక సాహిత్య కవుల్లో ఒక ప్రత్యేకమయిన స్థానం లభించింది. ఏది ఏమయినప్పటికీ కవి కలం నుండి వెలువడిన కవితలన్నీ కూడా ఆయన మరణం తర్వాత కూడా పరిపూర్ణంగా పండితుల దగ్గర నుండి సామాన్య ప్రజల నోళ్లలో కూడా నానుతూ ఉంటుందనడంలో అతిశయోక్తి కాదు. కాబట్టి

ద్వానా శాస్త్రిగారు మరణించినప్పటికీ ఆయన కవితలన్నీ కూడా చిరకాలం బ్రతికే ఉంటుంది.

**జీవితానుభవం :**

ఈ 'ద్వానా' కవితలోని 'ప్రశ్నించాల్సిందే...' అన్న కవితలో ప్రారంభంలోనే-

"చిన్నప్పుడు / నీ వాడలోకి వెళ్ళినందుకు
చాంతాడు దెబ్బలు తిన్నాను / నీ జట్టు కట్టినందుకు
ఎండలో నిలబడ్డాను / స్కూలులో నీ పక్కన కూర్చొని
చక్కిలాలు తిన్నందుకు
సచేల స్నానం చేశాను / యూనివర్సిటిలో
నీతో తిరిగినందుకు అప్రాచ్యుడ్ని అయ్యాను"

('ద్వానా'కవితలు)

ద్వానా శాస్త్రిగారు మనిషి స్వేచ్ఛా జీవి అని చెప్పడానికి పై కవితా పాదాల్ని కవిత్వీకరించారు. ఈయన చిన్నప్పటి నుంచి పెద్దవారు అయ్యేంతవరకు ఏ విధంగా వారి జీవితానుభవాల్ని గుర్తుచేసుకుంటున్నారనేటువంటి విషయాన్ని గురించి ప్రస్తావించారు. అంటే చిన్నప్పుడు వీధిలోకి వెళ్ళినందుకు చాంతాడు దెబ్బలు తిన్నానని చెప్పడమే కాకుండా నీతో స్నేహం చేసినందుకు ఎండలో కూడా నిలబడ్డాను అని హితబోధచేశారు. అంతే కాకుండా స్కూలులో నీ పక్కనే కూర్చొన్నందుకు సచేలంగా స్నానం చేశానని తెలిపారు. పై చదువులు చదివేటప్పుడు నీతో తిరిగినందుకు అందరి చేత అప్రాచ్యుడ్ని అయ్యాననే విషయాన్ని వ్యక్తీకరించారు.

"ఉద్యోగం చేస్తున్నప్పుడు / నీ ఇంటికి వచ్చినందుకు/
నీ పక్షాన మాట్లాడినందుకు /అబ్రాహ్మణుడినయ్యాను
బద్ధ శత్రువు నయ్యాను / నా మానుష స్వేచ్ఛని/
ధ్వంసం చేస్తున్న ఈ వ్యవస్థని / ఇన్ని రాత్రులూ
సూటిగా ప్రశ్నిస్తూనే వున్నాను"

('ద్వానా'కవితలు)

మనిషి నిద్రపోయే ముందుగా ఆ రోజు చేసిన మంచి కార్యాలను ఒక సారి గుర్తు చేసుకుని నిద్రిస్తే ఆ నిద్రకు ఒక సార్థకం ఉంటుంది. ఎందుకంటే ఆ రోజు చేసిన మంచి? చెడు? అన్న ఈ రెండు విషయాలకు ప్రాముఖ్యత ఇవ్వవలసిన బాధ్యత మనిషికి ఉంది కాబట్టి. ఒక వ్యక్తితో చిన్నప్పటి నుంచి ఉద్యోగం చేసినంతవరకే కాకుండా తన ఇంటికి వచ్చినందుకు, నీతో మాట్లాడినందుకు అబ్రాహ్మణుడయ్యానని, బద్ధ శత్రువు అయ్యానని, మనిషి స్వేచ్ఛని బద్ధలు కొట్టిస్తున్న ఈ వ్యవస్థ గురించి ప్రతి రాత్రి ప్రశ్నిస్తున్నానని వెలిబుచ్చారు. అంటే ద్వానా శాస్త్రిలో కలిగిన జీవితానుభవాన్ని గురించి పై కవితా పాదాల్లో వెల్లడించారు. అంటే ద్వానా శాస్త్రి గారి కవిత్వంలో మానవతా దృక్పథం కలిగి ఉందంటే అతిశయోక్తి కాదు.

**అనన్వయాలంకారం :**

ద్వానా శాస్త్రిగారు 'సీమతత్త్వం' కవితలో సీమవాసులు ఏ విధంగా జీవిస్తారో? ఏ విధంగా ఒక మాట తీరుగా నిలబడుతారో? అన్న అంశాలను గురించి-

"సీమవాసులు అచ్చంగా సీమవాసులే / అనన్వ
యాలంకారం వాళ్ళసహజగుణం
రెండు నాల్కలు ఎంతస్కానింగ్‌లోనైనా కనపడవు /
వాళ్ళమాట బడిపంతులు బెత్తం కావచ్చు
కాని, మనసు మాత్రం తల్లి!"

('ద్వానా'కవితలు)

పై కవితా పాదాల్లో అనన్వయాలంకారం చోటుచేసుకొన్నది. అంటే ఒకే వస్తువు ఉపమానం, ఉపమేయం అయితే అది అనన్వయాలంకారం అంటాం. ఇక్కడ ఉపమేయం సీమవాసులు, ఉపమానం సీమవాసులే అంటే సీమవాసులకి సాటి సీమవాసులే కానీ మరొక వస్తువు లేదని భావం. కాబట్టి ఇది అనన్వయం అవుతుంది. ద్వానా శాస్త్రిగారు అనన్వయాలంకారం సీమవాసులకి సహజ గుణమని వ్యక్తపరిచారు.ఒక నాలుకను స్కానింగ్ తీసినప్పుడు రెండు నాల్కులు కనబడదనే విషయాన్ని పరిగణలోనికి తీసుకొవాలన్నారు. సీమవాసులు మాట ఏలా ఉంటుందనే పాఠాలు నేర్పే బడిపంతులు బెత్తం లాగా ఉంటుందని వెలిబుచ్చారు. అయినప్పటికీ ఆ సీమవాసులు మాట మాత్రం తల్లి మనస్సుతో సమానమే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకొవాలన్నారు.

**రెండు కళ్ళు :**

'సీమతత్త్వం' కవితా పాదాల్లోని మరికొన్ని విషయాలను కూడా కవిత్వీకరించారు-

"వాళ్ళు రెండు రెళ్ళు నాలుగే అంటారు / తెల్లనివి అన్నీ పాలేనంటారు
వాళ్ళ నిఘంటువులో 'వెన్నుపోటు' కనపడదు / నమ్మకం నీటిమూట అవుతున్నప్పుడు
అందించిన స్నేహహస్తం నరికివేయబడుతున్నప్పుడు / రాజకీయ నాయకులు ముఠాలకు, వర్గాలకు
మహారాజ పోషకులవుతున్నపుడు / జలధారలకి బదులు
బాష్ప ధారలు కురుస్తున్నప్పుడు / పగ, ఆవేశం రెండు కళ్ళు కావచ్చు గదా!" ('ద్వానా'కవితలు)

ఒకే మాట, ఒకే బాట. అన్న పదానికి సార్థకం సీమవాసులే. ఎందుకంటే సీమవాసుల్లో ఉన్నటువంటి ఔదార్యం మరో వ్యక్తుల్లో ఉండదనే చెప్పాలి. ద్వానా శాస్త్రిగారు సీమవాసులు రెండు రెళ్ళు నాలుగే అంటారు. అలాగే తెల్లగా ఉండేవన్నీ కూడా పాలే అని చెబుతారు. వాళ్ళు దగ్గర ఉండే మంచితనానికి 'వెన్నుపోటు' అనే పదమే కనబడదన్నారు. ఒక్కొక్కసారి సీమవాసుల్లో నమ్మకం, తోటి వారికి వాళ్ళు అందించినటువంటి స్నేహం గానీ తొలగించబడినట్లయితే వాళ్ళల్లో పగ, ఆవేశం రెండు కళ్ళుగా ఉంటాయానే విషయాన్ని ద్వానాశాస్త్రిగారు పసిగట్టారు. అంటే రాజకీయ నాయకులు అవినీతికి, కొన్ని వర్గాలకు మహారాజులే పోషకులవుతున్న తరుణంలో, నీళ్ళకు బదులు కన్నీళ్ళు కురుపించినప్పుడు సీమవాసుల్లో కలిగే ఆవేశం ఎలా ఉంటుందనే విషయాన్ని క్రోడీకరించారు.

**ప్రాంతీయ తత్త్వం :**

ప్రాంతాలకే పరిమితమవుతున్నటువంటి విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలనే సత్సంకల్పంతో ప్రాంతీయ తత్త్వాన్ని కూడా నాంది పలికారు ద్వానా కవితల్లో-

"మరివాళ్లు మనసిచ్చారో..... / మనకి కంచె అవుతారు
నిచ్చెన అవుతారు / వారసత్వపు పునాదిని అలాగేవుంచి
కొత్తభవనాలతో సరికొత్త రత్నాలను అద్దుతారు /
జీవితం వడ్డించిన విస్తరి అయిన వాళ్ళకి
వాళ్ళ సాహిత్యాభిమానం, జలాభిమానం / ప్రాంతీయ తత్త్వంగానే గోచరిస్తుంది
ఎద్దుపుండు కాకికి నొప్పా?" ('ద్వానా'కవితలు)

'సీమతత్త్వం' కవితలో సీమవాసులు చేస్తున్నటువంటి మంచి కార్యాలకు నిదర్శనం పై కవితా పాదాలే. వాళ్లు మనసు ఇచ్చారంటే మనకి కంచెగా, నిచ్చెనగా ఉంటారన్నారు. కానీ వారసత్వానికి సంబంధించిన విషయాలను అలాగే ఉంచి కొత్త విషయాలకు నాంది పలుకుతామన్నారు. అంటే జీవితం వడ్డించిన విస్తరి అయినటువంటి వాళ్ళందరికీ, వాళ్ళ సాహిత్యాభిమానం, జలాభిమానం ప్రాంతీయ తత్త్వంగానే ఉంటుందనే విషయాన్ని ప్రస్తావించారు. ద్వానా శాస్త్రిగారు 'సీమతత్త్వం' కవితా పాదాల్లో చివరి పాదంలో 'ఎద్దుపుండు కాకికి నొప్పా?' అన్నారు. ఎద్దుకు తగిలిన దెబ్బ వల్ల కలిగిన పుండును కాకి పొడిచినప్పుడు ఎద్దుకు మాత్రమే ఆ నొప్పి తెలుస్తుంది గానీ కాకికి ఆ నొప్పి తెలియదనే విషయాన్ని చాలా చమత్కారంగా రచయిత తెలియజేశారు.

**చారిత్రక నేపథ్యం :**

ద్వానా శాస్త్రి గారు 'ఎప్పుడూ శత్రువే గెలుస్తున్నాడు...' అనే కవితలో శత్రువు ఎలా గెలుస్తున్నాడో అనే విషయాన్ని ఈ కింది కవితా పాదాల్లో చూద్దాం-

"చరిత్ర తిరగేస్తే ఎవరు పరాజితులో తెలీకపోదు
మనల్ని విజయలక్ష్మి వరించడం
తాత్కాలికమేనని తెలుసుకోలేకపోతున్నాం"
('ద్వానా'కవితలు)

ఇప్పటికీ మనిషి జీవితం తాత్కాలికమనే విషయాన్ని ఎవరూ పసిగట్టలేకపోతున్నారు. పగ, ఈర్ష్య, అసూయలతో ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటూ జీవన యానాన్ని సాగిస్తున్నారు. అయినప్పటికీ ద్వానాశాస్త్రిగారు చరిత్రను చూస్తే ఎవరు పరాజితులైనారో తెలియకుండాపోదన్నారు. అంటే చరిత్ర ద్వారా నిజం తెలుసుకొని, విజయానికి

సోపానం వేస్తుందనే విషయాన్ని స్పష్టం చేశారు. అదే విజయం కూడా తాత్కాలికమని వాపోయారు. అందువల్లే జీవితం చిన్నది. బ్రతికి ఉన్నంత వరకే మనిషి జీవితం.

"ఎప్పుడూ శత్రువే మనమీద సవారీచేస్తున్నాడుమన
చదువులు మీద, (వ్యాపారాలమీద) ఆలోచనలమీద
చివరికి మన వివాహవ్యవస్థ మీద
శత్రువు ఎగరేసే విజయపతాకని చూడలేక
పోతున్నాం"('ద్వానా'కవితలు)

పై కవితా పాదాల్లో శత్రువు ఎలాంటి వాడో ద్వానా శాస్త్రిగారు కవిత్వీకరించారు. అందువల్లే శత్రువులు దగ్గర జాగ్రత్తగా ఉండాలని కూడా వాపోయారు. పై పాదాల్లో ఎల్లప్పుడూ శత్రువే మంచి వారి మీద సవారీగా విహరిస్తున్నాడనీ, అదే శత్రువు మన చదువుల మీద, ఆలోచనల మీద నిరంతరం మెదులుతూనే ఉన్నాడని స్పష్టం చేశారు. అంటే మూడు విషయాల మీదనే కాకుండా చివరికి మన వివాహ కార్యక్రమంలో కూడా విజయపతాకాన్ని చూడలేకపోతున్నామనే బాధనే వ్యక్తపరిచారు.

**సంస్కృతి :**

సంస్కృతి సంప్రదాయాలు ఏ విధంగా కనుమరుగై పోతుందన్న విషయాన్ని కింది పాదాల్లో చూద్దాం-

"శరీరాలు దగ్గరగా ఉన్నా మనుసులు దూరం దూరం
కళ్ళనీ మెదడునీ తాకట్టు పెట్టి / అన్నదమ్ముల మధ్య
భార్యా భర్తల మధ్య
తాతా మనవళ్ళ మధ్య / చానల్ మార్చటం కోసం
అనురాగం పణంగా పెడతాం / దేవతావస్త్రాలు కూడా
లేని అంగాంగాల్ని
నట్టింట్లో ప్రదర్శిస్తూ నిస్సిగ్గులమవుతాం"
('ద్వానా'కవితలు)

నేటికాలంలో ఎవరి సంస్కృతి వాళ్ళది. ఎవరి సంప్రదాయాలు వారివి. కానీ నాటి నుంచి నేటి వరకు కూడా గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయాలకు కట్టుబడి ప్రజలు జీవిస్తుంటారంటే అతిశయోక్తి కాదు. వాళ్ళ సంస్కృతే వారి జీవితం. వారు సంప్రదాయాన్నే జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్నారు. అందువల్లే ద్వానాశాస్త్రి గారు ఇద్దరు మనుషులు ఒక చోట ఉన్నాగానీ, వారి మనసులు మాత్రం ఎక్కడో ఉన్నటువంటి విషయాన్ని గురించి తపన పడుతుందని తెలియజేశారు. అంటే నేటి కాలంలో అన్నదమ్ముల మధ్య గానీ, భార్యభర్తల మధ్య గానీ సంబంధం బాంధవ్యాలు చాలా వరకు ఏదో ఒక మాటతో సరిపెట్టుకోవడంలో ఉంది. కానీ అన్నదమ్ముల్లో ఆప్యాయతానురాగాలు, భార్యాభర్తల మధ్య అన్యోన్య బంధమంతా నేటి కాలంలో కనిపిస్తుందా? అంటే కొంత మందిలో మాత్రమే అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవలసిన విషయం. ఎందుకంటే చిన్నప్పుడు ఉన్నటువంటి అన్నదమ్ముల మధ్య వాత్సల్యం పెరిగి పెద్దయి పెళ్ళిన తరువాత కొంత వరకు ఆ ప్రేమానురాగాలు కనుమరుగైపోతున్నది. అదే విధంగా భార్యాభర్తలు కూడా నేటి కాలంలో ఉదయించే సూర్యుడు, అస్తమించే చంద్రుడ్ని కూడా వాళ్ళ ఇద్దరు చూస్తారో లేరో అన్న ప్రశ్న కూడా ఉంది. నేటి యాంత్రిక ప్రపంచంలో భార్యాభర్తలు కలిసి మాట్లాడుకోవడం, కలిసి భోజనం చేయడం లాంటి అంశాలు ఏదో కొద్ది మందిలో మాత్రం ఉంటుంది. ఎందుకంటే భర ఉదయం నిద్రనుండి మేల్కొనే లోపల భార్య ఇంటిలో ఉంటుందా? ఆఫీసులో ఉంటుందా? అంటే ఆఫీసులోనే ఉంటుందనే చెప్పే నేటి కాలంలో ప్రేమానురాగాలు ఎలా బలపడతాయనే విషయం మాత్రం సందేహం. అందువల్లే ద్వానాశాస్త్రిగారు పై నాలుగు పాదాల్లో ఎంతో లోతైనటువంటి కవితా వస్తువును విపులీకరించారంటే అతిశయోక్తి కాదు. కుటుంబంలో తాత మనవళ్ళు గానీ, తల్లిదండ్రులు గానీ ఏదైనా మంచి విషయాలు మాట్లాడుకోవడం వదిలేసి, టివిలో చానల్ మార్చే కాలం వచ్చేసిందనే విషయాన్ని గురించి ద్వానాశాస్త్రి గారు ప్రస్తావించారు. ఈ కవితా శీర్షికలో చివరగా-

"మనం ఇరవై ఒకటో శతాబ్దాంలో ఉన్నామని / అజ్ఞాన తన్మయత్వం చెందుతాం
నిజానికి ప్రజలకి దూరమైంది దూరదర్శన్ కాదు / మన సంస్కృతి..... మనం మాత్రమే!!"

('ద్వానా'కవితలు)

21వ శతాబ్దంలో ఉన్నప్పటికీ, ప్రజలకు దూర మయింది దూరదర్శన్ కాదనే విషయాన్ని స్పష్టం చేశారు. ఈ ఆధునిక సమాజంలోని ప్రజల్లో సంస్కృతి సంప్ర దాయాలు, కట్టుబాట్లు కనుమరుగైపోయాయనే విష యాన్ని మరో సారి కవితీ్వకరించారు. అందువల్లే ద్వానాశాస్త్రి గారి కవితా పాదాలు ఒక నూత్నమయి నటువంటి అంశాన్ని గురించి వ్యక్తీకరించడంలో ద్వానా శాస్త్రిగారికి సాటి ద్వానాశాస్త్రిగారే అన్న విషయం ద్యోతక మవుతుంది.

**సహజ గుణం :**

ద్వానా శాస్త్రిగారు 'సన్మాన దృశ్యం' అన్న కవితలో సన్మాలు చేసుకుంటున్న వాళ్ళు ఎలా ఉప్పొంగి పోతున్నారో ఈ కింది కవితా పాదాల్లో-

"ఇప్పుడు / సన్మానం ఆధునికతద్దినం
తెల్లని పట్టువస్త్రంపై ఆవకాయ డాగు / ప్రత్యేకమైన 'మహారాజా' కుర్చీలో
కూర్చో పెట్టినప్పుడు / సహజత్వం ప్రశ్నాకర్థకమై నిలుస్తుంది" ('ద్వానా'కవితలు)

ఆధునిక కాలంలో సన్మానాలు చేసే విధానాన్ని గురించి తెలియజేశారు. అంటే మనిషిలో సహజత్వం, సమానమైన గుణం ఎలా ఉంటుందన్న విషయాన్ని క్రోడీ కరించారు. సన్మానం చేసే వ్యక్తికి తెల్లని పట్టువస్త్రాలే కాకుండా, ప్రత్యేకమయినటువంటి పెద్ద కుర్చీలో కూర్చొపెట్టి 'మహారాజా'లాగా సన్మానం చేస్తున్న సంప్ర దాయాన్ని ఒక సారి గుర్తు చేశారు. కాని ఇలాంటి సన్మా నాలు చేసుకుంటున్న వ్యక్తిలోని సహజమయిన గుణం ప్రశ్నాకర్థంగానే నిలుస్తుందనే విషయాన్ని స్పష్టం చేశారు. ఇంకా పలు విషయాలను ప్రస్తావించారు.

"శాలువా కప్పుతున్నప్పుడు / ఖద్దరు వేసుకొన్న నాయకుడు గుర్తుకు వస్తాడు
బలవంతంగా వేయించుకున్న దండలమధ్య / అతగాడు పుట్టలోని కృష్ణసర్పంలా వుంటాడు"

('ద్వానా'కవితలు)

పలువురికి సన్మానాలు చేస్తున్నప్పుడు, ఆ సన్మానం చేసుకుంటున్న వ్యక్తికి ఖద్దరు ధరించినటువంటి నాయ కుడు గుర్తుకు వస్తాడని, అతడు బలవంతంగా వేయించు కున్న దండల్లో పుట్టలోని నల్లనిపాములా ఉంటాడని సంబోధించారు. సన్మాలను పొందిన వ్యక్తి ఏవిధంగా ఉ ంటాడో, అతనికి కలిగే అనుభూతిని గురించి కూడా విపులీకరించారు. అందువల్లే సన్మానాలనీ, సత్కారాలనీ ఇతరులు చేస్తున్నారో, ఆ వ్యక్తే ఇతరుల దగ్గరచేయించు కుంటున్నారన్న విషయాన్ని కూడా ఒక సారి అందరూ పరిశీలించాల్సిన ఆవశ్యకత ఏంతైనా ఉంది.

"వేదిక మీద చిలక పలుకలు విన్నప్పుడు / మాటలు కూడా కాలుష్యమవుతాయని గ్రహిస్తాం
అతగాడికి చదివే సన్మానపత్రం / కూచిమంచి తిమ్మకవి కవిత్వంలా వుంటుంది
ఆ చప్పట్లు.... అతగాడికి అహంకారాన్ని నూరిపోస్తాయి
ఆ బిరుదులు..... ఎదుగుదలకి పుల్‌స్టాపులవుతాయి"

('ద్వానా'కవితలు)

సన్మానాలు చేయవలసిన వారికి చెయ్యరు? బిరు దులు ఇవ్వవలసిన వారికి ఇవ్వరు? ఎందుకంటే అది మానవుల్లోని లోపమా? అంటే ప్రశ్నార్థకమే? అందువల్లే కొంతమందికి సన్మానాలు చేస్తున్నప్పుడు వాళ్ళను గురించి చేసే పరిచయ వాక్యాలు చిలక పలుకులన్నారు. అంటే ఆ మాటలు వల్ల కూడా వాతావరణ కాలుష్యమవుతా యని, ఆ వ్యక్తిని గురించి చదివే సన్మాన పత్రం కూచి మంచి తిమ్మకవి కవిత్వం లాగా ఉంటుందని వాపో యారు. పై అంశాలే కాకుండా అతగాడికి కొట్టే చప్పట్లు కూడా అహంకారాన్ని నూరిపోస్తాయని, ప్రదానం చేసే బిరుదులు కూడా సన్మానం పొందుతున్న వ్యక్తి ఎదుగుద లకి పుల్‌స్టాప్ అవుతాయని తెలియజేశారు. చివరి రెండు పాదాల్లో-

"ఇచ్చి పుచ్చుకోవడాలకి కొత్త అర్థాలు స్ఫురిస్తాయి
"జరిగిన సన్మానం కాదోయ్ / దానికైన ఖర్చెంతోయ్
మిత్రమా" అని అడగాలనిపిస్తుంది"

('ద్వానా'కవితలు)

'ఇందమ్మా పులగూరంటే, ఇందమ్మా తీగూర' అనే సామెత నేటికి ప్రజల నోళ్లలో నానుతూనే ఉంది. నేటి సమాజంలోని మనుషులు ఇచ్చి పుచ్చుకోవడంలో ముందుంటారు. అలా ద్వానాశాస్త్రిగారు పై కవితలో ఇచ్చిపుచ్చుకోవడానికి సంబంధించిన అంశాలని గురించి ప్రస్తావించారు. అంటే 'సన్మాన దృశ్యం' అనే ఈ కవితా శీర్షికలో ఉన్న కవితా పాదాల్ని గురించి ప్రస్తావిస్తూ చివరగా జరిగినటువంటి సన్మానాలు కాదు, ఈ సన్మానా లకు ఎంత ఖర్చు అయింది మిత్రమా! అని అడగాలని పిస్తుందనే విషయాన్ని గురించి ప్రస్తావించారు. అంటే నేటికి కూడా కొంతమంది వ్యక్తులు డబ్బులు ఇచ్చి సన్మా నాలు పొందుతున్న వైఖరి లేకపోలేదని విషయాన్ని మరో సారి గుర్తుచేశారు.

## ముగింపు :

"'ద్వానా' కవితలు" అన్న ఈ గ్రంథంలో ఉన్నటు వంటి పాతిక కవితల్లో ఆ కాలం నాటి, రచయిత వీక్షించి నటువంటి అనుభవాలు, అనుభూతులు, సంఘటనలు, సంఘర్షణలకు సంబంధించినటువంటి అంశాలే కాకుండా వివిధాంశాలను గురించి ప్రస్తావించారు. ద్వానా శాస్త్రిగారు వెలువరించిన కవితలను గురించి ద్వానాశాస్త్రి గారే తన 'ద్వానా కవితలు' అన్న గ్రంథంలో- "ఒకటి మాత్రం నిజం కుందుర్తి ఆశించిన స్పష్టత, సామాజిక పరిశీలన మాత్రం వీటిల్లో ఉన్నాయన్న తృప్తి నాకుంది" అన్నారు. అంటే ద్వానాశాస్త్రి గారు తాను రచించిన కవితల్ని తానే ఒక పాఠకుడు విశ్లేషించుకున్నాడు. అంటే ఆయనలో ఉన్నటువంటి సామాజిక దృక్పథమే ఎటువంటిదో ద్యోతకమవుతుంది. అందువల్లే ద్వానా అంటేనే దేశంలోని నాగరికత గురించి అనాగరికత గురించి అవగతమైనటు వంటి వ్యక్తిగా చెప్పుకోవచ్చు. శాస్త్రి అంటే వివిధ శాస్త్రాలను అవలోకనం చేసిన వ్యక్తిగా పరిజ్ఞానంలో కూడా సాటైన ఘనుడుగా చెప్పుకోవచ్చు. జ్ఞాపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ కీర్తిశేషులు డాక్టర్ సి.నారాయణరెడ్డి గారు 'ద్వానా'కవితలు అన్న గ్రంథంలో ద్వానాశాస్త్రి గారిని గురించి "డాక్టర్ 'ద్వానా'లో ఒక అదునెరిగిన విమర్శకుడు న్నాడు. ఒక పదునెక్కిన కవి ఉన్నాడు. ఆ యిద్దరు నేను ముందంటే నేను ముందని జంగసాచి వస్తుంటారు. ఒకోసారి ఇద్దరి అడుగులు ఒకటైపోతాయి. ఈ కవితల్లో ఆ ఉభయ సమ్మేళనం కనిపిస్తుంది" అన్నారు.

## ఆధార గ్రంథాలు :

1. 'ద్వానా' కవితలు - ద్వానాశాస్త్రి, చల్లావారి వీధి, అమలాపురం-533 201, విశాలాంధ్ర బుక్ హౌస్ (పబ్లికేషన్) వారి అన్ని బ్రాంచీలు.
2. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, ప్రగతి పబ్లిషర్స్, 3-11-275/1,శ్రీశంకర్ కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074, పరివర్ధిత చతుర్థ ముద్రణ : జూన్, 2008.
3. సాహిత్యమే శ్వాసగా, నాగురించి నేను - డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, ద్వానా సాహితీ కుటీరం, 1-1-428, గాంధీనగర్, హైదరాబాద్-500 080, ప్రథమ ముద్రణ: 2018.
4. తెలుగు కవుల కవితా దృక్పథం - డాక్టర్ కె.లక్ష్మణ, ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాసవనం, కుప్పం-517 426, ప్రథమ ముద్రణ : 2016.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# గోపీచంద్ నవలలు - వస్తు వైవిధ్యం

– డాక్టర్ పి.ఎస్. మైథిలి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, శ్రీకన్యాకపరమేశ్వరీ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల, చెన్నై, తమిళనాడు.

## ప్రవేశిక :

ప్రముఖ తెలుగు రచయిత హేతువాది, నాస్తికుడు, సాహితీ వేత్త మరియు తెలుగు సినిమా దర్శకుడు అయిన గోపీచంద్ తన జీవితంలో చాలా సంఘర్షణను అనుభ వించాడు. అనేక వాదాలతో వివాదపడుతూ తత్త్వాలతో దాగుడు మూతలాడుతూ సంతృప్తిలోనూ, అసంతృప్తి లోనూ ఆనందాన్నే అనుభవిస్తూ జీవిత యాత్ర కొనసాగిం చాడు. తన తండ్రి నుంచి గోపీచంద్ పొందిన గొప్ప ఆయుధం ఆస్తి, శక్తి ఎందుకు? అన్న ప్రశ్న. అది ఆయన్ను నిరంతరం పరిణామానికి గురి చేసిన శక్తి. ఆయనలోని అరుదైన అపురూపమైన నిత్య నూతనమైన అన్వేషణా శీలతకి ఆధారం ఎందుకు? అన్న ప్రశ్న. అదే ఆయన్ను ఒక జిజ్ఞాసువుగా, తత్త్వవేత్తగా నిలబెట్టింది. ఈ క్రమంలో ఆయనలో చెలరేగిన సంఘర్షణ ఆయన రచనలన్నింటి లోనూ ప్రతిఫలించింది. ఇంటా బయటా అప్పుడు వీస్తున్న గాలులు, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి హేతువాదం ఉద్యమం, గోరా నాస్తికవాద ఉద్యమం, చలం స్వేచ్ఛా ప్రభంజనం ఇవన్నీ గోపీచంద్‌ని ప్రభావితం చేశాయి. సహజంగానే ఆయన తొలిగురువు ఆయన తండ్రి, మలి గురువు మార్క్స్, మూడవ గురువు ఎమ్.ఎన్.రాయ్, అఖరి గురువు అరవిందుడు. ఇన్ని రకాల ప్రభావాలతో గోపీచంద్ జీవితం సాగింది. అందు కనే ఆయన రచనల్లో రకరకాల దృక్పథాలు కనిపిస్తాయి.

గోపీచంద్ నవలా రచయితగా, కథారచయితగా, నాటక రచయితగా, సినిమా రచయితగా ఇలా అనేక ప్రక్రియల్లో రచనా వ్యాసంగం సాగించారు. అనేక రచనలు చేశారు. వాటిల్లో కొన్నిటిని ముఖ్యంగా నవలల్లోని వస్తువును ఇక్కడ పరిశీలిద్దాం.

## నవలలు - వస్తువు :

### పరివర్తనం :

సిద్ధాంతం, ఆచరణా ఒక దాని మీద ఒకటి ఆధారపడి ఉంటుంది. సిద్ధాంతంలేని ఆచరణ ముందుకు సాగదు. ఆచరణ వల్లే సిద్ధాంతం పుడుతుంది. ఈ రెంటికీ అవినా భావ సంబంధం ఉంటుంది. సంఘంలో ధనికులూ బీద వాళ్ళూ ఏర్పడ్డ తర్వాత పని చెయ్యడం పేదవాళ్ల వంతూ, సిద్ధాంతం చెప్పటం ధనికులవంతూ అయింది. పరి వర్తనం నవలను గోపీచంద్ ప్రారంభంలో ఆ వర్షానికీ గాలికీ ఆ తోటలోని మొక్కలన్నీ కదిలి, ఒక పక్కకి ఒదిగి చికాగ్గా ఉన్నాయి. ఆ తోటలో రకరకాల చెట్లు, రకరకాల పూలమొక్కలు ఉన్నాయి. చాలా ఏపుగా మంచి పద్ధతిని పెరిగినట్లే ఉన్నాయి. కాని ప్రస్తుతం దుఃఖం వల్లా సంస్కారం లేకపోవటం వల్లా రేగిన స్త్రీ ముంగురులకు మల్లే చిక్కుపడి, అంతా కంగారు కంగారుగా ఉన్నాయి. తోట మధ్యగా ఉన్న కాలిబాట స్త్రీ పాపటకు మల్లే ఉంది అని రాశారు. దీనిని బట్టి మనకు స్పష్టమయ్యే విషయం ఆయన వర్ణిస్తున్నది ప్రకృతిని. అయితే దాన్ని స్త్రీ దు:ఖంతో పోలుస్తున్నారు. స్త్రీల బాధకు సంబంధించిన అవగాహన, ఆలోచన ఉన్న రచయితలు తప్ప ఇతరులు ఈ పని చెయ్యలేరు. ఈ నవలలో రాజారావుగారి భార్య మృతి చెందడం, రాజారావుగారి ప్రాణస్నేహితుడు కృష్ణుడి చెల్లెలు శాంతి ఆస్థానాన్ని భర్తీ చేయడానికి రాజారావు కుటుంబం పట్ల, పిల్లలపట్ల ఎనలేని ప్రేమానురాగాలను చూపి గొప్ప గుణగణాలపై దృష్టిని కేంద్రీకరించి రచిం చారు.

### అసమర్థుని జీవయాత్ర :

కుర్రతనంలో ఉబలాటం కొద్దీ సంఘానికి సేవ చెయ్యాలని బయల్దేరుతారు. ఇప్పుడున్న సంఘంలో బాధపడేవాళ్లని చూసి ఉద్ధరిద్దామని బయలుదేరుతారు.

కొన్నాళ్ళకు తాము చేసే పనిపట్ల ఏమీ లాభం లేదని తెలిసినప్పటికీ వెనక్కు తగ్గే అవకాశం ఉండదు. లోకులకు యధార్థం చెప్పే ధైర్యం ఉండదు. అందుకని వాళ్లకు సత్యం తెలిసినా పైకి చెప్పరు. యథాప్రకారం జీవయాత్ర సాగిస్తారు.

గోపీచంద్ నవలల్లో చాలా విశిష్టమైన నవల 'అసమర్థుని జీవయాత్ర'. "సీతారామారావు జీవితం విచిత్రమైంది. ఉన్నత శిఖరాగ్రం నుంచి స్వచ్ఛమైన జలంతో భూమి మీదపడి మలినాన్ని కలుపుకొని మురికి కూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది." అంటూ ఈ నవల ప్రారంభమవుతుంది. ఈ నవలలో సీతారామారావు భార్య పాత్ర చాలా విశిష్టమైనది. ఈ నవలలో పొయ్యిలో బూడిద ఎత్తివేస్తూ తన కూతుర్ని వీధిలో ముగ్గువెయ్యమని అంటూ సీతారామారావుగారి భార్య పాత్ర ప్రారంభమవుతుంది. ఈ నవలలో పాలామె డబ్బు అడిగితే వారింకా నిద్రలేవలేదనీ, రేపిస్తా రమ్మని అంటుంది. ఆమె వెళ్ళిపోయిన తర్వాత చాలా బాధపడుతుంది. కాని తను ఏమీ చెయ్యగలదు. ఇంట్లో చిల్లి గవ్వ కూడా లేదు. ఆమె కళ్ళు చెమ్మ గిల్లుతుంది. పని మనిషితో కూడా అత్యంత ఆత్మీయంగా మానవతా దృక్పథంతో ప్రవర్తించే పాత్రగా సీతారామారావుగారి భార్య పాత్రను చిత్రించారు. అదే విధంగా తల్లి కూతుళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా చక్కగా చిత్రించారు. తల్లికి ఆరోగ్యం బాగలేకపోవడంతో కూతురు ఇంట్లో ఉండి తల్లికి సహాయంగా ఇంటిపని చేస్తానంటే, తల్లి అంగీకరించకుండా బడికి వెళ్ళమని చెబుతుంది. వాళ్ళిద్దరి మధ్య ఉన్న ఆప్యాయతలకు నిదర్శనంగా సన్నివేశాలను సృష్టించారు.

ఇంట్లో ఏదయినా సరుకులు తేవాలన్నా డబ్బు కావాలన్నా భర్తనడగవలసిందే. తన దగ్గర డబ్బు ఉండేది కాదు. తన భర్త నిద్రపోతుంటే భర్తను నిద్రలేపితే కసురుకొంటాడు. కాని తన వద్ద అయిదు రూపాయలు కూడా లేదంటే తన భర్త గౌరవానికి లోపం వస్తుందని, తన భర్తను ఎదుటివారి ముందు వదిలిపెట్టేది కాదు. అదే విధంగా ఈ నవలలో ఆమెకు తన చిన్న తనం గుర్తుకు రావడం, తను గురుకులంలో చదువుకొన్నప్పుడు భర్తను చూసుకోవలసిన విధానం, పిల్లలను పోషించవలసిన విషయాల గురించి గొప్పగా ఊహించేది. తన పెళ్ళయినప్పుడు కూడా అదృష్టవంతురాలని అందరు అన్నారు. అనుభవానికి వచ్చేటప్పటికి అంతా తారుమారయింది. ఎక్కడో తప్పు జరిగిందని తనలో తను బాధపడడం, ఆడవాళ్లకు ఎంత తెలివి ఉంటే ఏం లాభం! అది రాణింపుకి వచ్చే అవకాశాన్ని భర్త ఇస్తే కదా! మన అమ్మాయి జాతకం ఎలా ఉంటుందోనని ఆలోచించడం, ఈ విధంగా నవల కొనసాగుతుంది.

## ఆదర్శ జీవులు :

గోపీచంద్ గారి ఆదర్శజీవులు అనే నవల ఆదర్శ దంపతులకు నిదర్శనం. ఈ నవలలో శకుంతల సమావేశాలకు వెళ్ళడం, తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త లేకపోవడం, సమావేశాల గురించి ఆలోచిస్తూ, మా వారు కొన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలంటే కుతూహలపడేదాన్ని, ఆయనకి సహాయం చెయ్యడానికి నా జీవితాన్ని ధార పోయటానికి నిశ్చయించుకున్నానని శకుంతల అనుకోవడం అయినా ఉపన్యాసాలకు వెళ్ళటాన్ని ఆపకుండా తనలో తానే ప్రశ్నలు వేసుకోవడం తానే సమాధానాలు ఇచ్చుకోవడం, శకుంతల భర్త స్నేహితునితో ఇంటికి రావడం, శకుంతల భర్త సుదర్శనాన్ని స్నేహితుడు నీవు అదృష్టవంతుడవు, అందమయిన భార్య కలిగిందని అనడంవల్ల మనస్సు బాధపడి మేధావిగా ప్రసిద్ధి చెందిన ఆయన కూడా మామూలు మనిషి లాగా మాట్లాడడం శకుంతలను కష్టపెడుతుంది. ఇక్కడ శకుంతల మనసు బాధపడడం యథాతథంగా వర్ణించారు గోపీచంద్. శకుంతల సుదర్శన్‌లు ఇద్దరూ సమాజసేవలో దిగటం, సంఘాన్ని సరిచెయ్యడానికి ప్రయత్నించడం, సంఘాన్ని తీర్చిదిద్దడానికి పూనుకోవడం విశిష్టంగా పేర్కొన్నారు గోపీచంద్.

## పిల్ల తెమ్మెర :

సంప్రదాయాన్నీ, వ్యక్తి వికాసాన్నీ వర్ణించి సందిగ్ధంలోనే వదిలివేసిన నవల పిల్ల తెమ్మెర. ఈ నవలలో కథానాయ

కుడు చిత్రాల్లో డాన్సులు చేస్తుండేవాడు. అతను చేసిన చివరి చిత్రంలో డాన్సు వేసిన మృణాళిని అనే డాన్సరుకు ఆంధ్ర, తమిళదేశాల్లో మంచి పేరు ప్రఖ్యాతలున్నాయి. ఈ నవలలో మృణాళిని, కథా నాయకుడు ఇద్దరు కలిసి డాన్సు స్కూలును స్థాపించడం, అక్కడ డాన్సు నేర్చుకోవడానికి కథనాయకుని స్నేహితుడు శచీంద్రుడు శమంతక మణి అనే ఆమెను నాట్యంలో పైకి తీసుకురావాలని తీసుకురావడం, మృణాళిని కథా నాయకుడు ఇద్దరు కలిసి శమంతకమణిని పైకి తీసుకురావడానికి కృషి చేయడం ఈ విధంగా నవలను కొనసాగించారు.

## మెరుపుల మరకలు :

దీర్ఘంగా ఆలోచించి చూస్తే జీవితం పట్ల స్త్రీలకున్న సానుభూతి పురుషులకు లేదనిపిస్తుంది. జీవితాన్నే స్త్రీ అర్థం చేసుకున్నంత సవ్యంగా పురుషుడు చేసుకోలేడు. జీవితం వీచే వీచికలు ఆమెను ఎప్పుడూ స్పృశిస్తూనే ఉంటాయి. ఆమె ఎప్పుడూ జీవిత ముఖద్వారం దగ్గర ఉంటుంది. దీనిని వదలి పెట్టి ప్రయాణం చెయ్యటానికి వీలుకాదు.

'మెరుపుల మరకలు' అనే నవలలో 'ఉషారాణి' స్త్రీ పాత్రను అత్యద్భుత సౌందర్యరాశిగా చిత్రించి, తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించారు. ఆమెయే ప్రతిభతో చిత్రింపబడిన ఉషారాణి. ఉషారాణి వివిధ సందర్భాలలో వెలువరించిన అభిప్రాయాలు, ఆమె చుట్టూ తిరిగే ఇతర పాత్రల చేత అనేక సార్లు ప్రకటింపచేసిన వాదనలు చదివే వారి మెదడుకు పని కలిగించాయి. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన దేహ సౌష్టవంతో, చురకత్తి లాంటి మేధస్సుతో మూర్తీ భవించిన ప్రశాంతతో ఉషారాణిని తెలుగు సాహిత్య నందనోద్యానవనంలో నిత్యజవ్వనిగా నిత్య కళ్యాణిగా చిత్రీకరించారు. ఆమెది ఒక నిండయిన పండుగ జీవితం. జేగీయమానమయిన మెరుపుగా ప్రభాసించి మరకలను విసర్జించి, వెన్నెలను స్వీకరించి హిమ శైలానికి అంకితమైన ఒక సుందరి సుందరజీవితం. ఉషారాణి మాత్రమే జీవించగలిగినట్టి ప్రత్యేక జీవితాన్ని స్త్రీ పాత్రలో వర్ణించారు గోపీచంద్.

## శిథిలాలయం :

మన సంఘపు శిథిలాలయాన్ని పూర్తిగా పడగొట్టి దాని స్థానంలో కొత్త మందిరాన్ని నిర్మించటానికి మనకు ఇంకా కొంత కాలం పట్టవచ్చు. ఒక వైపు నుంచి ఆ పని మొదలయిందని చెప్పవచ్చు. ఆ మహోద్యమంలో మొదటి మెట్టువంటిది గోపీచంద్ గారి శిథిలాలయం నవల. ఈ నవలలో కొంచెం క్లిష్టమయిన పాత్ర కథానాయకుడిది. భర్త కంటే ఎక్కువ భావన శక్తి కలిగింది. జీవితం నుంచి ఏమేమో ఆశిస్తుంది. ఆశలు తీరక ఉక్కిరి బిక్కిరి అవుతుంటుంది. తన స్వేచ్ఛకు నారాయణను నిమిత్త మాత్రునిగా ఉపయోగించుకుంటుంది. విశాల ప్రపంచంలోకి వెళ్ళి పోతుంది. మళ్ళీ తిరిగి రారు. పడుపు గత్తె పాత్ర చాలా విచిత్రమయింది. ఈ పాత్రలో వాస్తవికత, అవాస్తవికత రెండూ మిళితమై ఏది ఎక్కడ అంతమవుతుందో ఎక్కడ ప్రారంభమవుతుందో తెలియదు. వ్యంగ్యాలు చాలా ఉంటాయి. ఒక మూసలో నుంచి వచ్చిన వాటిలా అచ్చుగుద్దినట్లుగా ఉంటాయి. ఇలా చాలా అసహజంగా వర్ణించారు. వీటి ద్వారా వ్యంగ్యాన్ని పోషించి తన ఉద్దేశాన్ని నెరవేర్చుకున్నారు గోపీచంద్.

## గతించని గతం :

ఈ నవలలో శివుడు హాలాహలాన్ని మింగి అమృతాన్ని ఇచ్చినట్లు, మామిడి చెట్లు మలిన పదార్థాలతో ఆకలి తీర్చుకొని పండ్లను అందించినట్లు, గోమాత గడ్డిగాదం తిని మధురక్షీరధారలను కురిసినట్లు, ఆమె కష్టాలను జీర్ణించుకొని మందహాస రేఖలను ప్రసరించేది. అమ్మ కంటే మధురమయిన భావం, స్మృతి ఈ ప్రపంచంలో మరొకటి లేదని హుసేన్ ఖాన్ మూలంగా అద్భుతంగా గోపీచంద్ అభివర్ణించారు.

## ప్రేమోపహతులు :

ఈ నవలలో కళ్యాణి హైదరాబాద్ స్టేషన్‌లో రైలు దిగి తన స్నేహితురాలు సుందరి కోసం దిక్కులు చూసింది అంటూ నవల ప్రారంభమవుతుంది. ఈ నవలలో కళ్యాణి, సుందరి ఇద్దరు చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ

హైస్కూలు వరకు కలసి చదువుకున్నాడు. తర్వాత కళ్యాణి చదువు మానేస్తుంది. సుందరి మాత్రం బి.ఎ. పాసయి ఉద్యోగం చేస్తుంది. కళ్యాణి భర్త విశ్వేశ్వరరావు. ఎంబిబిఎస్ డాక్టర్. సుందరి భర్త పేరు జయరామారావు. ఒక పెద్ద ఫ్యాక్టరీ మేనేజరు. హైస్కూలు తర్వాత కళ్యాణి, సుందరి ఎవరిదారిలో వారు విడిపోవడం అనేక సంవత్స రాల తర్వాత ఎగ్జిబిషన్ ఆర్గనైజింగ్ కమిటి సభ్యుడయిన జయరామారావు ఎగ్జిబిషన్ బాధ్యతలను చూసుకోవలసిన అవసరం ఏర్పడటం ఒక రోజు సాయంత్రం జయ రామారావు సుందరి ఇద్దరూ ఆ ఎగ్జిబిషన్‌కు రావటం ఆ ఎగ్జిబిషన్‌కు కళ్యాణి భర్త విశ్వేశ్వరరావు రావడం. ఈ విధంగా ఈ ఇద్దరు స్నేహితులు మళ్ళీ కలవడం ఇలా కొనసాగుతుంది ఈ నవల.

## గడియపడని తలుపులు :

ఈ నవలలో కథా నాయకుడు, కథా నాయకుని స్నేహి తుడు ఇద్దరూ చాలా సంవత్సరాల తర్వాత కలుసు కొంటారు. కథా నాయకుని స్నేహితుని పేరు శ్రీనివాస రావు. పది సంవత్సరాల క్రితం పుస్తకాల షాపు పెట్టుకొని ఉండేవాడివిగదా ఇప్పుడు ఏం చేస్తున్నావు, ఎప్పుడు ఈ ఊరికొచ్చావని కథా నాయకుడు అడిగితే, నేను ఈ ఊళ్ళో దిగి రెండు రోజులు అయ్యిందని, కోటీశ్వరమ్మగారి ఇంట్లో ఉంటున్నానని ఇప్పుడు పుస్తకాల షాపు లేదని, అందులో నష్టం రావడం వల్ల అదివదిలేసి కొన్నాళ్లు పొగాకు వ్యాపారం చేశాననీ, అందులోనూ నష్టమే వచ్చిందనీ ఇప్పుడు టెక్ట్స్ బుక్స్ కోసం ప్రయత్నిస్తున్నాననీ అందుకోసమే నేను హైదరాబాదు వచ్చానని శ్రీనివాస్ చెప్పడం నీవు హైదరాబాదు వస్తే ఎందుకు ఇంటికి రాక వాళ్లింటికి వెళ్ళావని అడగటం, ఒక సారి కోటీశ్వరమ్మ గుంటూరు వస్తే ఆమెతో నాకు పరిచయం ఏర్పడిందనీ అప్పుడు ఆమె హైదరాబాద్ వస్తే మా ఇంటికి రావాలని ఆహ్వానించిందని అందుకనే అక్కడకు వెళ్ళావని శ్రీనివాస్ చెప్పడం టెక్ట్స్ బుక్స్ వ్యాపారం అన్నా బాగా చెయ్యాలంటే ఎవరయిన పెద్దవాళ్ల రెకమన్డేషన్ కావాలి. కోటీశ్వరమ్మ అధికార ప్రాపంకం ఉన్న స్త్రీ, ఆమెతో పరిచయం ఉండడం వల్ల ఆమె రెకమన్డేషన్ తీసుకొంటే పై కొస్తావని చెప్పడం. ఈ విధంగా ఈ నవల సాగుతూ వస్తుంది. చివరకు శ్రీనివాసరావు రామేశ్వరంలో పిచ్చివాడిగా తిర గడం, శ్రీనివాసరావు భార్య తిరిగి వస్తాడని నమ్మకంగా ఉంటుంది. ఈ నవలలో ఇల్లాలికి ఉండే ఆత్మ విశ్వాసం ఎంతటిదో మనకు కళ్లకు కట్టేట్లు వర్ణించారు గోపీచంద్.

## యమపాశం :

ఫైళ్ళను ఏం జరిగినా తమకు అపకారం జరగకుండా నడపటంలో చాకచక్యం చూపడమే ఎక్కువమంది ప్రభుత్వ ఉద్యోగులు చేసేపని. ప్రతి ఫైలు వెనుక ఒక ప్రాణి తహ తహలాడుతూ ఫలితం కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని కనిపెట్టుకొని కూర్చొని ఉంటుందని వారికి తట్టదు. కాఫీకి ఒక చోట చేరి ఉద్యోగులు చెప్పుకునే విషయం ఈ ఫైళ్ళ గురించే. తాము ఎంత తెలివిగా తమ మీద నేరం వాలకుండా, ఇతరుల మీద వాలేటట్టు ఫైళ్ళను నడుపుతున్నదని చెప్పుకొని మురిసిపోతూ ఉంటారు. వాళ్ళది ఫైళ్ళ ప్రపంచం మానవ ప్రపంచం కాదని ఈ నవలలో గోపీచంద్ వ్యక్తం చేశారు.

## చీకటి గదులు :

చీకటి గదులు గోపీచంద్ జీవిత నవల. దీనికి చాలా విస్తృతీ వైశాల్యం ఉన్నాయి. ఆయన జీవితంలాగానే ఇది కూడా సగంలోనే ఆగిపోయింది. గోపీచంద్ శైలి స్పష్టంగా సూటిగా సాఫీగా సజావుగా సరళంగా ఉంటుంది. డొంక తిరుగుడు తికమక కనిపించవు. దీనికి ముఖ్యమైన కారణం ఆయన మొదట మనసులో మననం చేసుకొని ఆ తరువాతే కాగితం మీద పెడతారు. ఇది ఆయన రచనా పద్ధతిలో దాగి ఉన్న కిటుకు. ఆనాటి కోస్తా జిల్లాల పల్లెటూళ్ల స్థితిగతులు, వ్యవసాయక కుటుంబాల జీవనాలు మనకు ఇందులో తారసపడతాయి. పల్లె సీమ ల్లోని ప్రశాంత వాతావరణం కుటుంబ జీవితంలోని ప్రేమానురాగాలు, ఆదరణ, ఆప్యాయతలు ఇవాళ మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇది గోపీచంద్ జీవన యానం, కుటుంబ గాథ. అకాల మరణాలూ అనా రోగ్యాలూ, కలతలు, కపటాలు కూడా మనకి కనిపిస్తాయి.

ఇంటా బయటా అలముకుని ఉన్న వాతావరణం, చెలరేగిన సంఘర్షణలు, సమాజాన్ని కుదిపివేసిన సంద ర్భాలు, ఉద్యమాలు మనకి తారసపడతాయి. హేతువాద ఉద్యమం విజృంభణ, గాంధీగారి నాయకత్వంలో జాతీయ కాంగ్రెసు సంరంభం, వీటితో కలగాపులగంగా కమ్యూనిస్టు ఉద్యమం. ఇది ఒక త్రివేణి సంగం. ఈ సంగమంలోనించి పడిలేచిన కెరటాలే చీకటి గదులు నవల.

## పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా :

చిట్ట చివర రోజుల్లో గోపీచంద్ మానవ సంబంధాల గురించి పదే పదే ఆలోచిస్తూ ఉండేవారు. ఒక్కొక్క సారి అన్యమనస్కంగా కూడా ఉండేవారు. మనుషుల లోపల దాగి ఉండే చెడుని గురించి బాధ పడేవారు. ముఖ్యంగా అలనాటి తెనాలి రాజకీయ వాతావరణంలో అలుము కున్న అనారోగ్యకర వాతావరణం ఆయన్ని తీవ్రంగా కలవరపెట్టింది. అందుకు ఆయన కలత చెందారు. కనుక ఈ నవలకి తొలిదశలో మలిన మనస్కులు అనే పేరు పెడదామనుకున్నారు. చివరికి మనస్సు మార్చుకొని పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా అని పేరు స్థిర పరిచారు. ఈ నవలలో కథా నాయకుడు కేశవమూర్తి. ప్రసిద్ధి చెందిన నవలా రచయిత, భార్య సుజాత. కేశవ మూర్తి కథలను చెబుతూ ఉంటే ఆమె రాసి పెట్టేది. ఈ విధంగానే కేశవమూర్తి కథలను పూర్తి చేసేవారు.

అవి కమ్యూనిస్టు పార్టీ ముమ్మరంగా ప్రచారం చేస్తున్న రోజులు. ఎక్కడ ఏ సమయంలో మీటింగు పెట్టినా పది వేల మందికి తక్కువ హాజరయ్యే వారు కారు. ఆనాటి సభ్యుల ఆవేశం, ఆ పార్టీ అంటే ఇష్టంలేని వారిని కూడా కలవరపెట్టిందని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. తీవ్రంగా విమర్శించే వ్యక్తులు కూడా వారి పట్టుదలకూ సంఘటిత శక్తికి, కార్య దక్షతకు, త్యాగనిరతికి లోలోపల జోహార్లు అర్పిస్తూ ఉండేవారు. ఆనాడు ఆ పార్టీ సభ్యులు రేపు ఏమవుతుందనే ఆలోచన లేకుండా ఆస్తులను తెగనమ్మి పార్టీకి ఇచ్చారు. ఆ పార్టీ కంకరరాళ్ళల్లో అగ్ని జ్వాలలను రేపిన రోజులవి. అయితే కమ్యూనిస్టులు తప్పు టడుగులు వెయ్యటం వల్ల మార్క్సిజానికి వచ్చిన ప్రమాదం ఉన్నట్లేమీలేదు. ఒక భావంలో బలం ఉన్న ప్పుడు దాని పని అది చేసుకోక ఊరుకోదు. కాంగ్రెస్ జమిందారీ విధానాన్ని రద్దు చేసింది. కాంగ్రెస్సే సంప్ర దాయక వ్యవసాయాన్ని ఆచరణలోకి తేవటానికి ప్రయ త్నిస్తూ ఉంది. ఇది ఒకరకంగా కమ్యూనిస్టు పార్టీకి విజయం కదా? విజయమే! తన పొరపాటు వల్ల మార్క్సి జాన్ని తానుగా ఆచరణలోకి తేలేకపోయినా ఇతరులు తేవటానికి సహాయపడింది. ఆ పార్టీ వల్లనే మార్క్సిజం తప్పనిసరి అయిందని ఈ నవలలో గోపీచంద్ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అంతేకాక 'కేంద్ర సాహిత్య అకాడెమీ' బహుమతి పొందిన తొలి తెలుగు నవలగా పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా నవల పేరుపొందింది.

## ముగింపు :

గోపీచంద్ గారి 109వ జయంతి సందర్భంగా ఆయన నవలల్లోని వస్తువును విశ్లేషించడం జరిగింది. అటు కథా సాహిత్యానికి ఇటు నవలా సాహిత్యానికే కాకుండా, మరెన్నో రచనలు ద్వారా తెలుగు సాహిత్యానికి గోపీచంద్ గారు చేసిన సేవ అపారమయింది. అందువల్లే ఆయన రచనలన్నిటిలో సామాజిక భావుకత మెండుగా ఉంద నడంలో ఎటువంటి సందేహంలేదు.

## ఆధార గ్రంథాలు :

1. గోపీచంద్ రచనా సర్వస్వం
2. నవలా శిల్పం-వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా.శాస్త్రి
4. ఆంధ్ర కవుల చరిత్ర - కందుకూరి వీరేశలింగం

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# అన్నమయ్య - త్యాగయ్య

- డా॥. ఆర్. యన్. యస్. శైలేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజిక్ & ఫైన్ ఆర్ట్స్,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

తెలుగు సాహిత్యానికి ఎందరో కవులు, పద రచయితలు, సాహిత్యవేత్తలు తమ వంతు సేవను చేసి శోభను కూరిస్తే, కర్ణాటక సంగీత ప్రపంచంలో కూడా ఎందరో వాగ్గేయకారులు తమ సంగీత, సాహిత్య ప్రతిభతో విశేషకీర్తిని, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టారు. "ఎందరో మహానుభావులు అందరికీ వందనములు". ఇటువంటి మహానుభావులలో సంగీత ప్రపంచానికి చెందిన అన్నమయ్య, త్యాగయ్య పేర్లు విననివారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. వీరు కర్ణాటక సంగీతఝరిని తరువాత తరాలకు అందించడమే కాకుండా తెలుగు భాషలో రచనలు చేసి, తెలుగుభాష అందాన్ని ద్విగుణీకృతం చేశారు. వీరి రచనలను ఆస్వాదిస్తే మనమంతా తెలుగు వారమైనందుకు ఎంతో గర్విస్తాము. తెలుగుజాతి గర్వించదగ్గ కవులు మన నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రెగడ అయితే తెలుగువారు గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారులు, భక్తాగ్రేసరులు అన్నమయ్య, త్యాగయ్య. తెలుగుభాషలో చక్కని పదజాలంతో తమ భావపుష్టిని ప్రతిబింబించిన వారే వీరిద్దరూ. అన్నమయ్య అన్ని వర్గాల జనుల కొరకు రచనలు చేసి సమాజాన్ని ఉత్తేజితం చేస్తే త్యాగయ్య కూడా రామభక్తిని ప్రకటిస్తూ తన రచనల ద్వారా సమాజానికి సందేశాలను అందించారు.

ఒకరు వేంకటేశుని ఆరాధ్యదైవంగా భావించి రోజుకొక సంకీర్తన చొప్పున జీవితకాలం రచనలు చేసి తరించిన ధన్యజీవి అయితే, ఇంకొకరు రాముని ఇష్టదైవంగా భావించి ఆయనపై ఎన్నోవేల కీర్తనలను భక్తిభావంతో పాడి తరించిన మహనీయులు. అన్నమయ్య అచ్చతెలుగు పదాలను ఉపయోగించి రచనలు చేస్తే, త్యాగయ్య చక్కటి తెలుగు పదజాలంతో రామునికి తన రచనలను నివేదించిన మహనీయులు. ఇద్దరూ వాగ్గేయకారులు ఎన్నో అపురూప రాగాలను ఉపయోగించారు. వీరి జీవిత విశేషాలను పరిశీలిస్తే ఎన్నో పోలికలు మనకు విశదమగుతాయి. ఇద్దరూ ఐహికమైన విషయాలకంటె మోక్షమార్గము ఉన్నతమైనదని భావించి సంసారబంధంలో ఉంటూనే భగవంతుని పొగిడి తరించిన ధన్యజీవులు. తమ జీవితంలోని ప్రతి ఒక్క సంఘటనని భగవంతునికి చెప్పుకున్నారు. వారి కృతులను పరిశీలిస్తే అందులోగల సాహిత్య సొగసు, మనోభావము, మనకు అర్థమవుతాయి. అన్నమయ్య ఆధ్యాత్మ, శృంగారు సంకీర్తనలను వ్రాస్తే త్యాగయ్య నవవిధభక్తి మార్గాలలో కృతులను వ్రాసారు.

## అన్నమయ్య : (1408-1503)

"అనుపమ లగ్నంబునందు వైశాఖమున విశాఖను జగంబున నుల్లసిల్ల జనియించె నన్నమాచార్యుడు" అను చిన్నన్న ద్విపద ఆధారంగా, కీ.శే.వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీయుతులు చాగంటి శేషయ్య, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి, ఆచార్య జి.ఎన్.రెడ్డి, డా॥ఎస్. గంగప్ప, డా॥ కీసర్ల వాణి వారి అభిప్రాయాల ఆధారంగా అన్నమాచార్యులు శాలివాహన శకం సర్వధారి నామ సంవత్సర వైశాఖశుద్ధ పౌర్ణమి విశాఖ నక్షత్రంలో జన్మించినట్లు తెలుస్తోంది. వీరి జన్మస్థలం కడవజిల్లా రాజంపేట తాలూకా పొత్తపినాడు మండలంలోని తాళ్ళపాక. తల్లితండ్రులు నారాయణసూరి, లక్కమాంబ, అన్నమయ్య పాంచరాత్రాగమ సార్వభౌముడు. సంగీత రత్నాకరం. సంగీత నీతిచంద్రిక, సంగీత సుధ, భరతుని నాట్యశాస్త్ర సారాన్ని జీర్ణించుకుని పురాణేతిహాసజ్ఞానాన్ని నిత్యజీవన సరళిని క్షుణ్ణంగా ఎరిగి, లక్ష్యలక్షణాలను తాను చూపించి, జనసామాన్యానికి నిరుపమాన సేవ చేశాడు. రోజుకొక్కటి తక్కువ కాకుండా 32,000 సంకీర్తనలు రచించినట్లు తెలుస్తోంది. సంకీర్తనలు యోగ -

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

వైరాగ్య, శృంగార ప్రబోధకంగా ఉన్నాయి. ఈయనకి "పదకవితా పితామహుడు" "ద్రవిడాగమ సార్వభౌమ" "సంకీర్తనాచార్య" అనే బిరుదులున్నాయి. ఇతనికి ఇద్దరు భార్యలు తిమ్మక్క, అక్కమ్మ. అన్నమయ్య వేంకటేశ్వర శతకం, శృంగార మంజరి, సంకీర్తన లక్షణం అనే గ్రంథాలను రచించారు. తన సంకీర్తనల రచనలలో ఎన్నో పోకడలు అనుసరించాడు. తుమ్మెదపదాలు, లాల, జోల, జాజర, చందమామ, జోజో, గుటకలు, జేజే, మేలుకొలుపులు, చిలుక, ఉయ్యాల, దంపుళ్ళపాటలు, చాంగుబళాలు గుజ్జెనగూళ్ళు, జయమంగళాలు, అవధానాలు, అల్లోనేరేళ్ళు, మంగళహారతులు, నివాళులు, కూగూగులు, కొట్పాలు, కోవెల, లాలి, జయజయ విజయీభవ, మంగళవైభోగములు, నలుగులు, ఆరతులు, నివాళులు, సాసముఖాలు, వెన్నెలలు, తందనాలు, చిత్తము, మనసా, బుద్ధి ఇత్యాది సంబోధనా కీర్తనలు మొదలగునవి ఉన్నాయి. వేంకటేశ్వరునికి తిరమలలో జరుగు అనేక సేవలను కళ్ళకు కట్టినట్లుగా సంకీర్తనల వలె రచించి పాడారు. అనేక వైష్ణవ క్షేత్రాలు దర్శించి అక్కడి ప్రధానదేవతలపై అనేక సంకీర్తనలు గానం చేసారు. శ్రీవేంకటేశ్వరుడే సర్వేశ్వరుడు అని చాటి చెప్పిన వ్యక్తి. అందరికీ శ్రీహరే అంతరాత్మ అనే ప్రబోధంతో విశ్వమానవ సౌభ్రాతృత్వమునకు బాటలు వేసిన మానవతావాది. పరమభాగవతోత్తముడు వేంకటేశ్వరుని పరమభక్తుడు అయిన అన్నమయ్య సుమారు 95 సంవత్సరములు జీవించి 1503వ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు తన కులదైవమైన శ్రీ అలవేలుమంగా సమేత వేంకటేశ్వరుని పాదపద్మములలో, తన సంకీర్తనలు గానం చేస్తూ ఐక్యమైనాయి.

## త్యాగరాజు : (1767 - 1847)

దక్షిణభారతదేశంలో గల ప్రముఖ వాగ్గేయకారులలో ఒకరు. ''సంగీత మూర్తిత్రయము'' - త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రిలలో ఒకరు. 1767 మే 4న తిరువయ్యూరు (పంచనదక్షేత్రం - తంజావూరు జిల్లాలో తమిళనాడులో జన్మించారు. ''వీరు 'కాకర్ల' వంశమునకు చెందినవారు. కాకర్ల ఆంధ్రప్రదేశ్‌లో గల ఖమ్మం జిల్లాలో ఒక గ్రామము. వీరి పూర్వీకులు ఇచ్చట నుండి తమిళనాడుకు వలస వెళ్ళిరి. తెలుగు బ్రాహ్మణులు. తండ్రి రామబ్రహ్మము, తల్లి సీతమ్మ. తాత గిరిరాజకవి. మాతామహులైన వీణ కాళహస్తయ్య గొప్ప సంగీత విద్వాంసులు. వీరి నుండే త్యాగరాజు సంగీత రహస్యములను, అనేకమైన తాళపత్రగ్రంథాలనుండి గ్రహించారు. చిన్నతనముననే సంస్కృత, తెలుగు భాషలలో పాండిత్యాన్ని సంపాదించారు. వాల్మీకి రామాయణాన్ని, పోతన భాగవతాన్ని అవుపోసన పట్టిన దిట్ట. 13 సంవత్సరముల వయస్సులో తన మొట్టమొదట రచన "నమో నమో రాఘవాయ" దేశ్యతోడిలో రచించారు. అది విని తండ్రి రామబ్రహ్మం వీరిని శొంఠి వేంకటరమణయ్య గారి వద్ద శిష్యరికానికి పంపుతారు. వీరి శిష్యరికంలో త్యాగయ్య ఒక ఉత్కృష్టమైన సంగీత వాగ్గేయకారునిగా రూపొందారు. చిన్నతనాన రామ షడాక్షరీమంత్రాన్ని రామకృష్ణానంద యతీంద్రుల నుండి పొంది, నారదుల వారి నుండి స్వరార్ణవ గ్రంథములోని సంగీత రహస్యాలను గ్రహించి, అనన్యమైన రామభక్తితో వేలాదికృతులను రచించిన ధన్యజీవి. కాని మనకు లభ్యమగుచున్నవి 700 కృతులు మాత్రమే. వీరు నరసింహుడు, రామ, లక్ష్మణ, సీత, హనుమంతుడు, శివుడు, అంబిక, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, తులసీ మొదలగు వివిధ దేవీదేవతలపై రచనలు రచించారు. ప్రహ్లాద భక్తి విజయం, నౌకా చరితం అనే యక్షగానాలు రచించారు. పంచరత్నకృతులు, దివ్యనామకృతులు, ఉత్సవసంప్రదాయకృతులు అనే వైవిధ్యంతో కృతి రచన చేశారు. సంగతులను మొట్టమొదటగా ప్రవేశపెట్టిన వాగ్గేయకారుడు. పంచరత్న కృతులు ఎంతో విద్వత్తుతో రచించారు. ఇందుగల స్వర ప్రస్తారాలు, ఎత్తుగడ స్వరాలు, సర్వలఘుస్వర ప్రయోగాలు వర్ణాలవలెనే వీనికి ఒక ప్రత్యేకస్థానాన్ని ప్రతిపాదించాయి. దివ్యనామ, ఉత్సవసంప్రదాయ కృతులు తక్కువ సంగతులతో రోజువారి పూజావిధానంలో ఎక్కువగా పాడుకునేట్లు సంకీర్తనల పద్ధతిలో రచించారు. 18 సం॥ల

వయస్సులో పార్వతి అనే కన్యను వివాహమాడి, ఆమె మరణానంతరం ఆమె చెల్లెలు కమలాంబను వివాహ మాడారు. అనేక పుణ్యక్షేత్రాలైన శ్రీరంగం, లాల్‌గుడి, తిరువొత్తియార్, తిరుపతి, కొవ్వూరు, మదరాసు దర్శించి ఆయా దేవీ దేవతలపై రచనలు రచించారు. ఆపత్స న్యాసమును స్వీకరించి త్యాగరాజస్వామి అయినారు. తన జీవితకాలమంతా రామధ్యానముననే వినియోగించి రామసాక్షాత్కారమును పొంది పరాభవనామ సంవత్సర పుష్య బహుళ పంచమినాడు(1847) పరమపదించిరి.

జీవిత ఘట్టాలలో సారూప్యము: ఇద్దరూ వాగ్గేయ కారులు చక్కని తెలుగులో సామాన్యులకు కూడా అర్థ మయ్యే రీతిలో రచనలు చేసారు. త్యాగరాజు కృతులు, దివ్యనామ కీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు యక్ష గానాలు రాస్తే, అన్నమయ్య ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలు వ్రాసారు. అన్నమయ్య 'వేంకటేశ' ముద్రతో రచనలు చేస్తే, త్యాగరాజు స్వనామ ముద్రకారుడు.

**అన్నమయ్య :**

శ్రీమన్నారాయణ - శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణుని శ్రీపాదమే శరణు ॥

చ॥1॥ కమలాసతి ముఖ కమల కమలహిత
కమలప్రియ కమలేక్షణా
కమలాసనహిత గరుడగమనశ్రీ
కమలనాభ నీ పదకమలమే శరణు ॥

చ॥2॥ పరమయోగిజన భాగధేయ
శ్రీపరమపురుష పరాత్పరా
పరమాత్మ పరమాణురూప శ్రీ తిరు
వేంకటగిరి దేవ శరణు ॥

**త్యాగరాజు :**

తులసీ దళములచే సంతోషముగా పూజింతు - మాయామాళవగౌళరాగము - రూపక తాళము.

అ॥ప॥ వలుమారు చిరకాలము పరమాత్ముని
పాదములను

చ॥ సరసీరుహ పున్నాగ చంపక పాటల కు రవక
కరవీర మల్లిగా సుగంధ రాజసుమముల్
ధరనివి యొక పర్యాయము ధర్మాత్ముని సాకేత
పురవాసుని శ్రీరాముని వరత్యాగరాజనుతుని ॥

**1. త్యాగరాజు** – తిరువారూరులోని శివాలయంలోగల ఈశ్వరుడు. త్యాగయ్య ఈ ఈశ్వరుని ముద్రతో రచనలు చేసారని కూడా ప్రతీతి ఉంది.

ఇద్దరూ ఇష్ట దైవాలకి అంకితంగా రచనలు చేశారు. అన్నమయ్య శఠగోపయతీంద్రుల వారి ఆశీర్వాదంతో వైష్ణవమతాన్ని స్వీకరించి వేంకటేశునికి అంకితంగా సంకీర్తనలు రచించి వైష్ణవమత ప్రచారం కావించారు. త్యాగయ్య రామకృష్ణానంద యతీంద్రులనుండి రామ షడాక్షరీ మంత్రాన్ని పొంది శ్రీరామునికి అంకితముగా ఎన్నో కీర్తనలు రచించి రామసాక్షాత్కారాన్ని పొందారు.

## అన్నమయ్య ఉపయోగించిన కొన్ని రాగాలు :

తన కాలంలో ప్రసిద్ధమైన రాగాలలో రచనలు చేశారు. దేశాళం, మాళవి, దేశాక్షి, తెలుగు కాంబోధి, సాళగం, హెజ్జుజ్జి, వేళావళి, పాడి, భల్లాటి, సాళంగనాట, బౌళి, ఆహిరి, అమరసింధు, ఆందోళి, ఆదాలి, ఆహిరినాట, కొండమలహరి మొదలుగా గల 63 రాగాల్లో 13,000 సంకీర్తనలు రాగిరేకుల్లో లభ్యమయ్యాయి. ఇందులో ఇప్పటికి ప్రసిద్ధమైన బౌళి, ముఖారి, భైరవి, రామప్రియ, వరాళి, శంకరాభరణం, శ్రీరాగంలతో పాటు, అప్రసిద్ధము లైన ఆహిరి, లలిత, పాడి మొదలగు రాగాలు, అసలు రాగస్వరూపమే తెలియని రాగాలైన దేశాళం, సాళంగనాట, సామంతం మొదలగు రాగాలు కూడా ఉన్నాయి. అన్న మయ్య సంగీతపు మెట్టు లభ్యం కాకపోవడం వల్ల అసలు ఇప్పటి ప్రసిద్ధ రాగాల్లో కూడా అన్నమయ్య అపుడు ఇలాగే పాడేవారా? అన్నది సందేహాస్పదము. ఇంకా అన్నమయ్య పదాలకి తాను వాడిన రాగాల పేర్లే రాగిరేకుల్లో లభ్యం కావడం వలన వాటి తాళగతి వివరం కూడా తెలియ రావడం లేదు. దీని వలన ఇప్పటికాలంలో ఒకే సంకీర్తన వివిధ రాగాలలో తాళాలలో మనకు వినపడుతోంది.

త్యాగరాజు ఉపయోగించిన రాగాలు: అన్నమయ్య తరువాత కాలానికి చెందిన వీరు కూడా అనేక ప్రసిద్ధమైన రాగాలను ఉపయోగించారు. నాట, గౌళ, ఆరభి, వరాళి,

శ్రీరాగం, కల్యాణి, తోడి, శంకరాభరణం, కాంభోజి, హరికాంభోజి, సావేరి, ఖరహరప్రియ, మాయామాళవగౌళ, మధ్యమావతి, సురటి మొదలైన రాగాలలో రచనలు చేసారు. అయితే త్యాగరాజు అన్నమయ్య ఇద్దరూ రచనలు చేసిన కొన్ని రాగాలు శంకరాభరణం, వరాళి, ఆహిరి, మొదలగు వానిలో రాగస్వరూపం కూడా ఒక్కటేనా కాదా అన్నది చర్చనీయాంశము.

త్యాగరాజు కొన్ని అపూర్వరాగాలలో కూడా రచనలు చేశారు. వీరు ఉపయోగించిన అపూర్వరాగాలు - సారమతి, రాగపంజరం, విజయశ్రీ, గరుడధ్వని, బిందుమాలిని, ఘంట, అమృతవాహిని, ఆందోళిక, కల్గడ, జయమనోహరి, చంద్రజ్యోతి, వివర్ధిని, ప్రతాపవరాళి, సింహవాహిని మొదలైనవి. వీనిలో ఒక్కొక్క కృతే లభ్యమవుతుంది. వీరి రచనలన్నిటికి తాళ నిర్దేశము కలదు.

## అన్నమాచార్య - సంకీర్తన :

కృతులకంటే సంకీర్తనలు చాలా పాతకాలపునాటివి. సాహిత్య ప్రధానమైనవి. ఈ పాటల్లో నాదస్వరూపం కన్నా కథాకథనం సాహిత్యం ముఖ్యం. సంగీతం చాలా సరళంగా జనరంజకత్వ ప్రధానంగా ఉంటుంది. శాస్త్రీయతకన్నా భావుకత ప్రధానాంశం. ప్రబోధాత్మకమైన ఇతివృత్తాలు విరివిగా ఉంటాయి.

అన్నమాచార్య పదాలన్నిటికీ, సంకీర్తన అని రాగిరేకుల మీద నిర్దేశం ఉంది. దాస భావముతో భక్తునిగా తన యొక్క అవగుణములను, అరిషడ్వర్గములచే కలిగిన బాధలను ఈషణత్రయము వలన కలిగెడి బంధనములను నివారించి సాక్షాత్కారము కల్గించి మోక్షప్రాప్తి కొరకు భక్త్యావేశముతో వినయముగా ప్రార్థించిన ప్రార్థనాపూర్వక రచనలే సంకీర్తనలు రాగనిర్దేశంతో కూడి అనుపల్లవి లేకుండా పల్లవి చరణాలతో రచించబడినవి అన్నమయ్య సంకీర్తనలు.

## త్యాగరాజు - కీర్తనలు - కృతులు :

కీర్తన అతి ప్రాచీనమైన సంగీత ప్రక్రియ. మతాన్ని భక్తిని వ్యాప్తి చేయడానికి ఏర్పడ్డ మాతువు ప్రధానంగా గల రూపాలు. సాహిత్యమే ప్రధానము. త్యాగరాజు ఉత్సవసంప్రదాయ, దివ్యనామకీర్తనలు రచించారు. ఇవి నిత్యము పూజావిధానంలో ఉపయోగించేవిగా ఉన్నాయి.

ఉత్సవ సంప్రదాయ కీర్తన - కొలువైయున్నాడే - దేవగాంధారి - ఆది.

దివ్యనామ కీర్తన - తవ దాసోహం తవదాసోహం - దాసోహం తవ దాశరథే - పున్నాగవరాళి - ఆది. ఔపచారికంగా, రాగ, తాళ, లయ ప్రధానంగా ఉన్న సాహిత్య ప్రక్రియ. కృతి, పల్లవి, అనుపల్లవి, చరణం లేక 4 చరణాలు, చరణానుపల్లవి కలిగి రాగ భావ విస్తృతి కలిగి ఉంటుంది.

చక్కని రాజమార్గము - ఖరహరప్రియ - ఆది
కద్దను వారికి - తోడి - ఆది.
మరిమరినిన్నే - కాంభోజి - ఆది.
ఏ తావునరా నిలకడ నీకు - కల్యాణి - ఆది.

అన్నమయ్య త్యాగయ్యల రచనలను పరిశీలిస్తే ఒకే రకమైన భావంతో రచించబడినవి మనకు ఎన్నో కన్పడతాయి. కలియుగంలో నామ సంకీర్తనాన్ని పంచమవేదమని అన్నమయ్య

"కలియుగంబునకు గలదిదియే
వెలసిన పంచమ వేదమే కలిగె
.................
బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకెదీర దెచ్చుట ననుచు
సంకీర్తనమే సకల లోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె (అధ్యా.సం.11-2-60)
అని కీర్తిస్తే,
త్యాగరాజు..........స్మరణే సుఖము శ్రీరామనామ"
నరుడై పుట్టినందుకు నామ" అని కీర్తించారు.

అన్నమయ్య సర్వం విష్ణుమయంగా భావించి "భావములోనా బాహ్యమునందును గోవింద గోవింద యని కొలువవో మనసా" అని మనస్సును ప్రబోధిస్తే త్యాగయ్య, తెలిసి రామచింతనతో నామము సేయవే ఓ మనసా .....తలపులన్ని నిలిపి నిమిషమైన తారక రూపుని

నిజతత్త్వములను ...... అని భగవంతుని ధ్యానించే విధానాన్ని చెప్పారు.

భగవంతుణ్ణి చేరుకోడానికి రకరకాలు మార్గాలున్నాయి. సగుణ ధ్యానంతో భక్తుడు భగవంతుణ్ణి రాముడుగానో కృష్ణుడుగానో శివునిగానో ఏ రకంగానైనా ఆరాధిస్తాడు. కాని అన్ని రూపాలతో ఉండేది ఒకే పరమాత్మ అనే విషయాన్ని ఇద్దరూ వాగ్గేయకారులు ఎంతో చక్కగా చిత్రీకరించారు.

ప॥ ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన
అంత మాత్రమే నీవు
అంతరాంతరము లెంచి జూడ
పింజంతే నిప్పటి అన్నట్లు.

చ॥ కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణువని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలకులు ఆది భైరవుండనుచు
అని అన్నమయ్య అంటే
త్యాగయ్య "ఎవరని నిర్ణయించిరిరా నిన్నెట్లారా ధించెరా నరవరు

శివుడనో మాధవుడనో కమలభవుడనో పరంబ్రహ్మ మనో" అని పరబ్రహ్మాన్ని ఎవరని నిర్ణయించగలము అని చెప్తూ వివిధమతాల సారాన్ని చక్కగా చెప్పారు.

అన్నమయ్య హరిభక్తి కల్గుట ఎంత కష్టమో ఈ సంకీర్తనలో వర్ణించారు.

"సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మరికదా వైష్ణవుడౌట."

ఇందు మనుజులకు ఎన్ని తపములు చేసినా, ఎన్ని కర్మలాచరించిన ఎన్ని తీర్థములు సేవించినా హరిభక్తి కలిగి వైష్ణవుడౌట కష్టమని బోధిస్తే త్యాగయ్య ఇదే భావాన్ని ఇంకొక కోణంలో చూపించారు.

"ఊరకే కల్గునా రాముని భక్తి"
అ॥ప॥ సారెకు సంసారమున జొచ్చి
సారమని యెంచువారి మనసున ॥ఊరకే॥

మాటిమాటికి సంసారానుభవములే మేలని తలంచు వారికి ధనములు బంగారమును చూచుకొని మురిసిపోవు వారికి రామభక్తి కలుగదని హితోక్తి చెప్పారు. సజ్జనులను చూచి పూజించుట, వారి బోధనలు విని వారి సాన్నిధ్య భాగ్యమంది శ్రీహరిని ధ్యానించుటయు, త్యాగరాజుని జిహ్వపై నర్తించు శ్రీరాముని జపించు మహారాజులకు గాక, శ్రీరామభక్తి ఊరకే కల్గునా అని భక్తి మహిమను, సాధనాలను వివరించారు.

పరమపూజ్యమైన ప్రీతియే భక్తి. భగవంతుని యెడగల పరమపూజ్య భావమే భక్తి. ఇది నవ విధాలు. అన్నమయ్య, త్యాగయ్య ఇరువురూ నవవిధభక్తి మార్గాలలో కృతులు రచించారు.

**ఆధ్యాత్మ వివరణ :**

దేహం, ఆత్మ పరమాత్మలకు గల సంబంధాన్ని లోక, వేద ధర్మాదుల వివేచనాదుల సంబంధాన్ని వివరించే హరి సంకీర్తనలే ఆధ్యాత్మ సంకీర్తనలు కలియుగంలో హరి సంకీర్తనమే మోక్ష సాధన అనే విషయాన్ని ఇద్దరు వాగ్గేయకారులు స్పష్టంగా తమ రచనలలో తెలిపారు.

నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం
స్తుత్యుడీ తిరువేంకటాద్రి నాథుడు
యే దేవు దేహమున నిన్నియును జన్మించె
నే దేవు దేహమున నిన్నియును నణగె మరి
యే దేవు విగ్రహం బీసకల మింతయును
యే దేవు నేత్రంబులిన చంద్రులు
యే దేవుడీ జీవులన్నింటిలో నుండు
నే దేవుచైతన్యమిన్నిటికి నాధార

ఈ విధముగా తమ జీవిత గమనంలో ఎన్నో సారూప్యాలు కలిగిన అన్నమయ్య-త్యాగయ్య తమ రచనా విధానములో కూడా అనేకమైన పోలికలను చూపించిన ధన్యజీవులు. వీరి రచనలే అందుకు నిదర్శనాలు.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# కాళోజీ కవిత్వంపై ఇతర కవుల ప్రభావం

**- డా॥ భూక్య తిరుపతి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రజాకవి కాళోజీ నారాయణరావు, జీవితమే ఉద్యమంగా ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహామనిషి. రాజీ ఎరుగని తత్త్వం. ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్వభావం ఆయన సొంతం. అందుకే నిరంతరం వ్యవస్థతో ఏదో ఒక రూపేణ 'గొడవ' పడటం ఆయనకు ప్రాణ ప్రదమైన అంశం. ఇరవయ్యో శతాబ్దపు తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో కాళోజీ ఒక అద్భుత అధ్యాయం. కాళోజీ జీవిత చరిత్రే - ఇరవయ్యవ శతాబ్దపు తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక చరిత్ర అని చెప్పేటంతగా తెలంగాణతో కాళోజీ జీవితం పెనవేసుకుపోయింది. కొన్ని తరాల్ని ప్రభావితం చేసే వ్యక్తిత్వం. శక్తి ఆయనలో దాగిన విశిష్ట గుణాలు. ఏ కవి అయినా సహజంగా తన చుట్టూ ఉన్న సమాజంతోటి ప్రభావితం చెందుతూ ఉంటాడు. అది భావజాలం కావచ్చు, భాష కావచ్చు, ప్రవర్తన - వ్యక్తిత్వాలు కావచ్చు. ఏవైనా తనకు నచ్చిన, తన ఆలోచనలకు సరిపడిన వారిని అనుకరించడం, వారి బాటలో నడవడం చేస్తుంటారు. అట్లా కాళోజీ కూడా తనకు నచ్చిన వ్యక్తులను, సిద్ధాంతాలను అనుకరించాడు. అయితే ఈ అనుకరణ యథాతథంగా కాకుండా దీనిలో తనదైన కాళోజీ ముద్ర ఉంటుంది. ఈ ముద్రను ఆయన సమకాలీన సామాజిక రాజకీయ అంశాల ద్వారా వచ్చిందని చెప్పవచ్చు.

గురువుగారి శిక్షణలో గురు లఘువుల కలయికల్ని గుర్తించాడు. మాత్రాఛందస్సులో గేయాల్ని అలవోకగా రాయడం అలవడింది. అందుకే -

"గురువు సుప్రసాదిత
రఘురాఘవ శక్తి ప్రశస్తి"

- అని గురులఘువులు అనే కవితలో గురువుగారికి కవితా నీరాజనాలు అందించాడు. అనంతరం అవనిపై జరిగేటి అవకతవకలు ఆవేదన కలిగించగా సద్యః స్ఫూర్తితో గేయాలు రాసి ఉపన్యాసక ధోరణితో సభల్లో వినిపించడం మొదలు పెట్టాడు. అందుకే కాళోజీ కవిత్వా నికి మౌఖిక లక్షణం అబ్బింది. రాసి వినిపించడమే కాళోజీ పనిగాని, రాసిందాన్ని ఆయన ఏనాడూ భద్రపరచలేదు. ఈ మనస్తత్వం కారణంగా కాళోజీ కవిత్వం చాలా మటుకు కాలగర్భంలో కలిసిపోయింది. "ఈ విషయాన్ని గమనించిన గురువుగారు రాఘవరెడ్డి ఇంట్లో రాసి పారేసిన కాళోజీ కవితల్ని ఏరి, సరిదిద్ది అందమైన దస్తూరితో రాసి భద్రపరిచేవారు. వారి ప్రయత్నం కారణంగానే మనకు కాళోజీ తొలినాళ్ల కవితలు లభ్యమయ్యాయి" (నా గొడవ కాళోజీ కవితలు ముందు మాటలో తూర్పు మల్లారెడ్డి, 2012, పే.XXX)

"మనకు కవిత్వం ద్వారా ఆకళింపు అయిందో లేదో ననే సందేహంతో పండొలిచినట్లు విడమరిచి చెప్పడం కాళోజీ సంభాషణల్లో, ప్రసంగాల్లోనే కాదు కవితల్లోనూ ఉన్న ఒక లక్ష్యం. (నా గొడవ కాళోజీ కవితలు ముందు మాటలు, వరవరరావు, 2012, పే.xiv).

"కవిత్వం అంటే పద్యం అనే భ్రమను పోగొట్టిన వాళ్ళలో శ్రీశ్రీ, ఆరుద్రలతోపాటు నీ వొకడవు. శ్రీశ్రీ, ఆరుద్రల రచనల్లో ఎక్కడన్నా కొద్దిగా శబ్దాల ఆడంబరం కనిపిస్తుందేమోగాని నీలో అది లేదు. కనుక నేనీ కవితను నగ్నసుందరిగా ఊహిస్తాను." (నా గొడవ కాళోజీ కవితలు ముందుమాటలు, దాశరథి, 2012, పే.424).

ఈయన మాట్లాడితే ఆరు నెలలకు చస్తే, మాట్లాడ కుంటే ఇప్పుడే 'చస్త' వాక్ ప్రవాహం, రోమరోలా రాసిన జీన్ క్రిస్టోఫ్ నవలలలో గ్రాండ్ డ్యూక్, క్రిస్టోఫ్‌ల మధ్య జరిగిన సంభాషణను కవిత రూపంలో ఎమర్జెన్సీ కాలంలో రాశారు. అందులో క్రిస్టోఫ్ ప్రకటించిన జీవన తత్త్వం కాళోజీది. కాళోజీని ఒకకేటగిరిలో చేర్చాలంటే వేమన - గురజాడ వంటి కవి. ఈ ముగ్గురు కవులు ప్రజా ప్రయో

జనాలను, లేదా సమాజం పట్ల తమ అవగాహనను, బాధ్యతను, కవిత్వం కన్నా, రచనా శైలికన్నా ప్రథమ స్థానంలో ఉంచినవాళ్లు. అందువలన సులభంగా, సరళంగా సందేశపూర్వకంగా చెప్పడానికి ఎంచుకున్నారు. కాళోజీ కవితా రూపం గురజాడకు దగ్గరగా ఉంటుంది. అలాగే దేశి ఛందస్సుకు దగ్గరగా ఉంటుందని చెప్పవచ్చు.

కాళోజీ మీద చేతనంగానో, అచేతనంగానో వేమన లాంటి శతక కవుల ప్రేరణ ఉంది. శతకకవుల కవిత్వం చదవటానికంటే వినటానికి బాగుంటుంది. అందువల్లనే శతక కవిత్వం చెప్పబడింది. అంటారేకాని రాయబడింది అనరు. కాళోజీ కవిత్వం కూడా కూర్చుని తేలిగ్గా రాసి నట్టుగా కాకుండా అలవోకగా చెప్పినట్టు ఉంటుంది. శతక కవులలో కనిపించే సామాజిక విమర్శ, తాత్త్విక చర్చ, మందలింపుధోరణి అన్నీ కూడా కాళోజీ కవిత్వంలో కని పిస్తాయి. కాళోజీకి శతక కవులకి ఉన్న సారూప్యతకి గల కారణాలల్లో మరొకటి నైతికత గురించిన వేదన విమర్శ లేదా నింద. ''అమలులో ఉన్న సమాజాల మీద ప్రవృత్తుల మీద, నైతిక పతనం మీద, హిపోక్రసీ మీద తీవ్రదాడి శతక కవిత్వంలో కనిపిస్తుంది. కాళోజీ కూడా ఈ త్రోవలోనే నడిచారు'' (నా గొడవ కాళోజీ కవితలు ముందుమాటలో, తిరుపతిరావు, 2012, పే.ఈఈఱఱ). పదాల పొందిక, సుదీర్ఘ పదబంధాల్ని వాడకపోవటం శతకకవుల్లో మంచి లక్షణం. ఈ లక్షణాన్ని కాళోజీ తనలో జీర్ణం చేసుకున్నారు. నిజానికి కాళోజీ మీద శతక వాఙ్మయ ప్రభావం ఉంది.

కాళోజీ తన జీవితంలో కవిత్వాన్ని ఒక అవసరంగా భావించారు. ఆయన జీవిత కథ 'ఇదే నా గొడవ' చదివితే ఆ పుస్తకంలో ప్రతి పేజీలో మనకు కనిపించే కవితా పంక్తులు కవిత్వం పట్ల ఆయనకున్న ఆపేక్షని తెలియ జేస్తాయి. పదిపన్నెండు ఉపన్యాసాలు చేయలేని పని ఒక కవితో, కథో చేయగలుగుతుందని కాళోజీ నమ్మకం. ఈ నమ్మకంలోంచే ఆయన కవిత్వ రచనకు పూనుకున్నారు. అయితే కాళోజీకి తన కవిత్వం మీద మితిమీరిన మమకారం లేదు. ఆయనే స్వయంగా తన ఆత్మకథలో ఇలా చెప్పుకున్నారు. ''మంచి కథకుడ్ని కావాల్ననీ, మంచి వ్యాసకర్తని కావాల్ననీ, లేక పోతే మంచి కవిని కావాల్ననీ నేను ఈ సాహిత్య రంగంలో ప్రవేశించలేదు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొనేటప్పుడు 10, 12 ఉపన్యాసాలు ఇచ్చే దానికంటే ఒక చిన్నపాటి కథ మోస్తరు రాస్తే దాని ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశ్యంతో సాహిత్య రంగంలో ప్రవేశించినానే కానీ, అందరికన్నా గొప్ప కథకుడిని అనో, కవిని అనో, అనపించుకోవాలని కాదు. అందుకని నా కథలు కానీ, కవిత్వం కానీ చూసి నవ్వుకుంటూ ఏమిటిది కవిత్వమా? అంటారు కొందరు. ఇవాళ నేను కవిత్వం చెప్పేది నా గొడవగా, దాంట్లో కవిత్వమేదైనా వుంటే మంచిదే'' (ఇదీ నా గొడవ, కాళోజీ, పే.125) తన కవి త్వాన్ని గురించి ఇంత వినయంగా చెప్పుకున్న కవెవరూ ఉండరు. అలాగే కవిత్వాన్ని ఇంత స్పష్టమైన లక్షణంతో రాసిన వాళ్ళు కూడా అరుదుగా కనిపిస్తారు. కవిత్వాన్ని కవిత్వం కోసం గాక జనచైతన్య ప్రయోజనాన్ని చేకూర్చే ఉపన్యాసానికి ప్రత్యామ్నాయంగా చేపట్టాడు కాళోజీ. కాళోజీ తన కవిత్వం ఎలా ఉండాలని కోరుకుంటాడో చూద్దాం.

''నాకున్నది కోరిక
నా గొడవ నీకు రాసిన ఉత్తరంగా ఉండాలని
చదువరులకు కవిత్వంగా ఉండాలని
భావుకులకు మెదడుగా ఉండాలని
మేధావులకు ఎడదగా ఉండాలని
తార్కికులకు కరుణ పుట్టించేదిగా ఉండాలని
అమాయకులకు ఆపద గుర్తించేదిగా ఉండాలని''

అంటాడు కాళోజీ. కవిత్వం కేవలం భావోద్రేకం. ఆవేశోద్వేగం కాదు. కాళోజీ ఉద్యమాల్లో పాల్గొంటూ తనకెదురయిన అంశాలనే ఆయన కవిత్వానికి ముడి సరుకుగా చేసుకున్నాడు. అయితే ఈ ముడిసరుకుని 'శుద్ధి' చేయటానికి ఆయన ఎలాంటి శ్రమ తీసుకున్నట్లు కనబడదు. అసలా ఆలోచన ఆయనకు లేదు కూడా.

కాళోజీకి భాషా వ్యాకరణాల మీద చాలా స్పష్టమైన అభిప్రాయం అవగాహన ఉన్నాయి. సాహిత్యంలో వాడా ల్సిన భాషమీద ఇంకా లోతైన అవగాహన ఉన్నది. ఇది

తన సాహిత్య ప్రయోజనాన్ని లక్ష్యంగా తీసుకుని ఏర్ప రుచుకున్నది. అట్లా ఆయన కవిత్వంలోని భాష గురించి ఆయనే చెప్పుకున్న అంశాలను ఇక్కడ చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. ఇంకా సాధారణంగా భాషకు సంబంధించిన వ్యాపారాలను, లాభాలను, నష్టాలను ప్రస్తావించాడు.

"భాష రెండు విధాలు - ఒకటి బడిపలుకుల భాష, మరొకటి పలుకుబళ్ళ భాష, బడి పలుకుల భాష అంటే గ్రాంథిక భాషే, కావ్యాల్లో, గ్రంథాల్లో వాడిన మాటలు తీసుకోవడం, ఆ విధంగానే మాట్లాడడం, అట్నే రాయడం. అయితే పాత పుస్తకాల్లో పలుకుబళ్ల భాష లేదా అంతకంటే తక్కువేననిపిస్తుంది. ఎందుకంటే ఈ మహానుభావులు సంస్కృత కావ్యాలు, తెలుగు కావ్యాలు చదువుకొని, అట్లే రాసినవాండ్లు. వీరి కవిత్వాన్ని చూస్తే వీళ్ళు పలుకుబళ్ళ విషయంలో అంత పట్టింపుతోని ఉన్నట్టు లేదు. ఎంత పెద్ద వాళ్లయిన గానీ, ఎంత గొట్టుపదం వేసినం? ఎంత క్లిష్ట సంస్కృత సమాసం వాడినం అనే చూసిన్రు. నాది పలుకుబళ్ళ భాష, బడి పలుకుల భాష కాదు. ఎట్టంటే అది నేను చదువుకోలేదు. అందువలన నాది పలుకుబళ్ళ భాష" అని అన్నారు కాళోజీ గారు (ఇదీ నా గొడవ, కాళోజీ ఆత్మకథలో 1995 :127)

'కాళోజీ మీద వేమన, గురజాడ, ఆయన గురువు గార్లపాటితోపాటు ఉర్దూ కవుల ప్రభావమే గాఢమైంది. వీళ్ళంతా సరళమైన వ్యక్తిత్వం ఎంచుకున్న వాళ్ళే. ఒక్క మాటలో చెప్పాలంటే కాళోజీది కమ్యూనికేషన్ కవిత్వం. కమ్యూనికేటివ్ కాకపోతే నా గొడవ నాగొడవగానే ఉండిపోతుంది. కమ్యూనికేట్ అయి ఎదుటి వారి గుండెల్లో ప్రతిస్పందించినప్పుడు అది మన గొడవ అవుతుంది. కాళోజీ నా గొడవ తెలంగాణా గొడవ. యావదాంధ్ర తెలుగు ప్రజల గొడవ. సత్య అన్వేషి, నిత్య పథికుడు, నిత్య అన్వేషి, నిత్య పథికులైన రక్తమాంసాలు గల మనుషులందరికీ అర్థమయ్యే భాష ఆయనదని అంటారు వరవరరావుగారు. కాళోజీ ఆత్మకథ ముందుమాటలో. కాళోజీ అక్కడక్కడ తన తోటి కవులపైన వ్యాఖ్యానం చేసినట్లుగా కనిపిస్తుంది. మానవుడు సంఘజీవి. అట్లాంటిది కవి అయినవాడు ఇంకా సంఘం గురించి లోతుగా ఆలోచిస్తాడు. ఈ ఆలోచనలల్లో తన ఆలోచనలకు, భావాలకు అనుకూలంగా ఉన్నవాళ్ళతో స్నేహం చేస్తాడు. వాళ్ళకు సహకరిస్తాడు. ప్రతికూలంగా ఉన్నవాళ్ళను విమర్శించాడు. చురకలు వేశాడు. అంతేగాకుండా తన మిత్రులను కూడా తప్పుచేస్తే వదిలిపెట్టలేదు. కాళోజీ కవిత్వ భాష మీద, శైలి మీద కేవలం శతక కవుల ప్రభావమే కాదు. జానపద గేయాల ప్రభావమూ, గురజాడ ముత్యాసరాలు ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. నారాయణరావు కాళోజీ, నా గొడవ (కవితలు), 2012, కాళోజీ ఫౌండేషన్, వరంగల్.
2. కాళోజీ నారాయణ రావు షష్ఠిపూర్తి అభినందన సంచిక, శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, హైదరాబాద్.
3. నారాయణరావు వెల్చేరు, తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, 1987. హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
4. వరవరరావు, పి. తెలంగాణ వ్యాసాలు. 2007. స్వేచ్ఛా సాహితీ పబ్లికేషన్స్, హైదరాబాద్.
5. తిరుపతి భూక్య. కాళోజీ రచనల్లో సమాజం, భాష. 2017. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# ఆధునిక సాహిత్యవేత్త యిక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం - ప్రకృతి వర్ణన

- గొరరపు శ్రీనివాస్, శాఖాధిపతి, తెలుగు విభాగం, ఎ. జి & ఎస్. జి. సిద్ధార్థ డిగ్రీ కళాశాల, ఉయ్యూరు. కృష్ణాజిల్లా.

యిక్కుర్తి నరసింహారావుగారు 1949 ఏప్రిల్ 23 వ తేదీన వీరరాఘవరావు, శకుంతలమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. 14-7-1975 న శ్రీకాంతమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. కృష్ణా జిల్లా ముసునూరులో M.E.Oగా చేస్తూ 2007వ సంవత్సరంలో పదవీ విరమణ చేశారు.

## సంక్షిప్త పరిచయం :

కవితల ద్వారా సమాజానికి సందేశం ఇవ్వడం, వ్యంగ్యంగా, నిశితంగా సమాజాన్ని పరిశీలిస్తూ ప్రజలలో మార్పు తీజుకురావచ్చనే ఉద్దేశ్యంలో కలంచిందులు, సహృద్గీత అనే కవితా సంపుటులను యిక్కుర్తి నరసింహారావు గారు రాశారు. ఈ కవితలలో అనేకమైన సామాజిక అంశాలతో పాటు ప్రకృతిని గురించి వర్ణన చేశారు.

## యిక్కుర్తి నరసింహారావు గారి కవిత్వం- ప్రకృతి వర్ణన :

ఆధునిక కవులలో భావ కవిత్వపు జాలును తెలుగు సాహిత్యంలో చూపించిన కవి యిక్కుర్తి. ఎంతోమంది కవులు ప్రకృతిని ఇతివృత్తంగా తీసుకుని గొప్ప రచనలు చేశారు మనిషి జీవితంలో కవిత్వం ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది అందులో ప్రకృతి కవిత్వం ఎంతో మంది కవుల కలాలలో గొప్పగా సాగింది.

ఆకులో ఆకునై అంటూ సాగిన దేవులపల్లి, నండూరి ఎంకి పాటలు, కృష్ణశాస్త్రి పుష్ప లావికలు మల్లెమాల ఫల విలాపం వంటి రచనలలో చక్కని ప్రకృతి వర్ణనల ద్వారా పర్యావరణ పరిరక్షణ, ప్రకృతిపట్ల ప్రేమను ఎంతో చక్కగా వర్ణించిన తీరును చూస్తే వారికి ఎంతో బాధ్యత ప్రకృతి పట్ల వుందని తెలుస్తుంది.

అలాంటి వరుసలో నిలబడిన కవి యిక్కుర్తి. వారి సాహిత్యంలో అనేక సందర్భాలలో వారి కవితలలో, పాటలలో ఎంతో చక్కగా చేసిన ప్రకృతి కవిత్వం హృదయాలను ఉప్పొంగేలా చేస్తాయి. అంతటి నిగూఢత్వం, నిర్మలత, వారి సాహిత్యంలో కనిపిస్తాయి. అంతగా మన సాహిత్యంలో పర్యావరణానికి ఎంతో ప్రాధాన్యతను కలగించారు.

మనసంతా ఆనందం పులుముకుని ఆసక్తితో, ఉత్సుకతతో ఒక్కసారి యిక్కుర్తి వారి ప్రకృతి తోటలోకి అడుగు వేసి విహరిద్దాం.

"నల్లని ఆకాశంలో
తెల్లని మంచు తునక లాంటి
జాబిల్లి చిరునవ్వులో
చల్లని తుంపరలు కురిశాయి
నల్లని కోయిల కంఠం
కమ్మగా పలికింది
నల్లని కలువ చిరునగవులలో
తెల్లని జాబిలి మెరిసింది
చల్లని ఈ లోకం
కమ్మని అనుభూతినిస్తున్నది."

(సుహృద్గీత పుట సంఖ్య - 83)

యిక్కుర్తి వారి ప్రకృతి వర్ణన ఇలా సాగుతుంది. నల్లని ఆకాశం, అందులోని మంచు లాంటి తెల్లని మబ్బు తునకలు నిండు పున్నమి నవ్వితే తుంపరలుగా మెరిసాయి అంటారు కవి. ఇదొక అలౌకికమైన భావన.

కోయిల నల్లగా వున్నా దాని గొంతు తియ్యగా కమ్మగా పలికిందంటారు. ఈ లోకం చల్లదైనదని ఎంతో కమ్మని అనుభూతిని కలిగిస్తుందని కవిభావన మన మనస్సుకు ఏదో తెలియని హృదయ తాపాన్ని కలిగించి మురిపిస్తుంది.

ప్రకృతి ఎంతటి రమణీయమైనది ఎంతటి మనోజ్ఞమైనది ఎంతటి సౌందర్యమైనది. చూసే మనస్సు వుండాలేగాని జగమంతా సౌందర్యమే నిండివుందని పిస్తుంది. ఇలా సాగుతుంది వారి కవిత్వపు యేరు.

తెల్లని ఆకాశంలో
రెక్కలు విప్పిహాయిగా
పక్షులు పరుగెడుతున్నాయి
ఆలోచించుకో!
వాటికున్న స్వేచ్ఛత నీకున్నదా!
అంటూ మానవ జాతినే ప్రశ్నించాడు.

(సుహృద్గీత పుట సంఖ్య - 18)

అవును నిజమే. మానువులకు అంతటి ఉదాత్తత వున్నదా అనే సందేహం కలగక మానదు. మనిషి స్వార్థ చింతనలో జీవిస్తాడు. ప్రకృతి ప్రశాంతతో మనలను ఆహ్వానిస్తుంది. ఇదొక విచిత్ర స్థితి.

తెలివైన మనిషిని సైతం ప్రకృతి తన ఒడిలో సేద తీరేలా చేస్తుంది. పక్షులు ఆకాశంలో ఎగిరినంత స్వేచ్ఛ, ఆనందం నిజంగా మనిషికి లేదని వాటిని ప్రోది చేసుకోవాలని కవి ప్రశ్నించాడు. ప్రకృతిలోని చైతన్యాన్ని గ్రహించమని మనలను మనం మార్చుకోవాలని వారంటారు.

యిక్కుర్తి పాటలలోనూ వారి భావ కవిత్వం ఇలా వుంది.

"ఆకురాలినగాని అలలు కదిలిన గాని
సుడులు రేగిన గాలి అలజడి చేసినా
మన సంత వాడి సద్దు మనిగేనా
గుండెలోతుల చేరి తమ కాన తరచేనా

(చుక్కపాటలు పుట సంఖ్య - 41)

ప్రకృతికి పరవశమొందిన ఏ హృదయమైనా ఇంతటి తియ్యదనాన్ని పొంది తీరుతుంది.

ఆకుల, అలల సవ్వడులు, గాలి అలజడులు, మనస్సులో రేగిన మధురిమలు తియ్యని భావంగా మారి మనసంతా చేరి మైమరిపిస్తుంది. గుండెలోతులో తిష్ట వేస్తుంది.

భావ కవిత్వంలో ప్రకృతి వర్ణన మనలోని భావోద్వేగాలకు ప్రతీక. వాటిని కవి ఎంతగా నిశితంగా గమనించారో అంతగా మన భావాలతో ముడి వేసాడు. అందుకే మన హృదయాలు ప్రకృతిలో విలీనమౌతాయి.

అందుకేనేమో చిన్నప్పుడు అమ్మ చందమామ రావే ....... జాబిల్లి రావె అంటూ జోల పాటలు పాడి మనలను అలరిస్తుంది మురిపిస్తుంది. ప్రకృతి రమణీయతలోని సౌందర్యం అదేనెమోమరి.

"తూర్పు నడిపాపిట తిలకం
జాగృతికి జాగ్రత్తకూ సంకేతం
కాటుక దిద్దుకొంటున్న సంధ్య
స్వప్నానికి సుషుప్తికీ ప్రియదూతిక"

(కలంచిందులు పుట సంఖ్య - 13)

కవి ప్రకృతిని ఎంతగా ప్రేమించారో ఈ కవితే నిదర్శనం. కవి ప్రకృతి సౌందర్యోపాసకుడు కాబట్టి కమ్మని కవిత వారి కలం నుండి జాలువారింది.

ఉదయిస్తున్న సూర్యున్ని వర్ణించిన అపురూప ఘట్టమిది. తూర్పుదిక్కు రెండుగా చీలినట్లుగా సూర్య కాంతి తిలకంగా రూపుదిద్దుకుని, జాగృతిని చైతన్య పరచడానికి సంకేతంగా ఉదయిస్తున్నదా అనేలా ఉషోదయ వర్ణన చేశారు కవి.

సూర్య అస్తమయం నల్లని కాటుకలాగా అది కలలాగా ఉందంటాడు కవి. ఇంతగా వారు ప్రకృతిని చూచి పరవశమొంది ఈ చక్కని పంక్తుల పరిమళాలను మనకు అందించారు.

"వసంతంలో నా నరనరాన్నిగిచ్చి
నిర్ణిద్రం చేసి
ఏకాకిని చేసిన యవ్వనమా
ఈ శిశిరంలో ఏమైపోయావు"

(కలంచిందులు పుట సంఖ్య - 47)

వసంతం సమస్త ప్రకృతికి ఆనందాన్ని చైతన్యాన్ని కలిగించే ఋతువు. వసంతం ఎప్పుడూ మనసులను కల్లోల పరుస్తూ ఆనందిస్తుంది.

కొత్త ఆశలు, కోరికలు, ఊహలు, వొయలు అన్నింటిని పంచి, ఆనందాన్ని కలిగించే వసంతం ఏమి చేయకుండానే నన్ను ఏకాకిని చేసి కళ్ళముందు నుండి అలా వెళ్ళిపోతున్నావా? అని యవ్వనం బాధపడుతుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

వసంతంలో ఉండే సంతోషం, ఆనందం ఆవిరై జీవితం శిశిరం లాగా మారిపోయిందని ప్రకృతి సహజమైన వసంత, శిశిర ఋతువులను గురించి కవి వర్ణించిన తీరు బాగుంది.

అది ఒక వసంతం
ప్రతిమనసు ప్రశాంతం
లేత మామిడి చివురుల కొమ్మపై
కెంజాయి కాంతులలో
గొంతువిప్పి కన్నె కోకిలమ్మ
కవి వ్రాయలేని గీతాన్ని
కమ్మగా పాడింది.

(సుహృద్గీత పుట సంఖ్య - 83)

వసంతం వసివాడని అనుభూతిని, ఆనందాన్నిస్తుంది. ప్రకృతికే కాదు మనిషికి హృదయ వికాసాన్ని కలిగిస్తుంది.

మామిడి చిగురుటాకులను తింటూ కమ్మని పాటలను పాడుతూ, కవి కలానికి అందని గుసగుసలను చేస్తూ గొంతువిప్పి ఆడే ఆ నల్లని కోయిల స్వరంలోని మాధుర్యం వసంతాన్ని మరింతగా మారుస్తుందని కవి వర్ణన బాగుంది.

"సుప్రభాతానికి హారతియా అనిపిస్తూ
అరుణుడు ఉదయిస్తున్నాడు మళ్ళీ
అది ఒక వసంతం
ప్రతి మనసు ప్రశాంతం

(సుహృద్గీత పుట సంఖ్య - 90)

సూర్యోదయంలాగా వసంతం ప్రతి మనసును ప్రశాంతం చేసి సంతోషపడుతుందని కవి తెలియని అనూభూతిని కలిగించే వసంతాన్ని హృద్యంగా వర్ణించాడు.

"వొయ్యార మెందుకె ఆ సయ్యాటలెందుకే
చిట్టి చేమంతి నీవట్టి డాబులు తెలిసే
చుక్కసిగలో నక్కి వెక్కిరిస్తున్నావు
కొండలెక్కినంత టెక్కు చూపిస్తావు
నల్లమబ్బులోన జాబిల్లి సొగసుతో
మురిసిపోతున్నావు మిడిసి పడుతున్నావు.

(చుక్కపాటలు పుట సంఖ్య - 61)

ప్రకృతి సౌందర్యాలను ఎంతో సహజంగా వర్ణించాడు కవి.

చుక్కజడలో చిట్టి చేమంతుల సొగసులు గుబాలిస్తున్నాయి. అవి కొండలు ఎక్కినట్లు గర్వంతో ఉన్నాయి. నల్లని కురులను నల్లని మబ్బులనుకుని మిడిసి పడుతున్నాయి అంటాడు కవి.

ప్రకృతిలోని కొండలు, కోనలు, నదులు, మబ్బులు, వెన్నెల వంటి రమణీయమైన సౌందర్యాలను చుక్కలాంటి ఆమెలో ఇమిడ్చి చక్కని ఉపమేయాన్ని చూపి ఆనందించాడు కవి.

"చందమామ వచ్చాడు ఎండి ఎలుగిచ్చాడు
పైరగాలి వీచింది చుక్కమనసిచ్చింది
మల్లెపూలు ముడిచింది మబ్బుతునకలా వుంది
మంచె మీద కూచుంది మహారాణి నేనంది.

(చుక్కపాటలు పుట సంఖ్య - 45)

అందమైన చందమామ తెల్లని వెన్నెలను కురిపిస్తాడు. పైరగాలి ఏదో తెలియని ఆనందాన్ని పంచుతుంది. ఎక్కడో తెలియని బంధం ముడిపడింది. మన ప్రేమకు ప్రకృతి నిలువుటద్దంగా వుంది.

మల్లెపూలు ప్రకృతిలోని అందానికి ప్రతీక. మబ్బు తునకలు సౌందర్యాన్ని కలిగించే అనుభూతిని కవి హృద్యంగా వర్ణించారు.

"పొన్న చెట్ల నీడలో చుక్క వూసులాడ
గున్నమావి సెట్టుమీద కోయిలమ్మ గోల

(చుక్కపాటలు పుట సంఖ్య - 45)

పొన్నచెట్టు నీడలో చుక్క ఊసులాడింది. మామిడి చెట్టుమీద కోయిలమ్మ కూతలు మనసుకు సంతోషాన్ని కలిగిస్తాయి. ప్రకృతిలోని సహజమైన దృశ్యాలను, ప్రకృతి వర్ణనలను ఇందులో కవి చక్కగా వర్ణించాడు.

ఇలా వారి కవిత్వంలో ప్రకృతి ఒక భాగమైంది. ఎందుకంతగా మన కవులు ప్రకృతి ఆరాధించారంటే మనందరి జీవితాలు ప్రకృతి చుట్టూ ముడిపడివున్నాయి. గాలి, నీరు, ఆకాశం, భూమి సకల జీవరాశులు, వనాలు, కొండ, కోనలు ఇలా ఎన్నో మానవునితో బలమైన బంధాలు కలిగి

వున్నాయి. అందుకే ప్రకృతి - మనిషి వేర్వేరు కారని కవులు నిరూపించి ఆరాధించమన్నారు. మనం ఎప్పుడైతే ప్రకృతిని వినాశనం చేస్తామో అప్పుడే మనిషి మనుగడ ప్రశ్నార్థక మౌతుంది. అందుకే మనం ప్రకృతి ప్రేమికులుగా వుండాలని ఆ భావాన్ని పోనివ్వ కుండా మన కవులు చక్కని ప్రకృతి కవిత్వాన్ని ప్రాచీన కాలం నుండే రచిస్తున్నారు.

"అదిగో సుందర మందార మధుర
పుష్ప సమంచిత లతావళీ వనంలో "

(సుహృద్గీత పుట సంఖ్య - 47)

అంటూ పరవశం పొందుతాడు.

**ముగింపు :**

ప్రకృతిని రక్షించమని మనిషితో
"మంచి చెడుల సామీప్యంలో
మానవతను నిర్ణయించు కాని
మనిషిగా జీవించు "

(సుహృద్గీత పుట సంఖ్య - 47)

అంటూ చక్కని హితవు పలికి ప్రకృతితో మమేకమై పొమ్మని యిక్కుర్తి చెప్పారు. యిక్కుర్తి తన కవితలలో ప్రకృతి వర్ణనలను ఎంతో హృద్యంగా వర్ణించారు.

**ఆధార గ్రంథాలు :**

1. యిక్కుర్తి నరసింహారావు - సుహృద్గీత
2. యిక్కుర్తి నరసింహారావు - కలం చిందులు
3. యిక్కుర్తి నరసింహారావు - చుక్కపాటలు

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# బాధాశప్త నది - కొండేపూడి నిర్మల

- నల్ల యామిని, కరీంనగర్, తెలంగాణ.

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద కవిత్వంలో మొదలు నాళ్ళ నుంచీ ఇప్పటి వరకూ అత్యంత బలమైన ముద్ర వేయగలిగిన కవయిత్రి కొండేపూడి నిర్మల. కవిత్వంలో రకరకాల వస్తువులని కవిత్వంగా మలిచిన నిర్మల స్త్రీ అన్న మాటనే ఒక దుఖ నదిగా మార్చిన చరిత్ర మీదా, ఇంకా ఇంకా అణగదొక్కబడుతున్న స్త్రీల మీద జరుగు తున్న హింసకి వ్యతిరేకంగా తమ రచనలని కొనసాగిం చారు. ప్రస్తుత కవిత "బాధశప్త నది" ఒక యుద్ధానంతర భీభత్సాన్ని, యుద్ధం ఏ రెండు దేశాల మధ్య, ఏ రెండు తెగలమధ్య జరిగినా దాని ప్రభావం స్త్రీల మీద ఎంత వికృతంగా అమానవీయంగా ఉంటుందో తెలిపేకవిత. నిజానికి ఇదొక అణిచివేయబడ్డ స్త్రీల కన్నీటి చారిక..

చరిత్ర పుటల్లో ఏ యుద్ధం చూసినా స్త్రీల మీదనే దాడి జరిగింది. ఒకానొక సందర్భంలో ఈ లాంటి నేపథ్యం ఉన్న కథని విన్నాను. రెండు దేశాల మధ్య యుద్ధం జరుగుతోంది ఆ సమయంలో మొదటి స్త్రీలను బంధించి వారి దేశానికి తీసుకెళ్తారు. స్త్రీలను లైంగికంగా వాడుకొని వాళ్ళను గర్భవతులుగా చేస్తారు. ఇలా సంధి జరిగే కాలం వరకు ఉంటుంది. అందులో ఒక స్త్రీ తనకి లైంగికంగా దగ్గర అయిన వ్యక్తికి మానసికంగా కూడా దగ్గర అవు తుంది. సంధి జరిగి ఆ స్త్రీని తిరిగి పంపించడానికి ఏర్పాట్లు చేస్తారు. కానీ ఆ స్త్రీకి అతనిని వదిలి వెళ్లాలని ఉండదు అయినా పంపించి వేస్తారు. తాను అనుకుంటుంది స్త్రీ మనసుతో ఎవరికి అవసరం లేదు. ఇన్ని సంవత్సరాలు ఇతనితో ఉండి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత సంధి చేకూరినాక స్వదేశానికి పంపిస్తే నా భర్త నన్ను స్వీకరిస్తాడా! ఇలా అని విన్నాను అది విన్నాక నాకు ఆ పుస్తకం చదివితే బాగుండు అనిపించింది. "బాధశప్త నది" ని చదివాక ఆ సంభాషణ గుర్తుకు వచ్చింది.

ఈ కవిత లోని అంశం బోస్నియా హెర్జిగోవినాలోని ముస్లిం క్రోషియన్ జాతులను నిర్మూలించి తమ ఆధి పత్యాన్ని నెలకొల్పడం కోసం సెర్బ్‌లు వేలాది మంది స్త్రీలను చిత్రహింసలు పెట్టి నిర్బంధ గర్భవతులుగా మార్చారు ఇది యుద్ధ సమయం 1992-1995 మధ్య కాలంలో జరిగింది. ఈ సంఘటన తరువాత ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి మన ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం జిల్లా వాకపల్లిలో 2007 ఆగస్టు 20 న 11 మంది కొందు ఆదివాసీ స్త్రీల మీద పోలీసులు అత్యా చారం చేసారు. వీరు న్యాయం కోసం న్యాయస్థానంకి వెళితే అక్కడ వీరికి చేదు అనుభవం ఎదురైంది. ముఖ్యంగా స్త్రీల మానసిక పరమైనటువంటి భావోద్వేగా లపై దెబ్బకొట్టెటువంటి ప్రశ్నలు వేసారు. ఈ మధ్య కాలంలో సిరియా లాంటి అంతర్యుద్ధాల్లో ఇలాంటి ఘటనలు సర్వసాధారణం అవుతున్నాయి. ఈ యుద్ధాల వలన స్త్రీ స్వేచ్ఛ అనేది పోతుంది.

సామాన్యంగా నదిని చైతన్యానికి, ఆనందానికి ప్రతీకగా వాడతారు. కానీ ఇక్కడ కవయిత్రి నదిని ఎంచు కోవడం ఎంచుకోవడం ఆ యొక్క వేదనకి ప్రతీకగా బాధా శప్త నది అనే శీర్షిక ఎంచుకోవడమే పాఠకుల్ని ఒక మూడ్ లోకి తీసుకెళ్తుంది. ఈ కవితలో ప్రధాన వస్తువు 'మహిళా యుద్ధ ఖైదీల రోధన'. వస్తువు గురించి ఆలోచించే సమయంలో కవిత కింది కవయిత్రి పుట్ నోట్ ఇచ్చారు ఏ సందర్భంలో తాను రాసిందో అనే విషయాన్ని. అది చదవడంతో వస్తువు విషయమై మరింత లోతుగా అధ్య యనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో స్టాంజాను చదువుతుంటే ఒక మరణ సంవేదన నిర్బదించబడిన స్త్రీల యొక్క మరణ సంవేదన. ఇంకా జాతి అభివృద్ధికి తాను క్షేత్రం కావడం శాపమైన స్థితిని తెలిపే కవిత. కవయిత్రి యొక్క ఎత్తుగడ అభివ్యక్తి మొదటి పంక్తులలోనే మనకు కనిపిస్తోంది. ఎత్తుగడ పాఠకుల్ని కవితలోకి మోసుకెళ్తోంది. కవిత చదివే కొద్ది పాఠకుడు బాధని పెనవేసుకొని ఒక బాధతప్త హృద్యంలోకి జారిపడిపోతాడు. ఇక్కడ కవయిత్రి

అలతి పదాల్లో అత్యంత అర్థాన్ని చెప్పేటువంటి విధానం గొప్పది.

కలల్ని కన్నీటి చాలున జారవిడిచాం
కళ్ళను రెప్పల వెనక చిదిమి ఉంచాం
కడుపు కడుపునా ఆ కిరాతకమూక పాతి పోయిన భయోత్పాతాల్నెలా దాచుకోగలం
అంచెలంచెలుగా వెన్నెముకను కృంగదీస్తూ
దేహం మీదికి విస్తరిస్తున్న విషజ్వర భారం మాతృత్వమే అయితే
చచ్చిపోని సిగ్గుతో అది మమ్మల్ని వెదురు బద్ధలా చీల్చింది

ఆ స్టాంజా లోనే కవయిత్రి చెప్పదలుచుకున్నది మనకు కనిపిస్తుంది. కలలన్ని కుప్పకూలిపోయి గుడ్డి వాళ్ళము అయ్యాము. సెర్బులు వాళ్ళ జాతి ఉన్నతికి అక్కడ ఉన్న ముస్లిం స్త్రీలందరిని గర్భవతులము అయ్యాము ఆ గర్భము మాతృత్వం అయితే అంటే మాకు ఇష్టం లేకుండా అయిన గర్భము మాతృత్వం అయితే ఈ చవిటి సిద్ధాంతాల వల్ల మా ఆత్మభిమానము కొట్టుకు పోతున్నది. ఆ గర్భము మమ్మల్ని వెదురు బద్ధలా చీల్చి వేస్తున్నది. ఈ బాధకు అంతం అనేది లేదు ఈ బాధలు ఎప్పుడు మొదలయ్యాయా అని వేళ్ళ మీద లెక్క పెట్టుకుంటాం. ఈ స్టాంజాలో సింబాలిజం, ధ్వని, వక్రోక్తి, శైలి సమపాలల్లో కనిపిస్తాయి. తుదిలేని యాతనల దీర్ఘభాధ/ఇక్కడ వాళ్ల బాధలకు కష్టాలకు అసలు అంతం అనేదే లేదు అని చెప్పింది.

దొరికిన వాళ్ళను దొరికినట్టే పసినవ్వుల్ని సైతం
డేగ కాళ్లతో తన్నుకు పోయారు
లెక్క తేలిన నిర్భాగ్యులతోనే ఏభయివేలకు మించిపోయాం
మాననికి సంబంధించిదంతా
అవమానాల భాషే అయిన చోట
చెప్పుకున్న కొద్దీ చొప్పకట్టాలా ఏటో కొట్టుకుపోయే మా రోదన

వయస్సు నిమిత్తం లేకుండా జరిగిన దారుణాన్ని వర్ణించినతీరు “డేగ కాళ్ళ మధ్య పసినవ్వులు” అన్న ఒక్క వాక్యం గుండెలని మెలిపెడుతుంది. ఆ దృష్యం అక్కడ జరిగిన పాశవిక దాడిని ఒక్క పోలికలో వర్ణించినతీరు, లెక్కకుమించిన దాడులనీ, స్త్రీ అయినందుకు మాత్రమే జరిగిన దారుణాన్నీ చెప్పారు. నిజానికి పాఠకుడు ఇక్కడ ఏ కన్నీళ్ళని ఎన్నని లెక్కగట్టగలడు. అధికారిక లెక్కల్లోనే అనంతమైన పాశవిక చర్యలు కనిపిస్తున్నప్పుడు జరిగింది ఇదీ అని చెప్పలేని స్థితి మరెంత దారుణం.... “మానానికి సంబంధించినదంతా అవమానాల భాషే” అన్న ఒక్క వాక్యం ప్రపంచ స్త్రీలందరికీ వర్తించేలా చిత్రీకరించ బడింది. ఎంత భారమైన దుఃఖమైన “స్త్రీ రోదన కదా నిజమే చొప్పకట్టకన్నా తేలికేమరి”

శత్రు బీజానికైన ప్రాణపవనాలు చిమ్మే
క్షేత్ర దౌర్భాగ్యంలా కాదు
జరగకూడనిదంతా ఒక పథకం ప్రకారమే
అధికారుల కనుసన్నలలోనే జరిగిపోయింది

ఈ పాదాలు చాలు అసలక్కడ ఏం జరిగిందో అర్థం కావటానికి. మనకు ఇప్పటి వరకు జరిగింది ఏది కూడా కేవలం శత్రువుల వల్ల మాత్రమే కాదు ఇది ఒక పథకం ప్రకారమే అక్కడి అధికారుల ప్రమేయంతోనే జరిగింది అని తెలుస్తున్నది. ఒకే ఒక్క కవితలో మొత్తం బోస్నియా యుద్ధబీభత్సాన్ని కళ్ళకు కట్టినట్టు చెబుతూనే, ప్రతీ పదంలోనూ అక్కడి వేదనని పలికించే ప్రయత్నం ఇది. “జరగకూడనిదంతా” ఎవరి ఆధ్వర్యంలో, మరెవరి నిర్లక్ష్యా పూరిత స్థితివల్ల జరిగిందో వివరించే ప్రయత్నం... ఇక్కడ క్షేత్ర అనే పదం గర్భనికి చిహ్నంగా వాడటం జరిగింది. విషపు మొక్కకైనా, పండ్లమొక్కకైనా ఒకేలా పుట్టించగల భూమిలాంటి స్త్రీ గర్భమే ఒక క్షేత్రమైనదన్న పోలిక అత్యంత ప్రభావవంతమైన పోలికగా మారి గుండెలని మెలిపెట్టింది.

బహిరంగ అకృత్యాలకు బలీయ సాక్ష్యంగా
బోస్నియాలోని రిజ్వినోలిసి బాధా శప్త నది కాగా
ఉన్న పళాన విరుచుకుపడ్డ సెర్బ్ పశువుల

తొక్కిసలాటకి
మా ప్రపంచం మట్టికొట్టుకుపోయింది
మానవ సంబంధాలు మారాకు తొడిగే
మమతానురాగాల దినుసు పెంటకుప్పల చేరింది

అక్కడ జరిగిన ఆకృత్యం చాటుగా జరిగింది కాదు. ఏదైతే జరిగిందో అది బహిరంగంగానే జరిగింది. బోస్నియా లోని రిజ్వినోలిసి ప్రాంతం స్త్రీల యొక్క రోధనతో నిండి పోయినది. సెర్బుల కిరాతకానికి అక్కడ ఉన్న స్త్రీలు పిల్లలు వాళ్ల అకృత్యాలకు బలియాయిపోయారు. మా ప్రపంచం ఇక ముగిసిపోయింది అన్నీ బంధాలు బంధు త్వాలు కుప్పకూలిపోయాయి. ఈ ఆకృత్యాలకు ఎలాంటి పేరు పెట్టుకుంటారో మీ ఇష్టం మీరు ఏ పేరు పెట్టిన అవి మమ్మల్ని భూపథనం చేసే అర్థాలే. ములుగాలో నొక్కి వుంచిన మూలుగుల్ని పట్టి తెచ్చే శబ్దవేది లేదు / అసలు వాళ్ళ బాధల్ని రోధనలని అర్థం చేసుకునేవాళ్ళు ఎక్కాడ లేరు. 'శబ్దవేది' అనగా శబ్దముని బట్టి విల్లుని సందించడం.

నిర్భంధ గర్భాలకు కావలి కుక్కలైన
గుండాల వుందాకోర్ల అడుగులు చప్పుడు వినిపించినప్పుడల్లా చిత్రంగా
శత్రువు చేరలోనే కాదు మిత్రుడి బరిలో అయినా
ఈ పరిస్థితి ఇంతకు ముందెన్ని సార్లో అనుభవంలోకి వచ్చిన
జన్మజన్మల దుఃఖం గడవేసినట్టు దొరికిపోతుంది

ఇక్కడ మమ్మల్ని సంకెళ్లు వేసి బంధించిన దాని కంటే మా కడుపులో ఉన్న శత్రువు యొక్క బీజం చేసి కదలికలు ఎక్కువ బడిస్తున్నాయి. వాళ్ళ వీరత్వం నిరూపించడం కోసం మా మీద దాడిచేసినప్పుడల్లా, మా నిర్భంధ గర్భా లకు కావలి కుక్కల్లాగా కాస్తుంటే వాళ్ళ అడుగుల శబ్దం వినిపించినప్పుడల్లా మా గుండెల్లో చెప్పలేని వేదన. ఇది జన్మజన్మల దుఃఖం మాకు.

ఆడదాని అవమానించిన తీరు వెనక
చాట వెయ్యి కారణాలెన్ని తీసినాచిత్తశుద్ధిలేని మీ విచారణల వెనక
అంతిమ తీర్పు ఏమిటనేది మా ప్రశ్న

వెదురు బొంగు వేణువుగా తయారవడానికి ఎన్ని గాయాలు పడి ఆ గాయాలతో ఎంత మంచి పాట వచ్చున, తాజ్ మహల్ ఒక షాజహాన్ యొక్క ప్రేమ మాత్రమే సమాజానికి కనిపిస్తుంది కానీ ముంతాజ్ తన 14వ ప్రసవవేదన తట్టుకోలేక చనిపోతుంది. వీటన్నింటి కంటే మా మరణ సంవేదన తుదిలేనిది. మా మీద ఈ అరాచక అకృత్యాలకు కులం మతం కామం క్రోధం మమ్మల్ని అవమానించడానికి కారణాలు ఎన్ని వెతికిన వ్యర్థమే. మా రోధన ఎవరికి చెప్పుకోలేనిది. మీ న్యాయ స్థానాల తుది తీర్పు ఏమిటనేదే మా ప్రశ్న.

యుద్ధమంటే రెండు దేశాల, రెండు సైనిక పటాలాల మధ్య మాత్రమే అనుకునే భావన నుంచి దాని వెనుక ఉన్న వికృత ఫలితాలనూ, అందులో ప్రధాన బాదితు రాలు "స్త్రీ" అన్న విషయాన్ని గుర్తుచేస్తూనే, మహిళల పట్ల అన్ని రకాల పురుష సమాజమూ ఏ రకమైన నిర్లక్ష్య ధోరణితో, వివక్షాపూరిత స్వభావంతో ఉందో చూపించే ప్రయత్నం జరిగింది... అంటే కవిత రాయబడిన సందర్భం బోస్నియా యుద్ధమే అయినా మొత్తంగా స్త్రీల పట్ల పురుష సమాజానికి ఉండే ఒకానొక వివక్షని కూడా గుర్తు చేయటమే కవియిత్రి లక్ష్యం. ఒక రకంగా బాధాశప్త నది ప్రపంచ స్త్రీలరోదన, ప్రాంతాల పేరు మారిస్తే చాలు అది బోస్నియా అయినా, పాలస్తీనా అయినా, వాకపల్లి అయినా అన్ని స్థలకాలాలకు సరిపోతుంది. పదాడం భరము కావటమూ, దుఃఖభారాన్ని పాఠకుడిలోకి ప్రవహిం పజేయటమూ అనే కారణాలవల్ల కవయిత్రి చెప్పాలను కున్న ప్రతీ విషయమూ సులభంగా పాఠకున్ని చేరగలుగు తుంది.

కవిత రాయటానికి తీసుకున్న వస్తువు ఒక దేశానికి, ఒక ప్రాంతానికి సంబంధించినదే అయినా "దేహం మీదికి విస్తరిస్తున్న విషజ్వర భారం మాతృత్వమే అయితే / చచ్చిపోని సిగ్గుతో అది మమ్మల్ని వెదురు బద్ధలా చీల్చింది". "ఆడదాని అవమానించే తీరు వెనక/దాట వెయ్యి కారణాలెన్ని తీసినా" వంటి పాదాలు కవితని సార్వ జనీనం చేసాయి. స్త్రీ ఏ కాలంలో అయినా తన మీద

జరుగుతున్న దాడిని చెప్పుకోవటానికి ఇంతకన్నా హృద్యమైన వాక్యాలేముంటాయ్. చదువుతున్నంత సేపూ ప్రపంచమంతా వేదనపడుతున్న స్త్రీమూర్తుల రోదనా స్వరాలన్నీ చుట్టుముట్టి ఊపిరాడనట్టు అనిపించేంత బలమైన వ్యక్తీకరణ. ఈ కవితని పైస్థాయిలో నిలిపింది.

స్త్రీ వివక్షని, స్త్రీలలోని భద్రంగానే ఉంటున్నా అన్న భావనలోని డొల్లతనాన్ని చూపించటమే లక్ష్యంగా సాగిన రచనని బట్టే కవయిత్రి దృక్పథం తెలిసిపోతోంది. కవయిత్రి ఈ ఒక్క కవితతోనే సమస్త స్త్రీ వేదనలకు తాను ఒక స్వరం కావాలనుకున్నట్లు, మహిళా స్వేచ్ఛని బలంగా కాంక్షిస్తున్నట్టూ తెలిసిపోతోంది. స్త్రీ ఔన్నత్యాన్ని చాటి చెప్పటం తర్వాత అసలు స్త్రీల మానసిక, శారీరక వివక్షలని వినిపించేటట్టు చేయటమే కవయిత్రి ప్రధాన ఆలోచనగా భావించవచ్చు.....

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# పాల్కురికి సోమనాథుని రచనల్లో అన్య భాషాప్రభావం

- పసుపులేటి నాగమల్లిక, శాఖాధిపతి, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం.

తెలుగు తోటలో మొదటి కోకిల కంఠమెత్తి తెలుగువాళ్ల కోసం తెలుగు ఛందస్సులో పాటలు పాడింది. ఆ కోకిల పేరు పాల్కురికి సోమనాథుడంటారు ఆరుద్ర.పన్నెండవ శతాబ్దంలో వీరశైవాన్ని వేదప్రామాణికమని నిరూపించ డానికి ప్రయత్నించిన ఈ కవి నేటి వరంగల్లులో పాలకుర్తి గ్రామంలో విష్ణురామిదేవునికి శ్రియాదేవికి జన్మించాడు. ఈతని రచనలు గూర్చి పిడపర్తి సోమన మొదటగా పేర్కొన్నాడు. ఇతడు తెలుగు సంస్కృత, కన్నడభాషలలో రచనలు చేశాడు.బసవపురాణం, పండితారాధ్యచరిత్ర, వృషాధిపశతకం, అనుభవసారం, బసవోదాహరణం, చతుర్వేదసారం, చెన్నమల్లుసీసములు, సోమనాథస్తవం మొదలైనవి ప్రసిద్ధిచెందాయి.

## అన్య భాషాప్రభావం :

నాడు వీరశైవమతము తమిళ కర్ణాటక మహరాష్ట్రలలో వ్యాప్తి చెందినది కావడం, అప్పటికే మహమ్మదీయ సంస్కృతి వ్యాపించడమనే కారణాల వల్ల ఇతని రచనల్లో అన్యదేశ్యాల ప్రభావం కన్పిస్తుంది.

## ఉర్దూ భాషా ప్రభావం :

సోమన ఉర్దూ పదాల్ని కొన్ని యథాతథంగా, మరికొన్ని పదాల్ని తెలుగుపదాలతో సమసింపచేశాడు. పండితా రాధ్యచరిత్రలో ఇలా రాశాడు. బత్తీసుచారులు, బత్తీసు పురములు ఇక్కడ బత్తీసు అంటే ముప్పైరెండు అని అర్థం. ఇలాగే ఛత్తీసు దృష్టు, చైదహ,పరోసనా మొదలైన ఉర్దూ పదాల్ని వాడాడు.

## తమిళ భాషా ప్రభావం :

పండితారాధ్యచరిత్రలో 'అరు వత్తు మూవురు' అనే తమిళపదం ప్రయోగించాడు. అంతేకాక శ్రీశైలం వేళ్ళే యాత్రికులలో అరవం వాళ్ళు ఉన్నారట. మల్లిఖార్జున స్వామిని వారు స్తుతించిన గీతాల్ని అరవంలోనే రాశాడు. వృషాధిపశతకంలో

"పరమనె యన్నె యాండవనె పన్నగతానె యనాథ నాథనే
పెరియవనె పుళిందవనె పేరుడయానె పిరాసె యప్పనే
తరిమురి యయ్యనే యనుచు ద్రావిడ భాష నుతింఎతు మన్మనో
వర కరుణా విధేయ! బసవా! బసవా! బసవా! వృషాధిపా!"

## కన్నడ భాషా ప్రభావం :

బసవపురాణంలో సిద్ద రామయ్య అనే భక్తుడు తన కుక్కకి ఉఘెకాళీకాడు అనే కన్నడ పేరుని పేట్టాడు. కన్నడ యాత్రికులు మల్లిఖా++=ర్జున్ని స్తుతించిన గేయాల్ని సోమన కన్నడంలోనే రాశాడు.

"అజగమ దేవయ్య! బిజమాడిరయ్య!
నిజభావ దేవయ్య! నీవిత్త బన్నియల్ల దేవయ్య! యెత్తలోహొది?
బల్లద దేవయ్య! బన్నిరి నీవు....."అని పాడుతూ వెళ్ళారట.

## మరాఠీ భాషా ప్రభావం :

సోమనాథుడు వృషాధిపశతకంలో బసవేశ్వరుని ఆరే భాషలోనే స్తుతించాడు.

"దేవపరీతుమ్హీచ గురుదేవ మణూను తరీతుమ్హీచ గో
సావతరీ తుమ్హీచ తుమ చాచ ప్రసాదమ్హీచ కృపాకర
హే వరదా! యటంచు నుతియంచెద నిన్నును నారెబాస దే
వా! వినుతార్యలీల! బసవా! బసవా! బసవా! వృషాధిపా!"

## సంస్కృత భాషా ప్రభావం :

దేశీయ ఇతివృత్తాన్ని, ఛందస్సును ఎంచుకుని సరళజాను తెనుగులో కావ్యాలను రాసిన సోమనాథుడు సంస్కృతంలో కూడా తాను కవిత్వం చెప్పగలడని నిరూ

పించాడు. శ్రీశైల యాత్రికులలో సంస్కృత పండితులు మల్లిఖార్జున స్వామిని కీర్తించిన విషయాన్ని ఇలా సంస్కృతంలో చెప్పాడు.

"నా యాతి పరిషదాయాహి సఖిత్వ
మాయామి సన్మార్గమతి రభసేన
ఆతపక్లాంతాస్మి హా మనోరమణ!
ఏతదేవహి పురమిందీవరాక్షి!
దృష్టిం విశిష్టాం నిధేహి ప్రమోద......"

## ఆధార గ్రంథాలు :

1. పండితారాధ్యచరిత్ర - పాల్కురికిసోమన
2. వృషాధిపశతకం - పాల్కురికిసోమన
3. బసవపురాణం - పాల్కురికిసోమన
4. సమగ్రాంధ్ర సాహిత్యం (రెండవసంపుటం) - ఆరుద్ర
5. పద్య బసవపురాణం -పిడపర్తి సోమన

## ముగింపు :

ఈ విధంగా తెలుగులో ద్విపద కావ్యాలను కూర్చిన సోమనాథుడు ఆ ద్విపదలోనే అన్యభాషలలో కవిత్వము చెప్పడం ద్వారా తన ప్రతిభను నిరూపించుకున్నాడు. అంతేకాక వేద, శాస్త్ర, పురాణ, ఆగమ, ఉపనిషత్తు, బ్రాహ్మణముల నుండి శైవాను కూలములైన అచేక వాక్యాలను చిన్న చిన్న ద్విపద పాదాలలో చక్కగా పొదిగాడు.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# 'కుటుంబరావుకు ఏదో అయింది' కథ - విశ్లేషణ

- పూండ్ల వేంకటేశ్వరరావు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

ఆంధ్ర రాష్ట్రంలో చిత్తూరు జిల్లాకు ఒక ప్రత్యేకమైన స్థానం, విశిష్టత కలిగి ఉంది. ఎందుకంటే పూజలకు ఆద్యుడు వినాయక స్వామి ఉన్న స్థలం, చిత్తూరు జిల్లాలోని కాణిపాకం. అలాగే కళియుగ వైకుంఠ స్వామి అయిన వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉన్నది కూడా చిత్తూరు జిల్లానే. ఇలా వివిధ పుణ్యక్షేత్రాలు కలిగిన చిత్తూరు జిల్లాలో కథా రచయితలు, రచయిత్రులు కూడా కలిగి ఉన్నారు. ఆయా రచయితలు, రచయిత్రుల రచనలను సమాజానికి పరిచయం చేసే దిశగా 'తెలుగు భాషోద్యమ సమితి' తిరుపతి వారు కొంత మంది రచయితలు, రచయిత్రుల దగ్గర నుండి కొన్ని కథలను సేకరించి వాటిని 'చిత్తూరు కథ' అన్న గ్రంథంలో వెలువరించారు. ఈ 'చిత్తూరు కథ' సంపాదకుడు పేరూరు బాలసుబ్రమణ్యం గారు. ఈ కథా సంకలనంలో నాయుని కృష్ణమూర్తి గారు రచించిన 'కుటుంబరావుకు ఏదో అయింది' కథలోని ఇతివృత్తం, పాత్రలు, సామాజికాంశాలను గురించి విశ్లేషించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**ఇతివృత్తం :**

ఇతివృత్తం అంటే ఏమిటనే విషయాన్ని గురించి పోరంకి దక్షిణామూర్తి గారి మాటల్లో- "ఉద్దిష్టక్రమంలో వికాసం చెందిన కథావస్తువిన్యాసం ఇతివృత్తం. దీన్నే కథానికా పథకమనీ కథా ప్రణాళిక అనీ కొందరంటారు. అలా అనడానికి కారణం, కథా సౌధానిర్మాణానికిది ఆధారభూతం కావడం. ఒకే వస్తువు వివిధ రచయితల చేతుల్లో వివిధ రకాలుగా వికాసం చెందవచ్చు. ఒకే రచయిత చేతిలో ఒకే వస్తువు వివిధ శిల్పనైపుణ్యాలు ప్రదర్శించవచ్చు. సారెమీద కుమ్మరి పెట్టిన మట్టిముద్ద కథా వస్తువు. ఆ మట్టిముద్ద నొక ముచ్చటగొలిపే పాత్రగా తీర్చిదిద్దడానికి ఆ కళాకారుడి చేతిలో భాసించే కల్పనాశిల్పమే ఇతివృత్తం. ఆ మృత్తికా ఖండానికీ ఈ మృణ్మయ పాత్రకూ ఉండే భేదమే కథావస్తువుకు ఇతివృత్తానికీ ఉండే భేదం" (కథానిక: స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, పుట.198) అని తెలియజేశారు. అందువల్లే కథల్లోని ఇతివృత్తాన్ని ఎన్ని కోణాల్లో తెలియజేయవచ్చనే విషయాన్ని గురించి ప్రస్తావించారు.

నాయుని కృష్ణమూర్తిగారి 'కుటుంబరావుకు ఏదో అయింది' అనే కథ సర్వసాక్షి దృష్టికోణంలో సాగింది. సర్వసాక్షి దృష్టికోణంలో రచయిత పాత్రల చుట్టూ తిరుగుతూ పాత్ర స్వభావాలను, ఆలోచనలను పాఠకునికి తెలియజేస్తాడు. ప్రతి పాత్ర దగ్గర ఆ రచయిత కనిపించడాన్ని సర్వసాక్షి దృష్టికోణంలో అంటారు.

ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన కుటుంబరావు జీవితంలో జరిగిన సంఘటనలను ఈ కథలో తెలియజేశారు. ఒక సామాన్యుడు కోమాలోకి వెళ్ళి నలభై మూడు సంవత్సరాల తరువాత వరండాలోకి వచ్చి నేటి సమాజ పరిస్థితులను చూసి అతను మళ్ళీ తిరిగి కోమాలోకి వెళ్ళి పోవాలని కోరుకుంటాడు. రచయిత నేటి సమాజంలో ఉన్న పరిస్థితులను ఎంతో చక్కగా వివరించాడు. సమాజంలోని పరిస్థితులను చూసి తనకు ఇప్పటి జీవితం కన్నా, ముందే బాగుండేదనిపించి చివరకు చనిపోతాడు. నన్నయ భారతంలో 'గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని 11వ శతాబ్దంలోనే తెలియజేశారు.

కుటుంబరావుకు ఒక మధ్య తరగతివాడు. ఈయన చౌడేపల్లి గ్రామంలో నివసించే వాడు. అతని భార్య పేరు రాజ్యలక్ష్మి. ఇద్దరు కుమారులు పాణిని, అభిమన్యం. ఒక రోజు సాయంకాలం కుటుంబరావు ఉన్నట్టుండి కళ్ళు తిరిగి పడిపోయాడు. అప్పుడు రాజ్యలక్ష్మి కుటుంబరావును ఆస్పత్రికి తరలిస్తుంది. అప్పటికి రాజ్యలక్ష్మి ఎనిమిది నెలలు గర్భంలో ఉంది. కుటుంబరావు 1969, ఆగష్టు 9వ తారీఖున కోమాలోకి వెళ్ళాడు. నలభై మూడు సంవత్సరాల తరువాత కుటుంబరావుకి స్పృహ వచ్చింది.

మొదట కుటుంబరావుకు అక్కడి పరిస్థితులు అర్థం కాలేదు. అతను ఎవరు, ఎక్కడ ఉన్నాడు అని ఎంతో సతమతమవుతూ ఉండడంతో ఈ కథ ప్రారంభమవుతుంది. మెల్లగా అతను ఆస్పత్రిలో ఉన్నాడని తన పేరు కుటుంబరావు అని గుర్తుకు వచ్చాయి. కుటుంబరావుకు మెలకువ రావడంతో అక్కడ డాక్టర్లు కూడా ఎంతో ఆశ్చర్యపోయారు. గిన్నిస్ బుక్ రికార్డును బ్రేక్ చేశామని ఎంతో సంతోషించారు.

ఆస్పత్రిలో కుటుంబరావుకి డాక్టర్ వేణుగోపాల్ పరిచయం అవుతాడు. డాక్టర్ వేణుగోపాల్ పేషంట్ కుటుంబరావు. డాక్టర్ వేణు మొదట్లో అన్ని చెప్పకూడదని అతనికి గతం గురించి చెప్పే ప్రయత్నం చేయలేదు. కొద్దిరోజుల తరువాత కుటుంబరావుకి తన కుటుంబం, భార్య, పిల్లలు అందరూ గుర్తుకు వచ్చారు. కానీ అతనిని చూడటానికి ఎవరూ రావడం లేదు అనే బాధ పడేవాడు. డాక్టర్‌ని అడిగితే తర్వాత చెబుతాను అన్నాడు.

కుటుంబరావుకి ఆస్పత్రి వాతావరణం చాలా కొత్తగా అనిపించింది. తాను చనిపోయి స్వర్గంలో ఉన్నాడేమో అనే అనుమానం కూడా కలిగింది. ఇంతకీ అతను ఎక్కడున్నాడో అది ఏ ఊరు? అని కూడా తెలియదు. ఇక ఒకరోజు కుటుంబరావు డాక్టర్ వేణు దగ్గర అన్ని విషయాలను గురించి అడిగి తెలుసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఇంతలో అక్కడికి నర్స్ వస్తుంది. ఆమె చేతిలో వార్తాపత్రిక ఉంటుంది. కుటుంబరావు ఆ వార్తాపత్రిక అడిగి తీసుకున్నాడు. పత్రిక మీద పేరు చూశాడు. 'సత్యవాణి' దాని పక్కన ఇంకో పత్రిక పేరు చూశాడు. 'నా వాణి', 'నీ వాణి'. ఆ పత్రికల పేరు ఆయనకు వింతగా అనిపించింది. తనకు తెలిసిన పత్రికలు 'ఆంధ్ర ప్రభ','ఆంధ్రజ్యోతి' ఇవి అసలు దినపత్రిక లేదా అని ఆలోచించాడు. తరువాత తారీఖు చూశాడు. 25 శుక్రవారం 2012. ఒక్కసారిగా అదిరిపడ్డాడు కుటుంబరావు. దాంతో ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాడు. తిరిగి మళ్ళీ తారీఖు చూసి బలంగా తల విధిలించుకున్నాడు.

కుటుంబరావుకు అంతా అయోమయంగా ఉంది. తరువాత హెడ్డింగులు చదవడం ప్రారంభించాడు. లీటర్ పెట్రోల్ ధర రూ.81-50. ఆయనకు రూపాయి అంటే అర్థం కాలేదు. బహుశా నయా పైసా కూడా ఈ గుర్తును ఉపయోగిస్తున్నారు ఏమో అనుకున్నాడు. తరువాత 81 రూపాయలు అని తెలిసి గుండెల మీద చేయి పెట్టుకున్నాడు. "ప్రత్యేక తెలంగాణా కోసం ఉద్యమం - చక్కెర వ్యాధిని నియంత్రించుకోవడం ఎలా-క్లోనింగ్ ప్రక్రియ ద్వారా జన్మించిన గొర్రెపిల్ల డాలీకి ఏమయింది? - 2012 డిశంబర్లో భూగోళం అంతరించిపోతుందా-వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేపట్టే పార్టీ ఏది?"(చిత్తూరు కథ, పుట.56) ఇవన్నీ వార్తలేనా అనిపించింది కుటుంబరావుకి.

ఇంతలో డాక్టర్ వేణు వచ్చాడు. కుటుంబరావు డాక్టర్ గారితో మాట్లాడటం ప్రారంభించాడు. కుటుంబరావుకే అంతా అయోమయంగా ఉంది. డాక్టర్ వేణు కుటుంబరావు గారిని మీ ఊరు ఏది అన్నాడు. కుటుంబరావు చౌడేపల్లి అన్నాడు. మీరు, నేను ఈ ఆస్పత్రి ఉన్నది కూడా చౌడేపల్లిలోనే. ఈ ఊరికి పేరు మార్చారంతే అన్నాడు వేణు. ఈ ఊరి పేరు విజయనగరం. కుటుంబరావు పకపకా నవ్వి, పది రోజుల్లో ఊరు పేరు మారిపోతుందా? అని అడిగాడు. పేరే కాదు గ్రామం నుండి పట్టణం రూపం దాల్చిన విజయనగరం గురించి చెప్పాడు డాక్టర్ వేణు. కుటుంబరావు దీనిని నమ్మలేకపోయాడు. కుటుంబరావుకు కోమాలోకి వెళ్ళిన విషయాన్ని తెలియజేశాడు. "ఒకప్పుడు మన రాష్ట్రమంత్రి పి.వి.జి.రాజుగారు ఒక కారు యాక్సిడెంట్‌లో చిక్కుకొని రెండేళ్ళపాటు కోమాలో వుండిపోయారు"(చిత్తూరు కథ,పుట.56). అని కోమాలోకి వెళ్ళిన కొందరి ప్రముఖులను గురించి చెప్పాడు డాక్టర్ వేణు.

కుటుంబరావుకు సందేహం వచ్చింది. ఆ సందేహానికి సమాధానంగా డాక్టర్ వేణు అవును! మీరు కూడా 1969 ఆగష్టు 9వ తారీఖున కోమాలోకి వెళ్ళారు. నలభై మూడు సంవత్సరాల తరువాత ఇప్పుడు స్పృహలోకి వచ్చారన్నాడు. అయితే కుటుంబరావుకి తన భార్య పిల్లలను చూడాలనిపించి వెంటనే వారికి సంబంధించిన వివరాలు అడిగాడు. రాజ్యలక్ష్మి గారు చనిపోయి పది సంవత్సరాలు అయిందని చెప్పాడు వేణు. తన కుమారులు ఇద్దరూ బాగా సంపా

దించారని, ఒకడు అమెరికాలో డాక్టర్‌గా పనిచేసి ఇప్పుడు ఇండియాలో రియల్ ఎస్టేట్ చేసుకుంటున్నాడని, మరొకడు హైదరాబాద్‌లో పెద్ద బిజినెస్ మాగ్నెట్ అని చెప్పాడు. వెంటనే కుటుంబరావు ఎంతో సంతోషంతో నేను స్పృహలోకి వచ్చినట్టు నా పిల్లలకు చెప్పలేదా డాక్టర్ అన్నాడు. అందుకు వేణు చెప్పామన్నాడు. కానీ వాళ్ళకి చాలా పనులు ఉన్నాయన్నారు. పెద్దాయనకి మీటింగ్ ఉందంట, చిన్నవాడు కుటుంబంతో కలిసి కాశ్మీర్ వెళు తున్నారని చెప్పాడు. వెంటనే కుటుంబరావు ముఖంలో సంతోషం చెదిరిపోయింది. నీకేం భయం లేదు మీ చిన్న పాప మీకు అన్ని సదుపాయాలు కల్పించారు. అవుట్ హౌస్‌కి పంపమన్నాడన్నాడు డాక్టర్ వేణు. ఇంతలో డాక్టర్ వేణుకి పోన్ రింగ్ అయింది. పోన్ తీసి కాసేపు మాట్లా డాడు వేణు. కుటుంబరావు అది ఏంటో అర్థం కావడం లేదు. వెంటనే డాక్టర్‌ని అడిగాడు. దానికి వేణు సెల్‌పోన్ గురించి వివరించారు. కుటుంబరావు కోమాలోకి వెళ్ళిన తరువాత జరిగిన ప్రపంచీకరణను విని కుటుంబరావు ఆశ్చర్యపోయాడు. పోన్ ద్వారా ఎవరితో ఎప్పుడు మాట్లా డాలనుకున్న మాట్లాడుకోవచ్చు. అంతర్జాలంలో మీరు తెలుసుకోవాలనుకున్న విషయాన్ని తెలుసుకోవచ్చు. అమె రికాలో జరిగే విషయాలను కూడా మీరు ఇక్కడ నుండి చూడవచ్చు. ఇందులో విజ్ఞానమే కాదు వినోదం కూడా ఉందన్నాడు డాక్టర్ వేణు.

కుటుంబరావు ఇదంతా వినోదమేనా అనిపించింది. యూత్‌లో చాలా మందికి ఈ ఇంటర్నెట్ కొన్ని సైట్లకు అలవాటు పడిపోయారు. ఇది ఒక వ్యసనంగా అయి పోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ విశాల ప్రపంచ మంతా ఒక 'కుగ్రామం' అయిపోయిందంటే నమ్మండి అన్నాడు డాక్టర్ వేణు. కుటుంబరావును డాక్టర్ లిఫ్ట్‌లో తీసుకొని వెళ్ళాడు. ఎందుకో కుటుంబరావుకి వేణు గారికి పెళ్ళి అయిందా లేదా అడగాలనిపించింది. వేణు ఆ ప్రశ్నకు నల్ల ముఖం పెట్టాడు. పెళ్ళయింది కానీ విడి పోయాం. నేను ఒక్కో రోజు రాత్రులు రావడానికి ఆలస్యం అయ్యేది. అందువల్ల ఆమె నాకు విడాకులు ఇచ్చిం దన్నాడు. దాంతో కుటుంబరావుకు ఆశ్చర్యం వేసింది. ఈ సమాజంలో తాను బ్రతకడానికి ఇష్టపడక చని పోవాలనుకుంటాడు. అలాగే చనిపోతాడు.

## పాత్రచిత్రణ :

కథలోని పాత్రలను గురించి పోరంకి దక్షిణామూర్తి గారు "ఒక రచనలో, తన స్వాభావిక లక్షణాలను మాటల్లో గాని చేతల్లో గాని వ్యక్తంచేసే వ్యక్తిని పాత్ర అంటాం. అతని మాటలు సంవాదం. అతని చేతలు నడత లేదా నటన. ఆ మాటలకూ చేతలకూ ఇచ్చేది అతని స్వతః ప్రవృత్తి. ఒక్కొక్క పాత్ర, ప్రవేశం మొదలు నిష్క్రమణం వరకు, స్వభావంలో గాని దృక్పథంలో గాని ఏ విధమైన మార్పూ లేకుండా, దాదాపు స్థిరంగా ఉండవచ్చు. ఒక్కొక్క పాత్ర, వికాస క్రమంలోని గాని తీవ్రసంక్షోభఫలితంగా గాని హఠాత్పరిణామం చెందవచ్చు. ఆద్యంతాల మధ్య పాత్రలో మార్పు పొడగట్టినా పొడగట్టకపోయినా, మొత్తం మీద, అతని శీలంలో ఒకానొక సంగతత్వం ఉండక తప్పదు. రూపుగట్టిన సన్నివేశం నుంచి అతడు హఠాత్తుగా విడివడి, అతని ప్రవృత్తి విషయమై అంతకు పూర్వం మనకు తెలిసి ఉన్నదానికి విరుద్ధంగా, అసంభావ్యమని పించే విధంగా నడుచుకోగూడదు"(కథానిక : స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, పుట.246) అని వెలి బుచ్చారు. కాబట్టి రచయిత కథలోని పాత్రలను ఏవిధంగా చిత్రీకరించుకోవాలనే విషయాన్ని కూడా ముందుగానే ప్రణాళిక వేసుకోవాలన్నారు.

## కుటుంబరావు :

ఈ కథలో ప్రధానమైన పాత్ర కుటుంబరావు. ఈయన ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందినవారు. కుటుంబ రావు పేరుకు తగ్గట్టు కుటుంబమే అందువల్లే తన కుటుంబాన్ని తన ప్రపంచంగా బ్రతికేవారు. కుటుంబరావు ఉన్నట్టుండి కోమాలోకి వెళతాడు. నలభై మూడు సంవత్స రాల తరువాత స్పృహ వస్తుంది. అప్పటికే అతని భార్య కూడా మరణిస్తుంది. కుటుంబరావుకి ఇద్దరు కొడుకులు. ఇద్దరు బాగా సంపాదిస్తున్నారు. కానీ వారికి తండ్రిని చూసుకునే అంత సమయం లేదు. నలభై మూడు

సంవత్సరాల తరువాత స్పృహ రావడంతో అతనికి అక్కడి వాతావరణమంతా కొత్తగా కనిపిస్తుంది. అప్పటికే యువత ప్రపంచీకరణ వలన చాలామంది చెడు అలవాట్లకు లోన య్యారు. ఇప్పటి ప్రపంచీకరణ మరియు అతి స్వేచ్ఛను కుటుంబరావు జీర్ణించుకోలేకపోయారు. ఇలాంటి సమా జంలో తను బ్రతకకూడదని చివరకు కన్ను మూసాడు.

## డాక్టర్ వేణుగోపాల్ :

ఈ కథలో మరో కీలక పాత్ర డాక్టర్ వేణుగోపాల్. డాక్టర్ వేణు కుటుంబరావుకు చికిత్స ఇస్తూ దగ్గరవుతాడు. అతని సమస్యలు కూడా వేణు కుటుంబరావుతో చెప్పుకుంటారు. అతనికి వివాహం అయింది కాని వారి రువురు విడిపోయారని చెబుతాడు. ఇప్పట్లో విడాకులు అంటే అందరికీ సరదా అయిపోయిందని అంటారు. భర్త గురక పెడితే, ఇంటికి లేటుగా వస్తే, ఎవరితో అయినా మాట్లాడితే, అసలు కారణాలు లేకుండా విడాకులు తీసుకుంటున్నారని చెప్పాడు. ప్రపంచీకరణ గురించి కుటుంబరావు వింటుంటే చిరాగ్గా ఉండేది. నేటి కాలంలో యువత ప్రపంచీకరణ వలనపాడై పోతున్నారని, చెడు అలవాట్లకు అలవాటైపోతున్నారని డాక్టర్ వేణు ఎంతో బాధపడ్డాడు.

## కుటుంబరావు కుమారులు :

ఈ కథలో మరో ముఖ్యమయిన పాత్ర కుటుంబరావు కుమారులు. తండ్రి కోమా నుంచి స్పృహలోకి వచ్చి నప్పటికీ వారికి కనీసం చూడాటానికి కూడా సమయం లేదు. ఒకరేమో మీటింగులు అంటూ తండ్రిని పట్టించు కోకుండా తిరుగుతుంటే, మరొకరు కుటుంబంతో కలిసి సరదాగా టూర్‌కి వెళ్ళాలని తండ్రిని కూడా లెక్క చేయకుండా వెళ్ళేవారు. తండ్రిని అటువంటి పరిస్థితుల్లో ఒంటరిగా వదిలేసి వారి వారి పనుల్లో వారు బిజీగా ఉ న్నారు. అలాంటి కొడుకులు తల్లిదండ్రులు గతి అధోగతి అనే విషయాన్ని కూడా నాయుని కృష్ణమూర్తి పై పాత్రల ద్వారా తెలియజేశారు.

## సామాజికాంశాలు :

కుటుంబరావు వంటి వారు నేటి కాలంలో గల ప్రపంచీ కరణను, అతి స్వేచ్ఛను జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రపంచీకరణ వలన యువత చెడు అలవాట్లకు వ్యసనా నికి లోనవుతున్నారు. అంతర్జాలం వలన నేటికి ఎన్నో మంది తమ ప్రాణాలను కూడా కోల్పోతున్నారు. కానీ అంతర్జాలం చెడు విషయం మాత్రమే నేర్పేది కాదు. దానిని సరైన పద్ధతిలో వినియోగించుకుంటే ప్రయోజకుల వుతారు. చెడు దారులు తొక్కితే పనికిరాని వారవుతారు. అదేవిధంగా డాక్టర్ వేణు ద్వారా స్త్రీలు విడాకుల విషయంలో తొందరపాటు చేయకూడదని తెలుస్తుంది. ఎందుకంటే తల్లిదండ్రులు పొరపాటు, తొందరపాటు వలన వారు తమ పిల్లలను అనాథలుగా మారుస్తున్నారు. పిల్లలకి మంచి చెడులు నేర్పే సమయంలో వారితో సమయం కేటాయించకపోతే వారు మానసికంగా చాలా క్షోభను అనుభవిస్తున్నారు. ప్రస్తుత కాలంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను కుటుంబరావు ఎదుర్కొం టున్నాడు. కొడుకులు ఉండి కూడా అనాథగా ఆస్పత్రిలో ఒంటరిగా వైద్యం పొందుతున్నాడు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో వారి వద్ద ఉంచుకోకుండా వారిని వృద్ధా శ్రమాలలో చేర్పించడం మనం నేటికీ గమనించవచ్చు. పిల్లలకు చిన్న కష్టం వస్తేనే ఎక్కువగా బాధపడే తల్లిదండ్రులను, పిల్లలు పట్టించుకోకుండా, నిర్దాక్షిణ్యంగా వదిలేస్తున్న కొడుకులను మనం నేటికీ గమనించవచ్చు.

## ముగింపు :

నాయుని కృష్ణమూర్తి గారు 'కుటుంబరావుకు ఏదో అయింది' అనే విషయాన్ని గురించి చాలా లోతైన భావనతో కథగా మలిచారు. వీటిలో ఉన్నటువంటి పాత్ర లను కూడా చాకచక్యంగా చిత్రీకరించారు. అంటే ఈనాటి సమాజాన్ని అన్వయించుకోగల కథగా చెప్పవచ్చు. పాఠ కులు ఈ కథను చదివినట్లయితే కుటుంబరావుగారు ఎందుకు కోమాలోకి వెళ్ళాడో అని విషయమే కాకుండా డాక్టర్ వేణుగోపాల్‌గారు ఆయన చికిత్స చేస్తూ కూడా తన జీవితంలోని కొన్ని విషయాలను కుటుంబరావుతో పంచుకున్నాడు. ఇలా వాళ్ళిద్దరి మధ్య జరిగిన సంభాషణ లను కూడా సమాజానికి ఉపయోగకరమైన అంశంగా

భావించవచ్చు. అందువల్లే కథలను వెలువరించే రచయితలు, రచయిత్రులు మొట్టమొదటిగా సమాజంలో జరుగుతున్నటువంటి విషయాలపై శ్రద్ధ వహించి వాటిని కథగా మలచడం వల్ల రేపటి తరానికి కూడా ఆ కథలు ఉపయోగకరంగా ఉంటుంది. అలాంటి కథలవల్ల కూడా సమాజంలో మార్పు రావడానికి అవకాశం ఉంటుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. బాలసుబ్రమణ్యం, పేరూరు (సంపాదకుడు) - చిత్తూరు కథ (కథా సంకలనం), తెలుగు భాషోద్యమ సమితి, తిరుపతి, మొదటి ముద్రణ: 31 మార్చి, 2014.
2. బహుజనపల్లి సీతారామాచార్యులు - శబ్దరత్నాకరము, విక్టరీ పబ్లిషర్స్, తృతీయ ముద్రణ: సెప్టెంబర్, 2007.
3. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి - కథాశిల్పం, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2008.
4. పోరంకి దక్షిణామూర్తి - కథానిక స్వరూప స్వభావాలు, తెలుగు కథానిక శతజయంతి సంవత్సరోత్సవ దీపిక, తొలి పరిష్కృత ప్రచురణ, 2009.

# చిత్తూరు జిల్లా కథ - దళితవాద స్పృహ

- యం. రాజేష్‌బాబు, పరిశోధక విద్యార్థి, తెలుగు & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

తెలుగు సాహిత్యంలో చిత్తూరుజిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. నన్నయకన్నా పూర్వం వాడైన పొన్నకవి నుండి చిత్తూరుజిల్లా సాహిత్య సృజన జరుగుతోంది. తమిళ, కన్నడ, తెలుగు త్రిభాషల సమ్మేళనం ఈ జిల్లా యొక్క ప్రత్యేకత. ప్రత్యేకమైన యాసతోటి ఆధునిక కాలంలో సాహిత్య సృజన జరుగుతోంది. సమాజంలోని జీవన ప్రతిఫలానాలే సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. అస్తిత్వ ఉద్యమాల ఆవిర్భావం వాటి ప్రతిఫలనాలు చిత్తూరు జిల్లా సాహిత్యంలో ప్రతిఫలించాయి.

అత్యంత ప్రాచీనత కలిగిన చిత్తూరుజిల్లా సాహిత్యంలో కథా ప్రక్రియ మాత్రం కె. సభాగారి చేతుల్లో కాస్త ఆలస్యంగానే సృజించబడింది. కథా సృజన ఆలస్యంగా వచ్చినప్పటికీ చాలా పదునైన, వాడి కలిగిన కథలెన్నో వచ్చాయి. వాటిలోని దళితవాద స్పృహను తెలియజేయటం ఈ పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపించడానికి అడ్డు తగిలే రుగ్మతలలో ప్రధానమైనది కులవ్యవస్థ. కుల నిర్మూలన జరిగితేనే దేశాభివృద్ధి పురోగతిని అందు కుంటుంది. ఈ రుగ్మతను నిర్మూలించకుండా మిగిలిన సమస్యలను పరిష్కరించాలనుకోవటం చాలా అవివేకం.

ఈ కులవ్యవస్థ చేత పీడింపబడుతూ, అంటరానితనా నికి, పీడనకు, దోపిడీలకు, పేదరికానికి గురవుతూ అనేక అవమానాలను ఎదుర్కొంటూ, హీనాతిహీనంగా జీవిస్తున్న దళితుల్లో చైతన్యాన్ని రగిలించి, అగ్రవర్ణ వ్యవస్థను నిరసిస్తూ, వారి ఆధిపత్యాలను ప్రతిఘటించాలనే స్పృహను కలిగించిన చిత్తూరుజిల్లా కథా రచయితల్లో ఒకరైన పులికంటి కృష్ణారెడ్డి రచించిన కథలను పరిశోధిం చగా ప్రథమంగా "సబ్బు' కథలో దళితస్త్రీ అగ్రవర్ణ పురు షుడి ప్రేమను తిరస్కరించి తన అస్తిత్వాన్ని నిలబెట్టుకునే విధానాన్ని ఈ కథలో చూడవచ్చు.

అగ్రకులానికి చెందిన పెద్దిరెడ్డి కుమారుడు రమణ పంపు నీటిలో నగ్నంగా స్నానం చేస్తున్న దళితస్త్రీ వరాలును చూస్తాడు. ఆమెను ప్రేమిస్తాడు, పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. అయితే రమణలోని అగ్రవర్ణాధి పత్య భావజాలం, ప్రస్ఫుటంగా కనిపించిన విషయాలు ఏంటంటే అతను సబ్బుతోటి స్నానం చేస్తున్నప్పుడు అతని ఒంటి నుండి జారిన నురగను దళిత పిల్లలు తీసి వాసన చూసుకుంటూ పరవశించి తమ కాళ్ళకు, చేతులకు పూసు కుంటారు దాన్ని భరించలేకపోతాడు రమణ. ఒంటరిగా ఉన్న వరాలును చూసి సబ్బును కానుకగా ఇచ్చి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చుతాడు. అప్పుడు వరాలు మా పిల్లలు మీ ఒంటి మీద నుండి జారిన నురగను పూసు కుంటేనే అంగీకరించని మీరా నన్ను పెళ్ళి చేసుకునేది. ఒంటిని శుభ్రం చేసే సబ్బులున్నాయి. కానీ మనస్సులను శుభ్రం చేసే ఫ్యాక్టరీలు వచ్చే వరకు ఆగమని తన ప్రేమను తిరస్కరిస్తుంది.

అంటరానితనం సమసిపోవాలంటే ప్రప్రథమ పరి ష్కారం కులాంతర వివాహాలు అని అందరూ అంగీకరించే వాస్తవం. అయితే కవిగానీ, రచయితగానీ సమయంకన్నా ఒక అడుగు ముందుండి ఆలోచిస్తారు. కాబట్టి కులాంతర వివాహాలు విజయవంతం కావాలంటే అగ్రవర్ణాధిపత్య భావజాలం మనష్యుల నుండేకాదు, మనస్సుల నుండి కూడా వెళ్ళిపోవాలని తెలియజేయడానికి ఈ కథా సృజన చేశారు. మనస్సులో ఆధిపత్య భావజాలాన్ని నింపుకొని దళితస్త్రీని ప్రేమించటమన్నది, ఆమెను ఆశించటమే కానీ, అందులో నిజమైన ప్రేమ ఉండదు అనడానికి ఇదొక నిదర్శనం. ఆమె మాత్రం కులం కారణంగా పీడనకు గురవుతూనే ఉంటుందన్న సత్యాన్ని రచయిత వరాలు పాత్ర ద్వారా తెలియజేసి అగ్రవర్ణాధిపత్య భావ జాలాన్ని ప్రతిఘటించే చైతన్యాన్ని సమాజానికి అందిం చారు.

ఈ కోవకు చెందిన మరో కథ 'చెంబుకోగంగ' ఈ కథలో నీటి సమస్యను చిత్రించారు. దళితోద్యమ పోరాటం మొట్టమొదట మంచినీటి సమస్య దగ్గరే మొదలైందని చెప్పాలి. అందుకు ఉదాహరణ డా॥ బి.ఆర్. అంబేద్కర్ మహద్ చెరువు సంఘటన. కారంచేడు ఉద్యమాలు మొదలైనవి నీటిసమస్యతోనే ఉద్భవించాయి. ఈ కథలో చిన్నతనంలోనే చేయని నేరానికి అగ్రకులస్తుల దగ్గర చావు దెబ్బలు తిని ఊరు విడిచిపోయిన అంకడు మిలటరీలో చేరి లోకానుభవం గడిస్తాడు. మిలటరీ నుండి తిరిగి తనవాడకు వచ్చిన తరువాత తనకు జరిగిన అన్యాయం ఇంకెవ్వరికీ జరగ కూడదని, తన వాడ ప్రజలందరినీ జాగ్రత్తపరుస్తాడు.

అది గ్రహించిన అగ్రకులస్తులు దళితులకు మంచి నీళ్ళు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తారు. ఇది గమనించిన అంకడు తనకు గవర్నమెంటు ఇచ్చిన ఐదు ఎకరాల భూమిలో బావి తవ్విస్తాడు. ఆ బావిలో మంచి నీళ్ళు పడుతాయి. కొంత కాలానికి వేసవికాలం కారణంగా అగ్రవర్ణ కులస్తుల బావులు ఎండిపోతాయి. వారు కూడా అంకడు బావిపైనే ఆధారపడవలసి వస్తుంది. మనిషికి ప్రాణాధారమైన నీళ్ళు ప్రకృతి వరప్రసాదం. కానీ ఇక్కడ ఆ గంగ ఏ కులం చెంబులో చేరితే ఆ కులం నీళ్ళుగా మారిపోవటం ధారుణం. మీకు నీళ్ళు కావాలంటే ఇస్తాం. కానీ ఒక షరతు బావిలో నీళ్ళు మేమే చేదిపోస్తాం. మీరు తీసుకొనిపోండి అని అగ్రవర్ణస్తులను తెలివిగా ప్రతిఘటించిన కథ ఇది.

ఈ కథలో రచయిత దళితులపై జరిగే అమానుష వైఖరులను ప్రతిఘటించాడు. దళితులు నీళ్ళు కోసం పడే అవస్థలను, మానసిక క్షోభలను అగ్రకులస్తులకు తెలియజేయటానికి రచయిత నీళ్ళు మేమే చేది పోస్తాం అనే షరతును అంకడు పాత్రద్వారా పలికించాడు. వాళ్ళ లాగే చేస్తే తేడా ఉండదన్న విషయాన్ని గ్రహించాడు. కాబట్టే ఈ కథలో నీళ్ళు ఇవ్వము అనే వ్యతిరేఖతను చూపించలేదు. సమాజంలోని అమానుష చర్యలను పరిష్కరించే మార్గంలో ప్రయాణించాలని రచయిత ఈ కథలో తెలియజేశాడు.

మరో కథ 'ఇరుకుమాను'. ఈ కథలో ఆధిపత్యాన్ని భరించలేక, ఎదుర్కొనే శక్తి లేక ఆత్మహత్య చేసుకొని, ఈ హత్య వలన ఆధిపత్యాన్ని ప్రతిఘటించే విధానాన్ని ఈ కథలో చూడవచ్చు. ఎంగటయ్య కాదు ఎంగిటిగాడి కూతురికి పెళ్ళి సంబంధం కుదురుతుంది. వియ్యాల వాళ్ళు పెళ్ళి చూపులకు వస్తున్నారు. అంతో ఇంతో కలిగిన వియ్యంకుల వాళ్ళకు సంగటి పెట్టడం మర్యాదకాదని రెండు కుంచాల వడ్లు కోసం ఎంగిటిగాడు ఆ ఊర్లో అడగని వాకిలిలేదు. ఆ పరిస్థితిలో పండిన వరిచేలు తన కళ్ళ ముందు మెదిలాయి. దొంగతనం చేతకాని పని, కానీ పరిస్థితి చేయక మాననివ్వలేదు. ఆత్మను చంపుకొని పండిన వరిచేలో వడ్లు పులుముకునే ప్రయత్నంలో పట్టుబడతాడు. ఎంగిటిగాడిని బజనగుడి ముందు రాతి స్తంభాలకు కట్టేసి చావు దెబ్బలు కొడతారు. అన్నింటినీ ఎదురు మాట్లాడకుండా భరిస్తాడు ఎంగిటిగాడు.

అప్పుడు శ్రీపురం చిన్నమరెడ్డి రంగప్రవేశం చేస్తాడు. అతని జోక్యంతో విడుదల అవుతాడు. ఈ సందర్భంలో చిన్నమరెడ్డి తన కూతుర్ని తన వద్దకు పంపమంటాడు. పెళ్ళి పీటల మీదకు పంపే కుతుర్ని రెడ్డి పడక మీదకు పంపలేక, పంపకపోతే ఎదురయ్యే సమస్యలను భరించలేక కులదేవత అయిన మాతమ్మ గుడిలో ఆత్మహత్య చేసుకొంటాడు. కులహీనుడైనా, గుణహీనుడు కాని ఎంగటయ్య రెడ్డి కోరికను తన చావుతో ప్రతిఘటిస్తాడు. దళితులు శ్రమదోపిడీకి గురై చేసిన పనికి తగ్గ ప్రతిఫలం అందక మూడు పూటలా తిండికి కూడా కష్టమైన స్థితిలో ఉన్నారు. ఒక్కపూట వచ్చినవారికి వరన్నం పెట్టలేక దొంగతనం చేయబోయి పట్టుబడి శిక్ష అనుభవించిందీ కాక కూతుర్ని భలికోరిన అగ్రవర్ణాధిపత్యాన్ని ఎదుర్కొనే శక్తి లేక ఆ ఆత్మహత్యతో వారి ఆధిపత్యాన్ని ప్రతిఘటిస్తాడు. సమాజంలో దళితులకు మర్యాదలేదు అనటానికి అతణ్ణి వెంకటయ్య అనకుండా ఎంగిటిగాడు అని అమర్యాదగా మాట్లాడుతూ అనేక అవమానాలకు గురిచేస్తున్నారు. ఈ భావజాలాన్ని రచయిత ఈ కథలో ప్రతిఘటించారు.

ఇలాంటి మరో కథ "కీచకవధ". ఈ కథలో సిద్ధిలుగాడి బావ రెడ్డి ఇంట్లో సేద్యం చేసేవాడు. ఎల్లప్పుడూ కష్టపడే

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


స్వభావం తనది. అతని చాకిరినీ గమనించిన ఊరు వారంతా అతనిని రెడ్డి ఇంటికి పాత అప్పులోడుగా చూస్తారు. ఒకరోజు కపిలతోలుతూ ఉంటే మోకు తెగి పోయి బాన బావిలో పడుతుంది. ఆ బానను పైకి తెచ్చే ప్రయత్నంలో బాన ఇనుప కమ్మీల మధ్య తల తగులు కొని పైకిరాలేక బావిలో శవమై తేలుతాడు. ఈ దుర్ఘటనకు ఏమాత్రం చలించని రెడ్డి తన మనస్సు అతని భార్యపై పడుతుంది. ఆమెను ఎలాగైనా అనుభవించాలని అది కూడా సిద్ధిలుగాడి ద్వారానే జరగాలని ప్రయత్నిస్తాడు.

ఈ విషయం తెలుసుకున్న సిద్ధులు అక్కను కాపాడు కోడానికి వారికి ఉన్న అవకాశాన్ని వారు చాలా తెలివిగా ఉపయోగించుకొని నింధుతున్ని హతమారుస్తాడు. ఇది తనకున్న తెలివితేటల దృష్ట్యా హత్యను ఆత్మహత్యగా రుజువుచేసి, సిద్ధులు తమ అక్కను కాపాడుకుంటాడు. అయితే రచయిత ఈ కథలో ఆధిపత్య భావజాలాన్ని కాకుండా ఒక అగ్రకులస్తున్ని చంపటం పరిష్కారంగా చూపించాడు. అది ఆ ఒక్క సమస్య నుండి మాత్రమే అతనిని బయటపడేసింది. అలాంటి మరో సమస్య తలెత్త కుండా సమస్యకు పరిష్కారాన్ని చూపించలేదనే చెప్పాలి.

ఇలాంటి మరో కథ "పులిగుండు". ఆ పల్లెలో పెద్దరైతు కృష్ణమనాయుడు, భార్య చనిపోయిన తర్వాత రెండో పెళ్ళి చేసుకుంటాడు. ఆమె చాలా అందమైంది. వయస్సు మల్లిన నాయుడిని కాదని, ఆ ఊరిలో మంచి అంద గాడు, ఆట, పాట వచ్చిన రాముణ్ణి ప్రేమిస్తుంది. ప్రేమతో సంబంధాన్ని మరింత పెంచుకుంటుంది. ఈ రహస్యాన్ని నాయుడు పసిగడతాడు. దీనిని భరించలేని నాయుడు ఒక పథకం ప్రకారం తన భర్యతో రాముడు ఉన్నప్పుడు పట్టుకొని రాముణ్ణి హత్య చేస్తాడు. దీనికి సాక్ష్యం బాలి గాడు. నాయుడంటే పడనివారు నాయుడుని కోర్టుకెక్కి స్తారు. బాలిగాడి తప్పుడు సాక్ష్యంతో నాయుడు శిక్ష తప్పించుకుంటాడు. బాలిగాడి తప్పుడు సాక్ష్యానికి కారణం బాలిగాడికి నాయుడు మూడంకణాల పూరిల్లు, ఎకరా పొలం ఇస్తానని మాట. కానీ బాలిగాడికి చివరికి ఏమీ ఇవ్వకపోటంతో నోటికొచ్చినట్లు తిట్టి, కొట్టడం చేస్తాడు నాయుడు. తనకు జరిగిన అన్యాయాన్ని లోకానికి చాటి చెప్పాలన్న తపనతో బాలిగాడు ఎవ్వరూ ఎక్కలేని పులి గుండు ఎక్కుతాడు. ఆ గుండు మీద నిలబడి తనకు జరిగిన అన్యాయాన్ని లోకానికి గొంతెత్తి చాటుతాడు. దిగివస్తే నాయుడి చేతుల్లో ఎటూ చావు తప్పదని ఆ గుండు మీద నుండి దూకి చస్తాడు.

అగ్రకులాధిపత్యం బాధితులను ఎన్ని విధాలుగా ఉపయోగించుకోవచ్చో, అన్ని విధాలుగా వారిని ఉప యోగించుకుంటుంది. చివరికి వారి పేదరికాన్ని, అవసరా లను, అవకాశాలుగా మార్చుకొని తమకు అనుకూలంగా మలచుకుంటారు. ఎదురు తిరిగితే వచ్చే పరిణామాలను ఎదుర్కొనే శక్తిలేక లొంగిపోవలసి వస్తున్న పరిస్థితులను రచయిత ఈ కథలో చూపించారు. ఆత్మసాక్షిని కూడా వారిచేత వారే ఆత్మహత్య చేసుకునేలా చేసి, వారిని నిట్ట నిలువునా దోచుకుంటున్న విధానాన్ని రచయిత వ్యతిరేఖిం చారు. అయితే ఈ కథలోని బాలిగాడు ఆత్మ సాక్షిని చంపుకొని చెప్పిన సాక్ష్యానికి పశ్చాత్తాపడి నిజాన్ని అందరి ముందు తెలియజేసి తాను ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ సంఘటన ద్వారా రచయిత సమాజానికి ఆధిపత్యాన్ని భరించాల్సిన అవసరాలు ఎంత పెద్దవైనా వాటిని ప్రతి ఘటించాలే తప్పా ఆధిపత్యానికి బలి కాకూడదు. మనల్ని మనం, మన అస్తిత్వాన్ని కోల్పోకూడదని అలాంటి పరిస్థితి ఎదురైతే ప్రాణాలనైనా వదులుకోవాలనే హితాన్ని ఈ కథలో చూడొచ్చు.

పై కథల్లో అగ్రకులాధిపత్యాన్ని నిరసించి తమ అస్తిత్వా లను కాపాడుకోవడం కోసం ప్రాణాలను కూడా లెక్క చేయని పోరాట పటిమను ఈ కథల్లోని దళిత పాత్రల ద్వారా చిత్తూరుజిల్లా రచయితలు సమాజానికి అందిం చారు. దళితోద్యమ పోరాట ప్రతిఫలనాలు వరాలు పాత్ర లోనూ, అంకడు పాత్రలోనూ, వెంకయ్య పాత్రలోనూ, సిద్ధులు పాత్రలోనూ ప్రతిబింబించాయి.

# 'శత్రువుతో ప్రయాణం' - సామాజిక దృక్పథం

- డి. తిరుమల స్వాతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

## ప్రవేశిక :

ఆధునిక వచన కవిత్వాన్ని ఔపోసన పట్టిన మహా మనిషి మాడభూషి సంపత్‌కుమార్ గారు. వీరి కలం నుండి జాలువారిన 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటిలో అడుగడుగునా సామాజిక స్థితిగతులు మెండుగా కనిపిస్తాయి. ఒక పక్క సామాన్యుల కష్టాలు, మరోపక్క స్త్రీల ఆవేదన, ఇంకో పక్క కులవ్యవస్థ నిర్మూలన, బిడ్డలను కాపాడడానికి కోసం తండ్రి పడే తపన, మనిషి అలుపెరుగని పోరాటం, జీవనయానం, దేశభక్తి, రాజకీయ దృక్పథం, పెట్టుబడిదారీ వ్యవస్థ, జెండా విలువ, స్త్రీని చెల్లిగా, తల్లిగా, ఎన్ని విధాలుగా చూపించాలో చూపిస్తూ ప్రపంచీకరణ నేపథ్యం, తెలుగు దీనస్థితి, ఆయా సంవత్సరాల్లో ఉగాది సందర్భంగా ప్రజల కన్నీళ్ళతోపాటు సుఖసంతోషాలను చూపిస్తూ, నేటి సంస్కృతీ సంప్రదాయాల రీతిని, మానవ నైజాన్ని, మానవతా దృక్పథాన్ని, చారిత్రక అర్థాన్ని ప్రత్యేకంగా ఒక్కోదాన్ని ఒక్కొక్క కోణంలో చూపిస్తూ, దేశభక్తిని పెంపొందిస్తూ, ప్రభుత్వ పనితీరునూ ఎద్దేవచేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, కడలి, భూమి, ఆకాశం ఇంకా ఎన్నో రీతులుగా సామాజిక, సాంఘిక దురాచారాలను నిర్మూలించడానికి ప్రయత్నిస్తూ, అలతి అలతి పదాలతో అనంత అర్థానిచ్చే భావ సౌందర్యాన్ని నేటి సమాజానికి అందజేయాలనే సంకల్పంతో ప్రతి చిన్న అంశాన్ని కూడా నిశితంగా పరిశీలించి, ఆకలి వేదనలను తెలుసుకొని, బడుగు బలహీనవర్గాలకు బాసటగా నిలిచి, సమాజంలో మార్పు తీసుకొనిరావలని తన వంతు కృషి చేస్తున్న మాడభూషి సంపత్ కుమార్‌గారి కవితలు ఎంతో నిబద్ధతతో, సాత్త్విక భావాలను అలవరచుకొని ప్రజల పక్షం ప్రతినిధిగా నిలబడి, ప్రశ్నించి పోరాటం చేయడం అక్కడక్కడ కనిపిస్తూనే ఉంటాయి. స్త్రీలలో ఉన్న ఆవేదనను, స్వాతంత్ర్యపు విలువలను, నాటి నాయకుల పనితీరును దుమ్ముపట్టడమే కాకుండా మనిషిగా జీవించడానికి మానవ జన్మ ఎంత తపన చెందుతుందోనన్న విషయాలన్నీ రుచి చూస్తేగానీ తెలియదు. ఇందులో ఉన్న ప్రతి కవితా ఏదో గొప్పలు కోసం రాసినట్టు కనబడదు. అప్పటికప్పుడు రచయిత ఆయా స్థితిగతులను ఆకళింపుచేసుకొని వాటికి సుస్థిర రూపం ఇవ్వదలచి సామాన్య భాషలో తమ భావాన్ని భావితరాలకు అందజేయాలన్న సంకల్పంతోనే నడుం కట్టాడని తెలుస్తుంది. ఈ కవితల్లో భావసౌందర్యం ఉందా? ఇతివృత్తం ఉందా? రూపం ఉందా? శిల్పం ఉందా? అని ప్రశ్నించుకోవడం కన్నా, ఇందులో సామాన్యుల కష్టాలున్నాయి. స్త్రీల గోడు ఉంది. దోపిడీ రాజ్యం ఉంది. పీడిత జనం ఉన్నారు. తండ్రి బాధ్యత ఉంది. ప్రపంచీకరణ నేపథ్యం ఉంది. విలువలకు అద్దం పడుతుంది. జెండా విలువ తెలుస్తుంది. స్వర్గం, నరకం, మగాడు ఈ విధంగా ఎన్నో రూపాలతో కవి తన మనో వేదనను మానవత్వంతో, అభ్యుదయ భావాలతో తన కలంలో చైతన్యం నింపుకొని, సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆలోచనలతో ముందడుగు వేశాడన్న విషయాన్ని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే ఈ ఆధునిక సమాజానికి మాడభూషి సంపత్‌కుమార్ గారి భావ విప్లవ సౌందర్యం, సామాజిక దృక్పథం ఎంతవరకు గుబాళిస్తుందో చూద్దాం.

## కుటుంబ జీవన విధానం :

'అతడు మనిషిని జయించాడు!' ఈ కవితలో మనస్సున్న మనిషిగా జీవించడం ఎంత కష్టమో చెప్పటమే కాకుండా మనస్సున్న మనిషిగా జీవిస్తే ఎదురయ్యే కష్టాలను చెప్పడంతోపాటు మనిషి కోసం ఎలా అన్వేషిస్తాడో ఈ కవితా పాదాలు చదివితే గానీ స్ఫురించదు. ఈ కవితా పాదాలను ఆకళింపుచేసుకొంటే మనస్సున్న

మనిషి సమాజంలో ఎంతవరకు కనిపిస్తారో ఆలోచించుకోవచ్చు. మనిషి రూపంలో ఉన్నవాళ్ళు అందరూ మనుషులు కారని, ఇప్పుడు మనస్సున్న వాళ్ళు కూడా మనిషిలో కలిసిపోయి మనిషిని జయించి, మనిషిని వెతకడం మానేశాడని రచయిత యాంత్రిక మనుషుల నడవడికను ఎత్తి చూపించాడు. మనిషిని అర్థం చేసుకోవాలంటే ఈ కవితను అర్థం చేసుకొంటే సమాజాన్ని అర్థం చేసుకొన్నటే. అలాగే 'అడవిలో పొద్దు గూకింది' అనే కవితా శీర్షికలో-

"జీవితం ఎందాకా?"(శత్రువుతో ప్రయాణం, పుట.10)

అని చెబుతూనే చేత్తుల్లో సత్తువలేదు. కడుపు దహించుకుపోతుంది. కళ్ళు కమ్ముతున్నాయి. ఆశలు వాడిపోతున్నాయి. మనసు పొర్లు కమ్ముతుంది. అడుగులు తడబడతున్నాయి. పొద్దుపోయేలో జీవితాన్ని దాటేయ్యాలని, సూర్యుడు తలకెక్కాడు. అయితే-

"ఆలోచనలకి చీకటి కమ్మలేదు /అడవిలో పొద్దు గూకింది!"(శత్రువుతో ప్రయాణం, పుట.10)

అడవికి అవతల అద్భుతమయిన సౌందర్యం ఉందని, దానిని కౌగిలించుకొని, ఉక్కిరి బిక్కిరి చేయడానికి కాచుకు కుర్చుంటే, అందంగా, హుందాగా, దర్జాగా వస్తేనే కౌగిలి అని ఒకే షరతు. అడవిలో పొద్దు గూకడమంటే ఆలోచనల అంధకారానికి కళ్ళెం తీసి ప్రగతిని కోరుకోవడమేనని గ్రహించాలి.

'కత్తి కింద పడకుండానే.....' ఓ తండ్రి క్రమశిక్షణను, బిడ్డలను పోషించడానికి తండ్రిపడే తపనను, తండ్రి దీనవస్థను, సామాన్య కుటుంబ స్థితిని బిడ్డల ఆకలి దప్పికలను తండ్రి ఎలా తీరుస్తాడో రచయిత మాటల్లో-

"రెక్కాడితేగానీ డొక్కాడని / కుటుంబంకోసం
పక్షులతోపాటు / రెక్కలు విదుల్చుకొని
బయలు దేరుతాడు! / చెమట ముక్కల్ని
నీటి చుక్కలు చేసి / పిడచ కట్టిన పిల్లల
నాల్కలపై పోస్తాడు! / అడవిలో ఎక్కడో వెన్నెల కాస్తుందంటే
అమృతంకోసం అక్కడికి పరుగు! / ఎడారిలో కొబ్బరి నీళ్ళున్నాయంటే
అక్కడికీ ప్రయాణమే! / కళ్ళలో కనిపించే పిల్లలముందు
అడవి మైదానంలా మారిపోతుంది! / ధ్యాసంతా-
అర్థం గురించి కాదు / పరహితం గురించే!"
(శత్రువుతో ప్రయాణం, పుటలు.11-12)

ఇందులో ప్రతి మాట ప్రతి బిడ్డకు వర్తిస్తుంది. ప్రతి తండ్రి ఆవేదన ఇలాగే ఉంటుంది. తల్లిదండ్రులు బిడ్డలనుంచి ఏమీ ఆశించరనే అక్షర సత్యాన్ని గ్రహించవచ్చు.

**సంఘసేవ :**

'అలలు అలసిపోవు' అనే కవితా శీర్షికలో ప్రయత్నం ఏవిధంగా ఉండాలన్న ఆలోచనను కవి వ్యక్తపరచడం జరిగింది. 1989వ సంవత్సరంలో రచించిన ఈ కవిత ఈనాటికి కూడా ఊపిరితోనే ఉండి మరలా కర్తం తొక్కుతుంది. పగలు రాత్రి తేడా లేకుండా అలలు ఎగసి ఎగసి పడుతూ ఊరంతా ముంచేయాలని ప్రయత్నంతో వస్తుంటే తీరం చేరేటప్పటికి కాళ్ళలో వణుకుపుట్టి మెల్లగా వెనక్కి తగ్గడమే కాకుండా శరీరమంతా కష్టం కార్చుకోవడం తప్ప పని తుడుచుకోవటం అలలకు తెలియదు. చంద్రుడు ఆకాశంలో కనబడితే కడలి దాటేదామనే ఆశ అయితే వెనక్కి తోయడానికి సూర్యుడు సిద్ధంగా ఉంటాడన్న విషయాన్ని మరచిపోతామనే భావనను చెప్పటంలో అంతర్లీనంగా దాగి ఉన్న అంశాలను నెమరు వేసుకోవాల్సిన అవసరం ఉంది.

"పెద్దచేప చిన్న చేపను మింగేస్తుంటే / చూసీ చూడనట్టు-
తిమింగలం మోరచాచి వస్తే / స్నేహ వాస్తం చాస్తూ-
సముద్రుడు ఉదారుడని / వేనోళ్ళా కీర్తిస్తూ-
మొహానికి నవ్వు తగిలించుకొని / అంతా సవ్యంగానే ఉందనుకొంటూ-
కడుపులో కత్తులు పెట్టుకొని / కావలించు కుంటూ-"
(శత్రువుతో ప్రయాణం, పుట.14)

ఈ కవితా చరణాలు అన్ని విధాలుగా సంఘసేవ, సామాజిక స్థితిగతులు ఆకళింపు చేసుకోవడానికి ఆధారంగా ఉంటాయని చెప్పవచ్చును.

## విజయ సంకేతం :

'కవిభేరి' కవితా శీర్షికలో స్వాతంత్ర్యాన్ని కోసం కవిత రాసి దేశవిముక్తి కోసం కంఠమెత్తి పాటపాడి తెల్లవాళ్ళ గుండెల్లో గుబుళ్ళు పుట్టించిన స్వాతంత్ర్య సమర యోధుల గురించి భావితరం ఎలా దిగులు చెందు తుందో ఏ కవిత అయితే రాశారో ఆ కవితకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రెస్సు బిల్లు పెట్టి కలం ముళ్ళు విరిసేశారని, ఏ దేశ విముక్తి కోసం కంఠమెత్తి పాట పాడాడో, ఎమర్జెన్సీ వచ్చినప్పుడు అలాంటి కవిత గొంతు ముతపడిందని, నల్లవాళ్ళపాలన కంటే తెల్లవాళ్ళ పాలన మెరుగని వాపోతూనే కవి ఎలా తన స్పందనను తెలియ జేస్తాడో-

"నేనుగాని / రాయకుంటె / దేశభక్తి, దాస్యముక్తి, ప్రజాశక్తి
దేశమందు / నాశమౌతాయి! / గద్దెనెక్కి వెక్కిరించే
బుద్ధిలేని పెద్దలంతా / పదవి పోయీ ఏడ్చుకుంటూ
కింది కొస్తారు! / భావజాలం మారిపోయి
మూఢతత్వం కదిలిపోయి / అభ్యుదయమే
జగమంతా / నిండిపోతుంది!"

(శత్రువుతో ప్రయాణం, పుట.16)

మహాకవి శ్రీశ్రీ రచించిన 'జయభేరి' కవితకు ఇది పేరడీ కాదు. ఇందులో ఉన్న భావజాలం 1983వ సంవత్సర స్థితిగతులను రచయిత పసిగట్టి తన భావాన్ని వ్యక్తం చేశాడు. శైలి శ్రీశ్రీని అనుసరించానని 'పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు' రచయిత భావించుకోవటం తన వినయ విధేయతలకు నిదర్శనం.

## సత్యానికి మార్గం :

'నిజం' కవితా శీర్షికలో కవి దర్శించిన అంశాలు ఏమిటంటే విశ్వవిద్యాలయాలపై చెక్కేసిన మతతత్వం, విద్యార్థి హృదయ కుహరంలో ముసుగేసిన కులతత్వం, ప్రజల గుండెల్లో అట్టడుగులో చెలరేగిన మతమౌఢ్యం, మనస్సులో కుడ్యం, పాలకుల ప్రకటనలో వికటించిన భాషా తత్వం, బజారుల్లో, బారుల్లో ప్రకటించెను సంకుచిత తత్వానే చూసిన నా దేశంలో కప్పేసిన మొహాలను, ప్రాంతీయపు గోడలను, తుంచేసిన బంధాలను, బార్లలో, వాడలు దేశంలో నెలకొన్న దౌర్భాగ్యాన్ని గురించి రచయిత విశదీకరించాడు. దేశ పురోభివృద్ధికి ఈ అంశాలన్నీ అడ్డు తగులుతున్నాయని కవి వాపోతున్నాడు. ఇలాంటి ముసుగులో నుంచి బయటపడినట్లయితే సమాజం బాగు పడినట్టే. ఈనాటికి కాకపోయినా రాబోవు తరాలకయినా కవి ఆకాంక్షను సాకారం చేసినట్లయితే దేశం మేల్కొన్నట్లే.

## తెలుగు సంవత్సరం :

'విరోధి' నామ సంవత్సర కవితా శీర్షికతో ఉగాది సంవత్సరాన్ని పురస్కరించుకొని సమాజంలో నెలకొన్న స్థితి గతులను రచయిత తన సామాజిక నైపుణ్యంతో ఎలా స్పందించాడో చెప్పుకోకతప్పదు. షడ్రుచులు వడ్డించిన భూమి తల్లిపై అత్యాచారం, ప్రాణమై నిలిచిన ప్రకృతిపై పడగెత్తిన మానవ అహంకారం, హత్యలు, ఆత్మహత్యలు, ముఖాలకు అద్దుకున్న మాధ్యమాలు, కులాల్ని ఒంటికి పుసుకొని పవళిస్తున్న మేధావులు, మానవ సంబంధాలకి సెల్లుచీటి రాసి ద్రవ్యోల్బణంలో తలదాచుకున్న మధ్య తరగతి, ఒకసారి ప్రజారాజ్యం పార్టీ, ఇంకోసారి కాంగ్రెస్, మరోసారి అని తెలుగు దేశం పార్టీ అధికారంపై మమకారంతో అవకాశాలకై అర్రులు చాస్తున్న ప్రజాసేవకుల తీరును, ఆకలికి కోలమానంగా ధరల గురించి, మానవులు బంధాలకు బదులు బాంబులు కట్టుకొని తిరుగు తున్నారని, ప్రయోక్తులు నవ్వు ముఖాలతో తెలుగుకు గోతులు తవ్వుతున్నారని, ప్రతి ఒక్కరు తెలుగు పల్లకీ ఎక్కినవారే, హద్దుమీరుతున్న తీవ్రవాదాన్ని గురించి, సర్దు మణిగిన మితవాదాన్ని గురించి, వాదాల స్థానంలో భేదాలు సమాజంలో నెలకొని ఉన్నాయని రచయిత సుదీర్ఘంగా చెప్పగలిగాడు. ఇందులో ప్రతి చిన్న అంశం కూడా సమాజానికి అడ్డుగోడుగా నిలుస్తున్నాయని మరో అడుగు ముందుకు వేయడానికి అవకాశం లేకుండా పోతుందని వీటన్నింటిని సక్కపెట్టినట్లయితే రాబోవు తరాలు సశ్యశ్యామలంగా తమ జీవనాన్ని కొనసాగించే అవకాశం ఉంది.

## ఆధునిక సాహిత్యానికి మార్గదర్శకులు :

'తెలుగు వెలుగులు' కవితా శీర్షికను సుదీర్ఘంగా చదివినట్లయితే నాటి నుంచి నేటివరకు తెలుగు పరిస్థితి తెలుసుకోవడమే కాకుండా భారత, భాగవత, రామాయణాలు, ప్రబంధాల గురించి అవగాహన చేసుకొనే అవకాశం ఉంది. వేమన, మొల్ల, వీరేశలింగం, గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, జాషువాల సాహిత్య సమ్మేళాలను తెలుసుకోవాలనే కూతుహలం ఆధునిక కవుల సాహిత్య ప్రక్రియ ధోరణులను తెలుసుకోవాలనే జిజ్ఞాస మెండుగా కలుగుతుంది. ఇందులో చోటుచేసుకొని సాహిత్య సౌధాలు లేవంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. పుస్తకాలు చదివే ఓపికలేని వారు తీరిక లేనివారు తెలుగు సాహిత్యాన్ని గురించి తెలుసుకోవాలంటే ఈ ఒక కవితను ఔపాసన పట్టినట్లయితే తెలుగుకు మర్యాద దక్కినట్లే.

## స్త్రీవాద దృక్పథం :

'ఆమె' కవితా శీర్షికలో స్త్రీలు పుట్టిన నాటి నుంచి పురుషునితో కాపురం చేసేంతవరకు నెలకొన్న దీనస్థితిని చవిచూడవచ్చు. ఆ కవితలో ఉన్న అన్ని విషయాలను సమీక్షించుకోవడం కన్నా కవి మాటలను పొందుపరిచినట్లయితే ఇంకా బాగుంటుందని భావిస్తున్నాను.

"కర్రిముండా అని తన్ని నిద్రలేపే అమ్మ!"

"పనులు పురమాయిస్తూ / వీపు విమానం మోత మోయించే తండ్రి!"

"కర్రిముండనే / ముద్దు పేరుగా మార్చిన తల్లి దండ్రులు!"

"మొగుడింటికి / పోతే చెప్పుదెబ్బలు తింటావని శాప నార్థాలు"

(శత్రువుతో ప్రయాణం, పుట.26)

ఇచ్చిన తల్లిదండ్రుల దీవెనలు మొగుడికి ముందుగానే అనుమతి లభించింది. ఇంకా ఆమె పెళ్ళాంగా ఎన్ని గతులు పడుతుందో ఏ గతికి లోనవుతుందో కవి మాటలనే ప్రతిబింబింప చేయవలసిన అవసరం ఏంతైనా ఉంది. అవేవో-

స్త్రీవాదులు చెప్పదలుచుకొన్న అన్ని విషయాలను, స్త్రీల పక్షిపాతిగా మహిళల గొడును త్రునప్రాయకంగా రచయిత చెప్పగలిగాడు. నాటికి, నేటికి జరుగుతూనే ఉన్నాయి. రేపటికి జరగకుండా ఉండాలంటే ఈ ఒక కవిత సమాజ పునాదుల్ని కదిల్చివేసి స్త్రీలకు జరగవలసిన సమన్వయానికి అద్దం పట్టి పోరాటం చేయగలదన్నదే నా భావన.

'స్వర్గం' కవితా శీర్షికలో ఒక స్త్రీ ఒక మగాడి మీద తన మానసిక మనోవేదనను స్కాన్ చేసినట్లు పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేసే విధంగా రచయిత వక్రీకరించారు. ఆ వక్రీకరణ అంశాలను రచయిత ఏ విధంగా చూపించాడో చూద్దాం-

"ప్రతిరాత్రీ / వాడికి స్వర్గం-
ప్రతిరాత్రీ / నాకొక నరకం-
దెయ్యంలా మారిన వాణ్ణి / దేహంలా ఎలా భరించగలను?
నా శరీరంమీదకి / తాచుపాములా పాకుతాడు
నంద్రగబ్బలా పట్టుకుంటాడు / వాడి ఉడుం పట్టునుంచి
తప్పించుకోవడానికి వీలుకాదు / పులిలా మీద పడుతాడు
నక్కలా నాకు ఫేవర్ చేస్తున్నట్టు నటిస్తాడు / బుసలు కొట్టే ఎద్దులా మారుతాడు
స్వర్గాన్ని రుచిచూస్తూ / నరకాన్ని తాగిస్తాడు!
వాడి కోరికలు తీర్చే / దేవతను నేను
నా కోరికల్ని అణచివేసే / రాక్షసుడు వాడు స్వర్గం పైకి దండయాత్ర చేస్తాడు
నరకాన్ని స్థాపించాలంటాడు!

(శత్రువుతో ప్రయాణం, పుటలు.43-44)

ఈ కవితలో పాదాలన్నీ అక్షరాలు కాదు, స్త్రీల కన్నీళ్ళు, వ్యధలు, ప్రపంచ నలుమూలలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళలో మాడిమసైపోతున్న వాళ్ళ ఆగ్రహానికి బలికాకుండా ఉండాలంటే వీటి మీద ప్రత్యేక దృష్టి పెట్టి ఇలాంటి సమస్యలను

చక్కబెట్టడానికి మానవత్వంతో మగడు మనుగడ సాగించాలన్నదే రచయిత ఉద్దేశం. ఎక్కడయితే స్త్రీ కన్నీరు కార్చకుండా ఉంటుందో అక్కడ సిరులు వెల్లులై కురు స్తాయని వెలిబుచ్చారు.

## శాంతి గీతం :

'విరుగుడు' కవితా శీర్షికలో శాంతి గీతం గురించి పలు విషయాలను ప్రస్తావించిన మాడభూషి సంపత్ కుమార్ గారి మాటలు సమాజ ఐక్యతకు తోడ్పడి అవ కాశవాదానికి బుద్ధి చెప్పి, విపరీతం జరగక్కముందే జనం నాడుల్లోకి విషం పాకకముందే విరుగుడు మందు కావాలని, రాజకీయ సమస్యలను సృష్టిస్తుందని, సంఘర్షణ లని ప్రేరేపిస్తుందని, అంతరాలను కల్పిస్తుందని వీటన్నిటికీ శాంతి గీతం కవి ఏమి గీశాడో కవి మాటల్లోనే పరిశీలిద్దాం.

"చేతులు కలిపి సాధించలేంది / కత్తులు దూసి గెలవగలమా?
ఆత్మావలోకనంలో / అంతా స్వచ్ఛమే / ఆత్మా శ్రయంలో
అంతా స్వార్థమే! / రాజకీయపు చెలగాటంలో
చెదపురుగులే ముందుండి / జై కొడతాయి
గ్రహిస్తే గెలుస్తాం! / మరిస్తే విలపిస్తాం!"

(శత్రువుతో ప్రయాణం, పుట.32)

అని రచయిత పేర్కొంటాడు.'పాలస్తీనా దృశ్యాలు' కవితలో ప్రపంచీకరణాన్ని దర్శించవచ్చు. 'కవి' అనే మరో కవితలో కవిత్వం రాయడానికి ఎలా ఆవేశపడుతారో, ఈనాటి కవితా స్వభావాలు, కవుల తీరుతెన్నులు కవితలో ఉన్న శిల్పం, కవితా సమీక్షలు, విమర్శలు, కవిత్వం మీద జడ్జిమెంటులు మెండుగా కనిపిస్తాయి. ఈ ఒక కవిత చదివితే ఈనాటి కవులు గురించి అవగతమవు తుంది. వచన కవిత్వాన్ని ఈ కవిత ఎద్దేవ చేస్తుంది. అత్యా ధునిక కవులకు ఆత్మావలోకనం చేసుకోవడానికి ఈ కవిత చేదోడు వాదోడుగా ఉంటుందన్నది అక్షర సత్యం.

## పురుషాధిక్యం :

'తండ్రి' కవితలో మాధ్యమాల పనితీరును చెబుతూ తండ్రి ఎందుకు తలవంచుకొంటున్నాడంటే మగాడినె నందుకు, కన్నబిడ్డనే కామించినందుకు, పత్రికలో వస్తున్న సంగతలకు స్పందించి రచయిత-

"మగాడినయినందుకు / తలవంచుకొంటున్నా!
తండ్రినయినందుకు / సిగ్గుపడుతున్నా
కన్నబిడ్డను చూసే శక్తిలేక / ఆత్మహత్య చేసుకొంటున్నా
ఆత్మలు లేని తండ్రులున్న / లోకంలో నిలువలేక!
మగాళ్ళు / ఎన్నిటికో ఆత్మహత్యలు చేసుకోవాలి"

(శత్రువుతో ప్రయాణం, పుట.45)

అంటాడు. వీటికి కూడా ఆత్మహత్యలు చేసుకోకపోతే మనుషులుగా మిగలడం అవమానమన్న సందేశం భావి తరాలకు బాసటగా నిలుస్తుంది.

'మగాడు' కవితలో అమమ్మ చెప్పిన మగాడి గురించి అమ్మమ్మ, అమ్మమ్మ చెప్పిన మగాడి గురించి అమ్మ, అమ్మ చెప్పిన మగాడి గురించి కూత్రు ఏకీభవించిన, కూతురు చెప్పిన మగాడి గురించి మనవరాలు ఏకీ భవించదు. మగాడంటే జల్సారాయుడని, కూడా ఉండే గొంతు కోసేవాడిని, భారాన్నంతా మోపేవాడని, తాను మోస్తున్నట్లు నటిస్తూ మోసం చేసేవాడని, సుఖపెడు తున్నట్లు నటించేవాడని, నీడచాటు ఉండమని నన్ను ఇంట్లో బానిస చేశాడని, నేను సహవాసం చేస్తున్నది, సహ జీవనం చేస్తున్నది, పని పంచుకొంటున్నది, పని చేస్తున్నది శత్రువుతోనని వాపోతుంది. వాడు కావాలన్న, తేవాలన్న, రావాలన్న, తిరగాలన్నా, రావాలి, తేవాలి, తిరగాలి. వాడు వాడుగా ఉంటాడు. నేను నేనుగా ఉండకూడదు. వాడు వాడుగా ఉంటాడు. వాడికి సంతోషం కలిగినా, దు:ఖం వచ్చినా, వాడికి తగ్గట్టు ఉండాలి. వాడు భర్త అయి నందుకు భరితెగిస్తున్నాడని, భార్య అయినందుకు భరిస్తున్నానని మగాడిని గురించి తమ అభిప్రాయాన్ని చెప్పింది. ఇది ఒక స్త్రీ సమస్య కాదు. ప్రపంచం మొత్తంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను కవి కాంక్షించి సమా జాన్ని దర్శింపజేశాడు. స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవని చెవులు, ముక్కులు ముందుగా కుట్టేశారని, నోరు తెర వాలని ప్రయత్నించినప్పుడు నోరుకు పెళ్ళి అనే పసుపు

తాడుతో కుట్టేశారని, రెక్కలు తొడుక్కొని పక్షిలా ఎగిరే మనసుని ముక్కలు చేసి మూల కూర్చొపెట్టడం పెళ్ళి ఎలా అవుతుందని మన ఆచార వ్యవహారాలను దుయ్య బట్టాడు. ఈనాటికి కాకపోయినా ఏనాటికయినా కవి మాటలు లోకం ఎరిగి సక్రమ మార్గంలో నడిపించడానికి నడుం బిగిస్తుందని ఆశిస్తున్నాను.

**ముగింపు :**

నాటి నుంచి నేటి వరకు ఉన్నటువంటి సామాజిక స్థితిగతులను అవలోకనం చేసినటువంటి ఆచార్య మాడ భూషి సంపత్‌కుమార్ గారి 'శత్రువుతో ప్రయాణం' కవితా సంపుటిలోని అన్ని కవితల్లో కూడా సామాజిక దృక్పథమే మెండుగా ఉందనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ గారు చిన్న వయస్సులో శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం' లాంటి కవితా ఖండికలను ఆకళింపు చేసుకొని కవిత్వీకరించారు. అందువల్లే వారి కవితలో ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సామాజిక దృక్పథానికి సంబంధించిన అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని కవిత్వాన్ని కవిత్వీ రించారంటే ఆశ్చర్యపోవలసినవసరం లేదు. కాబట్టి మాడ భూషి గారి 'కవిత్వమంటే సామాజిక దృక్పథమే'. సామాజిక దృక్పథం లేకుండా మాడభూషి గారి కలం ముందుకు సాగదనే విషయాన్ని ఆయన కవిత్వాన్ని చదివిన చదువరు లకు అర్థమవుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

సంపత్ కుమార్, మాడభూషి - శత్రువుతో ప్రయాణం, పాలపిట్టబుక్స్, హైదరాబాద్, మొదటి ప్రచురణ: శ్రీమన్మథనామ సంవత్సర ఉగాది, మార్చి 2015.

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# హాస్యకథా రచయితగా - డా॥ మంతెన సూర్యనారాయణరాజు

- వి. వెంకటేశన్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

## హాస్యం - నిర్వచనం :

హాసము అంటే నవ్వు ఆ నవ్వును పుట్టించేది హాస్యము. ఏది నవ్వు పుట్టిస్తుంది?. అసహజము అయినది ఏదైనా సరే దాన్ని చూచి నవ్వుతాము. వేషము విప రీతముగా ఉంటే నవ్వుతాము, చేష్టలు విపరీతముగా ఉంటే నవ్వుతాము, మాటలు వంకరగా ఉంటే నవ్వు తాము. నవ్వు మానవుడు కొత్తగా నేర్చుకున్న అంశము కాదు. ఏడుపు మానవునికి ఎంత సహజమో నవ్వు కూడా మానవునికి అంతే సహజము వంటిది. బ్రహ్మదేవుడు లోక సృష్టి కార్యక్రమం అంతా పూర్తి చేసి తాను చేసిన పనిని చూచి ఆలోచించి ఒకసారి నవ్వుకున్నాడట.

ఎన్ని పక్షులు, ఎన్ని జంతువులు, ఎన్ని చెట్లు, ఎన్ని రకాల పువ్వులు, ఇవ్వన్నీ చూచి నవ్వుకున్నాడు. గాడిద, ఏనుగు, ఒంటె మొదలగు జంతువులలో ఉండే రూప వైవిధ్యం చూస్తే ఆయనకే నవ్వు వచ్చి ఉంటుంది. అందుకు కారణం కుక్క మొరిగింది, గాడిద ఓండ్ర పెట్టింది, ఏనుగు ఘీంకరించింది. ఈ శబ్దాలలో ఉండే స్వర వైవిధ్యం చూచి మళ్ళీ ఒకసారి నవ్వుకొని ఉంటాడు. హాసమునకు కారణ భూతమైనది హాస్యము, నవ్వించేది హాస్యము, సహృదయుడూ, ఆరోగ్య వంతుడూ, సంస్కృత మతీ,నాగరికుడు మొదలైన వారిని నవ్వించేదే హాస్యము. **ఉదా** : " ఎవరిని గురించి నీవు హాస్యంగా మాట్లాడుతావో అతను కూడా సంతోషించ గలిగే విషయమే హాస్యం"

"Laugh with any body, but don't laugh against him"

## హాస్య రచయితగా మంతెన పరిచయం :

డా॥ మంతెన సూర్యనారాయణరాజు 1967వ సం॥ నుండి సాహిత్య కథారచయితగా పాత కథలను, కొత్త కథలను రచనలు చేయడమే కాకుండా తాను రచించిన కథలలో హాస్యమును క్రోడీకరించి హాస్య కథలను రచించి అందు సహృదయాలను ఆనందింపజేసే విధంగా రచన లను ప్రారంభించారు. మంతెన కలం నుండి జాలువారిన కథలు కంటే అందులో హాస్యం ప్రధానంగా ఉండే సృజ నాత్మక కథల ప్రస్థావన ఎక్కువ. మంతెన రచనలలో ఓ చిరునవ్వు పాఠకుల హృదయంలో నుండి మొఖంలో బహిర్గతమవ్వాలని కోరుకునేవారు. మంతెన గారి కథలో నిజం, సామాజికం, సాంఘీకం, ప్రాచీనం నుండి ఆధు నికం వరకు గల అంశాలు సంచరిస్తూ ఉంటుంది." నవ్వు నాలుగు విధాల చేటు" అన్న నానుడిని మలుపు తిప్పి పాఠకుల హృదయంలో హాస్యమును ప్రదర్శింప జేయడంలో మంతెన గారు అందె వేసిన చెయ్యి.

మంతెన సూర్యనారాయణరాజు గారు సమాజమును అందలి అసంఘటిత అంశములను జాగ్రత్తగా పరిశీలించి తన కథలలో సన్నివేశములను, పాత్రలను సజీవంగా, సహజ సుందరంగా జోడించి సరళమైన శైలిలో రచనలు చేసేవారు. మంతెన గారి కథలలో నిజమైన అంశాలు హాస్య రూపంలో గోచరిస్తూ ఉంటాయి. మంతెన తన రచనలలో కథకుడి నిజత్వమును పాఠకుల ప్రయోజ నమును దృష్టిలో ఉంచి రచనలు చేసేవారు.

మంతెన గారి రచనలలో నవరసాలలో ఒకటిగా గల హాస్య రసం ప్రధానంగా ఉంటుంది. మంతెన కథలను పాఠకులు చదువుతున్నపుడు హాస్యము నిగూఢంగా గోచ రిస్తూ తన మనస్సులోని ఆనందమును అనుభవించే విధంగా ఉంటుంది.

మంతెన రచనలు పాత కోణాలలో కాకుండా కొత్త కోణాలలో పయణించే విధంగా రచనలు ఉంటాయి. మంతెన హాస్య కథారచనలను ఆహ్లాదకరంగా రాయ డంలో రచనా విధానానికే వంతెన వంటి వారు.

## మంతెన కథలో హాస్య ప్రాధాన్యత :

మంతెన సూర్యనారాయణరాజు హాస్య కథలలో హాస్య

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

రస ప్రాధాన్యము పాఠకుల హృదయాన్ని హత్తుకునే విధంగా ఉంటుంది.

**హాస్య ప్రాధాన్యమైన కథాంశాలు :**

**జానపథం (కాఫీ మజిలీ కథలు) :**

పూర్వము రాజమండ్రి, కాకానాడ, దొమ్మరపేట, మేటిపాక, చిలకలూరిపేట వంటి ప్రదేశాలలో జీవనాధారం లేక వయస్సు మల్లిన స్త్రీలు, హిజ్రాలు సమాజమునకు, ప్రభుత్వమునకు వ్యతిరేకంగా వ్యభిచార వృత్తులను సాహిస్తూ సరైన బ్రతుకు మార్గం లేక రోడ్ల పాలైన సమస్యలను, ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యమును, సమాజంలో హిజ్రాలు పడుతున్న సమస్యలును, అదే విధంగా సమాజంలో హిజ్రాలకు సరైన సదుపాయాలు కల్పించవలసిన ప్రభుత్వాధికారుల బాధ్యతను హాస్య రూపంలో ఆవిష్కరింపజేయడము మంతెనగారి హాస్య రచనకు నిదర్శనము. ఇక్కడ మంతెనగారి రచనా దృష్టి హిజ్రాలను చూసి నవ్వడము కాదు వారి సమస్యలను తీర్చలేక ప్రభుత్వాధికారులు వారితో పోరాడడమే ఓ రకమైన హాస్యము.

**ప్రేమ - పిచ్చి-ఒక్కటే ( లేచింది మహిళాలోకం) :**

సమాజంలో యువకులు ప్రేమ అనే భావనలో తీవ్రమైన స్థాయికి చేరుకుంటూ అదే స్థాయి అధికమై ఉన్మాది స్థితికి చేరి జీవనమును నాశనం చేసుకుంటున్నారు. ఈ కథా సంపుటిలో మురగ భూషణం అనే పాత్రధారుడు సినీ తారల మీద ప్రేమ భావనను పెంచుకుంటూ చివరకు అదే మానసిక ఒత్తిడికి లోనై తన దేహమును పాడుచేసుకుంటూ తల్లిదండ్రులకు దూరమవుతాడు. ఇక్కడ రచయిత రచనా దృష్టి సమాజంలో యువకులు తన బ్రతుకును ప్రేమలపై మల్లించరాదని, మానసిక ఒత్తిడికి లోనుకాకూడదని తల్లిదండ్రులకు దూరం కాకూడదన్న విషయాన్ని హాస్య దాయకంగా నొక్కి చెప్పడమే.

**కథకుడి పరిచయం :**

డా॥ మంతెన సూర్యనారాయణరాజు గారు 12-08-1947వ సం॥రం పశ్చిమ గోదావరి జిల్లా, ఖండవల్లిలో మంతెన సుబ్బరాజు, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించారు. తన స్వగ్రామము ఏలూరుపాడు, కాళ్ళ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**రచనలు, పత్రికా ప్రచురణలు, పదవులు, సత్కారాలు :**

**కవితా సంపుటాలు** : 1. మానవారణ్యం 2. నా కవిత 3. అక్షరశిల్పాలు

**కథా సంపుటాలు** : 1. ఆమె నవ్వింది 2. జీడికి బంటెవరోయ్ 3. నా కవిత 4. గజారోహణం 5. కాఫీ మజిలీ కథలు 6. గోదావరి తీరం 7. లేచింది మహిళాలోకం 8. నాకొక శ్రీమతి కావాలి 9. ఆధిపత్యం 10. మండువా లోగి 11. టీ బ్రేక్ కథలు

**హాస్య నాటికలు** : 1. అద్దెకొంపలో గృహ ప్రవేశం 2. తాళి ఎగతాళి చేస్తే 3. నరకానికెళ్ళొచ్చిన నాంచారమ్మ 4. సంచలనం 5. పరిష్కారం 6. ఆడది లేని సంసారం 7. చిలుక చదువులు 8. బ్రహ్మచారి నిలయం 9. భార్య పీడుతుల సంఘం 10. సుబ్బారావు ది గ్రేట్ 11. బాలామణి బడ్జెట్ మరియు 15. రేడియోనాటికలు సంపుటిలు.

**సాహిత్య వ్యాస సంపుటాలు** : 1. సాహిత్య సుధ 2. సాహితీ నీరాజనం 3. వాఙ్మయ పారిజాతం

**రచనలు ప్రచురిత పత్రికలు** : ఆంధ్ర పత్రిక, ప్రభ, ఈనాడు, సూర్యవార్త, ఆంధ్రభూమి, భారతి, ఆంధ్రజ్యోతి, రచన, మయూరి, పల్లకి, తెలుగు విద్యార్థి, సాహితీ, స్త్రీమతి, అరుణ, నది, ఆహ్వానం, ఈభూమి, ఈవారం, విశాలాంధ్ర, ప్రజాశక్తి, తేజ, యోజన, ఆంధ్రప్రదేశ్, నవ్య, రమ్య, భారతి, మల్లెతీగ, స్మైల్ ప్లీజ్, హాస్యానంద, వంటి సుమారు 116 పత్రికలలో తన రచనలు ప్రచురితమైనాయి.

**రేడియో ప్రసారాలు** : 1. కథలు-కవితలు 2. నాటికలు 3.పద్యపఠనం 4.సాహిత్యప్రసంగాలు 5. పాటలు మొదలగు సుమారుఎనభై వరుకు ప్రసారమైనాయి.

**రేడియో స్టేషన్లు** : 1.విజయవాడ 2. విశాఖపట్నం 3.హైదరాబాదు 4. మధురై 5. కడప 6. తరంగ (హైదరాబాదు).

**అవధానాలు** : 1. అష్టావధానం 2. అష్టదశావధానం 3. సహస్రావధానం 4. పంచ సహస్రావధానం మొదలైనవి.

**పదవులు** : 1986-88 సమత రచయితుల సంఘం అధ్యక్షుడు (అమలాపురం) తెలుగు విశ్వవిద్యాలయం కవితా,వ్యాస ప్రక్రియల న్యాయ నిర్ణీత (8 సంవత్సరాలు) రసజ్ఞ సమాఖ్య కార్యదర్శి (అమలాపురం) విశాఖరత్న నాటక పరిషత్ - న్యాయనిర్ణీత "తేజ" సచిత్ర వార పత్రిక సంపాదకుడు (గోల్డెన్ స్టోరీ సెలక్షన్) రసచంద్రిక సాహితీ సంస్థ - కార్యనిర్వాహక సభ్యుడు (భీమవరం).

**సత్కారాలు :**

1. సమర సాహితీ సమాఖ్య కథలపోటీ (మొదటి బహుమతి)
2. "మణి మేఖలై" జాతీయ కవి సమ్మేళనం - తెలుగు కవిగా సత్కారం (తమిళనాడు)-1983
3. 2009లో "జోత్స్న" కళాపీఠం హైదరాబాదు నాటక రచయిత సత్కారం.
4. "పైశాచిక" కథకు తృతీయ బహుమతి (చిరుగాలి మాస పత్రిక)
5. "వచ్చిన వాడు ఫాల్గుణుడు"కథకు ప్రత్యేక బహుమతి (2009 'రమ్యభారతి' పత్రిక)
6. "అపార్థం" కథకు ప్రత్యేక బహుమతి (భావతరంగణి మాస పత్రిక)
7. "తాళి ఎగతాళి చేస్తే " నాటకం ప్రధమ బహుమతి (కర్షక పరిషత్ నాటక పోటీలో)
8. "సంచలనం" నాటికకు ప్రదర్శన బహుమతి (1990 బి.హెచ్.ఇ.యల్.పరిషత్ )
9. "విశ్వరచన" (కవితల పోటీ ద్వితీయ బహుమతి)
10. "విద్యుత్ సాహితీ కవిత" తృతీయ బహుమతి
11. 'నెలవంక - నెమలీక' మాస పత్రికలో (2008, ఫిబ్రవరి) ఉత్తమ వ్యాసకర్త బహుమతి.
12. "సృజన ప్రియ" మాస పత్రికలో (ఆగష్టు 2018)

**ప్రతిభా పురస్కారం :**

మంతెను గారు ఉన్నత విద్యాభ్యాసం కొరకు పలు విశ్వవిద్యాలయాలలో చదువును కొనసాగించారు.ఎం.ఏ. (ఆంధ్ర విశ్వవిద్యాలయం), బి.ఒ.ఎల్. (ఉస్మానియా విశ్వవిద్యాలయం), పి.హెచ్.డి.(శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం) నందు ఉన్నత విద్యలను అభ్యసించారు. మంతెన గారు మొట్టమొదటి సారిగా 1996లో " డి.వి. నరసరాజు - జీవితం, రచనలు" అనే అంశం పై పరిశోధన చేసి శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పట్టాను పొందారు. మంతెన ఉద్యోగరీత్యా పలు కళాశాలలో విధులను నిర్వహించారు. ముఖ్యంగా కాలేజీలలో, హైస్కూల్ నందు విధులను నిర్వహించారు.అందులో శ్రీ కోనసీమ భానోజీ రామర్స్ కళాశాల (అమలాపురం) నందు సుమారు 26 సం॥ లుగా తెలుగు ఉపన్యాసకులుగా విధులను నిర్వహించారు.

**రచనా ప్రారంభం, శైలి :**

మంతెన గారి తొలి రచన 16-06-1967లో ప్రారంభమైనది. మంతెన గారి తొలి రచన "మరుగున పడ్డ పద సాహిత్యం" అనే వ్యాసాన్ని వెలువరించారు. ఇది ఆంధ్ర జ్యోతి వార పత్రికలో ప్రచురితమయ్యింది. మంతెన తన రచనా విధానంలో ప్రజలలో దాగియున్న హావ భావాలను హాస్య రూపంలో అనుక్షణం బహిర్గతమయ్యే విధంగా రచించేవారు. వీరి కథలలో హాస్యం ప్రధాన రసంగా ఉంటూ పాఠకుల హృదమంలో హత్తుకుని పోతుంది. చెప్పదలిచిన విషయాన్ని సహజ సుందరంగా మలిచి రచనలు చేయడంలో మంతెన సూర్యనారాయణరాజు గారు అందె వేసిన చెయ్యి అనడంలో అతిశయోక్తి లేదు.

**ముగింపు :**

మంతెన గారి రచనలలో కథలు, కవితలు, నాటికలు, ప్రసంగాలు, సామాజిక ధోరణిలో ఉంటుంది. మంతెన తన కథల యందు నవరసాలలో హాస్య రసమును అలంకార ప్రాయముగా క్రోడీకరించి రచనలు చేస్తారు. కవిథలలో నిజాన్ని ఆవిష్కరించే విధంగా వాటిని

అల్లడంలో ప్రజ్ఞాశాలి. నాటికలలో, కథలలోని సన్నివేశాలు ప్రేక్షకుల కళ్ళముందు ఆవిష్కరింపజేస్తూ వ్రాయడంలో ప్రతిభాశాలి. మంతెన తన హాస్య కథా రచనల్లో భమిడి పాటి కామేశ్వరరావు, ముని మాణిక్యం, డి.వి. నరసరాజు వంటి వారి రచనల్లో మగ్ధులై హాస్య రచనలకు శ్రీకారం చుట్టారు. మంతెన హాస్య రచనకు మంతెన వంటివారు.

**ఉపయుక్త గ్రంథ సూచికలు:**

1. మనహాస్యం - మునిమాణిక్యం పరిశోధనా గ్రంథం.
2. రచయిత ముఖాముఖి (18-1-2018).
3. గజరోహణం (కథల సంపుటి).
4. నాకొక శ్రీమతి కావాలి (హాస్య కథలు).
5. కాఫీ మజిలీ కథలు (జానపథం).
6. లేచింది మహిళాలోకం (ప్రేమ, పిచ్చి, ఒకటే).

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# "తెలంగాణ కథ - ప్రాంతీయ అస్తిత్వం"

- బానోత్ వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

తెలంగాణలో కథ 1912 లో పుట్టింది. 1912 మొదలు కొని నేటి వరకు కథయినా, కవిత్వమైనా సాహిత్యంలో ఏ ప్రక్రియ తీసుకున్న తెలంగాణలో అటు ఉద్యమాలతో ఇటు ప్రజా జీవితంతో మమేకమవుతూ వచ్చింది. మొదటి నుంచి ఉద్యమాలతో, పోరాటాలతో నిత్యం రగులుతున్న నేల తెలంగాణ. పరపీడన, ఆదిపత్యం, అణచివేత ఏదో రూపంలో తెలంగాణను వెంటాడుతూనే ఉన్నాయి. నిజాం రాజులతో, దొరలు, భూస్వాములతో, ఆంధ్ర పాలకులతో తెలంగాణ నిరంతర పోరాటం చేస్తూనే ఉంది.

భారత స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం రాజకీయ, ప్రాబల్యం, తెలంగాణ ప్రజల వ్యతిరేక పోరాటం, రజాకార్లు, పోలీసు మిలటరీ యాక్షన్ వంటి సంఘటనలు, భారత యూనియన్‌లో హైదరాబాద్ రాష్ట్రం కలవడం కోసం తెలంగాణ ప్రజలయత్నం. తెలంగాణ విమోచనోద్యమం, హైదరాబాద్ రాష్ట్రం స్వాతంత్ర్యం పొందటం, వివిధ పరిణామాల మధ్య విశాలాంధ్ర ఏర్పడటం వంటి రాజకీయ అనిశ్చలత నాటి కాలంలో తెలంగాణలో చోటు చేసుకుంది. నాటి పరిమితమైన సాంస్కృతిక, సామాజిక వనరులు, సాంస్కృతిక, ఆర్థిక రాజకీయ ప్రతిబంధకాల మధ్య తెలంగాణ రచయితలు తమ నేల పురిటి నొప్పులను కథలుగా మలిచారు. ఈ ప్రాంతపు అస్తిత్వాన్ని కథల్లో ప్రవేశపెట్టారు.

సాయుధ పోరాటం కన్నా ముందు నుంచే గోలకొండ పత్రికలో కథలు రాసిన వారిలో అగ్రగణ్యుడు భాస్కరభట్ల కృష్ణారావు 1939 నుంచీ కథలు రాస్తూ వచ్చిన భాస్కరభట్ల మూడు కథా సంపుటాలు ప్రచురించాడు. మొదటి సంపుటం 1955లో "కృష్ణారావు కథలు" పేరిట, తర్వాత "చంద్రలోకానికి ప్రయాణం", "వెన్నెలరాత్రి" పేరిట ప్రచురితమయ్యాయి. ఈయన మొత్తం తెలంగాణ కథకుల్లో ముందు వరుసలో నిలబడాల్సిన వాడు. జన్మత: తెలంగాణ వాడు కావడంతో ఈయన కథల్లో తెలంగాణ మట్టివాసన కనబడుతుంది. ఇక్కడ ప్రజల ఆచార వ్యవహారాలు, బాధలు, సంతోషాలు అందులో కనిపిస్తాయి.

భాస్కరభట్ల కృష్ణారావు బాగా పేరు తీసుకు వచ్చిన కథ "ఇజ్జత్" ఇందులో కౌలుకు తీసుకున్న భూమిలో పంటలు సరిగా పండక పోవడంతో మల్లయ్య అనే రైతు కౌలు చెల్లించలేక పోతాడు. అందుకు మల్లయ్యకు "శిక్ష" విధిస్తారు. ఆ అవమానాన్ని భరించలేక ఉరివేసుకున్న రైతు కథను ఇందులో చిత్రీకరించాడు. భూసంస్కరణల అమలు చట్టం తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో పేదరైతు దీనస్థితిని ఈకథలో భాస్కరభట్ల చూపించారు. ఈ కథ 1944లో "మీజాన్" పత్రికలో అచ్చయ్యింది. మల్లయ్య అనే రైతు రంగారావు పొలం కౌలుకి తీసుకొని క్రమం తప్పకుండా కౌలు గింజలు చెల్లిస్తూ ఉండేవాడు. అయితే కాలం సరిగా కాక పోవడంతో, కుంటకు గండిపడడం లాంటి సమస్యకు తోడు కూతురు పెళ్ళి చేశాడు. దీనితో ఖర్చులో పడ్డాడు. అందువలన కౌలు గింజలు ఇవ్వలేకపోయాడు. గండి పూడ్చగల తాహతు మల్లయ్యకు లేదు. పైగా భూసంస్కరణల చట్టం ఒకటి వచ్చి పడింది. ఈ పరిస్థితిలో తన కౌలు గింజలు బకాయి రాబట్టుకోవడానికి రంగారావు గట్టి ప్రయత్నం చేస్తాడు. మల్లయ్య ఎంత వేడుకున్న ఫలితం లేకపోయింది. మల్లయ్యకు శిక్ష వేస్తారు. వంగబెట్టి వీపు మీద బండ పెట్టించారు. కొంత సేపటికి మల్లయ్య స్పృహతప్పి పడిపోయాడు. అతని భార్య ఏడుస్తూ వస్తుంది. భార్యతో "ఇజ్జత్" పోయిందే పిల్లా అని చెబుతూ పరువు పోవడంతో బతకడం కష్టం అని తలచి ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని చనిపోతాడు. "ఇజ్జత్" కథలో రైతులు కష్టపడే గుణాన్ని, కౌలుదారీ విధానం గురించి కథకుడు చెబుతాడు. చివరికి ఆత్మాభిమానం గల రైతు ఆత్మహత్య చేసుకోవడంతో కథ ముగుస్తుంది. ఇది 1944 నాటి తెలంగాణ రైతుల స్థితిగతుల్ని తెలియజేస్తుంది.

తెలంగాణ విమోచనోద్యమాన్ని చిత్రీకరిస్తూ అనేక తెలంగాణ కథలు ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రదర్శించాయి. ఇందులో ప్రముఖంగా కనిపించే ఆకాలపు రచయితలో పాములపర్తి వెంకటనర్సింహారావు రచించిన కథ "గొల్ల రామవ్వ" కథ ఒక సాహసవంతుడైన ఉద్యమకారుడైన కార్యకర్తను గొల్లరామవ్వ రక్షించే ఇతివృత్తం ఈ కథలో సహజంగా చిత్రించబడింది. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న యువకులను కాపాడటంలో గొల్ల రామవ్వ ధైర్యం, తెగువ కనిపిస్తాయి. రజాకార్లను ఎదిరించడంలో గొల్లరామవ్వ అత్యంత నేర్పును ప్రదర్శిస్తుంది. రజాకార్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ యువకుల పోరాటం, వారి కోసం రజాకార్లు గ్రామస్తులను బాధపెట్టడం, అర్థాంతరంగా యువకుల ప్రాణాలు తీయడం వంటివి ఈ కథలో కనిపిస్తాయి. భయానకమైన ఆనాటి తెలంగాణ పరిస్థితిని రచయిత సమర్థవంతంగా ఈ కథలో చిత్రించారు.

అల్లం రాజయ్య రాసిన కథలన్ని భూమి పోరాటాల చుట్టూ తిరుగుతాయి. "ఎదురు తిరిగితే", "గోడ", "దున్నేవాడిదే భూమి", "అడవి మనిషి", "సృష్టికర్తలు" మొదలైన కథలు 1970-80 మధ్య వచ్చినవే. "ఎదురుతిరిగితే" (1975) కథలో సామాన్యుల తిరుగుబాటు చిత్రింపబడింది. నీరటికాడు (కొమురయ్య) ఆకలికి తట్టుకోలేక తాను నీళ్ళు పెడుతున్న దొరల పొలం నుండి కొంత వరిని దొంగిలిస్తాడు. ఆ కారణంగా దొర కొమురయ్యకు సంవత్సర జీతం ఎగ్గొడతాడు. ఆ మరుసటి సంవత్సరం కూడా చేసిన దొంగతనానికి దొర దండగవేస్తే తన ఆవును అమ్మి డబ్బు చెల్లిస్తాడు. ఇంకా బతకడానికి ఎట్లాంటి ఆధారంలేని సమయంలో కొమురయ్య పొరంబోకు భూమిని దున్నుకొని సాగులోకి తెచ్చుకుంటాడు. మరల దొర కొమురయ్య పొలం లూటీ చేయాలని చూస్తాడు. సహనం కోల్పోయిన కొమురయ్య సర్వశక్తులను కూడ గట్టుకొని గొడ్డలితో దొరపై తిరగబడతాడు.

అల్లం రాజయ్య తన స్వంత గ్రామం గాజులపల్లి వేదికగా అక్కడ జరుగుతున్న పోరాటాలను 1979లో "సృష్టికర్తలు" కథను రాసారు. దొరలు, పోలీసులు ఏకమై పేదలను రైతులను పీడిస్తున్న కాలమది. పీడనకు వ్యతిరేకంగా సాగుతున్న సాయుధపోరు హింసాత్మకమైందన్న విమర్శ వస్తున్న కాలం. సమస్త ప్రపంచమంతా రైతు సేద్యం చిందించడం వల్లనే జీవిస్తుందని, రక్తాన్ని చెమటగా మార్చి పిడికెడు అన్నం పెడుతున్నరైతే నిజమైన సృష్టికర్త అని చెప్పే కథ. "మా నెత్తురు, మా మాంసం, మా బొక్కలు, మా ములుగు, మా బతుకు, మా సుఖం, కట్టం, చెమట, కన్నీళ్లు మేం నాశనం చేసుకుంటామురా" అన్న ఓదెలు పాత్ర పలికిన మాటలు శ్రామికుల తిరుగుబాటును తెలుపుతాయి. రైతులు చెలక సాగు చేసుకునే క్రమంలో "ఎర్రజెండాలు" పాతినప్పటికీ దొరకు అమ్ముడుపోయిన పోలీసుల చేతుల్లో రైతులు ప్రాణాలను కోల్పోతారు. నాగేటి చాళ్ళల్లో పారిన రక్తం పోరాట, త్యాగాలను తెలియజేస్తుంది.

అల్లం రాజయ్య "భూమి" కథలో (1979) లో మొక్కవోని రైతుల పోరాట ధైర్యాన్ని చిత్రించింది. ఈ కథలో ఆశన్న, గంగన్న ప్రధానపాత్రలు భూమి కోసం పోరాటం చేసినందుకు ఆశన్న బావమరిదిని పోలీసులు అరెస్టు చేశారు. అతన్ని వెతుక్కుంటూ ఆశన్న బయలుదేరాడు. ఆశన్న వెళ్ళే కాలిబాటలో దున్నపోతును తోలుతూ బక్కచిక్కిన ముసలయ్య (గంగన్న) ముందుకు సాగుతున్నాడు. దారి పొడుగునా వీరిద్దరి సంభాషణలో రచయిత భూపోరాటాన్ని కళ్ళకు కట్టినట్లు, చిత్రించాడు. ఆ ముసలయ్య కొడుకు, అల్లుడు కూడా అరెస్టయి జైళ్ళో ఉన్నారు. అయినా గంగన్న అధైర్యపడలేదు. ఆశన్న, గంగన్నతో "నన్నుబట్టుకోకపోతే నాబిడ్డ, నా కోడలుంటారు".

"నీ కోడలును, బిడ్డను జైళ్ళకు పట్టుకపోతారు" ఇట్లా సాగుతాయి ఆశన్న, గంగన్న మాటలు అయినా గంగన్న ఆత్మస్థైర్యం చెక్కు చెదరలేదు. అప్పుడు భూమి సెరసెర సెక్కలయిద్ది...... ఇంటున్నావా! అంత వరకు మేం చేతులు కట్టుకొని కూసుంటామా? అన్న ముసలయ్య మాటలు ఆనాటి రైతాంగ పోరాట స్వరూపాలను

BHAVAVEENA
Vol. 16, Issue. 10(1), October - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

తెలియజేస్తున్నాయి. ఈ రైతాంగ పోరాటం శ్రామిక రంగాలకు కూడా విస్తరించింది.

''ఆర్థికంగా వెనకబడితే మళ్ళీ పుంజుకోవచ్చు, రాజకీయంగా నిరాదరణకు గుర్తైతే మళ్ళీ నిలదొక్కు కోవచ్చు. సామాజికంగా అణచివేతకు గురైతే తిరుగుబాటు చెయ్యొచ్చు. కాని సాంస్కృతికంగా, భాషాపరంగా లేఖనంలో జరిగిన దాడిని తిప్పికొట్టకపోతే శాశ్వతంగా కనుమరుగైపోతాం అన్న ప్రొఫెసర్ జయశంకర్ మాటలు అక్షర సత్యాలు ఇట్లాంటి సాంస్కృతిక దాడిని తట్టుకొని నిలదొక్కుకునే ప్రయత్నంలో పి.యశోదారెడ్డి మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి వెలువరించారు. ఇందులోని ''గంగిరేగిచెట్టు'', ''పీర్లపండుగ'', "మాపంతులు", "ఎంకన్న" మొదలైన కథలు గ్రామీణ సంస్కృతిని అద్దంపట్టి చూపాయి. "నిశ్చాతార్థం" కథ ఆంధ్ర సంస్కృతికి తెలంగాణ సంస్కృతికి మద్య ఉన్న వైరుద్యాలను చక్కగా చిత్రించారు. తెలంగాణ యాస, భాషలోని నుడికారాలు కథల నిండా పేర్చబడ్డాయి. ప్రాంతీయ అస్తిత్వానికి, సంస్కృతికి భాష ఆయువుపట్టు. "ఎన్నముద్దోలె", "ఇంగిలోకం", "గున్నగున్ననడ్సుకుంట", ''తండ్లాడుకుంట'' మొదలైన జాతీయాలు, ఇజ్జత్, దవాఖానా మొదలైన ఉర్దూపదాల కలయికతో మిళిత మైన తెలంగాణ భాష ప్రత్యేకయాసను కలిగి ఉందని చెప్పవచ్చు. యశోదారెడ్డి ''మావూరి ముచ్చట్లు'' కథా సంపుటికి ముందుమాట రాస్తూ ఈ కథలను ప్రధానంగా తెలంగాణ భాషను, సంస్కృతిని, జాతీయాలను, సామెత లను , పదధ్వని రీతులను కాలగర్భంలో కలిసి పోకుండా రికార్డు చేయడానికి రాశానని పేర్కొన్నారు. తెలంగాణపు వెలుగు కూడా తదితర ప్రాంతములందు వలనే తన నిజ స్వరూపమును చాలా వరకు పోగొట్టుకొని నామ మాత్రావశిష్టమై యున్నది. కావున అమూల్యమైన పదప్రయోగములను కాపాడవలెననెడి తాపత్రయమే ఈ కథల సంపుటికి కారణము'' భాషా నుడికారాలను చెప్పడానికి రచయిత్రి శ్రామీణ జీవన నేపథ్యాన్ని ఎన్ను కున్నారు. "మాపంతులు" కథలో "వచ్చాడు, సచ్చాడు, రాండిరాయి, దగిలిబోర్ల నడుండి అనేటోని బాస అచ్చ మైంది'' అన్న వాక్యాలు తెలంగాణ భాష చిన్న చూపుకు గురైన స్థితిని తెలియజేస్తున్నాయి. పైనిండ కండ్లు పెట్టు కోండి లేకుంటే మీ చేతుల రొట్టె గద్దలు దన్నుకుపోతాయి. ఎవ్వరికి నెత్తినొంచకుండి", అన్న పంతులు మాటలు ఏమి తెలియని విద్యార్థులకు ముందస్తు ఆపదను తెలియ జేస్తున్నాయి. పంతులు పాత్ర అన్నట్లుగానే తెలంగాణ ప్రాంత ఉద్యోగాలు కొల్లగొట్టబడ్డాయి. నీళ్లు, నిధులు అన్యాక్రాంతం చేయబడ్డాయి.

**ఆధార గ్రంథాలు:**

1) తెలుగు కథకులు-కథన రీతులు - సం. సింగమనేని నారాయణ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 2001.
2) వందేళ్ళ తెలుగుకథ - చిన్న వీరభద్రుడు - ఎమెస్కో - 2001.
3) తెలంగాణ కథ - సం. పంతంగి వెంకటేశ్వర్లు - కాకతీయ విశ్వవిద్యాలయం-2010.

BHAVAVEENA
VOL. 16, ISSUE. 10(1), OCTOBER - 2019.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జానపద కళారూపాలు - తోలుబొమ్మలాట మరియు గంగిరెద్దులు విశిష్టత

**డా. మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్(తెలుగు),
డాక్టర్ బి.ఆర్.ఆర్. కళాశాల, జడ్చర్ల, తెలంగాణ

## 1. ఉపోద్ఘాతం:-

జానపద కళారూపాల్లో తోలుబొమ్మలాట, గంగిరెద్దులు తెలుగు సంస్కృతికి ప్రతీకలుగా నిలిచాయి. ఇవి కేవలం వినోదం మాత్రమే కాకుండా, పురాణగాథలు, సాంఘిక విలువలను తరతరాలుగా అందించే మాధ్యమాలు అంతేకాకుండా భారతీయ సనాతన సంస్కృతి, సాంప్రదాయాలకు కళారూపాలు.

## 2.తోలుబొమ్మలాట విశిష్టత:-

**2.1.చారిత్రక నేపథ్యం:** తోలుబొమ్మలాట ప్రాచీన కాలం నుంచే ఉన్నట్లు సాహిత్యాధారాలు లభించాయి. శ్రీశైలం శివరాత్రి ఉత్సవాల్లో దీనిని ప్రదర్శించినట్లు పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో పేర్కొన్నారు. శ్రీనాథుడి 'పల్నాటి వీర చరిత్ర', 'భాస్కర శతకం'లో కూడా తోలుబొమ్మలాట ప్రస్తావన ఉంది.

### 2.2.సాంకేతిక ప్రత్యేకత:-

తోలుబొమ్మల కాళ్లు, చేతులు, తలకు దారాలు కట్టి, మధ్యలో ఒక డబ్బాలో నిలబెట్టి, అవసరమైన దారాన్ని లాగుతూ, వదులుతూ బొమ్మలాడిస్తారు. ఒక తెల్లని తెర వెనక ఉండి దీపపు వెలుగులో ఆ బొమ్మలను ఆడిస్తారు. ఇది ప్రాచీన కాలం నుండి జానపద ప్రదర్శన కళలో మనిషి సాధించిన సాంకేతికతకు ఉదాహరణ.

### 2.3.సమాహార కళారూపం:-

తోలుబొమ్మలాట సంగీతం, నృత్యం, అభినయం, కథాకథనం కలిపిన సమాహార కళారూపం. "తొంభై ఏండ్ల బోయి తోలుబొమ్మలాట చూడాలి, అరవై ఏండ్ల బోయి హరికథ వినాలి" అనే తెలంగాణ నానుడి దీని ప్రాచుర్యాన్ని సూచిస్తుంది

## 3.గంగిరెద్దులు -- విశిష్టత:-

### 3.1.కులవృత్తి కళ:-

సాధారణంగా పూజగొల్ల కులానికి చెందినవారు గంగిరెద్దులను ఆడిస్తారు. వీరు ఎద్దును చక్కగా అలంకరించి, ఊళ్లలో తిరుగుతూ దాన్ని ఆడిస్తారు. ప్రధానంగా భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తారు.

### 3.2.ప్రదర్శన విధానం:-

ఒక గంగిరెద్దుతో పాటు ముగ్గురు వ్యక్తులు ఉంటారు. ఒకరు గంగిరెద్దును ఆడిస్తే, మరో వ్యక్తి డోలు వాయిస్తాడు. ఎద్దుకు గజ్జెలు, అలంకరణలు కట్టి, నృత్యం చేయిస్తారు.

### 3.3.సాంస్కృతిక ప్రాధాన్యం:-

గంగిరెద్దులాట గ్రామీణ ప్రాంతాల్లో పండుగలు, జాతరల్లో ప్రధాన ఆకర్షణ. ఇది పశుసంపద, వ్యవసాయ సంస్కృతికి ప్రతీక.

## 4.తోలుబొమ్మలాట, గంగిరెద్దులు వంటి జానపద కళారూపాలు అంతరించిపోవడానికి ప్రధాన కారణాలు ప్రధాన:-

ప్రధాన కారణాలు

### 4.1. ఆర్థిక ఇబ్బందులు

ఈ కళారూపాల ద్వారా స్థిరమైన ఆదాయం లేకపోవడం వల్ల కళాకారులు ఇతర వృత్తుల వైపు మళ్లారు.
తోలుబొమ్మల తయారీ ఖర్చు పెరగడం, అమ్మకాలు తగ్గడం వల్ల కుటుంబాలు ఈ కళను వదిలేశాయి.
గంగిరెద్దుల కళాకారులు భిక్షాటనపై ఆధారపడటం వల్ల నేటి తరం దీనిని అవమానకరంగా భావిస్తోంది.

**4.2. తరం మారడం** -- యువత ఆసక్తి లేకపోవడం విద్య, ఉద్యోగావకాశాల కోసం యువత నగరాలకు వలస

వెళ్లడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కళాకారుల కొరత ఏర్పడింది.

గురు-శిష్య పరంపర దెబ్బతినడం వల్ల సీనియర్ కళాకారులు చనిపోయాక ఆ జ్ఞానం కోల్పోయింది.

తోలుబొమ్మలాట, గంగిరెద్దులు వంటి కళలు నిర్దిష్ట కులాలకు పరిమితం కావడం వల్ల ప్రాక్టీస్ చేసేవారి సంఖ్య తగ్గింది.

### 4.3. ఆధునిక వినోద మాధ్యమాల ప్రభావం

సినిమా, టీవీ, సోషల్ మీడియా, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు వంటి ఆధునిక వినోద వనరులు పెరగడం వల్ల పారంపర్య కళలపై ఆసక్తి తగ్గింది.

పారంపర్య ప్రదర్శనలు గంటల తరబడి సాగుతాయి, ఓపిక అవసరం. నేటి తరం వేగవంతమైన వినోదానికి అలవాటు పడింది.

### 4.4. సామాజిక మార్పులు

గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వలసలు పెరగడం వల్ల పండుగలు, జాతరలు, ఊరి సమారోహాలు తగ్గాయి.

మధ్యతరగతి, సమృద్ధిగా ఉన్న రైతు కుటుంబాలు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్లడం వల్ల గ్రామాల్లో ప్రేక్షకులు తగ్గారు.

జానపద కళలను సమాజంలో హీనంగా చూసే ధోరణి వల్ల కళాకారులకు ప్రోత్సాహం లేదు.

### 4.5. ప్రభుత్వ సంరక్షణ లోపం

సరైన ఆర్థిక సహాయం, పెన్షన్, గుర్తింపు లేకపోవడం వల్ల కళాకారులు నిరాశకు గురయ్యారు.

సంవత్సరానికి కేవలం 3-4 సార్లు మాత్రమే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో జానపద కళలకు అధికారిక శిక్షణ లేకపోవడం వల్ల యువత ఆకర్షితులు కాలేదు.

### 4.6. సాంకేతిక పరిణామాలు

19-20వ శతాబ్దాల్లో నాటకాలు, పద్యనాటకాలు ప్రాచుర్యం పొందడం వల్ల తోలుబొమ్మలాట ప్రాధాన్యత తగ్గింది.

సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందడం వల్ల బొమ్మలాట ప్రాచుర్యం క్షీణించింది.

### 4.7. లిఖిత రికార్డులు లేకపోవడం

ఈ కళారూపాలు మౌఖిక పరంపర ద్వారా, గురు-శిష్య పద్ధతిలో నేర్పబడ్డాయి. లిఖిత రూపాలు, స్క్రిప్టులు, రికార్డింగ్‌లు లేవు.

చివరి కళాకారుడు చనిపోయాక ఆ కళ పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది.

## 5. తోలుబొమ్మలాట, గంగిరెద్దులు వంటి జానపద కళారూపాలను కాపాడుకోవడానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు:-

తోలుబొమ్మలాట, గంగిరెద్దులు వంటి జానపద కళారూపాలను కాపాడుకోవడానికి ప్రభుత్వ, సామాజిక, విద్యాపరమైన చర్యలు అత్యవసరం.

ప్రభుత్వ చర్యలు

### 5.1. ఆర్థిక సహాయం, ఉపాధి హామీ

కళాకారులకు నెలవారీ పెన్షన్, గౌరవ వేతనం అందించాలి. రాజస్థాన్‌లో మాంగనియార్ కళాకారులకు 100 రోజుల పాటు ?500 వేతనంతో ఉపాధి హామీ ఇస్తున్న పథకం మాదిరిగా తెలుగు రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలి.

సంగీత నాటక అకాడమీ ద్వారా అగోచర సాంస్కృతిక వారసత్వ అంశాలపై పరిశోధన, రికార్డింగ్ కార్యక్రమాలు నిర్వహించాలి.

కళాకారులకు ఉచిత ఆరోగ్య బీమా, పింఛన్ పథకాలు అందించాలి.

### 5.2. గురు-శిష్య పరంపర పునరుద్ధరణ

Guru Shishya Parampara Scheme కింద

మాస్టర్ ఆర్టిస్టులు యువ శిష్యులకు శిక్షణ ఇచ్చేలా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఇది సాంస్కృతిక జ్ఞానాన్ని తరతరాలుగా అందించడానికి సహాయపడుతుంది.

జోనల్ కల్చరల్ సెంటర్స్ (ZCCs) ద్వారా అంతరించిపోతున్న కళారూపాలను ఆడియో, వీడియో, లిఖిత రూపాల్లో డాక్యుమెంట్ చేయాలి.

### 5.3. విద్యాసంస్థలతో సహకారం

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (NSD), సాంస్కృతిక శాఖతో కలిసి తెలంగాణ జానపద కళలకు అధికారిక థియేటర్ హోదా ఇవ్వాలి. 2014లో తెలంగాణ ప్రభుత్వం 62 'అంతరించిపోతున్న' కళారూపాలను గుర్తించి NSD సహకారం కోరింది.

విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో జానపద కళలను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి.

సాంస్కృతిక వారసత్వ క్లబ్బులు పాఠశాలల్లో ఏర్పాటు చేసి, విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి.

### 5.4. డిజిటలైజేషన్, డాక్యుమెంటేషన్

పాత రికార్డులను డిజిటల్ ఫార్మాట్‌లో మార్చి, ఆన్‌లైన్ ఆర్కైవ్‌లు సృష్టించాలి.

తోలుబొమ్మల తయారీ విధానం, గంగిరెద్దుల శిక్షణ పద్ధతులను వీడియో ట్యుటోరియల్స్గా రికార్డు చేయాలి.

### 5.5. సాంస్కృతిక కార్యక్రమాలు, ఫెస్టివల్స్

బతుకమ్మ పండుగ మాదిరిగా జానపద కళలకు ప్రత్యేక ఫెస్టివల్స్ నిర్వహించాలి. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మను ప్రపంచ స్థాయిలో ప్రచారం చేసింది.

అంతర్జాతీయ భారతీయ నృత్య మహోత్సవం వంటి కార్యక్రమాల్లో జానపద కళాకారులకు వేదిక కల్పించాలి.

దేశవ్యాప్తంగా, విదేశాల్లో పప్పెట్ ఫెస్టివల్స్, క్రాఫ్ట్ ఫెస్టివల్స్ నిర్వహించి తోలుబొమ్మలాటకు గుర్తింపు తెచ్చాలి.

## 6.సామాజిక, ప్రైవేట్ చర్యలు

### 6.1. యువతను ఆకర్షించడం

సోషల్ మీడియా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో జానపద కళల షార్ట్ వీడియోలు, రీల్స్ తయారు చేయాలి.

వర్క్‌షాప్‌లు, మాస్టర్‌క్లాస్‌లు నిర్వహించి యువతకు ప్రాక్టికల్ అనుభవం ఇవ్వాలి.

### 6.2. పర్యాటక రంగంతో అనుసంధానం

హైదరాబాద్, విశాఖ, విజయవాడ వంటి పర్యాటక ప్రాంతాల్లో జానపద కళా ప్రదర్శనలకు నిరంతర వేదికలు ఏర్పాటు చేయాలి.

హోటల్స్, రిసార్ట్స్, కల్చరల్ విలేజెస్లో సాంప్రదాయ కళా ప్రదర్శనలను నిర్వహించాలి.

### 6.3. NGO\T, CSR సహకారం

కార్పొరేట్ కంపెనీల CSR నిధులు జానపద కళల సంరక్షణకు వినియోగించాలి.

NGOలు గ్రామీణ ప్రాంతాల్లో కళాకారుల శిక్షణ కేంద్రాలు నెలకొల్పాలి.

## 7. ముగింపు:-

తోలుబొమ్మలాట, గంగిరెద్దులు -- ఈ రెండు కళారూపాలు తెలుగు సంస్కృతి యొక్క సజీవ చరిత్రలు. ఇవి కేవలం గతం కాదు; భవిష్యత్తులో కూడా నిలబెట్టుకోవాల్సిన సాంస్కృతిక సంపద. ప్రస్తుతం ఈ కళలు అంతరించిపోయే స్థితిలో ఉన్నప్పటికీ, వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత.

### ఆధార గ్రంథాలు:-

1. భీమేశ్వర పురాణం .....సోమనాథుడు, 12వ శతాబ్దం
2. పల్నాటి వీరచరిత్ర ............శ్రీనాథుడు
3. "తోలుబొమ్మలాట ప్రదర్శనం"..... బిట్టు వెంకటేశ్వర్లు
4. తోలుబొమ్మలాట" --- నల్లబాటి రాఘవేంద్రరావు కథ (సంచిక, 2026)
5. వికీసోర్స్ ( "తోలుబొమ్మలాట", "తెలుగువారి జానపద కళారూపాలు/బొమ్మలూ, తోలుబొమ్మలూ)

భావవీణ

# BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

Journal of Telugu Literary, Culture & Language Study

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

October (1) 2019




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.